అనుదినం... జనస్వరం

www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-3-2024

సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 75 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50

'టీజీ' తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి ప్రతీక

- రాష్ట్రంలో టీజీ పేరుతో మొదలైన వాహన రిజిస్ట్రేషన్లు
- తొలిరోజు వాహనదారుల నుంచి మంచి స్పందన వచ్చింది : రవాణాశాఖ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్
- ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీస్‌లో 'టీజీ' నెంబర్ ప్లేట్ ఆవిష్కరించిన ట్రాన్స్‌పోర్టు కమిషనర్



నవతెలంగాణ-సిటీబ్యూరో

తెలంగాణ ఉద్యమ సమయంలో వాహనాల నెంబర్ ప్లేట్ ఏపీ నుంచి టీజీగా మన వాహనాలకు అతికించామని, ఆ రోజు ఉద్యమంలో 'టీజీ' మన ఆత్మగౌరవనానికి ప్రతీకగా చెప్పుకున్నామని రాష్ట్ర రవాణాశాఖ కమిషనర్ డాక్టర్ జ్యోతి బుద్ధ ప్రకాష్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్లు(జేటీసీ) సి.రమేష్, మమత ప్రసాద్, ప్రవీణ్ రావు, ఆర్టీవోలతో కలిసి ఆయన టీజీ నెంబర్ ప్లేట్‌ను ఆవిష్కరించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల ఆకాంక్షల మేరకు రాష్ట్ర ప్రభుత్వం టీఎస్ నుంచి టీజీగా మార్చిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం నుంచి టీజీ నెంబర్‌తో రిజిస్ట్రేషన్లు ప్రారంభించామని, ఇందుకోసం తమ అధికారులు, ఐటీ సిబ్బంది రాత్రంతా ఎంతో కష్టపడ్డారని గుర్తుచేశారు. అందుకు తగిన విధంగానే కొత్త నెంబర్ల కోసం ప్రజల నుంచి భారీ స్పందన లభించిందన్నారు. తొలిరోజు రాష్ట్రవ్యాప్తంగా టీజీ పేరుతో 1,475 నంబర్లు కేటాయించగా.. తద్వారా రూ. 2.5కోట్ల ఆదాయం రవాణాశాఖకు వచ్చిందని తెలిపారు. ఒక్క ఖైరతాబాద్ ఆర్టీఏ పరిధిలో 125 వాహన నెంబర్లు కేటాయింపు ద్వారా మొదటి రోజు రూ.30.49లక్షల ఆదాయం వచ్చిందన్నారు. ఇందులో టీజీ 09 0001 నెంబర్‌కు ఏకంగా 9.61లక్షల ఆదాయం సమకూరిందని చెప్పారు. అన్ని ఆర్టీవో, యూనిట్ ఆఫీసుల్లో అద్భుతమైన స్పందన కనిపించిందని తెలిపారు.

తొలిరోజే రికార్డు స్థాయిలో ఆదాయం రావడంతో రానున్న రోజుల్లో మరింత ఆదాయం వచ్చే అవకాశముందన్నారు. ఇప్పటికే టీఎస్ నెంబర్ ప్లేట్‌తో ఉన్న వాహనాలను టీజీగా మార్చబోమని, అవి యథావిధిగానే కొనసాగుతాయని తెలిపారు. వాహన యజమానులు ప్రతిరోజు అంతకు ముందు రిజిస్ట్రేషన్ అయిన నెంబర్ నుంచి వెయ్యి నంబర్ల లోపు ఇప్పటి విధానం ప్రకారమే టీజీ సిరీస్‌లో రిజర్వు చేసుకోవచ్చన్నారు. రాష్ట్రంలో ఇప్పటివరకు ఏపీ సిరీస్ పేరుతో 70.68లక్షల వాహనాలు, టీఎస్ సిరీస్‌తో 92.82లక్షల వాహనాలు నమోదైనట్టు కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్టీవోలు రవీందర్ కుమార్, సదానందం, పురుషోత్తం రెడ్డి, కిషన్ నాయక్, సీపీ. వెంకటేశ్వర్ రావు, వి.శ్రీనివాస్ రెడ్డి, కిష్టయ్య, సీనియర్ ఎంవీఐలు, ఏఎంవీఐలు, ఐటీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని
టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో వాక్‌థాన్

- కిడ్నీ వ్యాధుల గురించి అవగాహనముఖ్యం : వక్తలు



నవతెలంగాణ- హైదరాబాద్

ప్రపంచ కిడ్నీ దినోత్సవాన్ని పురస్కరించుకుని టీఎక్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆ ఆస్పత్రి ప్రాంగణం నుండి కేబీఆర్ పార్క్ వరకు వాక్‌థాన్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రఖ్యాత సెలబ్రిటీ, నటి శ్రేయా శరణ్ ముఖ్యతిథిగా హాజరై మాట్లాడారు, ఆరోగ్యకరమైన మూత్రపిండాల సంరక్షణ, దాని ఆవశ్యకతను వివరించారు. అనంతరం టీఎక్స్ ఆస్పత్రి విశిష్ట వైద్య నిపుణులు, నెఫ్రాలజిస్టులు డాక్టర్ పవన్ కుమార్, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ శశిధర్, డాక్టర్ హరి ప్రసాద్, కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ సర్జన్లు డాక్టర్ జయరాంరెడ్డి, డాక్టర్ హిదాయతుల్లాతో పాటు యూరాలజిస్టులు డాక్టర్ భరతరెడ్డి, డా. యశ్వంత్ కిడ్నీ వ్యాధుల గురించి అవగాహన, కిడ్నీ యొక్క ప్రాముఖ్యతను వివరించారు. టీఎక్స్ ఆస్పత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ శ్రీకాంత్ వోడ్నాల కిడ్నీల ఆరోగ్యంపై అవసరమైన సమాచారాన్ని తెలియ జేశారు. అలాగే టీఎక్స్ ఆస్పత్రి కమ్యూనిటీ హెల్త్, వెల్‌నెస్ పట్ల నిబద్ధతను వివరించారు. అంతకుముందు ఈ కార్యక్రమాన్ని టీఎక్స్ ఆస్పత్రి వైద్యులు కీర్తికర్ రెడ్డి, డాక్టర్ దీపక్ రాజుతో పాటు శ్రీ రవీంద్ర రెడ్డి ప్రారంభించారు.



ఒక దేశం ఒకే ఎన్నిక **వద్దు**
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

అనుదినం... జనస్వరం
www.navatelangana.com

నవతెలంగాణ

శనివారం 16-3-2024
సమగ్ర తెలుగు దినపత్రిక

సంపుటి : 10 | సంచిక : 75 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 16 పేజీలు | వెల : 6.50


హైదరాబాద్‌లో రాష్ట్రపతి ముర్ము
స్వాగతం పలికిన సీఎం రేవంత్‌రెడ్డి, గవర్నర్ తమిళిసై తదితరులు


కవితతో కేటీఆర్

ఎమ్మెల్సీ కవిత అరెస్టు

ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో అదుపులోకి తీసుకున్న ఈడీ

- ఆరు గంటలకు పైగా ఇంట్లో సోదాలు
- నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తత
- ఈడీ అధికారులతో కేటీఆర్, హరీశ్ వాగ్వాదం
- ఢిల్లీకి తరలింపు

దేశంలో సంచలనం రేపిన ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో ఎట్టకేలకు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు.. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను అరెస్ట్ చేశారు. బంజారాహిల్స్‌లోని ఆమె నివాసం వద్ద తీవ్ర ఉద్రిక్తతల మధ్య అరెస్ట్ జరిగింది. అంతకముందు, దాదాపు ఆరు గంటలకు పైగా ఈడీ అధికారులు కవిత నివాసంలో సోదాలు నిర్వహించారు.

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి/బంజారాహిల్స్

కవితను అరెస్ట్ చేసి ఢిల్లీకి తీసుకువెళ్లాలనే ఈడీ అధికారుల ప్రయత్నాలకు ఆమె సోదరుడు, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావుల నుంచి ప్రతిఘటన ఎదురై తీవ్ర వాగ్వాదానికి దారి తీసింది. చివరికి తాము వేసుకున్న వ్యూహం ప్రకారమే ఈడీ అధికారులు కవితను రాత్రి ఢిల్లీకి విమానంలో తీసుకెళ్లారు.

స్కాంలో కవితదే కీలక పాత్ర : ఈడీ ఆరోపణలు

గత కొంత కాలంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో కవితను ఈడీ అరెస్ట్ చేయనున్నట్టు ...5లో

బీఆర్ఎస్‌లో ప్రకంపనలు

- అటు మోడీ రోడ్‌షో...ఇటు కవిత అరెస్టు
- రాజకీయ కక్షసాధింపేనంటున్న పార్టీ శ్రేణులు
- పార్టీని వీడుతున్న ప్రజాప్రతినిధులు
- సీఎంను కలిసిన పసునూరి, దానం
- బీఆర్ఎస్, బీఎస్పీ పొత్తు ఖరారు
- బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్ స్థానాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్)లో రాజకీయ ప్రకంపనలు తీవ్రస్థాయికి చేరాయి. శుక్రవారం సాయంత్రం ప్రధాని నరేంద్రమోడీ హైదరాబాద్‌లోని మల్కాజ్‌గిరి పార్లమెంటు స్థానంలో రోడ్ షో నిర్వహిస్తున్న సమయంలోనే, బీఆర్ఎస్ అధ్యక్షులు కే చంద్రశేఖరరావు కుమార్తె, ఎమ్మెల్సీ కవితను ఈడీ, ఐటీ శాఖలు ...5లో

వచ్చారు.. వెళ్లారు..

నిరుత్సాహపర్చిన మోడీ రోడ్డు షో


అభివాదం చేస్తున్న ప్రధాని మోడీ

7లో

- దాదాపు మూడు గంటలు వేచి ఉన్న బీజేపీ శ్రేణులు
- మాట్లాడకుండా కేవలం అభివాదం చేస్తూ వెళ్లిపోయిన ప్రధాని
- ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నైరాశ్యంలో రాష్ట్ర నేతలు
- మోడీ మౌన రోడ్ షో అంటూ పెదవి విరుపు

మాది సెక్యులర్ సర్కార్

ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్ అమలు చేస్తాం

- మోడీ, అమిత్‌షా దీన్ని రద్దు చేస్తామంటున్నారు..అది వారి వల్ల కాదు
- ఇఫ్తార్ విందు మతసామర్యానికి ప్రతీక : సీఎం రేవంత్ రెడ్డి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో పక్కా సెక్యులర్, ప్రజా ప్రభుత్వ పాలన సాగుతున్నదని సీఎం రేవంత్‌రెడ్డి


అప్యాయంగా..ఖర్జూరం తినిపిస్తూ..

అన్నారు. పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాస దీక్షలో ఉండే ముస్లిం సోదరుల కోసం శుక్రవారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ఇఫ్తార్ విందును ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ, షబ్బీర్‌అలీ, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ముస్లీం మత పెద్దలు, ప్రభుత్వ అధికారులు, కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి అనాథపిల్లలకు కానుకలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆత్మీయత, మతసామరస్యానికి ప్రతీకగా ...15లో


తోఫా అందజేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి

ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

- అటవీ, పర్యాటక శాఖ కలిసి పని చేయాలి
- ఉద్యోగుల సాధారణ బదిలీలపై వేసవిలో నిర్ణయం
- అటవీ శాఖ సమీక్షలో సీఎం రేవంత్ రెడ్డి

6లో



నేడే ఎన్నికల నగారా

- 543 లోక్‌సభ స్థానాలు, నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతంలో అసెంబ్లీ ఎన్నికలకు నేడు షెడ్యూల్ విడుదల
- ఏడు దశల్లో ఎన్నికలు జరిగే అవకాశం

వివరాలు 15లో

భువనగిరి బరిలో సీపీఐ(ఎం)

సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య



మాట్లాడుతున్న ఎస్.వీరయ్య

ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికలపైనే ఆధారపడి ఉంది : చెరుపల్లి, జూలకంటి

రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్.వీరయ్య తెలిపారు. శుక్రవారం యాదాద్రి భువనగిరి జిల్లా కేంద్రంలోని వెన్నెల కళాశాలలో నిర్వహించిన సీపీఐ(ఎం) జిల్లా విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ.. కుల, మతాల పేరుతో ప్రజల మధ్య చీలికలు తీసుకొచ్చి వైషమ్యాలను రెచ్చగొట్టి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని ఆరోపించారు.

నవతెలంగాణ-భువనగిరి

భారతదేశంలో 100 కోట్ల మందికి పైగా పౌష్టికాహారం అందడం లేదని ఐక్యరాజ్యసమితి ప్రకటించిందని, కానీ దేశ ప్రధాని 80 కోట్ల మందికి మాత్రమే అందడం లేదని అబద్ధాలు చెప్పడం దారుణమని వీరయ్య అన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా కార్పొరేట్ కంపెనీలకు అప్పగించడం, ప్రభుత్వ రంగంలో ప్రయివేటు వ్యక్తుల వాటాలు పెంచడం ద్వారా ప్రభుత్వ రంగాన్ని పూర్తిగా నిర్వీర్యం చేసే కుట్రలు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం చేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో బడా బూర్జువా పెట్టుబడు దారులు మోడీని కొనసాగించాలని కోరుకుంటు న్నారే కానీ సామాన్య, పేద, మధ్యతరగతి ప్రజలు మాత్రం బీజేపీని విమర్శిస్తున్నారన్నారు. ఎలక్టోరల్ బాండ్స్ పేరుతో బీజేపీకి వేల కోట్ల రూపాయల విరాళాలు అందాయని తెలిపారు. పాలకవర్గ స్వభావాన్ని తక్కువగా అంచనా వేయవద్దని, ప్రజా సమస్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మూడుసార్లు కలిసామని, నేటికీ ఒక్క సమస్యా పరిష్కారం కాలేదని అన్నారు.

సీపీఐ(ఎం) కేంద్రకమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి మాట్లాడుతూ.. దేశ ప్రజల భవిష్యత్తు ఈ ఎన్నికల ఫలితాలపై ఆధారపడి ఉందన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ప్రజా సమస్యలే తమ ఎజెండాగా నిరంతరం ప్రజల తరపున పనిచేసే సీపీఐ(ఎం) అభ్యర్థికి ఓటువేసి గెలిపించాలని పిలుపునిచ్చారు. బీజేపీ అనుసరిస్తు న్న ప్రజా వ్యతిరేక ...15లో

గోప్యత ఎందుకు?

ఎస్‌బీఐపై సుప్రీం ఆగ్రహం

సోమవారం లోగా వివరణ ఇవ్వాలంటూ ఆదేశం



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడించకుండా ఎందుకు గోప్యత పాటిస్తున్నారని ఎస్‌బీఐపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. ఇందుకు సంబంధించి గతంలో జారీ చేసిన ఆదేశాలను ఎందుకు పూర్తిగా పాటించలేదని నిలదీసింది. దీనిపై తదుపరి విచారణ జరిగే సోమవారం నాటికల్లా కోర్టుకు ఎస్‌బీఐ వివరణ ఇవ్వాలని సర్వోన్నత న్యాయస్థానం ఆదేశించింది. ఎలక్టోరల్ బాండ్ల సమాచారాన్ని ఎస్‌బీఐ దాచిపెట్టేందుకు యత్నిస్తోందంటూ వచ్చిన పిటిషన్లను ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డివై చంద్రచూడ్, న్యాయమూర్తులు జస్టిస్ ...15లో

దాడుల తర్వాతనే..
41 కంపెనీల నుంచి బీజేపీకి విరాళాలు 7లో..
18 కంపెనీల నుంచే రూ.2,010కోట్లు!


ఎన్నికల బాండ్ల గుట్టు బహిర్గతం
సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో 15లో

పదోన్నతులకు ఎన్నికల ఎఫెక్ట్

- పార్లమెంటు ఎలక్షన్ల తర్వాతే ప్రమోషన్లు
- మల్టీజోన్-2 జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల ఆందోళన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో గెజిటెడ్ హెడ్మాస్టర్ (జీహెచ్‌ఎం) గ్రేడ్-2 పదోన్నతులకు పార్లమెంట ఎన్నికల ప్రక్రియ ఆటంకంగా మారనుంది. శనివారం ఆ ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. దీంతో పదోన్నతులు చేపట్టేందుకు అవకాశముండదు. దీంతో పార్లమెంటు ఎన్నికల తర్వాతే మల్టీజోన్-2 పరిధిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు ...15లో

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

- చిన్నారెడ్డి నేతృత్వంలో ఏర్పాటు
- సభ్యులుగా కోదండరామ్, దివ్య

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలతోపాటు ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు ఇచ్చిన వినతులను పరిశీలించి పరిష్కరించేందుకు ముగ్గురు సభ్యులతో ముఖ్యమంత్రి ఎ రేవంత్‌రెడ్డి కమిటీ వేశారు. రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్ చైర్మెన్ జీ చిన్నారెడ్డి నేతృత్వంలో టీజేఏసీ మాజీ చైర్మెన్, రిటైర్డ్ ప్రొఫెసర్ కోదండరామ్, ఐఏఎస్ అధికారి దివ్యను సభ్యులుగా నియమించారు. ఈనెల 10న రాష్ట్రంలోని వివిధ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాలతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్డీలో ప్రత్యేకంగా సమావేశమైన విషయం తెలిసిందే. ఆ సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన ...15లో

మిషన్‌భగీరథపై విజిలెన్స్

రాష్ట్ర కార్యాలయంలో సోదాలు

- గణాంక అధికారితో భేటీ
- సమాచారం కోసం లేఖ
- కార్డులు సమర్పించాలని ఆదేశం
- ఇప్పటికే నిజామాబాద్‌లో తనిఖీలు

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం ఆయా ప్రభుత్వ శాఖల కార్యకలాపాలపై దృష్టిపెట్టింది. పాత బీఆర్ఎస్ సర్కారు హయాంలో చేపట్టిన ప్రాజెక్టులు, పథకాల్లో చోటుచేసుకున్న అవినీతిని వెలికితీసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఇప్పటికే సాధారణ పరిపాలన శాఖ(జీఏడీ) పరిధిలో పనిచేసే విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖకు ఆదేశాలు జారీచేశారు. అక్రమాలను బయటపెట్టి విచారణ చేయడం ద్వారా ఎన్నికల్లో ప్రజలకు చెప్పిన వాగ్దానాలను నెరవేర్చాలనే ఆశాభావంతో భావిస్తున్నది. ఇప్పటికే సాగునీటిపారుదల శాఖలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా ఇద్దరు ఉన్నతాధికారులను ఇంటికి పంపిన ప్రభుత్వం, తాజాగా మిషన్ భగీరథలో తీగలాగేందుకు సిద్ధమైంది. రాష్ట్రంలోని పౌరులందరికి ఉచితంగా తాగునీటిని అందించేందుకుగాను బీఆర్ఎస్ ప్రభుత్వం మిషన్ భగీరథ ప్రాజెక్టును చేపట్టి పూర్తి చేసింది. దాదాపు రూ.35,300 కోట్లు ఖర్చు చేసింది. అయితే ఇందులో



అవినీతి,అక్రమాలు జరిగాయని ఆరోపణలు, విమర్శలు వచ్చిన నేపథ్యంలో విచారణకు శ్రీకారం చుట్టింది. సహకరించాలంటూ మిషన్ భగీరథ ఇంజినీర్ ఇన్ చీఫ్‌కు గురువారం లేఖ రాసింది. ప్రాజెక్టు టెండర్ల ప్రక్రియకు సంబంధించి రికార్డులు అందజేయాలని విజిలెన్స్ శాఖ కోరింది. నోట్ ఫైళ్లు, టెండర్ ఎవాల్యుయేషన్, టెండరు కమిటీ అనుమతులు, లెటర్ ఆఫ్ యాక్సెప్టెన్స్(ఎల్‌ఓఏ) తదితర దస్త్రాలను విచారణకు సమకూర్చాలని కోరింది. ఇంట్రా విలేజ్ నెట్‌వర్క్‌కు చెందిన సర్క్యులర్లు, జీవోలు ఇతర సమాచారం ...15లో

ఖమ్మం హస్తంలో అయోమయం

కాంగ్రెస్ ఎంపీ సీటుపై సందిగ్ధత | పెద్ద నేతల చుట్టూ చక్కర్లు

- మంత్రుల కుటుంబీకుల్లో ఎవరికి ఇవ్వాలో తెలియని స్థితి
- ఒకరికిస్తే మరొకరి సహకారంపై అనుమానం
- మధ్యేమార్గం ఎంచుకున్నా సమన్వయంపై సందేహాలు
- అధిష్టానానికి సవాల్‌గా టిక్కెట్ కేటాయింపు

నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

ఖమ్మం పార్లమెంట్ టిక్కెట్ కేటాయింపు కాంగ్రెస్ అధిష్టానానికి సవాల్‌గా మారింది. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఆ పార్టీ అభ్యర్థులు, మద్దతుదారులు మొన్నటి ఎన్నికల్లో భారీ విజయాలను సాధించడంతో ఈ సీటుపై ఆసక్తి తారాస్థాయికి చేరింది. ఓవైపు ముగ్గురు మంత్రులు మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తమ కుటుంబీకుల కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తుండగా మరోవైపు ఇతర ఆశావహులు సైతం కాంగ్రెస్ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మంత్రుల కుటుంబీకుల్లో ఏ ఒక్కరికి ఇచ్చినా మిగిలిన ఇద్దరు మంత్రులు ఏ మేరకు సహకరిస్తారనేది చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుతానికి ముగ్గురు మంత్రుల మధ్య సమన్వయం ఉంది. భవిష్యత్తులోనూ వీరి మధ్య పరస్పర సహకారం కొనసాగటం ఈ టిక్కెట్ కేటాయింపుపైనా ఆధారపడి ఉంటుందనే చర్చ పార్టీ శ్రేణుల్లో కొనసాగుతోంది.




టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు..

ఖమ్మం ఎంపీ టిక్కెట్ కోసం జోరుగా పైరవీలు కొనసాగుతున్నాయి. మంత్రులు తమ కుటుంబీకుల కోసం ప్రయత్నాలు సాగిస్తూనే.. తమ వారికి దక్కని పక్షంలో ఎవరికి ఇవ్వాలో కూడా సూచిస్తున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఎన్డీవీ అధినేత నరేంద్రచౌదరిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దగ్గరకు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి గురువారం తీసుకువెళ్లడం చర్చనీయాంశమైంది. అయితే ఇది టిక్కెట్ కోసం కాకపోవచ్చు.. మర్యాదపూర్వకంగా అయివుండొచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. మరోవైపు వీవీసీ సంస్థల అధినేత వంకాయలపాటి రాజేంద్రప్రసాద్ కూడా తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొన్న కర్నాటక ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్‌ను కలిస్తే...గురువారం రాయచూర్‌లో రాహుల్‌గాంధీని కలిసినట్టు తెలుస్తోంది. ఖమ్మం టిక్కెట్ విషయంలోనే తనకున్న అర్హతలను వివరిస్తూ.. మాజీ ఎంపీ వి.హనుమంతరావు సైతం ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్కపై ఇటీవల విమర్శలు చేశారు. కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జెట్టి కుసుంకుమార్ సైతం కొద్దిరోజుల క్రితం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఖమ్మం టిక్కెట్‌పై తనకున్న ఆసక్తిని వెల్లడించారు. రేణుకాచౌదరిని రాజ్యసభకు ఎంపిక చేసినా ఖమ్మం సీటుపై ...15లో

సంపాదకీయం

తెలంగాణ వీరులదే



సరిగ్గా సార్వత్రిక ఎన్నికల ముందు సెప్టెంబర్ 17ను అధికారికంగా తెలంగాణ "విమోచనదినం"గా జరపాలని నోటిఫికేషన్ జారీచేసింది కేంద్ర ప్రభుత్వం. మహోన్నత తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో సెప్టెంబర్ 17కు గల ప్రత్యేకత ఎవరూ కాదనలేనిదే. జాతికి గర్వకారణమైన ఆ పోరాటఖ్యాతిని తస్కరించి దానికి వక్రభాష్యాలు చెపుతూ, విశాల ప్రజామోదమున్న ఆ చారిత్రక సందర్భాన్ని తమ రాజకీయ ప్రయోజ నాలకు వాడుకోజూడటమే ఆక్షేపణీయం. ఇప్పుడు బీజేపీ ప్రభుత్వం చేస్తున్నది అదే. ఇప్పటికే సెప్టెంబర్ 17 వచ్చిందంటే వీరి "పరివారం" నిత్యం "విమోచనదినం" పేరుతో అనేకానేక అసత్య ప్రచారలకు పూనుకుంటోంది.

> కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదని తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. తద్వారా కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా చూసుకోవడమే నాటి నెహ్రూ ప్రభుత్వ లక్ష్యం.

ఇప్పుడు ప్రభుత్వమే ఆ అబద్ధాలను అధికారికం చేస్తూ భవిష్యత్ తరాలకు అందించజూస్తోంది.

విచిత్రమేమిటంటే వీరెవరూ ఈ పోరాటంలో ఒక్క నెత్తురుబొట్టు చిందించినవారూ కాదు. చుక్క చెమట రాల్చినవారూ కారు! కానీ కులమతాల కతీతంగా తెలంగాణ ప్రజలు లిఖించిన త్యాగాల చరిత్రకు మతం రంగు పులుముతున్నారు. ఇది హిందూ ప్రజలకూ ముస్లిం రాజుకూ మధ్య యుద్ధంగా చిత్రిస్తూ వక్రభాష్యాలు చెపుతున్నారు. "ముస్లింల పాలన కింద ఉన్న హిందూ ప్రజలకు 1948 సెప్టెంబర్ 17న భారత ప్రభుత్వం విమోచన కలిగించింది" అన్న అశాస్త్రీయ వాదనను ముందుకు తెస్తున్నారు. అసలు హైదరాబాద్ సంస్థానం ముస్లిం పాలన కింద ఉండేదన్నదే అర్థసత్యం. పాలకుడు ముస్లిం కావొచ్చు... అతడి మతం ఇస్లాం కావొచ్చు... కానీ ఆ రాజు ఆధారపడి పాలన సాగించింది హిందూ భూస్వాములు, దేశ్‌ముఖ్‌లు, జాగీర్దార్ల మీదే. ప్రజలు ప్రత్యక్షంగా దోపిడీకి, విపరీతమైన పీడనకు గురయింది వీరి చేతుల్లోనే. అత్యంత క్రూరులూ మతోన్మాదులైన రజాకార్ మూకలన్నిటికీ ఈ హిందూ దొరల గడీలలోనే విడిది. అక్కడే తిని, తాగి ఈ కసాయి మూకలు ప్రజలమీద కిరాతక దాడులు చేసేవి అన్న సంగతి మరువగలమా? రజాకార్ల సైన్యాధ్యక్షుడు ఖాసీం రజ్వీ ముస్లిం అయితే,వాడికి ఆశ్రయమిచ్చిన విసునూర్ దేశ్‌ముఖ్ రాపాక రామచంద్రారెడ్డి హిందువేగా! అతని దాష్టీకానికి బలైన బందగీ ముస్లిం కాదా? లక్షల ఎకరాలకు అధిపతిగా జనాల మూల్గులు పీల్చిన జన్నారెడ్డి ప్రతాపరెడ్డి ఎవరు? పసిబిడ్డల తల్లుల్ని మోదుగుడొప్పల్లో పాలు పిండించి పరీక్షించిన పసునూరి రామ్మోహన్‌రావు ఎవరు? నీర్మాల నియంత లింగాల నర్సింహారెడ్డి ఎవరు? కోడూరి కర్కోటకుడు గడ్డం నర్సింహారెడ్డి ఎవరు? వీరి అమానుషాలను ఎండగట్టిన షోయబుల్లాఖాన్ ఎవరు? వీరి దురాగతాలను ప్రతిఘటించిన మఖ్దూం మొహియుద్దీన్ ఎవరు? ఈ చరిత్రనిండా ఇటువంటివెన్నో ఉదాహరణలు... వీటిలో "పీడకులు పీడితులు" అన్న విభజనకు తప్ప "హిందువులు ముస్లింలు" అనే విభజనకు ఆస్కారముందా?

ఇక 1948 సెప్టెంబర్ 17న జరిగింది విమోచనే అయితే, 1950 జనవరి 26 దాకా హైదరాబాద్ రాజ్య పాలన నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీఖాన్ పేరు మీదనే ఎందుకు సాగినట్టు? ఆ తరువాత 1956 దాకా ఆయన రాజప్రముఖ్ (గవర్నర్)గా ఎలా కొనసాగినట్టు? దుర్మార్గమైన ఫ్యూడల్ నిరంకుశ పాలన సాగించి, ప్రజల రక్తమాంసాలు పిండి, పన్నులు వసూలు చేసి, ఆనాటికి ప్రపంచంలోనే అత్యంత ధనికులలో ఒకనిగా చలామణీ అయిన నిజాం ఆస్తులను ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? పైగా రాజభరణాల పేరుతో ఇచ్చిన కోట్ల రూకల్ని నాడు ఇందిరా గాంధీ రద్దు చేస్తే దాన్ని పూర్తిగా వ్యతిరేకించింది జనసంఘం, నేటి బీజేపీ మాతృక. ఈ ప్రశ్నలకు సర్కారు వారు జవాబు చెప్పగలరా? అదే నిజమైతే ఆ తరువాత కూడా ప్రజలు సాయుధ పోరాటం ఎందుకు కొనసాగించినట్టూ? ఎందుకంటే ఆ రోజుతో ఏదో మార్పు వచ్చినట్టు ప్రజలు భావించలేదు గనుక. వీరు చెపుతున్నట్టు 1948 సెప్టెంబర్ 17న విమోచన పూర్తయితే 1951 దాకా పటేల్ పటాలాలు తెలంగాణను ఎందుకు వీడలేదు? ఎందుకంటే అవి వచ్చింది నిజాం రాజు కోసం కాదు గనుక. వాటి "ఆపరేషన్ పోలో" అసలు లక్ష్యం కమ్యూనిస్టులే గనుక. తెలంగాణ ప్రజలపై, కమ్యూనిస్టులపై నిజాం పోలీసులు, రజాకారు మూకలకంటే యూనియన్ సైన్యాల హత్యలూ అకత్యాలే ఎక్కువ గనుక దీనిని బట్టి అర్థమవుతున్నదేమిటి? ఏలినవారు చెపుతున్నట్టు ఇది విమోచనే అయితే ఎవరి నుండి ఎవరికి విమోచన? ఈ చారిత్రక వాస్తవా లన్నీ విస్మరించి, వక్రీకరించి "విమోచనగానా లాపన" చేయడంలో వీరికి కొన్ని నిర్దిష్టమైన ప్రయోజనాలున్నాయన్న సంగతి తెలియనిది కాదు.

ఇక్కడ గమనించవలసిన అసలు విషయం ఏమిటంటే.. కమ్యూనిస్టుల సాయుధ పోరాటం ముందు నిజాం తలవంచక తప్పదని తేలిపోయాకే భారత యూనియన్ సైన్యాలు రంగప్రవేశం చేసాయి. ఎందుకంటే ఇక్కడ ప్రజలు గెలిస్తే తెలంగాణ కమ్యూనిస్టుల చేతిలోకి వెళుతుందనీ, అది రేపు తమ ఢిల్లీ కోటను కూడా ముట్టడిస్తుందనే భయం వారిది. నిజం చెప్పాలంటే ఇది యూనియన్ సైన్యాలు తెలంగాణ ప్రజల నుండి నిజాం రాజుకు కల్పించిన విమోచన. తద్వారా కమ్యూనిస్టు ఉద్యమ ప్రకంపనలు హస్తినదాకా చేరకుండా చూసుకోవడమే నాటి నెహ్రూ ప్రభుత్వ లక్ష్యం. ఈ చారిత్రక సత్యాన్ని విస్మరణకు గురిచేయడం, దానిని హిందూ ముస్లిం పోరాటంగా చిత్రించడం, తద్వారా తెలంగాణలో తన రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడం నేటి మోడీ ప్రభుత్వ లక్ష్యం. అందులో భాగమే ఈ నోటిఫికేషన్. ఇది ముమ్మాటికీ చరిత్రకు ద్రోహం చేయడమే.

పీడకులకు పారిస్ కమ్యూన్ ఎప్పటికీ ఒక పీడకలే...



ఆర్. రఘు
9490098422

కనీవినీ ఎరుగని, అంతం కానరాని ఓ సుదీర్ఘ ఆర్థిక సంక్షోభం నేడు ప్రపంచాన్ని కుదిపేస్తున్నది. పర్యవసానంగా రాజకీయ, సామాజిక రంగాలలో తీవ్రమైన అనిశ్చితి నెలకొంది. పెట్టుబడిదారీ ప్రపంచానికి ఇవి చివరి రోజులని, ఆ వ్యవస్థకు కొమ్ముకాసే ఆర్థిక పండితులే ప్రకటిస్తున్నారు. ఆ వ్యవస్థను ఇక కాపాడటం కోసం, మితవాద ఫాసిస్టుల కోసం వీరు ఎదురు చూస్తున్నారు. గతంలో ఇటువంటి పరిస్థితులను అధిగమించటానికి వామపక్ష విప్లవ శక్తులు ప్రభోదించే సోషలిస్టు పరిష్కారం మళ్లీ తలెత్తుతుందేమోనని, ప్రజలు ఆ వైపు చూస్తారేమోనని భయకంపితమవుతున్నది పెట్టుబడిదారీ వ్యవస్థ. "పారిస్ కమ్యూన్, కొద్దికాలం నిలబడ్డ విప్లవం. సంపన్నులపై పేదలు సామాజిక న్యాయం కోసం

> జర్మనీకి తలొగ్గిన ఫ్రెంచ్ ప్రభుత్వం తన దేశంలో తమ దేశ గౌరవం కోసం నిలబడి ప్రజలకు ఓ మంచి ప్రభుత్వాన్ని అందిస్తున్న కార్మికవర్గ రాజ్యాన్ని సహించలేక ఆ జర్మనీ సైన్యాన్ని సహకారంగా తీసుకొని పారిస్ నగరాన్ని, దాన్ని పాలిస్తున్న కార్మిక రాజ్యాన్ని అంతం చేసి పెట్టమని జర్మన్ ప్రభువులని వేడుకున్నది ఫ్రెంచి పెట్టుబడిదారీ వర్గం. దీన్ని కార్ల్ మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మిక సంస్థ)లో ప్రసంగిస్తూ "పెట్టుబడిదారుల అంతర్జాతీయత ఎలా ఉంటుందో మనం చూస్తున్నాం. దానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయత ఒక్కటే మన ఆయుధం. పాతకాలపు భూస్వామ్య ప్రభువులకి తామే నిజమైన వారసులమని బూర్జువా వర్గం భావిస్తున్నది. అందువలన పేద ప్రజలపై ప్రయోగించడానికి ఏ ఆయుధాన్ని అయినా తాము వాడుకోవచ్చు. పేదలు ఏ ఆయుధాన్ని వాడినా అది మాత్రం మహా నేరం" అని పేర్కొన్నారు.

జరిపిన విప్లవం. అది ఓ అద్భుతమైన రాజకీయ కల. మారణకాండతో అంతమైంది కానీ, చావటానికి నిరాకరించిన స్వప్నమది. ఆ కల రానున్న శతాబ్దాలలో విప్లవాలకు ఉత్తేజాన్ని ఇస్తూనే ఉంటుంది." అని గొప్పగా వర్ణించాడు యేల్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్.

చావ నిరాకరించిన కల పారిస్ కమ్యూన్

భూస్వామ్య, రాచరిక పాలనని అంతం చేసి దాని స్థానంలో పెట్టుబడిదారీ వ్యవస్థ స్థిరపడటం మొదలైన కాలంనాటిది పారిస్ కమ్యూన్. 1789 ఫ్రెంచి పెట్టుబడిదారీ విప్లవం ప్రపంచాన్నే ఉత్తేజపరిచింది. అది మొదలుకొని ఐరోపా ఖండంలో పెట్టుబడిదారీ విప్లవాలు ప్రారంభమైనాయి. అయితే పెట్టుబడిదారీ వర్గానికి ఆదిలోనే హంసపాదులా ఆ వ్యవస్థలోని డొల్లతనాన్ని బట్టబయలుచేసి నిలబెట్టింది పారిస్ కార్మిక వర్గం. 1871 మార్చి 18న ప్రారంభమై 72 రోజుల పాటు సాగిన ఈ తొలి కార్మికవర్గ రాజ్యం ప్రపంచ మానవాళి చరిత్రలో ఓ మరుపురాని చారిత్రక ఘటనగా నిలిచిపోతుంది. పారిస్ కమ్యూన్ నేటికీ పెట్టుబడి దారులకి, ముఖ్యంగా ఐరోపా ఖండంలోని పెట్టుబడిదారీ వర్గానికి ఓ పీడకలలా మిగిలిపోయిందని, నేటికీ పారిస్ కమ్యూన్ జ్ఞాపకాలపై ఫ్రాన్స్‌లోనే కాదు, అనేక పాశ్చాత్య దేశాలలో విషం గక్కు తున్న పరిస్థితిచూస్తే మనకు అర్థమవు తుంది.

పారిస్ కమ్యూన్ ఎందుకు పుట్టింది? ఏం చేసింది?

పెట్టుబడిదారీ వ్యవస్థ ఆయా దేశాలలో స్థిరపడడానికి రాచరిక వ్యవస్థలను కూల్చేందుకు ప్రజా బాహుళ్యాన్ని, అందులో భాగంగా విస్తరిస్తున్న కార్మికవర్గాన్ని కూడా తీసుకుపోవడానికి మతం పైన, మూఢాచారాల పైన ఒక్క మాటలో చెప్పాలంటే పురాతన భావాలపైన యుద్ధం ప్రకటించింది. పెనవేసుకుని ఉన్న ఫ్యూడల్, రాచరిక పాలన మతాధిపత్యాలను ఎదిరించింది. ఈ క్రమంలోనే లౌకిక తత్వం (సెక్యులరిజం) అంటే రాజ్యాన్ని, మతాన్ని విడగొట్టాలని నినదించింది. ప్రజాస్వామ్య జాతీయ రిపబ్లిక్‌లు ఏర్పాటుకు శ్రీకారం చుట్టింది. నిజానికి జనం పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు తెచ్చిన ఆధునిక భావాల వైపు, శాస్త్రీయ దృక్పథం వైపు, పార్లమెంటరీ రిపబ్లిక్ వ్యవస్థల వైపు, లౌకిక వాదాల వైపు పెద్ద ఎత్తున ఆకర్షితులయ్యారు. ఈ క్రమంలోనే పెట్టుబడిదారీవర్గం లేవనెత్తిన జాతీయవాదం బలంగా ముందుకు వచ్చింది.

ఈ నేపథ్యంలో దీనికి పూర్తి విరుద్ధమైన భావాల ప్రతిరూపంగా ఏర్పడిన కమ్యూనిస్టు లీగ్ రూపాంతరం చెంది 1864లో మొదటి అంతర్జాతీయ శ్రామిక సంస్థ (ఫస్ట్ ఇంటర్నేషనల్) ఏర్పడింది. కార్ల్‌మార్క్స్, ఎంగెల్స్ ఈ సంస్థ ఆధారంగా పెట్టుబడిదారీ వ్యవస్థను చీల్చి చెండాడటం ప్రారంభించారు. పెట్టుబడిదారీ వ్యవస్థ ముందుకు తెచ్చిన జాతీయ వాదానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయతని ముందుకు తెచ్చారు. భూస్వామ్య వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థ కూల్చినట్టుగానే, పెట్టుబడిదారీ వ్యవస్థను కార్మిక వర్గం కూల్చి తీరుతుందని, పెట్టుబడిదారీ వర్గం ముందుకు తెచ్చిన ప్రతి నినాదంలోని, దాని వర్గ ప్రయోజనాల బండారాన్ని ఎండగట్టడం మొదలెట్టింది ఫస్ట్ ఇంటర్నేషనల్.

జర్మనీకి, ఫ్రాన్స్‌కి మధ్య యుద్ధం మొదలైంది. అప్పటికే ఫ్రాన్స్ పెట్టుబడిదారీ వర్గం కూలిపోయిన రాచరిక వ్యవస్థపై తాము ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ను నిర్మిస్తామని వాగ్దానం చేసి ఉన్నారు. కానీ జర్మనీ సైన్యం దాడి ముందు నిలవలేక చేతులెత్తేసి ఫ్రాన్స్‌ని జర్మనీకి పాదాక్రాంతం చేయడానికి నిశ్చయించారు. ఈ క్రమంలో ఆ దేశంలోని అనేక పట్టణాలలో ప్రజలు ప్రతిఘటన ప్రారంభించారు. ల్యాన్, సెయింట్-ఎటన్నే, మార్సిల్లే, టౌలేస్ వంటి నగరాలలో ఈ ప్రతిఘటన సాగింది. తమపై విజయం సాధిస్తున్న జర్మనీ శత్రువుల కన్నా ఈ నగరాలలో కార్మికుల ప్రతిఘటన ఫ్రెంచి పెట్టుబడి దారులకు కోపం కలిగించింది. జర్మనీతో శాంతి ఒప్పందం పేరిట ఈ ప్రతిఘటనలన్నింటినీ వెంటనే అణచివేసింది. కానీ ఫ్రాన్స్ రాజధాని అయిన పారిస్ నగరంలో కార్మికుల నాయకత్వాన సాగిన ప్రజా ప్రతిఘటనను ఫ్రెంచ్ ప్రభుత్వం అణచలేకపోయింది. దేశభక్తితో జర్మన్ సైన్యానికి తమ దేశాన్ని పాదాక్రాంతం చేయడం అంగీకరించని పారిస్ ప్రజలు ప్రారంభించిన ఈ ప్రతిఘటన తిరుగుబాటుగా, ఒక విప్లవంగా మారి మార్చి 18న మొత్తం పారిస్ నగరాన్ని తమ చేతుల్లోకి తీసుకున్నది.

మార్చి 26న పారిస్ మున్సిపాలిటీకి కార్మిక వర్గం ఎన్నికలు నిర్వహించింది. కార్మిక ప్రభుత్వం ఏర్పడింది (పారిస్ కమ్యూన్). ప్రభుత్వాన్ని ఏర్పరిచిన వెంటనే మతాన్ని రాజకీయాలను విడగొడుతూ తీర్మానం చేసింది. ఫ్యూడల్ వ్యవస్థ మతాధిపతులకి, మత సంస్థలకి కట్టబెట్టిన వేల ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. మూతబడి ఉన్న పరిశ్రమలను తెరిపించి కార్మిక సహకార సంస్థలకు అప్పగించింది. బేకరీలలో రాత్రి షిఫ్టులు రద్దు చేసింది. స్త్రీ



పురుషులకు సమాన వేతనం ప్రకటించింది. పెట్టుబడిదారీ దేశాలలో కనీస వేతనం ప్రకటించడమే గొప్పగా చెప్పుకుంటారు. (నిజానికి దాన్ని కూడా అమలు చేయరు) కానీ గరిష్ట వేతనాన్ని 6000 ఫ్రాంకులుగా నిర్ణయించింది. అలాగే ఎన్నికల్లో పోటీ చేయాలనుకునే వారు ఎవరైనా పారిస్ నగరంలో ప్రకటించబడ్డ కనీస వేతనాన్ని తమ వేతనంగా అంగీకరించి రాతపూర్వకంగా సమర్పిస్తేనే అర్హత ఉంటుందని తీర్మానించింది. ఈ కార్మిక వర్గ ప్రభుత్వం తమది ప్రజాస్వామ్య రిపబ్లిక్ కాదు. సోషలిస్ట్ రిపబ్లిక్ అని ప్రకటించింది. ఆ విధంగా ప్రజాస్వామ్య రిపబ్లిక్‌ల గురించి ఓ పక్క ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదుగుతున్న పెట్టుబడిదారీ వ్యవస్థలో పుట్టిన కార్మిక వర్గం తాను పెట్టుబడిదారీ వ్యవస్థని కూల్చగలిగిన శక్తే గాదు, ఆ వ్యవస్థకు భిన్నమైన, అత్యంత శక్తివంతమైన, దోపిడీ రహితమైన, సామాజిక న్యాయం, సమానత్వంతో కూడిన వ్యవస్థను నిర్మించగలదు అని నిరూపించింది పారిస్ కమ్యూన్.

దీనితో దేశ దేశాలలోని నాటి పెట్టుబడిదారీ పాలకులు భయకంపితులయ్యారు. వెను వెంటనే ఒకటయ్యారు. ప్యారిస్ కమ్యూన్‌పై విరుచుకు పడ్డారు. పారిస్ నగరాన్ని ఈ చీకటి శక్తులన్నీ కలిసి మట్టు పెట్టడానికి ఉపక్రమించాయి. జర్మనీకి తలొగ్గిన ఫ్రెంచ్ ప్రభుత్వం తన దేశంలో తమ దేశ గౌరవం కోసం నిలబడి ప్రజలకు ఓ మంచి ప్రభుత్వాన్ని అందిస్తున్న కార్మికవర్గ రాజ్యాన్ని సహించలేక ఆ జర్మనీ సైన్యాన్ని సహకారంగా తీసుకొని పారిస్ నగరాన్ని, దాన్ని పాలిస్తున్న కార్మిక రాజ్యాన్ని అంతం చేసి పెట్టమని జర్మన్ ప్రభువులని వేడుకున్నది ఫ్రెంచి పెట్టుబడిదారీ వర్గం. దీన్ని కార్ల్ మార్క్స్ మొదటి ఇంటర్నేషనల్ (అంతర్జాతీయ కార్మిక సంస్థ) లో ప్రసంగిస్తూ "పెట్టుబడిదారుల అంతర్జాతీయత ఎలా ఉంటుందో మనం చూస్తున్నాం. దానికి ప్రతిగా కార్మిక వర్గ అంతర్జాతీయత ఒక్కటే మన ఆయుధం. పాతకాలపు భూస్వామ్య ప్రభువులకి తామే నిజమైన వారసులమని బూర్జువా వర్గం భావిస్తున్నది. అందువలన పేద ప్రజలపై ప్రయోగించడానికి ఏ ఆయుధాన్ని అయినా తాము వాడుకోవచ్చు. పేదలు ఏ ఆయుధాన్ని వాడినా అది మాత్రం మహా నేరం" అని పేర్కొన్నారు. మే 28తో పారిస్ కమ్యూన్ పూర్తిగా కూల్చివేయబడింది. 30 వేల మందికి పైగా కమ్యూనార్డ్స్‌ని నగర వీధుల్లో కాల్చి చంపారు. లక్ష మందికి పైగా ఇతర దేశాలకు వలసలు పోయారు. వేల మందిని జైళ్లల్లో నిర్బంధించారు. ఆ విధంగా కార్మికవర్గ తొలి రాజ్యాన్ని అణచివేసి వెంటనే పెద్ద ఎత్తున దుష్ప్రచారం ప్రారంభించారు. శాంతియు తంగా అధికారంలోకి వచ్చిన కార్మిక రాజ్యాన్ని రక్తపుటేరుల్లో ముంచిన తాము శాంతికాముకులు గాను, ప్రతిఘటించిన దేశభక్తియుత పేద ప్రజలను, మూగజీవులను అరాచక వాదులుగా, రాక్షసులుగా నాడే కాదు నేటికీ పాలకులు చిత్రిస్తూనే ఉన్నారు.

ఈ విధంగా పారిస్ కమ్యూన్ పతనానంతరం మార్క్స్ "బానిసలు, పతితులు, యజమానులపై ఎదురు తిరిగిన నాడు బూర్జువా వ్యవస్థ నాగరికత, న్యాయం నగ్న రూపంలో వెల్లడవుతాయి. ఈ నాగరికత, న్యాయాలు ఎట్టి ముసుగులేని కర్కశత్వానికి, చట్టరహితమైన ప్రతీకార వాంఛకు తార్కాణమవుతాయి. ఉత్పత్తిదారునికి, సంపదను స్వాహా చేసే పరాన్న భుక్కులకు జరిగే వర్గ పోరాటంలో ప్రతి నూతన సంక్షోభం ఈ వాస్తవాన్ని మరింత స్పష్టంగా బయటపెడుతుంది, వర్సెల్స్ సైన్యాలు (ప్రభుత్వ సైన్యాలు) పారిస్‌లో ప్రవేశించిన తర్వాత పారిస్ స్త్రీలు, పురుషులు, పిల్లలు ఎనిమిది రోజులపాటు అనేకమైన త్యాగాలతో, ధైర్య సాహసాలతో పోరాడారు. వారి లక్ష్యం ఎంతటి ఉన్నతమైనదో వారి ప్రతిఘటనే చిహ్నం. ప్రభుత్వ సైనికులు నగరంలో సాగించిన అమానుష హత్యాకాండ ఈ కిరాయి మూకలు ప్రాతినిధ్యం వహించే నాగరికతలోని పాశవికత్వాన్ని వెల్లడిస్తుంది. యుద్ధమైన తరువాత మృతుల శవాల గుట్టలను తొలగించడమే ఒక పెద్ద సమస్యగా చేసిన వీరి నాగరికత ఎలాంటిదో చెప్పనక్కరలేదు" అని మార్క్స్ ఆ సమావేశంలో నిప్పులు చెరిగాడు.

కమ్యూన్‌కి మరణం లేదు

తిరిగి మార్క్స్ మాటల్లోనే చెప్పాలంటే "శ్రమజీవుల పారిస్ దాని కమ్యూన్‌తో సహా నూతన సమాజపు వేగుచుక్కగా చిరస్థాయిగా నిలుస్తుంది. దాని మృతవీరులు కార్మికవర్గ హృదయాలలో చిరస్థాయిగా నిలిచి ఉంటారు". పారిస్ కమ్యూన్ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకొని కారల్‌మార్క్స్ మరో అత్యంత ప్రముఖమైన నేటికీ అవసరమైన విశ్లేషణ మన ముందుంచారు. కమ్యూన్ పార్లమెంటరీ సంస్థగా కాక, కార్యాచరణ సంస్థగా ఉండాలి. పార్లమెంట్‌లో ప్రజలకు ప్రాతినిధ్యం వహించి తమను అణగదొక్కవలసింది పాలకవర్గంలోని ఏ సభ్యుడు అనేదాన్ని ఐదేండ్లకు, ఆరేండ్లకు ఒక్కసారి నిర్ణయించుకునేందుకు ఉపయోగించిన మాదిరిగా కాకుండా, ఒక యజమాని తన వ్యాపారానికి కార్మికులను, ఫోర్‌మెన్‌లను, అకౌంటెంట్లను ఎన్నుకునే మాదిరిగా కమ్యూన్‌లో ఏర్పడిన ప్రజలకు ఉపకరించాలని, అంటే వారిని వెనక్కి పిలిపించే హక్కు ఎన్నుకున్న ప్రజలకు ఉండాలని ఆయన ప్రకటించారు. నిజానికి పారిస్ కమ్యూన్ ప్రజా ప్రతినిధులనే కాదు న్యాయమూర్తులు, సైన్యాధికారులు, పోలీసు, మున్సిపల్ అధికారులని కూడా ప్రజలు వెనక్కి పిలిచే (రీ కాల్) హక్కును చట్టబద్ధం చేసింది. పారిస్ కమ్యూన్ స్ఫూర్తితో దాని అడుగు జాడలలో మారిన సామాజిక పరిస్థితుల్లో 1917 రష్యన్ విప్లవం, 1949 చైనా విప్లవం, ఆ తరువాత వియత్నాం, క్యూబా తదితర దేశాలలో విప్లవాలు జయప్రదమయ్యాయి.

> 21వ శతాబ్దంలో ఓ పక్క శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అపారంగా పెరిగింది. ఆహార ఉత్పత్తులు, పారిశ్రామిక అభివృద్ధి గణనీయంగా పెరుగుతున్నాయి. అయినా ఆకలిచావులు, నిరుద్యోగం, అనారోగ్యం, అసమానతలు, అరాచకాలు అదుపు లేకుండా పెరిగి పెట్టుబడిదారీ ప్రపంచాన్నే వెక్కిరిస్తున్న పరిస్థితి అన్ని దేశాలలోనూ, మన దేశంలోనూ చూస్తున్నాము. పర్యవసానంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలని పీడిత ప్రజలు, శ్రామిక జనం ప్రత్యేకించి యువతీ యువకులు వెతుకులాట ప్రారంభించారు. వెనిజులా వంటి లాటిన్ అమెరికా దేశాలలో సోషలిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్యం కండ్లు తేలేస్తున్న నేటి ప్రపంచంలో సోషలిజం వైపు పురోగమించడమే మన కర్తవ్యం.

21వ శతాబ్దంలో ఓ పక్క శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానం అపారంగా పెరిగింది. ఆహార ఉత్పత్తులు, పారిశ్రామిక అభివృద్ధి గణనీయంగా పెరుగుతున్నాయి. అయినా ఆకలిచావులు, నిరుద్యోగం, అనారోగ్యం, అసమానతలు, అరాచకాలు అదుపు లేకుండా పెరిగి పెట్టుబడిదారీ ప్రపంచాన్నే వెక్కిరిస్తున్న పరిస్థితి అన్ని దేశాలలోనూ, మన దేశంలోనూ చూస్తున్నాము. పర్యవసానంగా పెట్టుబడిదారీ వ్యవస్థకు ప్రత్యామ్నాయం కావాలని పీడిత ప్రజలు, శ్రామిక జనం ప్రత్యేకించి యువతీ యువకులు వెతుకులాట ప్రారంభించారు. వెనిజులా వంటి లాటిన్ అమెరికా దేశాలలో సోషలిస్టు తరహా ప్రభుత్వాలు ఏర్పడుతున్నాయి. ఉదారవాద ప్రజాస్వామ్యం కండ్లు తేలేస్తున్న నేటి ప్రపంచంలో సోషలిజం వైపు పురోగమించడమే మన కర్తవ్యం.

అందుకు పారిస్ కమ్యూన్ పతనానంతరం కమ్యూన్ వ్యవస్థాపక సభ్యులలో ఒకరైన కవి యూజీన్ పోర్టర్ రాసిన అద్భుత గీతం ఈరోజు లెక్కలేనన్ని భాషల్లోకి తర్జుమా చేయబడి ఆలపించబడుతున్న గీతమే 'అంతర్జాతీయ గీతం'. ఆ గీతంలో చెప్పినట్టు **"ఆకలిమంటలు మలమలలాడే అనాథులందరూ... లేవండోయ్"** అంటూ నిరూపిం చాల్సిన సమయమాసన్నమైంది.

(మార్చి 18 పారిస్ కమ్యూన్ డే)

వెంటాడుతున్న మనువాదం!

ఒంటి నిండా
కాలకూట విషాన్ని నింపుకొని
పెదాలపై చిరునవ్వు ఒలికిస్తుంటాడు
పేరు ప్రతిష్ఠ కోసం
విశ్వ గురునని బయలుదేరాడు
విషాదాలు మనకు కొత్త కాదు చూడండి

భజనపరులతో
బాడుగ రాతలతో
కితాబులిప్పించుకొని
తన్మయత్వం పొందుతున్నాడు
కండ్లు పెద్దవి చేసుకుని చూడండి

సన్యాసిగా
ప్రపంచాన్ని చుట్టేయసాగాడు
భయమో, భక్తో తెలియదు కానీ,
ఒకప్పుడూ...
వీసాలివ్వని దేశాలిప్పుడూ
సాష్టాంగపడి పొర్లు దండాలెడుతున్నాయి
మనస్సు పెట్టి చూడండి

గోద్రా అల్లర్ల గాయాలింకా మానిందిలేదు
బిల్కిస్ బానో గాయాలు రెచ్చుతున్నయి
నరహంతకులకు పూలదండలు
హారతుల రాచ మర్యాదలు
అబ్బో...
ఉన్మాదమే సిగ్గు పడుతుంది కదా
కండ్లు మూసుకోకుండా చూడండి

ఆడబిడ్డల నగ్న ఊరేగింపుతో
సోయి రాలేదింక
వస్తదని ఆశాసలే లేదు
మణిపూర్ ఇంకా అగ్గి మండుతుంది
జాతుల తెగల మధ్య
మతాధిపత్యం బుసలు కొడుతుంది
ఇప్పుడైతే గుండె స్పందించడం
కోసం చూడండి

పుట్టుక మూలాలను
ప్రశ్నిస్తున్న పౌరసత్వం
మళ్లీ రగులుకుంటోంది
చలి మంటలేసుకొని కాషాయ గుంపొకటి
అధికారానికి నిచ్చెనేసింది
నిచ్చెనమెట్ల కింద నలిగిన
గాయాల నుండి చూడండి


మనువాదానికి
మనం నిప్పెట్టకపోతే
వాడు... కచ్చితంగా
రాజ్యాంగాన్ని తగలబెడుతాడు
వెంటాడుతాడు, వేటాడుతాడు
త్రిశూలాలు ఆయుధాలవుతాయి
గోద్రా అల్లర్లలో నిండు గర్భిణిని
చీల్చిన శూలాల గుర్తులున్నాయక్కడ
వెనుతిరిగి చూడండి

మానవ వాదాన్ని పాతరేసి
నిర్జీవమైన మనుస్మృతికి ప్రాణం పోస్తాడు
కుల మత విషబీజాలు
జవసత్వాలందిస్తాయి
అప్పుడూ.. నువ్వు నేను
నిరాశ్రయులమవుతాం

సరిగ్గా చూడకపోతే..
నిర్బంధ కేంద్రాల్లో
కొన ఊపిరితో కొట్టుమిట్టాడుతూ
మానవవాదాన్ని నెమరేసుకుంటాం
ఇక చావు బతుకుల సంగతి సరేసరి!

- మామిండ్ల రమేష్ రాజా,
7893230218

140 కోట్లూ ఆయన కుటుంబమేనా?



జి. తిరుపతయ్య
9951300016

"ఏక్ సౌ చాలీస్ కరోడ్ దేశ్ వాసి మేరా పరివార్ హై" అని భారతీయ జనతా పార్టీ అగ్ర నాయకులు మోడీ అంటూ అందులో కొన్ని సమూహాలను, రాజకీయ ప్రత్యర్థులుగా శత్రు సమానులుగా చూడడం ఆశ్చర్యమే! నేడు నూటా నలభై కోట్ల కుటుంబసభ్యుల్లో మునుపెన్నడూ లేనంత విభజన, అభద్రత నెలకొన్నది.ఒక ప్రధానమంత్రి స్థానంలోని నాయకుడు తన దేశ జనాభా మొత్తాన్ని కుటుంబంగా భావించడం ఆశించ దగినదే. కానీ 140 కోట్ల జనాభాలో దాదాపు 15 శాతం ప్రజానీకానికి అధికార పార్టీ ప్రాతినిధ్యం వహించడం లేదు. ఇది పరిశీలించాల్సిన అంశం. ప్రజాస్వామ్యమంటే భాగస్వామ్య పరిపాలన మాత్రమే కాదు, ప్రాతినిధ్య పరిపాలన కూడా. అంటే ప్రజాస్వామ్య పరిపాలనలో అన్ని ప్రాంతాల, జాతుల, ప్రజాప్రతినిధులు భాగస్వా ములై నిర్ణయాలను చేయాలి. షెడ్యూల్డ్ కులాలు తెగలకు కొన్ని నియోజకవర్గాల నుండి ప్రాతినిధ్యం వహించే అవ కాశాన్ని రాజ్యాంగంలో పొందుపరిచారు. దీనికి మూలం పూనా ఒడంబడికలో ఏర్పడిందని అంటారు. ఈ పరిపాటిని రాజకీయపార్టీలు స్వచ్ఛందంగా పాటించినప్పుడే సార్థకత.

దేశంలో లోక్‌సభకు 545, రాజ్యసభకు 250 దాదాపు 795 సభ్యుల వరకు ప్రాతనిధ్యం వహిస్తున్నారు. అలాగే నాలుగు వేలకు పైగా శాసనసభ సభ్యులున్నారు. ఇందులో దాదాపు వెయ్యి మంది దాకా బీజేపీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. వీరందరిలో ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా లేడు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసి కులాలలోని ఉపకులాల వారీగా కూడా అభ్యర్థులను ఎంపిక చేసుకునే వారు ఒక మతస్తులనుపూర్తిగా ఎందుకు విస్మరిస్తున్నట్లు? స్వాతంత్ర్య సంగ్రామంలో వీరోచితంగా పోరాడి అమరులైన అనేకమంది ముస్లింల చరిత్ర మనకు తెలుసు. హైదరాబాద్‌లో షోయబుల్లాఖాన్ చేతులు నరికేసినా సరే నిజాం నవాబును ఎదిరించిన తీరు మనకు తెలుసు. అండమాన్ జైల్లో 17 ఏండ్లు కఠిన కారాగారం అనుభవించి జైలు అధికారుల నిర్బంధాన్ని దునుమాడి తిరగబడిన ముజ్జబా హుస్సేన్ గురించి కూడా చరిత్ర పుటల్లో నిక్షిప్తమై ఉంది. 22 కోట్ల జనాభాను పూర్తిగా విస్మరిస్తే సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్ అనే నినాదం శూన్య ఫలితమే ఇస్తుంది. బీజేపీలోకి ముస్లిం నాయకులు రావడం లేదా, లేక ముస్లింలను బీజేపీ రానివ్వడం లేదా? సదరు మతస్తులను వెనకేసుకొచ్చేందుకు రాస్తున్న వ్యాసం కాదిది. అంత పెద్ద సమూహాన్ని అక్కున చేర్చుకోకుండా దేశ జనాభా మొత్తం నాకుటుంబమని చెప్పడం హాస్యాస్పదమవుతుందనేది భావన.

ప్రస్తుత పాలక రాజకీయ పార్టీ మూలాల్లోనే ఆ విభజన పూరిత విధానం వేళ్లూనుకుని ఉన్నది. 1925లో ప్రారంభమైన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఒక్క శాఖతో మొదలై ఇప్పుడు దాదాపు 57 వేల శాఖలకు విస్తరించి నట్టు తెలుస్తోంది. ఈ శాఖలన్నీ ప్రతిరోజూ ఒక గంటపాటు వ్యాయామాలతో కూడిన డ్రిల్‌ను నిర్వహించి, భారతమాతకు సమర్పితమవుతూ ధ్వజ ప్రణామం చేస్తాయి. ఆర్ఎస్ఎస్ ప్రచారాల్లో ముఖ్యమైనది హిందువుల ఐక్యత. ముస్లింలు కాని వారంతా ఇందులో చేరతారు. ఈ దేశం హిందువులది ఇక్కడ ఇతరులకు చోటు లేదనే భావనను నూరిపోస్తారు. ఆర్ఎస్ఎస్‌లో కులాలకతీతంగా అందరూ సమానంగా భావింపబడతారనే భావన ఉన్నది. ఆటాపాటల్లో, సహపంక్తి భోజనాల్లో తారతమ్యాలు ఏవి ఉండవు. అయితే గమనించవలసిన అంశమేమంటే ఇస్లాం వ్యతిరేకతతో కూడిన జాతీయవాద దేశభక్తికి హిందువులంతా ఐక్యంగా ఉండాలని మాత్రమే బోధన జరుగుతుంది. అదే దాని మూలసూత్రం కూడా. మైనార్టీ మతాలతో పాటు కమ్యూనిస్టులను కూడా వ్యతిరేకిస్తుంటారు. కానీ, ఆర్థిక అసమానతలకు సంబంధించిన ఏ ఒక్క చర్చ ఉండకపోగా అలాంటి అసమానతలకు కులవ్యవస్థ ప్రధాన కారణమని గుర్తించే ప్రయత్నాలేవి జరగవు. అంతేకాకుండా కులవ్యవస్థను నిర్మూలించాలనే ఆలో చన కూడా



రానివ్వరు. పైగా కులవ్యవస్థ అనేక సమస్యలకు పరిష్కారాన్ని ఇవ్వగలరని కూడా ఆర్ఎస్ఎస్ వాదులు నమ్ముతారు. అనగా ఏదైనా సమస్య ఘనీభవించినప్పుడు కిందికులం వాళ్లు పై కులాల తీర్పులకు బద్ధులై వుండాలం టారు. ఆర్ఎస్ఎస్ భావజాలం అంబేద్కర్‌ను అంగీకరించదు. అనేకమంది ఆర్ఎస్ఎస్ భావజాలికులు అంబేద్కర్‌ను కీర్తించడాన్ని ఇష్టపడరు. దానికి ప్రధాన కారణం అంబేద్కర్ రిజర్వేషన్ల ద్వారా నైపుణ్యంగల వారికి అన్యాయం చేశారని వాపోతుంటారు. ఎస్సీ,ఎస్టీలు ఇతర వెనుకబడిన వారంతా అనాదిగా సామాజిక నిర్లక్ష్యానికి, కొందరు ఆధిపత్య భావజాలికుల దోపిడీకీ గురయ్యారని కూడా వారు గుర్తించరు. "తమకు దాసోహం అంటూనే వారికున్న నైపుణ్యాలను బట్టి ఎదగాలి కానీ కింది కులాలకు ప్రత్యేక రాయితీలు ఎందుకు?" అనేది వారి ఆలోచన విధానం. "ఒకే గొడుగు కింద ఉన్న వాళ్లం, ఒక మతస్తులం మన ఐక్యత కావాలి" అనే ఆలోచనలలోనే ఇంతటి విషపూరిత విభజనవాదం ఉన్నప్పుడు, తమది కాదనుకున్న సమూహాన్ని వారు చేరదీస్తారని ఆశించగలమా? దీనికి సమాధానం వెతకకుండా 140 కోట్ల నా జనాభా అంటూ పలకడాన్ని ఏమంటాం!

> ఒకవైపు దేశమంతా నా కుటుంబం అంటూనే మరోవైపు జనాభాను జల్లెడబడతాం, కొందరిని ఏరి పారేస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వలసదారులను గుర్తించడానికి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని తీసుకొచ్చారు. వారి ఏలుబడిలో ఉన్న అస్సాంలో అమలు చేశారు కూడా. దేశమంతా దీన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రచించగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాస్తా వెనక్కితగ్గారు. మొన్నటికి మొన్న సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఏఏ)ను తీసుకొచ్చి ఆమలు చేసి తీరుతామంటున్నారు. దీని ద్వారా ముస్లింలు, క్రైస్తవులు మన దేశ పౌరులు కాదనే విభజను తీసుకొస్తున్నారు.

ఒకవైపు దేశమంతా నా కుటుంబం అంటూనే మరోవైపు జనాభాను జల్లెడబడతాం, కొందరిని ఏరి పారేస్తాం అంటూ భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వలసదారులను గుర్తించడానికి నేషనల్ రిజిస్టర్ ఆఫ్ సిటిజన్స్ (ఎన్ఆర్‌సి)ని తీసుకొచ్చారు. వారి ఏలుబడిలో ఉన్న అస్సాంలో అమలు చేశారు కూడా. దేశమంతా దీన్ని అమలు చేసేందుకు ప్రణాళికలు రచించగా తీవ్ర వ్యతిరేకత రావడంతో కాస్తా వెనక్కితగ్గారు. మొన్నటికి మొన్న సిటిజన్‌షిప్ అమెండ్మెంట్ యాక్ట్ (సిఏఏ)ను తీసుకొచ్చి ఆమలు చేసి తీరుతామంటున్నారు. దీని ద్వారా ముస్లింలు, క్రైస్తవులు మన దేశ పౌరులు కాదనే విభజను తీసుకొస్తున్నారు. "1971 మార్చి 25వ తేదీకన్నా ముందు నుండి ఈ దేశంలో ఉన్నట్లు ఆధారాలు ఉంటేనే ఈ దేశ పౌరులు, లేకుంటే కారు" అని దేశంలో ఉన్న ఏడు మతాలలో ఒక మతం వాసులు, ముస్లింలలో మాత్రమే బయోత్పత వాతావరణాన్ని సృష్టిస్తున్నారు. గుర్తింపు కార్డుల వ్యవస్థ మొదలై పట్టుమని పాతికేళ్లు కూడా కాలేదు. ఇండ్ల పట్టాలు, భూముల పట్టాలు కూడా అధికారికమైంది ఈ పాతికేళ్లలోనే. ఈ వాస్తవాలను తెలిసికూడా ఎందుకు ప్రకటిస్తున్నారంటే హిందువులలో ద్వేషాన్ని నింపి రాజకీయ లబ్ధి పొందడానికే. వీరంతా 'విశ్వగురు' పలికిన కుటుంబ సభ్యుల సంఖ్యలో లేరా మరి? రాబోయే ఎన్నికలకు మరో అస్త్రంగా భావించబడుతున్నది యూనిఫామ్ సివిల్‌కోడ్. చట్టము బాహ్య వ్యవహారాలకు వర్తిస్తుంది కానీ అంతర్గత ఆచారాలకు వర్తించలేదన్న వాస్తవాన్ని మరిచిపోయి యుసిసి ద్వారా కొందరిని కట్టడిచేసి అణచి వేయగలమనే ఆధిపత్య భావజాలాన్ని ప్రజల్లో నింపజూస్తున్నారు. బీజేపీ పాలిత కొన్ని రాష్ట్రాలు ఇప్పటికే దీనికి చట్ట రూపాన్ని కల్పించ ప్రారంభించాయి. రాజకీయ లబ్ధి కోసం తెస్తున్న ఈ చట్టాలు తప్పుల తడకగా ఉన్నవని నిపుణులు అంటూనే ఉన్నారు. ఎవరినైతే కట్టడి చేయాలనుకుంటున్నారో వారందరూ ఈ 140 కోట్ల కుటుంబ సభ్యులు కారా? ఇదే 140 కోట్ల జనాభాలో కనీస గఅహ వసతి లేని వారి సంఖ్య కోకొల్లలు. గతేడాది తాత్కాలిక షెడ్లలో తల దాచుకుంటున్న ఏడు లక్షల 40 వేల మందిని వెళ్ళగొట్టి నిరాశ్ర యులుగా చేశారు. లక్షా 50 వేల మందిని అక్రమ నివాసంలో ఉంటున్నారంటూ వారి నివాసాలను నిర్దాక్షిణ్యంగా కూల్చి వేశారు. ఈ వివరాలను హౌసింగ్ అండ్ ల్యాండ్ రైట్స్ నెట్వర్క్ అనే సంస్థ బహిర్గతపరిచింది. అనధికారికంగా గ్రామాలలో కొండ కోనల్లో ఇలాంటివారు అనేకమంది ఉన్నారు. వీరి సంగతి కాస్త పట్టించుకోవాలి. ఏడాది పొడవునా కార్చి చ్చులా కాలి పోతూ వందల మందిని బలిగొంటున్న మణిపూర్ ప్రాంతాన్ని ఒక్కసారైనా సందర్శించక పోగా వివాదాన్ని పరిష్క రించే మార్గాలను కూడా సూచించకపోవడం చాలా విచారకరం. మొండి తనానికైనా ఒక హద్దు ఉంటుంది. ప్రతిపక్షాలపై కోపంతో మణిపూర్ మరణకాండని గాలికి వదిలేయడం గర్హనీయం. కేవలం ప్రతిపక్ష పార్టీలు పాలిస్తున్న రాష్ట్రాల్లోని సమస్యలను మాత్రమే ప్రస్తావిస్తూ స్వపాలిత రాష్ట్రాల్లో రగులుతున్న కుంపటిని ఆర్పేయకపోతే ఎలా! ఇలాంటి ద్వంద్వ వైఖరిని అవలంబిస్తూ 140 కోట్లు నా కుటుంబం అని చెప్పడం స్వార్థ రాజకీయమే.

ఎమ్మెల్సీ కవిత అరెస్టు

(మొదటిపేజీ తరువాయి)

వార్తలు వెలువడుతున్న విషయం తెలిసిందే. ముఖ్యంగా, ఈస్కామ్‌లో కవిత పీఏ అయిన అశోక్ అప్రూవర్‌గా మారి.. కోర్టు ముందు ఇచ్చిన వాంగ్మూలం కవితను అరెస్ట్ చేయటానికి ఈడీ అధికారులకు పెద్ద ఆధారంగా నిలిచినట్టు తెలుస్తున్నది. గత ఏడాదిన్నర కాలంగా ఢిల్లీ లిక్కర్ స్కామ్ వెలుగు చూసి ఢిల్లీ నుంచి తెలుగు రాష్ట్రాల వరకు ప్రకంపనలు సృష్టించిన విషయం తెలిసిందే. ఈ స్కామ్‌లో సౌత్ ఇండియా గ్రూపు తరఫున కవిత కీలక పాత్ర పోషించి, భారీ మొత్తంలో అవినీతికి పాల్పడ్డట్టు ఈడీ నుంచి ఆరోపణలు ఉన్నాయి. ముఖ్యంగా, సౌత్ ఇండియా గ్రూపునకు చెందిన సిండికేట్‌కు మద్యం దుకాణాలు లభించేలా చేయటంలో కవిత కీలక పాత్ర పోషించారనీ, ఇందులో భారీ ఎత్తును ముడుపులు చేతులు మారాయని ఈడీ ఆరోపణలు ఉన్నాయి.

ఈడీ నోటీసులపై సుప్రీంకోర్టులో కవిత పిటిషన్‌పై 19న విచారణ

మరోవైపు, కవిత సన్నిహితుడిగా పేర్కొనబడే రామచంద్రపిళ్లై సైతం ఈ కేసులో మొదట అప్రూవర్‌గా మారి, కవితకు వ్యతిరేకంగా వాంగ్మూలమిచ్చి తర్వాత దానిని వెనకకు తీసుకునే ప్రయత్నం చేశారు. ఇదిలా ఉంటే, కవితను గతేడాది మార్చి నెలలోనే మూడు సార్లు కేంద్ర దర్యాప్తు బృందాలు ఈ కేసులో ప్రశ్నించాయి. కాగా, తాజాగా ఈడీ ఇచ్చిన నోటీసులను సుప్రీంకోర్టులో కవిత సవాలు చేయగా.. దానిపై ఈనెల 19న న్యాయస్థానం విచారణను చేపట్టనున్నది. ఈ నేపథ్యంలో నాటకీయ ఫక్కీలో ఢిల్లీ నుంచి వచ్చిన అసిస్టెంట్ డైరెక్టర్ జోగిందర్ నేతృత్వంలోని 12 మంది సభ్యుల ఈడీ ప్రత్యేక బృందం.. బంజారాహిల్స్‌లోని కవిత నివాసానికి మధ్యాహ్నం 1 గంట ప్రాంతంలో చేరుకొని సోదాల సెర్చ్ వారెంట్‌ను చూపించి మరీ చర్యలకు దిగింది. వీరితో పాటు ఐటీ అధికారులు కూడా సోదాల్లో పాల్గొన్నారు.

ఈడీ సోదాలు.. భారీగా చేరుకున్న బీఆర్ఎస్ శ్రేణులు

మొదట కవితకు చెందిన సెల్‌ఫోన్లతో పాటు లోపల ఉన్నవారి సెల్‌ఫోన్లన్నింటినీ స్వాధీనపర్చుకున్న అధికారులు.. కవిత నివాసంలో అణువణువునా సోదాలు నిర్వహించినట్టు తెలిసింది. నివాసం ప్రధాన గేట్లను మూసివేసి, బయటవారిని ఎవరినీ లోనికి అనుమతించకుండా కట్టుదిట్టంగా సోదాలు జరిపారు. కవిత నివాసంలో ఈడీ సోదాలు నిర్వహిస్తున్నట్టు తెలుసుకున్న బీఆర్ఎస్ శ్రేణులు హుటాహుటిన ఆ ప్రాంతానికి చేరుకొని సోదాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రధాని మోడీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ.. కవిత నివాసంలోకి ప్రవేశించాలని వారు చేసిన ప్రయత్నాలను పోలీసులు నిరోధించారు. మరోవైపు, కవిత నివాసంలో సోదాలు నిర్వహించిన ఈడీ అధికారులను.. కవిత తరఫు న్యాయవాదులు సోమభరత్, మరికొందరు ఈ సోదాలపై ప్రశ్నించినప్పటికీ.. వారు ఏ మాత్రమూ స్పందించకుండా తమ పనుల్లో నిమగ్నమయ్యారు.

కవిత ఇంటికి చేరుకున్న కేటీఆర్, హరీశ్.. అధికారులతో వాగ్వాదం

ఇంకోవైపు, హైదరాబాద్‌లోని ఈడీ కార్యాలయానికి చెందిన మరో ఆరుగురు అధికారులు కూడా కవిత నివాసానికి చేరుకొని ఢిల్లీ అధికారులకు మద్దతుగా నిలిచారు. అయితే, అదేసమయంలో నివాసంలో సోదాలు నిర్వహించటమే గాక.. కవితను అరెస్ట్ చేయబోతున్నట్టు బయటకు వార్తలు పొక్కటంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. దాదాపు ఆరు గంటల ప్రాంతంలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావులు, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్‌లు హుటాహుటిన కవిత నివాసానికి చేరుకోగా.. వారిని కూడా పోలీసులు లోనికి అనుమతించలేదు. లోపల ఏం జరుగుతున్నదో తాము తెలుసుకోవాలనీ, తాము కవిత కుటుంబసభ్యులమని పోలీసులతో పాటు ఈడీ అధికారులతో కేటీఆర్, హరీశ్‌లు వాగ్వాదానికి దిగారు. దాదాపు పది నిమిషాల తర్వాత వారిని అధికారులు లోనికి అనుమతించారు. అప్పటికే ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నమోదైన పీఎంఎల్‌ఏ కేసుకు సంబంధించి నిందితురాలిగా కవితను అరెస్ట్ చేసి, ఢిల్లీకి తీసుకెళ్తున్నట్టు ఒక నోటీసును కవిత భర్తకు ఈడీ అధికారులు అందజేశారు. అంతేగాక, ఆ కేసుకు సంబంధించిన మెమోను కూడా భర్తకు అందజేసినట్టు తెలిసింది.

ప్రత్యేక బందోబస్తు నడుమ ఎయిర్‌పోర్టుకు

కాగా, ట్రాన్సిట్ వారెంట్ లేకుండా ఏ విధంగా కవితను ఢిల్లీకి తీసుకెళ్తారంటూ కేటీఆర్, హరీశ్‌రావులు ఈడీ అధికారులతో వాదించినట్టు తెలిసింది. ఒకవైపు వారి వాదనలు కొనసాగుతుండగానే, ఈడీ అధికారులు కవిత నివాసంలో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్లు, సెల్‌ఫోన్లను సర్దుకొని కవితను ఢిల్లీకి తీసుకెళ్లటానికి రంగాన్ని సిద్ధం చేసుకున్నారు. ముందుగా, వారు రూపొందించుకున్న వ్యూహం ప్రకారమే ఢిల్లీకి రాత్రి 8.45 గంటల ఫ్లైట్‌కు ముందస్తుగా టికెట్లను కూడా సిద్ధం చేసుకున్నారు. ఒకపక్క, వెలుపల ఉద్రిక్త వాతావరణం ఉండగానే రాత్రి ఏడు గంటల ప్రాంతంలో ప్రత్యేక బందోబస్తు మధ్య ఎయిర్‌పోర్టుకు బయలుదేరి వెళ్లారు.

నేటి సాయంత్రం కోర్టులో హాజరుపర్చే అవకాశం

మరోవైపు, ఢిల్లీలో శనివారం సాయంత్రం 5 గంటల లోపల కోర్టులో హాజరుపరిచే విధంగా ఈడీ అధికారులు సన్నాహాలు పూర్తి చేసుకున్నట్టు తెలిసింది. అంతకముందు, ఢిల్లీలో ఇదే కేసులో తమ కస్టడీలో ఉన్న నిందితుడు అమిత్ అరోరాతో కలిపి కవితను విచారించే అవకాశం ఉన్నదని తెలిసింది. దాదాపు వంద కోట్ల రూపాయలు ఈ స్కామ్‌లో ముడుపులుగా ఆప్ నేతలకు కవిత చెల్లించినట్టు వస్తున్న ఆరోపణలకు సంబంధించి ఇప్పటికే అప్రూవర్‌గా మారిన రామచంద్ర పిళ్లై, మాగుంట రాఘవ, అశోక్‌ల నుంచి సమాచారాన్ని సేకరించిన ఈడీ.. మున్ముందు దర్యాప్తులో కవితపై పకడ్బందీగా ఉచ్చును బిగించటానికి రంగం సిద్ధం చేసుకుంటున్నట్టు తెలిసింది. ఈ స్కామ్‌లో ఇదివరకే అరెస్టయిన ఆప్ మంత్రి మనీశ్ సిసోడియా, మరికొందరికి బెయిల్ రావటం అతికష్టంగా మారిన నేపథ్యంలో కవిత కూడా ఆ ఇబ్బందులను ఎదుర్కోక తప్పదనే వాదన న్యాయ నిపుణుల నుంచి వినిపిస్తున్నది.

బీఆర్ఎస్‌లో ప్రకంపనలు

(మొదటిపేజీ తరువాయి)

అరెస్టు చేసినట్టు ప్రకటించి, ఢిల్లీకి తీసుకెళ్లాయి. మోడీ హైదరాబాద్‌లో ఉన్నప్పుడే ఇలాంటి ఘటన జరగడం రాజకీయంగా తీవ్ర దుమారాన్ని రేపుతుంది. ఉద్దేశ్యపూర్వకంగానే కవితను శుక్రవారం అరెస్టు చేశారనే ప్రచారం జరుగుతున్నది. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసుపై కవిత వేసిన పిటీషన్‌పై సుప్రీంకోర్టులో సోమవారం విచారణ జరగనుంది. అందుకు రెండ్రోజుల ముందు ఆమెను అరెస్టు చేయడం గమనార్హం. మరోవైపు ఆపార్టీ నుంచి వెళ్లిపోయే నేతల సంఖ్యా రోజురోజుకూ పెరుగుతుంది. శుక్రవారం బీఆర్ఎస్‌కు చెందిన వరంగల్ ఎంపీ పసునూరి దయాకర్ సీఎం రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. ఆయన కాంగ్రెస్‌పార్టీలో చేరుతున్నారనే ప్రచారం జరుగుతుంది. మరో బీఆర్ఎస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఆయన కూడా కారు స్టీరింగ్ వదిలేస్తారనే చర్చ జరుగుతుంది. కవిత అరెస్టుపై బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మాత్రం సైలెంట్‌గా ఉన్నారు. ఆమె అరెస్టు తర్వాత తెలంగాణ భవన్‌లో మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీల రాజకీయ కుట్రలో భాగంగానే కవిత అరెస్టు జరిగిందని ఆరోపించారు. ఈ సందర్భంగా ఆయన భావోద్వేగానికి గురయ్యారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు కూడా హడావిడిగా ఢిల్లీ వెళ్లారు. కవితను అరెస్టు చేసి తీసుకెళ్తున్న సందర్భంగా ఆయన కూడా భావోద్వేగానికి గురయ్యారు. ధైర్యంగా ఉండాలని కవితకు చెప్పారు. కేంద్రం రాజకీయ కుట్రల్ని చట్టపరంగా ఎదుర్కొంటామని స్పష్టంచేశారు. మరోవైపు బీఆర్ఎస్, బీఎస్పీ ఎన్నికల పొత్తు ఖరారైంది. బీఎస్పీకి నాగర్‌కర్నూల్, హైదరాబాద్ పార్లమెంటు స్థానాలను కేటాయించినట్టు బీఆర్ఎస్ ప్రకటించింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయాక వరుసగా జరుగుతున్న పరిణామాలపై బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు బెంబేలెత్తుతున్నారు. వ్యక్తిగతంగా తమ రాజకీయ భవిష్యత్ ఏంటని ప్రశ్నించుకుంటున్నారు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో కవిత అరెస్టు పార్టీకి మేలు చేస్తుందా...నష్టం చేస్తుందా అనే విశ్లేషణల్లో పార్టీ శ్రేణులు ఉన్నాయి. కాంగ్రెస్‌పార్టీ కూడా జరుగుతున్న పరిణామాలను నిశితంగా గమనిస్తుంది. మొత్తంమీద లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడదలకు ఒక్కరోజు ముందు రాష్ట్రంలో జరుగుతున్న నాటకీయ పరిణామాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరుగుతుంది.

22 నుంచి నిరవధిక సమ్మె

- ఎన్‌హెచ్ఎం డైరెక్టర్‌కు నోటీసు అందజేత

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

నేషనల్ హెల్త్ మిషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల జీతాలు చెల్లించకపోతే ఈ నెల 22 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్తామని ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ (ఏఐటీయూసీ) హెచ్చరించింది. ఈ మేరకు ఆయన యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు ఎం.నరసింహ నేతృత్వంలో నాయకులు శుక్రవారం హైదరాబాద్ కోఠిలోని ఎన్‌హెచ్ఎం డైరెక్టర్ కార్యాలయంలో సమ్మె నోటీసును అందజేశారు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయని వారు తెలిపారు. ఏడు నెలల పీఆర్సీ ఏరియర్స్ పెండింగ్‌లో పెట్టారని చెప్పారు.

ఫైలు కదిలేనా? జీతాలందేనా?

ఉపాధి ఉద్యోగులకు మూడు నెలలుగా అందని జీతాలు

- సమస్య తీవ్రతను పట్టించుకోని ఉన్నతాధికారులు
- కుటుంబాలు గడవక ఉద్యోగుల ఇబ్బందులు
- పర్మినెంట్ చేస్తారనే చిన్న ఆశతో బాధలను భరిస్తున్న వైనం



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఉపాధి హామీ చట్టంలో పనిచేసే కూలీలకే కాదు ఉద్యోగులకూ సర్కారు వేతనాలివ్వడం లేదు. ఒకటికాదు.. రెండు కాదు..మూడు నెలలు నుంచి జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. నెలలో ఒకటెండ్రు రోజులు కాస్త లేటుగా పడితేనే కిందామీద అయ్యే ఈ రోజుల్లో మూడు నెలలు జీతాలు రావడట్లేదంటేనే వారు పడుతున్న వ్యథలు అన్నీఇన్నీ కావు. జీతాలు అందకున్నా..అప్పులు చేసుకుని మరీ బతుకులు వెళ్లదీస్తున్నారు. 18 ఏండ్ల నుంచి పనిచేస్తున్న తమను రాష్ట్ర సర్కారు ఎప్పటికైనా పర్మినెంట్ చేయకపోతుందా? అనే చిన్న ఆశతో వారు బాధలన్నింటినీ పంటికింద భరిస్తూ కుటుంబ బాధ్యతలను నెట్టుకొస్తున్నారు. జీతాల ఫైలు ఆర్థిక శాఖ మంత్రి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క వద్ద పెండింగ్‌లో ఉంది. 'డిప్యూటీ సీఎం సారూ..ఈనెలనైనా జీతాలు వేయించండి' అనుకుంటూ కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు.

ఉపాధి హామీ చట్టం 2005 ఆగస్టు 23న ప్రారంభమైంది. ఆ చట్ట పరిధిలో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 3,974 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. అందులో 392 మంది అడిషనల్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు, ఇంజినీరింగ్ కన్సల్టెన్సీలు 289 మంది, టెక్నికల్ అసిస్టెంట్లు 2028 మంది, ఏపీలు 870 మంది, అడిషనల్ డీఆర్‌పీలు 8 మంది, సీడీ సీఎల్ఆర్ 17 మంది, జేఈ(సివిల్)లు 60 మంది, ప్లాంటేషన్ సూపర్‌వైజర్స్ 26 మంది, పీవోలు 23 మంది, ఇతర విభాగాలకు చెందిన వారు 261 మంది ఉన్నారు. వీరికి తోడుగా 7,500కిపైగా ఫీల్డు అసిస్టెంట్లున్నారు. వీరంతా ఉపాధి హామీ కూలీలతో పనులను చేయించడంలో, బిల్లింగ్ చేయడంలో, కూలీలకు వేతనాలు అందించడంలో జరిగే అన్ని ప్రక్రియల్లోనూ పాలు పంచుకుంటారు. ఉపాధి హామీ పనులను క్రమం తప్పకుండా చేయిస్తూ కేంద్రం నుంచి వీలైనంత మేరకు ఎక్కువ నిధులను రప్పించడంలో వీరు కీలక భూమిక పోషిస్తున్నారు. వీరు 18 ఏండ్ల ఆరు నెలల నుంచి అదే పనిచేస్తున్నారు. వీరు ఉపాధి హామీ పనులు, హరితహారం, రైతు వేదికలు, శ్మశాన వాటికలు, డంపింగ్ యార్డులు, నీటి నిల్వ పనులు, పండ్ల తోటల పెంపకం, మల్బరీ తోటల పర్యవేక్షణ, నర్సరీల నిర్వహణ, ఇలా 220 రకాల పనులను పర్యవేక్షిస్తున్నారు. 16 శాఖలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నారు. ఇంత పనిచేస్తున్న వీరికి జీతాలు మాత్రం సకాలంలో అందడం లేదు. డిసెంబర్ నుంచి వేతనాలు రాలేదు. డిసెంబర్, జనవరి, ఫిబ్రవరి, ఇలా మూడు నెలల జీతాలు పెండింగ్‌లో ఉన్నాయి. మార్చిలోనూ పక్షం రోజులు పూర్తయిపోయాయి. జీతమైతే ఇవ్వలేదు. రాష్ట్ర ప్రభుత్వం వీరికి సకాలంలో వేతనాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నదన్న విమర్శలు ఉద్యోగుల నుంచి వినిపిస్తున్నాయి. 'మూడు నెలల నుంచి జీతం లేక అప్పులు తెచ్చి మరీ ఈఎమ్ఐ లు కడుతున్నాను. ఉద్యోగంలో చేరిన నాటి నుంచి ఇప్పటిదాకా ఎన్నడూ ఇలా కాలేదు. ప్రతి నెలా జీతం వచ్చేది' అని రాష్ట్ర కేంద్రంలో పనిచేసే ఓ ఉద్యోగి వాపోయాడు. వారు అనేక రకాల ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిత్యావసరాల సరుకులు తెచ్చుకునేందుకు, ఇంటి అద్దెలు కట్టేందుకు అప్పులు చేసుకుని బతుకులు వెళ్లదీస్తున్నారు. వేతనాల గురించి ఆఫీసర్ల చుట్టూ తిరుగుతున్నా ఎవ్వరూ పట్టించుకోని పరిస్థితి. వేతనాలకు సంబంధించిన రూ.121 కోట్ల ఫైలు సీతక్క సంతకంతో గ్రామీణాభివృద్ధి శాఖ ఆర్థిక శాఖకు పంపింది. అక్కడ నుంచి ఆ ఫైలు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క దగ్గర పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది.

18 ఏండ్ల నుంచి చేస్తున్నా పర్మినెంట్ ఏది?

గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం 2014 కంటే ముందు నుంచి పలుశాఖల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేసింది. వీరిని మాత్రం పట్టించుకోలేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో దీన్ని అస్త్రంగా చేసుకున్నది. ఉపాధి హామీ చట్టంలో పనిచేస్తున్న వారిని తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే పర్మినెంట్ చేస్తామనీ, పేస్కేలు అమలు చేస్తామని హామీనిచ్చింది. ఆ చట్టం పరిధిలో పనిచేస్తున్న ఉద్యోగుల పర్మి నెంట్ ఫైలు ప్రస్తుతం ఉన్నతస్థాయి అధికారుల వద్ద పెండింగ్‌లో ఉన్నట్టు తెలిసింది. దీనిపై సీఎం రేవంత్‌రెడ్డి సంతకం పెడితే పర్మినెంట్ ప్రక్రియ పూర్తవుతుంది. ఆ ఫైలు ఎంత వేగంగా ముందుకు కదులుతుంది? ఎప్పటిలోగా వారు పర్మినెంట్ అవుతారనే విషయంపై వేచిచూడాల్సిందే.

ప్రాజెక్టుల ప్రాథమిక అంచనాలు పెంచడం అనివార్యమా?

రాష్ట్రంలో కొనసాగుతున్న ఇరిగేషన్ ప్రాజెక్టుల్లో ప్రాథమిక అంచనాలు 4 నుండి 12 రెట్లు పెరగడం సహజమని, అది నేరం కాదని మాజీ నీటి పారుదల శాఖా మంత్రి కడియం శ్రీహరి నిన్న (01.03.2024) మేడిగడ్డ విలేకరుల సమావేశంలో విన్నవించారు. గతంలో రెండు టర్మ్‌లు నీటి పారుదల శాఖా మంత్రిగా ఉన్న అనుభవంతో చెబుతున్నానని, ఎక్కడైనా ప్రాథమిక అంచనా మేరకు ప్రాజెక్టు నిర్మాణం జరిగినట్లు రుజువు చేయాలని సవాల్ విసిరారు. మొదటి నుండి ఇరిగేషన్ ప్రాజెక్టులు పాలక వర్గాలకు, కాంట్రాక్టర్లకు ఏటీఎంలుగా పనిచేస్తున్నాయి. పని ప్రారంభించేటప్పుడు వేసిన అంచనాలు పెంచడానికి వీలుగా ప్రాజెక్టుల నిర్మాణాన్ని జాప్యం చేయడం ఆనవాయితీగా వస్తున్నది. భారీ ప్రాజెక్టులకే కాక, చివరకు మధ్యతరహా ప్రాజెక్టులు కూడా ఈ భారం నుండి తప్పించుకోలేకపోతున్నాయి. రెండు దశబ్దాల క్రితం ఉమ్మడి ఆదిలాబాదు జిల్లాలో చేపట్టిన జగన్నాధపూర్ ప్రాజెక్టుకు ప్రాథమిక అంచనా రు.65కోట్లు కాగా, 2023 మార్చి నాటికి రు.244.66 కోట్లు వ్యయం చేయడం జరుగుతుంది. ఇంకా రు.127 కోట్లు వ్యయం చేస్తే తప్ప ప్రాజెక్టు పూర్తి అయి నిర్ణీత 15వేల ఎకరాల ఆయకట్టుకు నీటిని సరఫరా చేయలేమని కాంగ్రెస్ శ్వేతపత్రంలో చెప్పింది. గతంలో ఎకరాకు సాగునీటి వనరులు కల్పించడానికి రు.93వేల కోట్లు ఖర్చుకాగా, 2014 నుండి 2024 వరకు ఎకరాకు రు.11.20లక్షల కోట్లు ఖర్చు చేయడం జరుగుతున్నది. ఇంత ఖర్చు చేసినా సకాలంలో నీరు ఇవ్వలేకపోతున్నారు. రాష్ట్రంలో 18 భారీ ప్రాజెక్టులు, 26 మధ్యతరహా ప్రాజెక్టులు దశబ్దాలుగా నిర్మాణాలు కొనసాగుతూనే ఉన్నాయి.

మేడిగడ్డ - సుందిల్లకు జరిగిన వ్యయం (కోట్లలో)

ప్రాజెక్టు	ప్రాథమిక అంచనా	రీవైజ్డ్ అంచనా	మార్చి 2022 నాటికి వ్యయం
మేడిగడ్డ ప్రాజెక్టు	1849.31	4321.44	3348.24
మేడిగడ్డ ఎత్తిపోతల	2826.10	4915.37	4721.49
అన్నారం బ్యారేజ్	1452.82	2565.51	2326.83
అన్నారం ఎత్తిపోతల	1669.23	3772.56	3003.98
సుందిల్ల బ్యారేజ్	1248.27	2148.45	1671.80
సుందిల్ల ఎత్తిపోతల	1737.57	3573.78	2869.41
మొత్తం	10,783.30	21,297.11	17,941.75

బాధ్యత కలిగిన మంత్రిగా పనిచేసి రివైజ్డ్ పేరుతో 12-15 రెట్లకు అంచనా వ్యయం పెరుగుతుందని వాధించడం అవినీతికి కీలకంగా భావించవచ్చునా? ఏ ప్రాజెక్టునైనా నిర్ణీత వ్యవధిలో పూర్తిచేయడానికి తగిన ఏర్పాటు లేకుండా తమకు ఉపయోగపడే ఏటీఎంగా మార్చుకోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారు. ప్రజా ధనాన్ని ప్రాజెక్టుల రూపంలో కొల్లగొట్టడం జరుగుతున్నది. 2014 నుండి నేటి వరకు రు.1,81,067 కోట్లు వ్యయం చేసి 15.81 లక్షల ఎకరాలకు మాత్రమే సాగునీటి వనరులను కల్పించడం జరిగింది. నేడు సాగు నీటి వనరులు కల్పించడం అత్యంత వ్యయంతో కూడుకున్నది. ఈ దురాచారాన్ని తగ్గించడాన్ని నిర్ణీతకాలంలో ప్రాజెక్టులను పూర్తిచేయడం ఒక్కటేమార్గం.

మేడిగడ్డ - సుందిల్ల ప్రాజెక్టుల వ్యయాన్ని గమనిస్తే ఎన్ని రెట్లు అంచనాలు పెరుగుతున్నాయో అర్థమవుతుంది. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని పాలకవర్గాలు నిరంతరం అంచనాలను పెంచుతున్నాయి. అందుకు ఈ దిగువ గణాంకాలే ఉదాహరణ.

- సారంపల్లి మల్లారెడ్డి

సందర్శించి... సమస్యలను ఆలకించి..

- జోడేఘాట్‌ను సందర్శించిన మంత్రి సీతక్క
- పోరాట యోధుడు భీమ్‌కు ఘన నివాళి



నవతెలంగాణ-కెరమెరి

ఆదివాసుల ఆరాధ్యదైవం, పోరాట యోధుడు అసువులు బాసిన పోరుగడ్డ జోడేఘాట్‌ను శుక్రవారం పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్క సందర్శించారు. గ్రామస్తులు మంత్రిని డప్పు, వాయిద్యాల నడుమ ఘన స్వాగతం పలికారు. అనంతరం అమరుడు కుమురం భీమ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సమాధి వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ట్రైబల్ మ్యూజియంలో కలియ తిరిగి, మ్యూజియంలో ప్రదర్శనకై ఏర్పాటు చేసిన ఆదివాసీ గిరిజన సంప్రదాయ వస్తువులు, వ్యవసాయ పనిముట్లు, గిరిజన సాంస్కృతిని ప్రతిబింబించే అలంకార ఆభరణాలు, తదితర వస్తువులను తిలకించి వివరాలడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామస్తులతో సమావేశమయ్యారు. పోరు గ్రామాల పెద్ద కుమురం భీమ్ ఉత్సవ కమిటీ మాజీ చైర్మెన్ పెందూర్ రాజేశ్వర్, కోరేంగా గోవింద్ రావు గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. హట్టి నుంచి టోకెన్ మోవాడ్ వరకు అటవీ అనుమతులు లేక రోడ్డు పనులు అసంపూర్తిగా ఆగిపోయాయని తెలిపారు. పోరు గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలన్నారు. జోడేఘాట్ నుంచి దెంబటి గూడెం 3 కి.మీ దూరంలోనే ఉంటుందని, రోడ్డు సౌకర్యం కల్పిస్తే ఆసిఫాబాద్‌కు కేవలం 13 కి.మీ దూరం మాత్రమే ఉంటుందని, రవాణాపరంగా సౌకర్యంగా ఉంటుందని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. అదే విధంగా గత ప్రభుత్వం జోడేఘాట్ గ్రామానికి 30 డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు మంజూరు చేసిందని, గ్రామస్తులే స్వంత ఖర్చులతో రూఫ్ లెవెల్ వరకు నిర్మాణం పూర్తి చేసుకున్నారని వాపోయారు.

వాటికి సంబంధించిన సగం బిల్లులు రావాల్సి ఉందని, పెండింగ్ బిల్లులు ఇప్పించాలని వేడుకున్నారు. వేసవిలో ఈ ప్రాంతంలో భూగర్భ జలాలు 400 మీటర్ల లోతుకు అడుగంటి పోతాయని, నీటి ఎద్దడి తీర్చేందుకు బోర్లు వేయించాలని కోరారు. మూగజీవాల దప్పిక తీర్చేందుకు చెరువు నిర్మాణం చేపట్టాలని విన్నవించారు. గ్రామస్తుల సమ స్య లను విన్న మంత్రి సమీప గ్రామ ప్రజలతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రభుత్వం అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి జోడేగాడ్ ప్రాంతంపైన ప్రత్యేక దృష్టి సారించినట్టు తెలిపారు. పోరు గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తామని మంత్రి సీతక్క అన్నారు. మంత్రి వెంట కలెక్టర్ వెంకటేష్ దోత్రే, ఎస్పీ సురేష్‌కుమార్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీఎస్పీ సదయ్య, భీమ్ మనుమడు సోనిరావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్, జడ్పీ చైర్మెన్ కోనేరు కృష్ణ, వాంకిడి సీఐ శ్రీనివాస్, కెరమెరి ఎస్ఐ గుంపుల విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కన్హా శాంతివనంలో ఆధ్యాత్మిక మహోత్సవం

- హాజరైన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



నతెలంగాణ-రంగారెడ్డి ప్రాంతీయ ప్రతినిధి

ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవ కార్యక్రమాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించారు. కేంద్ర సాంస్కృతిక మంత్రిత్వ శాఖ హార్ట్ ఫుల్‌నెస్ సహకారంతో రంగారెడ్డి జిల్లా నందిగామ మండలంలోని కన్హా శాంతివనంలో నాలుగు రోజులపాటు ప్రపంచ ఆధ్యాత్మిక మహోత్సవాలను నిర్వహించను న్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హాజరై శాంతివనాన్ని సందర్శించారు. ఆధ్యాత్మికతపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను ఆమె తిలకించారు. శాంతివనంలో మొక్కను నాటారు. కార్యక్రమానికి న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్, స్వామి చిదానంద సరస్వతి, చిన్న జీయార్ స్వామి, స్వామి ముకుందానంద, యోగి నిరంజన్ దాస్, నమ్రముని మహారాజ్, దాజి, దేవి చిత్ర లేఖ, తారాచంద్ కంటాలే, డాక్టర్ భవాని రావు, దిల్షాద్, టోనీ లాడర్, తదితరులు పాల్గొన్నారు.

ఆడియాలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ డిగ్రీ కోర్సులను నిలిపివేయాలి: టీఏఎస్ఎల్‌పీఏ

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

ఆర్‌సీఐ అనుమతి లేకుండా తెలంగాణ పారామెడికల్ బోర్డ్ నిర్వహిస్తున్న ఆడియాలజీ డిప్లొమా కోర్సులను, కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం నిర్వహిస్తున్న బీఎస్సీ ఆడియాలజీ, స్పీచ్ థెరపీ టెక్నాలజీ డిగ్రీ కోర్సులను తక్షణమే నిలిపివేయాలని తెలంగాణ ఆడియాలజిస్ట్స్ అండ్ స్పీచ్ లాంగ్వేజ్ పాథాలజిస్ట్స్ అసోసియేషన్(టీఏఎస్ఎల్‌పీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని రాష్ట్ర వికలాంగుల హక్కుల కమీషనర్ బి. శైలజకు వినతిపత్రం సమర్పించారు.

రష్యా అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో
ఉక్రెయిన్ దాడిపై ఐరాస స్పందన



ప్రపంచ వనం

బ్యాకప్ జనరేటర్ల కోసం ఏర్పాటు చేసిన డీజిల్ ట్యాంకులకు సమీపంలో ఉక్రేనియన్ దళాలు బాంబులు వేస్తున్నాయని రష్యా ఫెసిలిటీ సిబ్బంది ఆరోపించిన తర్వాత, జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌లో భద్రతను కాపాడవలసిన బాధ్యత అన్ని పక్షాలదేనని ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ఆంటోనియో గుటెర్రెస్ ప్రతినిధి తెలిపారు. అణు విద్యుత్ ప్లాంట్ సమీపంలో ఇటీవల జరిగిన దాడి గురించి ఐక్యరాజ్య సమితి ప్రతినిధి స్టీఫెన్ డుజారిక్‌ను గురువారం విలేకరుల సమావేశంలో అడిగినప్పుడు ఆయన ఇలా చెప్పాడు. "అణు విద్యుత్ ప్లాంట్ చుట్టూ ఉన్న పరిస్థితి గురించి చాలా ఆందోళన చెందుతున్నామని మేము పదే పదే చెబుతున్నాము. దాని భద్రతను కాపాడటంపై హామీ ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తుంచుకోవాలి. ఒకవేళ ప్రమాదం అంటూ జరిగితే ఎటువంటి పరిస్థితి ఉత్పన్నం అవుతుందనే విషయం గురించి ఆలోచించడానికే భయమేస్తుంది" అని డుజారిక్ చెప్పాడు. ఐక్యరాజ్య సమితికి చెందిన న్యూక్లియర్ వాచ్‌డాగ్ అయిన ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ రష్యా మీడియాతో మాట్లాడుతూ ఈ సంఘటన గురించి తమకు తెలుసునని పేర్కొంది. రేకులో చుట్టబడిన పేలుడు పదార్థాలతో తయారు చేసిన బాంబును జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్ కాంపౌండ్ గోడకు కేవలం ఐదు మీటర్ల దూరంలో పడవేసినట్లు ప్లాంట్ డైరెక్టర్ యూరీ చెర్నుక్ గురువారం సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన ఒక వీడియోలో తెలిపాడు. ఈ దాడి వల్ల అణు విద్యుత్ ప్లాంట్‌కు ఎటువంటి నష్టం జరగలేదు. అలాగే ప్రాణనష్టం కూడా జరగలేదు. అయితే పొరపాటున ఇంధన ట్యాంకులు ధ్వంసం అయితే ప్లాంట్ "అత్యవసర పరిస్థితుల సంసిద్ధత" దెబ్బతింటుందని ఆయన చెప్పాడు.

2022లో ఉక్రెయిన్‌తో వివాదం ప్రారంభంలో యూరోప్‌లోని అతిపెద్ద అణు విద్యుత్ ప్లాంట్ రష్యా నియంత్రణలోకి వచ్చింది. రష్యా నిర్వహించిన రిఫరెండం తరువాత జాపోరోజీ ప్రాంతం రష్యాలో విలీనం అయింది. ఆ తర్వాత ఇది అధికారికంగా రష్యా ఆటమిక్ విద్యుత్ సంస్థ రోసాటమ్ నిర్వహణకు బదిలీ చేయబడింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌పై ఉక్రెయిన్ ఫిరంగి, క్షిపణి, డ్రోన్ దాడులను ప్రారంభించిందని, అలాగే దానిని స్వాధీనం చేసుకోవడానికి ప్రత్యేక దళాలను అనేక సార్లు పంపిందని రష్యా పదేపదే ఆరోపించింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్ చాలా సార్లు బ్లాక్‌అవుట్‌లను ఎదుర్కోవటమే కాక దాని సహాయక మౌలిక సదుపాయాలకు స్వల్పంగా నష్టం వాటిల్లింది. జాపోరోజీ అణు విద్యుత్ ప్లాంట్‌కు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉన్నందున, దాని పర్యవసానాల ప్రభావాన్ని తగ్గించడానికి అణు విద్యుత్ ప్లాంట్‌ను నిద్రాణ స్థితిలో ఉంచటం జరిగింది.

'ఒక దేశం, ఒకే ఎన్నిక' వద్దు

- సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో

న్యూఢిల్లీ : 'ఒక దేశం, ఒకే ఎన్నిక' అన్న భావనకు తాము పూర్తిగా వ్యతిరేకమని సీపీఐ(ఎం) పునరుద్ఘాటించింది. అప్రజాస్వామికమైన ఈ ప్రతిపాదనను ఐక్యంగా వ్యతిరేకించాల్సిందిగా అన్ని ప్రజాస్వామ్య సంస్థలకు, పౌరులకు విజ్ఞప్తి చేసింది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏకకాలంలో ఎన్నికలు నిర్వహించాలని ఉన్నత స్థాయి కమిటీ చేసిన సిఫారసు, దీనిని సాధించేందుకు అది ప్రతిపాదించిన చర్యలు తిరోగమనంతో కూడినవని వ్యాఖ్యానించింది. ఇవి దేశంలో కేంద్రీకృత నిరంకుశ రాజకీయ వ్యవస్థ స్థాపనకు దారి తీస్తాయని పేర్కొంది. పార్టీ పొలిట్‌బ్యూరో శుక్రవారం ఈ మేరకు ఒక ప్రకటన విడుదలజేసింది. రాజ్యాంగానికి, ఇతర చట్టాలకు 18 సవరణలు చేయాలని ఈ నివేదికలో ప్రతిపాదించారు. ఇవి మన పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థను కుళ్లబొడిచేవిగా, అలాగే ఐదేళ్లకోసారి ప్రభుత్వాన్ని ఎన్నుకునే ప్రజల హక్కును హరించేవిగా ఉన్నాయి.

అంతేకాదు, కేంద్ర- రాష్ట్ర సంబంధాల్లో కేంద్రానికి మరిన్ని అధికారాలిచ్చేవిగా కూడా ఉన్నాయి. ఉదాహరణకు, 18వ లోక్‌సభ ఎన్నికల తరువాత ఎన్నికలు జరిగిన రాష్ట్రాల అసెంబ్లీల పదవీ కాలాన్ని తగ్గించాలని ఈ నివేదికలో ప్రతిపాదించారు. ఈ రాష్ట్రాల అసెంబ్లీలకు కూడా 19వ లోక్‌సభ ఎన్నికలతో పాటు ఒకేసారి ఎన్నికలు నిర్వహించుకోవచ్చని ప్రతిపాదించారు. అంటే దీనర్థం 2026లో ఎన్నికలు జరగాల్సిన పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ రాష్ట్ర అసెంబ్లీల పదవీ కాలం ఈ చర్య వల్ల సగానికన్నా పైగా కుదించబడుతుంది. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించిన వంద రోజుల్లోగా అన్ని పంచాయితీలకు, స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలని కూడా కమిటీ ప్రతిపాదించింది. ప్రస్తుతం, స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్‌ను రాష్ట్ర ప్రభుత్వాలే నిర్ణయించి, నిర్వహిస్తూ వుంటాయి. మూడు స్థాయిల్లో ఎన్నికలకు ఉమ్మడి ఓటర్ల జాబితాలు, అన్ని రాష్ట్రాల్లోని స్థానిక సంస్థలకు ఏక కాలంలో ఎన్నికలు నిర్వహించడం వల్ల అధికారాలు కేంద్రీకృతమవుతాయని, అది పంచాయితీలు, స్థానిక సంస్థల ప్రాథమిక సూత్రమైన వికేంద్రీకరణ వ్యవస్థకే పూర్తి విరుద్ధమని పొలిట్‌బ్యూరో పేర్కొంది.

అందుకే ఒక దేశం, ఒక ఎన్నిక అన్న భావనను తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని పొలిట్‌బ్యూరో మరోసారి స్పష్టం చేసింది. ఈ అప్రజాస్వామిక చర్యను సమైక్యంగా వ్యతిరేకించాలని అన్ని ప్రజాతంత్ర శక్తులకు పొలిట్‌బ్యూరో విజ్ఞప్తి చేసింది.

అమెరికా ప్రత్యేక దళాల ఉనికిని ధ్రువీకరించిన తైవాన్

అమెరికా ప్రత్యేక దళాల సిబ్బంది తైవాన్‌లోని కొన్ని ద్వీపాలలో తమ సాయుధ దళాలకు శిక్షణ ఇస్తున్నారని తైవాన్ రక్షణ అథారిటీ చీఫ్ చియు కువో-చెంగ్ గురువారం పత్రికలకు ధృవీకరించాడు. ఒక లెజిస్లేటివ్ విచారణ సందర్భంగా తైవాన్‌లో అమెరికాకు చెందిన శాశ్వత సైనిక ఉనికి గురించి మీడియా నివేదికలను ధృవీకరించమని సదరు అధికారిని కోరినట్లు ఫోకస్ తైవాన్ వార్తా సంస్థ తన వెబ్‌సైట్‌లో గురువారం రాసింది. అమెరికా రక్షణ దళాలకు సంబంధించిన సిబ్బంది తైవాన్ దళాలకు శిక్షణ ఇస్తున్నారని, బలహీనతలను, బ్లైండ్ స్పాట్‌లను గుర్తించడంలో వారికి సహాయపడుతున్నారని చియు పేర్కొన్నాడు.

వంద రోజుల్లో ఐదు గ్యారంటీలకు శ్రీకారం

- ప్రజల నమ్మకాన్ని, విశ్వాసాన్ని నిలబెట్టుకున్నాం : రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంద రోజుల కాంగ్రెస్ పాలనలో ఐదు గ్యారంటీల అమలుకు శ్రీకారం చుట్టినట్టు రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. డిసెంబర్ 7న అధికారం చేపట్టినప్పటి నుంచి ప్రజలకు మెరుగైన పాలన అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో జరిగిన తప్పిదాలను సరిచేస్తూ, ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తూ ప్రభుత్వ ఉద్యోగులకు, పెన్షనర్లకు ఒకటో తేదీన వేతనాలు చెల్లిస్తున్నామని వివరించారు. ఈ మేరకు వంద రోజుల పాలనపై పొంగులేటి శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో విధ్వంసమైన తెలంగాణను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్కో అడుగు ముందుకేస్తూ ఇచ్చిన వాగ్దానాలను అమలు చేస్తోందని తెలిపారు. తాము అధికారం చేపట్టిన 48 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రాజీవ్ ఆరోగ్యశ్రీ వైద్యసాయం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి చరిత్ర సృష్టించామని వివరించారు. 80 రోజుల్లో గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు సదుపాయం, తెల్ల రేషను కార్డు కలిగిన 40 లక్షల మంది మహిళలకు రూ.500లకే గ్యాస్ సిలిండర్ అందించే మహాలక్ష్మి ఎల్‌పీజీ పథకాన్ని అమలు చేశామని పేర్కొన్నారు. 90 రోజుల్లో 5వ గ్యారంటీగా ఇందిరమ్మ ఇండ్లకు శ్రీకారం చుట్టినట్టు తెలిపారు. ఈ పథకం కింద నియోజకవర్గానికి 3,500 ఇండ్ల చొప్పున 4.5 లక్షల ఇళ్లను నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మూడు నెలల్లోనే 29వేలకు పైగా ఉద్యోగ నియామక ఉత్తర్వులు అందచేయడంతో పాటు వయోపరిమితి పెంచామని వివరించారు. భూ సమస్యలకు శరాఘాతంగా మారిన ధరణి పోర్టల్‌ను ప్రక్షాళన చేసేందుకు ఐదుగురు సభ్యులతో పునర్నిర్మాణ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ సమస్యలను సమూలంగా పరిష్కరించడమే తమ లక్ష్యమని వ్యాఖ్యానించారు. పారిశ్రామిక, వ్యవసాయ రంగాల్లో నూతన సాంకేతికను అందిపుచ్చుకొని మరింత మెరుగైన ఫలితాలను రాబట్టేలా చర్యలు చేపట్టినట్టు వివరించారు. అభివృద్ధిని, సంక్షేమాన్ని పరుగులు పెట్టిస్తూ తెలంగాణను దేశంలోనే నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు తమ సర్కార్ అహర్నిశలు పనిచేస్తుందని తెలపారు.

ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిన 100 రోజుల పాలన : మంత్రి జూపల్లి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

వంద రోజుల కాంగ్రెస్ పాలన ప్రజల ఆకాంక్షలకు అద్దం పట్టిందని ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో ప్రజా పాలన కొనసాగుతోందని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. అవినీతి, అక్రమాలకు తావు లేకుండా మెరుగైన పాలనను అందిస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను అప్పుల కుప్పగా మార్చిందనీ, ఉద్యోగులకు జీతాలు ఇవ్వలేని అధ్వాన్న పరిస్థితి నుంచి ఒకటో తేదీన జీతాలు చెల్లించే స్థాయికి చేరామని గుర్తు చేశారు. వంద రోజుల పాలనపై బీఆర్ఎస్ నేతలు అవాకులు, చెవాకులు మాట్లాడుతున్నారనీ, ప్రజలు వారిని నమ్మే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత ఆ పార్టీ కనుమరుగు కావడం ఖాయమని పేర్కొన్నారు.

అడ్మిరల్ రాందాస్ మృతిపై సీఎం సంతాపం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

విశ్రాంత నౌకా దళాధిపతి అడ్మిరల్ లక్ష్మీనారాయణ్ రాందాస్ మృతి పట్ల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక ప్రకటనలో సంతాపం వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం సీఎంవో కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. పదహారేండ్ల వయస్సులోనే 1949లో సంయుక్త సైనిక దళాల్లో చేరి అంచెలంచెలుగా ఎదిగి దేశ రక్షణ విభాగంలో అత్యున్నత పదవిని అలంకరించారని పేర్కొన్నారు. 1971 ఇండియా-పాకిస్థాన్ యుద్ధ సమయంలో వీరోచితంగా పోరాడారని గుర్తు చేశారు. ఆయన మృతి దేశానికి తీరని లోటని పేర్కొన్నారు. రాందాస్ పట్ల కుటుంబ సభ్యులకు సీఎం ప్రగాడ సానుభూతి తెలిపారు.

12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్

- ముదురుతున్న ఎండలు
- అక్కాపూర్‌లో అత్యధికంగా 40.9 డిగ్రీలు
- హైదరాబాద్(బేగంపేట)లోనూ 40 డిగ్రీలు

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎండలు రోజురోజుకీ ముదిరిపోతున్నాయి. 15 జిల్లాలో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. నిర్మల్ జిల్లా అక్కాపూర్‌లో అత్యధికంగా 40.9 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత రికార్డయింది. ఎండ తీవ్రత నేపథ్యంలోనే వాతావరణ శాఖ 12 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. ఆ జాబితాలో నిర్మల్, జోగులాంబ గద్వాల, నిజామాబాద్, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, కొమ్రంభీం అసిఫాబాద్, వనపర్తి, జగిత్యాల, వికారాబాద్, ఆదిలాబాద్, హైదరాబాద్ జిల్లాలున్నాయి. రాజన్నసిరిసిల్ల, ములుగు, యాదాద్రి భువనగిరి జిల్లాల్లోనూ 40 డిగ్రీలు దాటింది. హైదరాబాద్ పరిధిలో బేగంపేటలో అత్యధికంగా 40.2 డిగ్రీల పగటి ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రంలో వచ్చే ఐదురోజుల పాటు వాతావరణం పొడిగా ఉంటుందనీ, అయితే, అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే సూచనలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది.



అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలు	
అక్కాపూర్(నిర్మల్)	40.9 డిగ్రీలు
మాడ్గులపల్లి(నల్లగొండ)	40.7 డిగ్రీలు
వడ్డేపల్లి(జోగులాంబ గద్వాల)	40.7 డిగ్రీలు
అలంపూర్(జోగులాంబ గద్వాల)	40.7 డిగ్రీలు
నిజామాబాద్	40.7 డిగ్రీలు
రాయినిగూడెం(సూర్యాపేట)	40.6 డిగ్రీలు
కేతేపల్లి(వనపర్తి)	40.6 డిగ్రీలు
సిర్పూర్(కొమ్రంభీమ్)	40.5 డిగ్రీలు
గుబ్బగుర్తి(ఖమ్మం)	40.5 డిగ్రీలు
అలంగాపురం(సూర్యాపేట)	40.5 డిగ్రీలు

ఎకో టూరిజం అభివృద్ధికి ప్రణాళిక

- అటవీ, పర్యాటకశాఖ కలిసి పని చేయాలి
- ఐఎఫ్ఎస్ ఖాళీల భర్తీకి కేంద్రానికి విజ్ఞప్తి
- ఉద్యోగుల సాధారణ బదిలీలపై వేసవిలోనే నిర్ణయం
- కాలుష్యం లేని పరిశ్రమలకు ప్రోత్సాహకాలు : అటవీ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ఎకో టూరిజం అభివృద్ధికి ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. అటవీ, పర్యాటక శాఖలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ఆ రెండు శాఖలూ పర్యాటకులను ఆకట్టుకునేలా వైవిధ్యమున్న ప్రాంతాలను గుర్తించి పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్.అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో అటవీ శాఖ అధికారులతో సీఎం సమీక్ష నిర్వహించారు. అందులో అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ, ఆ శాఖ ముఖ్య కార్యదర్శి వాణీప్రసాద్, ఫారెస్ట్ చీఫ్ కన్జర్వేటర్ డోబ్రియాల్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం కార్యదర్శి చంద్ర శేఖర్ రెడ్డి, తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..అటవీ అందాలు, వన్య ప్రాణులు, వలసొచ్చే విదేశీ పక్షులు, విభిన్న జీవ వైవిధ్యమున్న ప్రాంతాలు, హెరిటేజ్ ప్రదేశాలు, సంస్కృతికి అద్దం పట్టే ప్రాంతాలన్నింటినీ గుర్తించి అభివృద్ధి చేయాలని ఆదేశించారు. రాష్ట్రంలో అడవులతో ముడిపడి ఉన్న ప్రకృతి అందాలకు, పర్యాటక ప్రాంతాలకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించేలా ప్రతిపాదనలు రూపొందించాలని ఆదేశించారు. అవసరమైతే ప్రత్యేక కన్సల్టెన్సీ నియమించి ప్రతిపాదనలు తయారు చేయించాలని సూచించారు. ఉత్తర తెలంగాణలో కవ్వాల్, దక్షిణ తెలంగాణ వైపు అమ్రాబాద్ టైగర్ రిజర్వు ప్రాజెక్టులను పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దేందుకు ఉన్న అవకాశాలను పరిశీలించాలని ఆదేశించారు. వన్య ప్రాణులకు హాని కలిగించకుండా ప్రత్యేక పర్యాటక విధానం తయారు చేయాలని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో అటవీ ప్రాంతాల్లోనే పర్యాటకులు విడిది చేసే ప్రాజెక్టులు కూడా ఉన్నాయనీ, వాటిని అధ్యయనం చేసి, అక్కడ అనుసరిస్తున్న రక్షణ, భద్రత చర్యలను రాష్ట్రంలోనూ అమలయ్యేలా చూడాలని సూచించారు.

ఇతర శాఖలకు డిప్యూటేషన్ వెళ్లిన వారి వివరాలివ్వండి

రాష్ట్రానికి మంజూరైన 81 మంది ఐఎఫ్ఎస్ పోస్టుల్లో ప్రస్తుతం 55 మంది మాత్రమే ఉన్నారని, మిగతా 26 ఐఎఫ్ఎస్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని చర్చ జరగ్గా.. సరిపడ సంఖ్యలో ఐఎఫ్ఎస్‌లను కేటాయించాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తామని సీఎం చెప్పారు. అటవీ శాఖ నుంచి డిప్యూటేషన్‌పై వెళ్లి ఇతర విభాగాల్లో పని చేస్తున్న ఉద్యోగుల వివరాలను వెంటనే సమర్పించాలని సీఎం ఆదేశించారు. వసరమైతే వెంటనే వారిని వెనక్కి రప్పించే చర్యలు చేపడుతామన్నారు. ఒకే చోట పనిచేస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలనీ, అందుకు వీలుగా బదిలీలపై నిషేధం ఎత్తేయాలని అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై సీఎం స్పందిస్తూ పార్లమెంట్ ఎన్నికల కోడ్ ముగిసిన తర్వాత బదిలీల ప్రక్రియపై నిర్ణయం తీసుకుంటామని హామీనిచ్చారు. ఉద్యోగుల పిల్లల చదువులకు కూడా ఇబ్బంది లేకుండా వేసవిలోనే బదిలీల ప్రక్రియ పూర్తి చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఒక్క అటవీ శాఖలోనే కాకుండా అన్ని విభాగాల్లోనూ చాలా ఏండ్లుగా ఒకే చోట పాతుకుపోయిన ఉద్యోగులను బదిలీ చేసేలా సాధారణ బదిలీలకు మార్గదర్శకాలు కూడా తయారు చేయాలని అధికారులను ఆదేశించారు.

జీరో పొల్యూషన్ సంస్థలకు ప్రశంసాపత్రాలివ్వండి

కాలుష్య నిబంధనలు, ప్రమాణాలను పాటించే పరిశ్రమలను ప్రోత్సహించాలని సీఎం అన్నారు. ప్రతి ఏడాది పర్యావరణ దినోత్సవం లాంటి సందర్భాన్ని పురస్కరించుకొని జీరో పొల్యూషన్ పాటించే సంస్థలకు ప్రశంసా పత్రాలను అందించాలని సూచించారు. కరీంనగర్, వరంగల్, ఖమ్మం నగరాలకు అందుబాటులో ఉండేలా సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, విద్యుత్తు ఉత్పత్తి చేసే ప్లాంట్లను ఏర్పాటు చేయాలనీ, ఎక్కడ అనువైన ప్రాంతాలున్నాయో పరిశీలించి సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని ఆదేశించారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని నియంత్రించేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ప్లాస్టిక్ తయారు చేసే పరిశ్రమలకు నోటీసులు ఇవ్వాలనీ, భారీగా జరిమానాలు విధించాలని ఆదేశించారు.



అడవుల్లోని ఖాళీ ప్రాంతాల్లో మొక్కలు పెంచండి

రాష్ట్రంలోని నర్సరీల్లో దాదాపు 22 కోట్ల మొక్కలు అందుబాటులో ఉన్నాయని అధికారులు సీఎంకు నివేదించారు. జూన్ లో వర్షాకాలం ఆరంభంలో వీటిని నాటేందుకు ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. అడవుల్లో చెట్ల నరికివేతతో ఖాళీ అయిన ప్రాంతాల్లో మొక్కలు పెంచాలనీ, అవసరమైతే అక్కడే బోర్లు వేయించి నీరు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. ఆక్రమణకు గురవుతున్న అటవీ భూముల చుట్టూ కాంపౌండ్ వాల్, ఫెన్సింగ్ వేసి కాపాడే చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కేంద్రం నుంచి వచ్చే కాంపా నిధులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

కరెంటు చార్జీల పెంపు లేదు

- త్వరగా టారిఫ్ ప్రతిపాదనలు ఇవ్వండి: డిస్కంలకు టీఎస్ఈఆర్సీ ఆదేశాలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ప్రస్తుత విద్యుత్ టారిఫ్ చార్జీలే 2024-25 ఆర్థిక సంవత్సరంలోనూ అమల్లో ఉంటాయని తెలంగాణ విద్యుత్ నియంత్రణ మండలి (టీఎస్ఈఆర్సీ) ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే ఆర్థిక సంవత్సరానికి ఉద్దేశించిన వార్షిక ఆదాయ అవసరాల ప్రతిపాదనల (ఏఆర్ఆర్)ను త్వరగా సమర్పించాలని డిస్కంలను ఆదేశించింది. ఈ మేరకు ఈఆర్సీ చైర్మెన్ టీ శ్రీరంగారావు, సభ్యులు మనోహర్‌రాజు, బీ కృష్ణయ్య శుక్రవారం ఉత్తర్వులు విడుదల చేశారు. 2024 ఏప్రిల్ 1వ తేదీతో ప్రారంభమయ్యే ఆర్థిక సంవత్సరంలోనూ ఇప్పటి కరెంటు చార్జీలనే వసూలు చేసుకోవచ్చని తెలిపింది. విద్యుత్ సంస్థలు 2024-25కి సంబంధించిన పిటీషన్లు ఈఆర్సీలో దాఖలు చేసేవరకు ప్రస్తుత ఎస్ఎల్‌డీసీ చార్జీలు, ట్రాన్స్‌మిషన్ చార్జీలు, జెన్‌కో విద్యుత్ కేంద్రాల విద్యుత్‌కి సంబంధించిన స్థిర, చర వ్యయాలు, వీలింగ్ చార్జీలు యథాతథంగా కొనసాగుతాయని పేర్కొంటూ టీఎస్ఈఆర్సీ వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేసింది. బహిరంగ మార్కెట్లో ఓపెన్ యాక్సెస్ ద్వారా కరెంట్ కొనుగోలు చేసే వినియోగదారుల నుంచి యూనిట్‌కు రూ.1.40 పైసలు చొప్పున అదనంగా సర్‌చార్జ్ వసూలు చేసుకొనేందుకు డిస్కంలకు అనుమతి ఇచ్చింది. యూనిట్‌కు రూ.1.95 వసూలు చేసుకోవడానికి డిస్కంలు అనుమతి కోరగా, దాన్ని రూ.1.40 పైసలకు తగ్గిస్తూ అదనపు సర్‌చార్జీలపై ప్రత్యేకంగా ఉత్తర్వులు జారీ చేశారు. హరిత ఇంధనం (గ్రీన్ ఎనర్జీ) ఆధారిత విద్యుత్ కొనుగోలు చేసేవారికి మాత్రం అదనపు సర్‌ఛార్జ్ వర్తించదని స్పష్టం స్పష్టంచేసింది.

నేడు జీరో బిల్లుపై ఉత్తర్వులు

గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు అర్హులైన లబ్ధిదారులకు ఉచిత విద్యుత్ అందించేందుకు అనుమతి కోరుతూ విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కంలు) సమర్పించిన ప్రతిపాదనలపై శనివారం ఈఆర్సీ నిర్ణయం తీసుకోనుంది. అయితే ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును ముందస్తుగా విడుదల చేస్తేనే జీరో బిల్లు జారీ చేయడానికి వీల్లేదని విద్యుత్ చట్టంలో నిబంధనలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో శనివారం దీనిపై టీఎస్ఈఆర్సీ స్పష్టమైన ఉత్తర్వులు ఇవ్వనుంది.

కవిత అరెస్టును ఖండించిన నేతలు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ఎమ్మెల్సీ కవితను ఈడీ అరెస్టు చేయడాన్ని పలువురు నాయకులు ఖండించారు. కొందరు నేతలు ట్విట్టర్ వేదికగా స్పందిస్తే, మరికొందరు పత్రికా ప్రకటనలు చేశారు. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కే తారకరామారావు దీనిపై స్పందిస్తూ, లోక్‌సభ ఎన్నికలకు ముందు మోడీ సర్కార్ రాజకీయ కక్షపూరిత చర్యను చట్ట ప్రకారం ఎదుర్కొంటామన్నారు. సమాజ్‌వాదీపార్టీ నేత అఖిలేష్ యాదవ్, శివసేన ఎంపీ ప్రియాంక చతుర్వేది, బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రులు కడియం శ్రీహరి, సబితా ఇంద్రారెడ్డి, పోచారం శ్రీనివాసరెడ్డి తదితరులు కవిత అరెస్టును తీవ్రంగా ఖండించారు. ఈడీ, సీబీఐ, ఐటీ వంటి స్వతంత్ర దర్యాప్తు సంస్థలు మోడీ సేవలో తరిస్తున్నాయనీ, లోక్‌సభ ఎన్నికలకు ముందు అధికారం కోసం ఇలాంటి తప్పుడు కేసులు పెట్టి, అరెస్టులు చేసి ప్రతిపక్షాలను భయంభ్రాంతులకు గురిచేస్తున్నారని విమర్శించారు. కవిత ఆత్మస్థైర్యంతో ఉండాలని ఆకాంక్షించారు.



'రీటా నేర్పిన పాఠం'

పుస్తకం స్ఫూర్తిదాయకం

- ఐద్వా జాతీయ నాయకురాలు పుణ్యవతి

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

'రీటా నేర్పిన పాఠం' పుస్తకం ఎంతో స్ఫూర్తిదాయమైందని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జాతీయ నాయకురాలు ఎస్ పుణ్యవతి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞానకేంద్రంలో ఐద్వా జాతీయ ఉపాధ్యక్షురాలు సుధా సుందరరామన్ ఆవిష్కరించారు. అనంతరం పుణ్యవతి మాట్లాడుతూ బందా కరత్ తన యవ్వన ప్రాయంలోనే దేశంలోని వివిధ సమస్యలపై స్పందించారని చెప్పారు. ఆ సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు. ఆ పుస్తకంలో ప్రతి అంశం మహిళా ఉద్యమాలకు ప్రేరణగా ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి, అధ్యక్షురాలు అర్, అరుణజ్యోతి, ఉపాధ్యక్షురాలు టి. జ్యోతి, కె.ఎస్. ఆశాలత, రత్నమాల, సరళ, డి. ఇందిర, ఎమ్, భారతి, ప్రభావతి, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డి అరెస్ట్

- అనుమతులు లేకుండా క్వారీ నిర్వహించినట్టు నిర్ధారణ

నవతెలంగాణ - పటాన్ చెరు

అనుమతులకు మించి అక్రమ మైనింగ్‌కు పాల్పడుతూ ప్రభుత్వ ఆదాయానికి భారీ ఎత్తున గండి కొట్టారన్న ఆరోపణలపై పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు గూడెం మధుసూదన్ రెడ్డిని శుక్రవారం తెల్లవారుజామున ఆయన ఇంట్లో అదుపులోకి తీసుకొని పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. వివరాల్లోకి వెళితే సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం లక్డారం గ్రామ పరిధిలో గూడెం మధుసూదన్ రెడ్డి నిర్వహిస్తున్న సంతోష్ సాండ్ అండ్ గ్రానైట్స్ సప్లయర్స్ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా మైనింగ్ నిర్వహిస్తోంది. మైనింగ్ అనుమతులు ముగిసినా గూడెం మధుసూదన్ రెడ్డి సుమారు సంవత్సరం పాటు అనుమతులు లేకుండా మైనింగ్ నిర్వహించినట్టు అంతేకాకుండా ఆ సంస్థకు ప్రభుత్వం మైనింగ్ నిమిత్తం నిర్దేశించిన విస్తీర్ణకు అదనంగా సుమారు 13 ఎకరాల ప్రభుత్వ భూమిలో అక్రమ మైనింగ్‌కు పాల్పడ్డట్టు టాస్క్ ఫోర్స్ కమిటీ నిర్ధారించడంతో ఆయనను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. గూడెం మధుసూదన్ రెడ్డిని అదుపులోకి తీసుకున్న పటాన్ చెరు పోలీసులు అతనిపై 379, 447, 427, 409, 420 పలు సెక్షన్లతో కేసు నమోదుచేశారు.

ఈ సందర్భంగా పటాన్‌చెరులో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు భారీ ఎత్తున మోహరించి ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నారు. గూడెం మధుసూదన్ రెడ్డిని వైద్య పరీక్షల నిమిత్తం సంగారెడ్డికి ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా పోలీసు వాహనాన్ని బీఆర్ఎస్ శ్రేణులు అడ్డుకునే ప్రయత్నం చేశారు. పోలీసుల బందోబస్తు మధ్య మధుసూదన్ రెడ్డిని సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య పరీక్షల అనంతరం సంగారెడ్డి కోర్టులో హాజరు పరిచారు.

మంత్రి దామోదర ఆదేశాలతోనే అక్రమ కేసులు

- ప్రజాస్వామ్యంలో అంతిమంగా న్యాయమే గెలుస్తుంది : హరీశ్‌రావు
- కాంగ్రెస్ పార్టీలో చేరనందుకే అక్రమ కేసులు : పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి

నవతెలంగాణ - పటాన్ చెరు

కాంగ్రెస్ ప్రభుత్వానికి అక్రమ కేసుల నమోదుపై ఉన్న శ్రద్ధ ప్రజా సమస్యల పరిష్కారంలో లేదని, మంత్రి దామోదర రాజనర్సింహ ఆదేశాలతోనే పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి సోదరుడు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు గూడెం మధుసూదన్ రెడ్డిని పోలీసులు అరెస్టు చేశారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. అరెస్టును తీరును ఆయన తీవ్రంగా ఖండించారు. శుక్రవారం ఆయన ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వంద రోజుల పాలన ఎలా తయారు అయ్యిందంటే కాంగ్రెస్ పార్టీలో చేరాలి అంటే లేదంటే అక్రమ కేసులు నమోదు చేయాలి అన్న రీతిలో ఉన్నద విమర్శించారు.

వందల మంది పోలీసులతో కలిసి తెల్లవారుజామున మూడు గంటలకు వెళ్లి అరెస్టు చేయడం ఎంత వరకు సమంజసమని,అంత అవసరం ఏముందని ప్రశ్నించారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని వచ్చి పోతుంటాయని, గత పదేండ్లలో ఎప్పుడూ కక్షపూరితంగా వ్యవహరించ లేదన్నారు. కాంగ్రెస్ నాయకుల క్వారీల మీద ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం దారుణం అన్నారు. అంతిమంగా న్యాయమే గెలుస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వ కుట్రలను ప్రజల ముందుకు తీసుకొని వెళ్తామన్నారు.



ప్రజల ఆశీర్వాదంతో హ్యాట్రిక్ విజయం సాధించామని, తాము తప్పు చేస్తే మూడుసార్లు గెలిచే వాళ్ళమా అనిఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ప్రశ్నించారు. ప్రజల మనసు గెలవండి ప్రతి పక్షం లేకుండా చేయాలనుకోవడం సరికాదన్నారు. కాంగ్రెస్‌పార్టీలో చేరనందునే అక్రమ కేసులు నమోదు చేస్తున్నారని అన్నారు. కక్షపూరిత అరెస్టులను మానుకోవాలన్నారు.

2012-13 లో అప్పటి కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో పూర్తి అనుమతులతోనే క్వారీలను ప్రారంభించడం జరిగిందన్నారు. నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. సమావేశంలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం తాజా టెండర్లతో రూ.1,110 కోట్ల లాభం



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తాజా టెండర్లలో గతం కన్నా ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3 వేలు అదనంగా టెండర్లు దాఖలయ్యాయి. ఈ లెక్కన పౌరసరఫరాల శాఖకు రూ.1,110.51 కోట్లు అదనంగా సమకూరనుంది. కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ) ప్రకారం మెట్రిక్ టన్ను ధాన్యం ధర రూ.20,600. గతంలో టెండర్లు పిలిచి మెట్రిక్ టన్నుకు రూ.17,015.19కు టెండర్లు ఖరారు చేశారు. ఆ లెక్కన 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు పౌరసరఫరాల శాఖకు రూ.5,885.55 కోట్లు రావాల్సి ఉంది. ఎమ్మెస్పీ ప్రకారం చూస్తే రూ.1,239.99 కోట్లు శాఖ నష్టపోయే పరిస్థితి. అంత తక్కువకే టెండర్లు దక్కించుకున్న కొనుగోలుదారులు ఆ మొత్తం చెల్లించేందుకూ ముందుకు రాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పాత టెండర్లు రద్దు చేసి మళ్లీ టెండర్లు పిలిచారు. తాజా టెండర్లలో మెట్రిక్ టన్నుకు రూ.20,225.67కు టెండర్ దాఖలైంది. పాత టెండర్‌తో పోలిస్తే ఇది ఒక్కో మెట్రిక్ టన్నుకు రూ.3,210.48 అదనం. ఈ లెక్కన మొత్తం 34.59 లక్షల మెట్రిక్ టన్నులకు తాజా టెండర్ ప్రకారం రూ.6,996.06 కోట్లు రాబడి సమకూరనుంది. పాత టెండర్ల రాబడితో పోలిస్తే ఇది రూ.1,110.51 కోట్లు అదనం.

చేరిక...నియామకం


- మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి జాక్‌పాట్



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

బీజేపీ నేత, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డికి జాక్‌పాట్ వరించింది. శుక్రవారంనాడాయన బీజేపీని వదిలేసి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఏఐసీసీ ఇంచార్జ్ దీపాదాస్ మున్షీ సమక్షంలో కుమారుడితో కలిసి కాంగ్రెస్‌లో చేరారు. ఆయన పార్టీలో చేరగానే ఢిల్లీలో తెలంగాణ ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధిగా, తెలంగాణ ప్రభుత్వ సలహాదారుగా (క్రీడా వ్యవహారాలు) నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీపాదాస్ మున్షీ ఆయనకు కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, వంశీచంద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల సమయంలోనూ బాండ్ల విక్రయం



చట్టానికి సవరణ చేసిన మోడీ ప్రభుత్వం

ముఖేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధమున్న పలు సంస్థలు 2019 లోక్‌సభ ఎన్నికల ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. అంతేకాదు... 2022లో గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ శాసనసభలకు ఎన్నికలు జరగడానికి ముందు కూడా బాండ్ల కొనుగోళ్లు జరిగాయి. సాధారణంగా ఎన్నికల సమయంలో బాండ్లను విక్రయించకూడదు. అయితే మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్ట సవరణ కారణంగా అందుకు మార్గం సుగమమైంది. ఫలితంగా కమలదళానికి విరాళాలు వెల్లువలా వచ్చి పడ్డాయి.

ఎన్నికల సమయంలో విక్రయించిన బాండ్లలో అధిక భాగం కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ఖాతాకే చేరాయి. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన వారి జాబితాలో అనేక బడా దేశీయ కంపెనీల పేర్లు కన్పించడం లేదు. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఉంచిన సమాచారాన్ని ప్రాథమికంగా పరిశీలించినప్పుడు అదానీ, టాటా గ్రూప్ కంపెనీలు బాండ్లను కొనుగోలు చేసిన సమాచారం లేదు. రిలయన్స్ ఇండస్ట్రీస్ కూడా బాండ్లను నేరుగా కొనలేదు. అయితే ఆ గ్రూపుతో సంబంధమున్న సంస్థల పేర్లు కొనుగోలు దారుల జాబితాలో ఉన్నాయి. వీటన్నింటికీ ఉమ్మడి డైరెక్టర్లు ఉన్నారు. వాటి చిరునామాలు కూడా ఒకటే.

భారీగా కొనుగోళ్లు చేసిన రిలయన్స్ అనుబంధ సంస్థలు ఫలితంగా బీజేపీకి భారీ విరాళాలు

న్యూఢిల్లీ : రిలయన్స్ ఇండస్ట్రీస్‌తో సంబంధమున్న సంస్థలలో క్విక్ సప్లయ్ చెయిన్ ప్రైవేట్ లిమిటెడ్ ఒకటి. ఇది రూ.410 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. ఈ విషయాన్ని గతంలోనే పలు స్వతంత్ర మీడియా సంస్థలు వెల్లడించాయి. ఈ కంపెనీకి చెందిన ముగ్గురు డైరెక్టర్లలో ఒకరైన తపస్ మిత్రా రిలయన్స్ ఆయిల్ అండ్ పెట్రోలియం, రిలయన్స్ ఎరోస్ ప్రొడక్షన్, రిలయన్స్ ఫొటో ఫిల్మ్స్, రిలయన్స్ ఫైర్ బ్రిగేడ్, రిలయన్స్ పాలియస్టర్ సంస్థలకు కూడా డైరెక్టరుగా వ్యవహరిస్తున్నారు. ముకేష్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ అకౌంట్స్ (కన్సాలిడేషన్) విభాగానికి ఆయనే అధిపతి.

అంబానీ మాజీ భాగస్వామి కూడా...

ముకేష్ అంబానీకి ఒకప్పటి వ్యాపార భాగస్వామి సురేంద్ర లూనియాతో సంబంధమున్న సంస్థలు కూడా బాండ్లను కొనుగోలు చేశాయి. రిలయన్స్ అనుబంధ సంస్థలకు ఎన్డీటీవీలో ఉన్న 29.18% వాటాలను ఆయన అదానీ గ్రూపుకు విక్రయించారు. లూనియాతో సంబంధమున్న ఎన్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, ఇన్ఫోటెల్ బిజినెస్ సొల్యూషన్స్ లిమిటెడ్ కంపెనీలు బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ రెండు కంపెనీల బోర్డు సమావేశాలకు లూనియా హాజరవుతుంటారు. ఇక లూనియాకు ఇన్ఫోటెల్ యాక్సెస్ ఎంటర్‌ప్రైజెస్ ప్రయివేట్ లిమిటెడ్, ఇన్ఫోటెల్ టెక్నాలజీస్ ప్రయివేట్ లిమిటెడ్ కంపెనీలతో సంబంధం ఉంది. వాటి డైరెక్టర్ కమల్ కుమార్ శర్మ ద్వారా లూనియాకు ఈ కంపెనీలతో సంబంధం ఏర్పడింది. లూనియాస్ ఇన్ఫోటెల్ గ్రూపుకు కమల్ కుమార్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టరుగా, సీఈఓగా వ్యవహరిస్తున్నారు. ఈ కంపెనీలన్నీ కలిసి 2019 మే 9న రూ.50 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. ఆ సమయంలో దేశంలో లోక్‌సభ ఎన్నికలు జరిగాయి.

టెండర్ దక్కించుకున్న రిలయన్స్

స్థానికంగా బ్యాటరీ సెల్స్ ఉత్పత్తిని ప్రోత్సహించేందుకు మోడీ ప్రభుత్వం 2.4 బిలియన్ డాలర్ల కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికింద ప్రోత్సాహకాలు పొందేందుకు రియలన్స్ గ్రూప్ బిడ్ సమర్పించింది. 2022 మార్చిలో టెండర్ దక్కించుకుంది. రిలయన్స్‌తో సంబంధమున్న మరో కంపెనీ హానీవెల్ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్ 2021 ఏప్రిల్ 8న రూ.30 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. ఈ కంపెనీ డైరెక్టర్లలో ఒకరు 2005 నుంచి అనేక రిలయన్స్ గ్రూపు సంస్థల బోర్డుల్లో ఉన్నారు.

ఎన్నికల వేళ బాండ్ల విక్రయం

సాధారణంగా ఎన్నికల బాండ్లను సంవత్సరానికి నాలుగు సార్లు మాత్రమే విక్రయిస్తారు. లోక్‌సభ ఎన్నికలు జరిగే సంవత్సరంలో వీటిని అమ్మకూడదు. అయితే ఎన్నికలు జరిగే సంవత్సరంలోనూ పదిహేను రోజుల పాటు బాండ్లను విక్రయించేందుకు వీలుగా 2022 నవంబర్ 7న మోడీ ప్రభుత్వం చట్ట సవరణ తీసుకొచ్చింది. హిమాచల్ ప్రదేశ్ శాసనసభ ఎన్నికలు జరగడానికి కొద్ది రోజుల ముందు, గుజరాత్ అసెంబ్లీ ఎన్నికలకు నెల రోజుల ముందు ఈ సవరణ చేయడం గమనార్హం.

సింహభాగం బీజేపీకే

చట్ట సవరణ నేపథ్యంలో 2022 నవంబర్ 9 నుంచి వారం రోజుల పాటు బాండ్లను అమ్మారు. ఈ వ్యవధిలోనే రూ.676 కోట్ల విలువైన బాండ్లను ఎస్‌బీఐ విక్రయించింది. ఇందులో బీజేపీకి రూ.590 కోట్లు (87 శాతం) విరాళాల రూపంలో అందాయి. ఈ దశలో రిలయన్స్‌తో సంబంధమున్న సంస్థలే ఎక్కువగా బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ వారం రోజుల వ్యవధిలో క్విక్ సప్లయ్ చెయిన్ ప్రయివేట్ లిమిటెడ్, నెక్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మాన్‌కైండ్ ఫార్మా లిమిటెడ్‌లు రూ.164 కోట్ల (మొత్తం విక్రయాలలో 24 శాతం) బాండ్లు కొన్నాయి. మాన్‌కైండ్ ఫార్మాలో లూనియా కూడా ఒక డైరెక్టరే.

లూనియాతో సంబంధం ఉన్న మరో సంస్థ ఎంఎస్ మీడియా వెంచర్స్ ఈ వారం రోజుల అమ్మకపు కాలంలో రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొన్నది. దీనికి, నెక్స్‌జ్ డివైసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌కు సందీప్ జైరాథ్ అనే వ్యక్తి డైరెక్టర్‌గా ఉన్నారు. ఎంఎస్ మీడియా వెంచర్స్‌లో రెండో డైరెక్టర్‌గా ఉన్న కుల్విందర్ పాల్ సింగ్ ఇన్ఫోటెల్ గ్రూపు (లూనియాకు చెందిన కంపెనీ)కు సీనియర్ మేనేజర్‌గా వ్యవహరిస్తున్నారు.

రెండోసారి కూడా...

సవరణ ద్వారా బాండ్లను విక్రయించిన కాలంలో రిలయన్స్ గ్రూపుతో పాటు వేదాంత గ్రూపు, యునైటెడ్ ఫాస్ఫరస్, శ్రీ సిద్ధార్థ్ ఇన్‌ఫ్రాటెక్ అండ్ సర్వీసెస్, డీఎల్‌ఎఫ్, సిప్లా, మారుతి సుజికీ కూడా పెద్ద మొత్తంలోనే కొనుగోళ్లు జరిపాయి. గుజరాత్ ఎన్నికలకు ముందు 2022 డిసెంబరులో మరోసారి బాండ్ల విక్రయానికి గేట్లు తెరిచారు. ఈ కాలంలో రూ.232 కోట్ల విలువైన బాండ్లు అమ్ముడుపోయాయి. వీటిలో కూడా సింహభాగం బీజేపీదే. ఆ పార్టీకి రూ.165 కోట్ల విరాళాలు అందాయి. క్విక్ సప్లయ్ రూ.410 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది. అందులో 2022 జనవరి 5న రూ.225 కోట్లు, జనవరి 10న రూ.10 కోట్ల విలువైన బాండ్లు కొన్నది.

మేము సైతం అన్న ఫార్మా, హెల్త్‌కేర్ సంస్థలు

రూ.900 కోట్ల ఎన్నికల బాండ్ల కొనుగోలు

న్యూఢిల్లీ : దేశంలోని కనీసం 30 ఫార్మా, హెల్త్‌కేర్ కంపెనీలు రూ.900 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి రాజకీయ పార్టీలకు విరాళంగా అందజేశాయి. వివిధ రాజకీయ పార్టీలకు అందిన రూ.12,155 కోట్ల విరాళాలలో ఈ కంపెనీల వాటా 7.5%. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన ప్రముఖ ఫార్మా, హెల్త్‌కేర్ సంస్థలలో యశోద సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ (హైదరాబాద్-రూ.162 కోట్లు), డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ (రూ.80 కోట్లు), అహ్మదాబాద్‌లో కేంద్ర కార్యాలయం ఉన్న టొరెంట్ ఫార్మాస్యూటికల్స్ (రూ.77.5 కోట్లు), హైదరాబాదుకు చెందిన నాట్కో ఫార్మా (రూ.69.25 కోట్లు), హైదరాబాదుకే చెందిన హెటెరో ఫార్మా, దాని అనుబంధ సంస్థలు ఉన్నాయి. బియోకాన్ లిమిటెడ్ వ్యవస్థాపకుడు కిరణ్ మజుందార్ షా కూడా ఆరు కోట్ల రూపాయల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశారు. ఫార్మా పరిశ్రమకు చెందిన సిప్లా కంపెనీ సైతం రూ.39.2 కోట్ల విలువైన ఈబీలను కొనుగోలు చేసింది.

యశోదా సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి ఆరు దశలలో 80 బాండ్లను కొనుగోలు చేసింది. ఒక్క 2022 ఆగస్టులోనే రూ.80 కోట్ల విలువైన బాండ్లు కొన్నది. హెటెరో ఫార్మా మూడు విడతలుగా బాండ్లు కొనుగోలు చేసింది. దానికి ముందే ఆ కంపెనీపై ఐటీ దాడులు జరిగాయి. లెక్క చూపని రూ.550 కోట్ల నగదును అధికారులు కనుగొన్నారు. ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసిన ఫార్మా కంపెనీల జాబితాలో హైదరాబాదుకు చెందిన వ్యాక్సిన్ తయారీ సంస్థలు భారత్ బయోటెక్ (రూ.10 కోట్లు), బయలాజికల్ ఈ (రూ.5 కోట్లు) కూడా ఉన్నాయి. కోవిడ్ వ్యాక్సిన్ల తయారీ కోసం ఈ రెండు కంపెనీలు ప్రభుత్వ అనుమతి పొందిన విషయం తెలిసిందే. ఇక్కడ గమనించాల్సిన విశేషమేమంటే పలు ఫార్మా కంపెనీలు ఒకే రోజు ఎన్నికల బాండ్లు కొనుగోలు చేశాయి. ఉదాహరణకు 2022 నవంబర్ 10న సిప్లా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్, ఇప్కా లేబొరేటరీ కలిపి మొత్తంగా రూ.50 కోట్ల విలువైన బాండ్లను కొన్నాయి. ఆ మరునాడే గ్లెన్‌మార్క్, మాన్‌కైండ్ కంపెనీలు రూ.30 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాయి. మూడు రోజుల తర్వాత అంటే నవంబర్ 14న అలెంబిక్ ఫార్మాస్యూటికల్స్, ఆల్‌కెమ్ లేబొరేటరీస్, పిరమల్ కంపెనీలు రూ.20 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేయడం జరిగింది. 2022 మార్చిలో పన్ను ఎగవేత ఆరోపణలకు సంబంధించి గ్లెన్‌మార్క్ ఫార్మా, సిప్లా, మైలాన్, అరబిందో ఫార్మాపై డీజీజీఐ విచారణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పాలకులను ప్రసన్నం చేసుకునేందుకు ఆయా కంపెనీలు ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసి విరాళాలు సమర్పించుకున్నాయి.

మహారాష్ట్ర ప్రాజెక్టు కోసం...

రూ.140 కోట్ల బాండ్లు కొనుగోలు చేసిన మేఘా

న్యూఢిల్లీ : హైదరాబాదుకు చెందిన మేఘా ఇంజినీరింగ్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ (ఎంఈఐఎల్) గత సంవత్సరం ఏప్రిల్ 11న రూ.140 కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. దానికి నెల రోజుల ముందే ఆ కంపెనీకి రూ.14,400 కోట్ల విలువైన థానే-బొరివాలీ జంట టన్నెల్ ప్రాజెక్ట్ టెండర్ దక్కడం గమనార్హం. మొత్తంమీద ఈ కంపెనీ అత్యధిక విలువ కలిగిన బాండ్లను (రూ.821 కోట్లు) కొనుగోలు చేసిందని ఎన్నికల కమిషన్ వెల్లడించిన వివరాలను బట్టి తెలుస్తోంది. టన్నెల్ ప్రాజెక్టు కోసం ఎంఈఐఎల్ కంపెనీ ఒక్కటే టెండర్ దాఖలు చేసింది. టన్నెల్ నిర్మాణం కోసం ఎల్ అండ్ టీ సంస్థ దాఖలు చేసిన బిడ్లు తిరస్కరణకు గురయ్యాయి. దీనిపై ఆ సంస్థ బాంబే హైకోర్టును ఆశ్రయించినా ప్రయోజనం కలగలేదు.



వచ్చారు.. వెళ్లారు..

నిరుత్సాహపర్చిన మోడీ రోడ్డు షో

దాదాపు మూడు గంటలు వేచి ఉన్న బీజేపీ శ్రేణులు

మాట్లాడకుండా కేవలం అభివాదం చేస్తూ వెళ్లిపోయిన ప్రధాని

ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నైరాశ్యంలో రాష్ట్ర నేతలు

మోడీ మౌన రోడ్ షో అంటూ పెదవి విరుపు

నవతెలంగాణ-సిటీబ్యూరో

మల్కాజిగిరిలో ప్రధాని నరేంద్ర మోడీ రోడ్ షో నిరాశపర్చింది. మోడీ రాక కోసం దాదాపు మూడు గంటల వరకు వేచి ఉన్న మహిళలు ఆయన ఎందుకు వచ్చారు.. ఎందుకు వెళ్లారు.. అంటూ నిరుత్సాహం వ్యక్తం చేశారు. మేడ్చల్- మల్కాజిగిరి జిల్లాలోని మల్కాజిగిరి నియోజకవర్గంలో శుక్రవారం ప్రధాని నరేంద్ర మోడీ విజయ సంకల్ప రోడ్ షో నిర్వహించారు. ఈ రోడ్ షో సాయంత్రం 4 గంటలకు ప్రారంభం కావాల్సి ఉండగా.. 6.15కు ప్రారంభమైంది. మిర్జాలగూడ చౌరస్తా నుంచి మల్కాజిగిరి చౌరస్తా వరకు దాదాపు 1.3 కిలో మీటర్లు మోడీ రోడ్ షో కొనసాగింది. గోషామహల్‌తో సహా సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బీజేపీ శ్రేణులను మూడు గంటల ఆలస్యం ఇబ్బందులకు గురిచేసింది. ప్రధాని మోడీ జిల్లాకు ఏమైనా వరాల జల్లు కురిపిస్తారని ఆశించిన ప్రజలకు నిరాశే మిగిలింది. అయితే రోడ్ షోలో నాయకులు, కార్యకర్తల హడావుడి జోరుగా కనిపించింది.

బారికేడ్లు ట్రాఫిక్ ఆంక్షలతో ఇబ్బందులు..

మోడీ పర్యటనను పురస్కరించుకుని బందోబస్తు పేరిట మల్కాజిగిరి అసెంబ్లీ పరిధిలోని పలు ప్రాంతాలను, ప్రధాన రోడ్లను దిగ్బంధించారు. ట్రాఫిక్ ఆంక్షలూ విధించారు. బారీకేట్లు ఏర్పాటు చేసి రహదారులపై ప్రత్యేక నియంత్రణా చర్యలు చేపట్టారు. మల్కాజిగిరి పరిసర ప్రాంతాల్లో మల్కాజిగిరి, ఈస్ట్ ఆనంద్ బాగ్, జెడ్ టీఎస్, మిర్జాల్ గూడ, గౌతంనగర్, మినీ ట్యాంక్ బండ్, నేరేడ్ మెట్ ప్రాంతాల్లోని ట్రాఫిక్ మళ్లించారు. అలాగే ప్రధాన రహదారి పక్కన వాణిజ్య సముదాయాలను మూసివేశారు. దాంతో వివిధ పనులు, హాస్పిటల్స్, రోజువారీ కార్యక్రమాల కోసం బయటికి వెళ్లే బస్తీవాసులు ఇబ్బందులు పడ్డారు. కొన్ని చోట్ల బందోబస్తు పేరిట నాయకులు ఓవర్ యాక్షన్ చేసినట్టు తెలిసింది. కొందరు నాయకులు మల్కాజిగిరి చౌరస్తా ప్రాంతంలో ప్రత్యేక వేదికలు ఏర్పాటు చేయడంతో మోడీని దగ్గర నుంచి చూడాలనుకున్న ప్రజలు ఇబ్బందులు పడ్డారు. బీజేపీ శ్రేణుల కంటే ప్రధాని మోడీని చూడాలనే ఉద్దేశంతో చాలా మంది రోడ్ షోకు వచ్చారు.

ఉలుకు లేదు.. పలుకు లేదు..

రోడ్ షోలో ప్రధాని మోడీని అతిగా ఊహించుకున్న పార్టీ క్యాడర్‌కు, ప్రజలకు నిరాశే మిగిలింది. రోడ్ షోలో మోడీ అభివాదమే తప్ప. ఉలుకు, పలుకు లేకుండా మౌనంగా రోడ్ షో ముగించటం పట్ల ప్రజలు అసహనానికి గురయ్యారు. ఈ రోడ్ షోలో ప్రధాని మోడీ వెంట బీజేపీ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి ఈటల రాజేందర్, సికింద్రాబాద్ అభ్యర్థి జి.కిషన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రాం చందర్ రావు, బీజేపీ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా రూరల్ అధ్యక్షులు విక్రమ్ రెడ్డి పాల్గొన్నారు.

అనుమతుల కోసం నజరానాలు

రూ.825 కోట్ల విరాళాలు • బాండ్ల కొనుగోలులో మైనింగ్, స్టీల్ కంపెనీలు

న్యూఢిల్లీ : ఏ ప్రాజెక్టు నిర్వహించాలన్నా ప్రభుత్వం నుండి అనుమతులు ఊరికే రావు. అంతో ఇంతో సమర్పించుకోవాల్సిందే. దేశంలో పేరెన్నికగన్న మైనింగ్, స్టీల్ కంపెనీలు తమ ప్రాజెక్టులకు అవసరమైన పర్యావరణ అనుమతులు పొందేందుకు ఎన్నికల బాండ్ల పథకాన్ని ఉపయోగించుకున్నాయి. ఈబీలను కొనుగోలు చేసి పాలకులకు నజరానాలు అందజేశాయి. అయినా ఇప్పటికీ కొన్ని కంపెనీలు అనుమతుల కోసం ఎదురు చూస్తూనే ఉన్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం తన అధికారిక వెబ్‌సైట్‌లో బహిర్గతం చేసిన వివరాల ప్రకారం దేశంలోని బడా మైనింగ్, స్టీల్ కంపెనీలు కోట్లాది రూపాయల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశాయి. వేదాంత లిమిటెడ్, రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్, జిందాల్ స్టీల్ అండ్ పవర్ (జేఎస్‌పీఎల్), ఎస్సెల్ మైనింగ్ అండ్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఈఎంఐఎల్), డెంపో సంస్థలు కలిపి రూ.825 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేశాయి. ఈ కంపెనీలలో రుంగ్తా సన్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.100 కోట్లు, వేదాంత లిమిటెడ్ రూ.376 కోట్లు, ఈఎంఐఎల్ రూ.224.5 కోట్లు, జేఎస్‌పీఎల్ రూ.123 కోట్లు, డెంపో రూ.1.5 కోట్లు బాండ్ల కొనుగోలు కోసం వెచ్చించాయి.



అనుమతుల కోసం ఎదురు చూపులు

జేఎస్‌పీఎల్ ప్రధానంగా ఛత్తీస్‌గఢ్, ఒడిషా, జార్ఖండ్ రాష్ట్రాలలోని మైనింగ్, విద్యుత్, ఉక్కు రంగాలలో వ్యాపారాలు చేస్తోంది. ఈ కంపెనీ విరాళాలన్నీ 2022 అక్టోబర్, 2023 నవంబర్ మధ్య కాలంలో ఇచ్చినవే. ఇక ఆదిత్య బిర్లా గ్రూపునకు చెందిన ఈఎంఐఎల్ మధ్యప్రదేశ్‌లోని చింద్వారా జిల్లాలో బందర్ డైమండ్ ప్రాజెక్టును చేపట్టింది. 2019-2022 మధ్యకాలంలో ఈ కంపెనీ రూ.224.5 కోట్ల విలువ కలిగిన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది. వీటిలో 2019లో రూ.50 కోట్లు, 2020లో రూ.20 కోట్లు, 2021లో రూ.104.5 కోట్లు, 2022లో రూ.50 కోట్ల బాండ్లను కొనుగోలు చేసింది. దేశంలోని అతి పెద్ద బొగ్గు మైనింగ్ కంపెనీలలో ఈఎంఐఎల్ ఒకటి. 2019లో ఈ కంపెనీ బందర్ డైమండ్ ప్రాజెక్ట్ కోసం మైనింగ్ లీజు పొందింది. అయితే స్థానికుల నుండి తీవ్రమైన వ్యతిరేకత వ్యక్తం కావడంతో ఈ ప్రాజెక్ట్ ప్రారంభం కాలేదు. పర్యావరణ అనుమతుల కోసం కంపెనీ అందజేసిన దరఖాస్తును 2020లో పర్యావరణ మంత్రిత్వ శాఖ తిప్పిపంపింది. ఈ ప్రాజెక్టు పన్నా టైగర్ రిజర్వ్ సమీపంలో ఉండ డంతో ముందుగా అటవీ, వన్య ప్రాణులకు సంబం ధించిన అనుమతులు పొందాలని సూచిం చింది. అటవీ అను మతులకు సంబం ధించిన ఈఎంఐఎల్ ప్రతి పాదనలపై మంత్రి త్వ శాఖ అనేక ప్రశ్నలు లేవనెత్తింది. నోయి డాకు చెందిన జీహెచ్‌సీఎల్ కంపెనీ 2019లో రూ.50 లక్షల విలువ కలిగిన బాండ్లను కొను గోలు చేసింది. గుజరాత్ లోని సోడా యాష్ ప్లాంటు, కాప్టివ్ పవర్ ప్లాంటు ఆధునీకరణ నిమిత్తం ఈ కంపెనీ పర్యావరణ అనుమతుల కోసం దరఖాస్తు చేసింది. అయితే తాను అడిగిన వివరణలను సమర్పించలేదన్న కారణంతో 2019 నవంబరులో ఈ ప్రాతిపాదనను మంత్రిత్వ శాఖ ఉపసంహరించుకుంది.

ఎన్నికలకు ముందే బాండ్లు కొన్న 'వేదాంత'

వేదాంత లిమిటెడ్ మొత్తం రూ.376 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేయగా వాటిలో రూ.98 కోట్ల విలువైన బాండ్లను ఒక్క 2022 జనవరిలోనే కొనుగోలు చేసింది. ఉత్తరప్రదేశ్, ఉత్తరాఖండ్, పంజాబ్, మణిపూర్, గోవా శాసనసభలకు ఎన్నికలు జరగడానికి ముందు వీటిని కొనుగోలు చేయడం గమనార్హం. వేదాంత గ్రూపులోని సెసా గోవా కంపెనీ దేశంలోని అతి పెద్ద ఇనుప ఖనిజపు మైనింగ్ కంపెనీలలో ఒకటి. ఒడిషాలో ఈ కంపెనీకి మైనింగ్ వ్యాపారాలు ఉన్నాయి. వేదాంత గ్రూపుకు ఇనుప ఖనిజం, చమురు-గ్యాస్, రాగి, అల్యూమినియం, ఉక్కు రంగాలలో వ్యాపారాలు ఉన్నాయి.

నిబంధనల్లో మార్పుల కోసం...

నోయిడాకు చెందిన బల్డోతా గ్రూపునకు చెందిన కంపెనీ ఎంఎస్‌పీఎల్ లిమిటెడ్‌ది కూడా ఇలాంటి కథే. ఇనుప ఖనిజం మైనింగ్ వ్యాపారం నిర్వహిస్తున్న ఈ కంపెనీ 2019 ఏప్రిల్‌లో కోటి రూపాయలు, 2023 ఏప్రిల్‌లో మూడు కోట్ల రూపాయల విలువ కలిగిన ఎన్నికల బాండ్లు కొనుగోలు చేసింది. తన ఇనుప ఖనిజం మైనింగ్ ప్లాంట్లకు సంబంధించిన నియమ నిబంధనల్లో ఈ కంపెనీ కొన్ని మార్పులు కోరుకున్నది. కంపెనీ కోరిన మార్పులకు పర్యావరణ మంత్రిత్వ శాఖ 2022 ఫిబ్రవరిలో అంగీకారం తెలిపింది.

దాడుల తర్వాతనే...

- 41 కంపెనీల నుంచి బీజేపీకి విరాళాలు
- 18 కంపెనీల నుంచే రూ.2,010కోట్లు!

న్యూఢిల్లీ : కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి దాడులను, చర్యలను ఎదుర్కొన్న తర్వాత 30 కంపెనీలు బీజేపీకి రూ.355 కోట్లను విరాళాలుగా అందజేశాయని ఫిబ్రవరిలో ఆన్‌లైన్ వార్తా వెబ్‌సైట్‌లైన న్యూస్‌లాండ్రీ, ది న్యూస్ మినిట్ పేర్కొన్నాయి. కానీ మరో 11 కంపెనీలు కూడా పాలక పార్టీకి రూ.62.3కోట్లు విరాళమిచ్చి ఇదే బాటలో పయనించినట్లు మూడు రోజుల క్రితం వెల్లడైంది. అంటే మొత్తంగా 41 కంపెనీలకు గానూ 18 కంపెనీలు గత రాత్రి ఎన్నికల కమిషన్ విడుదల చేసిన ఎన్నికల బాండ్ల కొనుగోలుదారుల జాబితాలో వున్నాయి. ఈ 18 కంపెనీలు ఏకంగా దాదాపు రూ.2,010.5 కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేశాయి. అంటే గతంలో 41 కంపెనీలు బాండ్ల రూపంలో అందజేసిన విరాళాల మొత్తం కన్నా ఐదు రెట్లు ఎక్కువ. వాటిలో కొన్ని సంస్థల వివరాలిలా ఉన్నాయి.



లాటరీ కింగ్ : అన్నింటికంటే అగ్రభాగాన తమిళనాడుకు చెందిన లాటరీ కంపెనీ ఫ్యూచర్ గేమింగ్ అండ్ హోటల్ సర్వీసెస్ పీఆర్ వుంది. అనేక క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్న, లాటరీ కింగ్‌గా తనకు తాను చెప్పుకునే శాంటియాగో మార్టిన్ ఈ కంపెనీ అధినేత. రూ.1368 కోట్ల మేరకు బాండ్ల రూపంలో ఈ కంపెనీ విరాళాలు అందజేసింది.

యశోదా హాస్పిటల్స్ : రావు సోదరులైన రవీందర్, సురేందర్, దేవేందర్‌లకు చెందిన ఈ గ్రూపు ఆఫ్ హాస్పటల్స్ రూ.162 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.

ఐఆర్‌బీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలపర్స్ : ముంబయికి చెందిన ఈ కంపెనీ దాని అనుబంధ సంస్థలు కలిపి 2014 నుంచి 2023 వరకు రూ.84 కోట్లను బీజేపీకి విరాళంగా అందజేశాయి. గత రాత్రి ఎన్నికల కమిషన్ అందజేసిన డేటా ప్రకారం ఐఆర్‌బి-మోడరల్ రోడ్ మేకర్స్, ఐఆర్‌బీ ఎంపీ ఎక్స్‌ప్రెస్‌వే, ఐడియల్ రోడ్ బిల్డర్స్ - కలిపి ఇచ్చిన రూ.84 కోట్లలో మోడరల్ రోడ్ మేకర్స్ రూ.53 కోట్లను, ఐఆర్‌బీ ఎంపీ ఎక్స్‌ప్రెస్ వే రూ.25 కోట్లను, ఐడియల్ కంపెనీ రూ.6కోట్లను అందజేశాయి.

సోమ్ డిస్టిలరీస్ : దాడి జరిగిన వెంటనే విరాళమిచ్చిన కంపెనీల్లో మధ్యప్రదేశ్‌కి చెందిన సోమ్ డిస్టిలరీస్ ఒకటి. అరెస్టయిన తన ప్రమోటర్లను విడుదలైన పది రోజుల్లో రూ.3కోట్లు విరాళంగా ఇచ్చింది.

హెటెరో గ్రూపు: హైదరాబాద్‌కి చెందిన హెటెరో గ్రూపు ఒక ఫార్మస్యూటికల్ సంస్థ. బీఆర్ఎస్‌కి చెందిన రాజ్యసభ సభ్యుడు, సంపన్నుడైన ఎంపీ అయిన పార్థసారథి రెడ్డి సారథ్యంలో ఇది నడుస్తోంది. మొదట వెబ్‌సైట్‌లు విడుదల చేసిన 30 కంపెనీల జాబితాలో ఇది వుంది. మూడు కంపెనీలతో కూడిన ఈ గ్రూపు 2022 ఏప్రిల్ 7 నుండి 2023 అక్టోబరు 12 మధ్యలో రూ.60కోట్ల విలువైన ఎన్నికల బాండ్లను కొనుగోలు చేసింది.

ఎస్‌పిఎంఎల్ ఓం, మెటల్ జెవి: ఓం కొఠారి గ్రూపునకు చెందిన ఈ కంపెనీకి జల విద్యుత్, రియల్ ఎస్టేట్, ఆటో డీలర్‌షిప్‌లు, హోటళ్లు, వినోద కేంద్రాల్లో వ్యాపారాలు వున్నా యి. 2020 జులో ఐటి దాడులవగానే రూ.5కోట్లు విరాళంగా ఇచ్చింది. తిరిగి 2021లో అక్టోబరు 4న మరో రూ.5కోట్లు విలువైన బాండ్లను కొంది.

రామ్‌కో సిమెంట్స్ : తమిళనాడుకు చెందిన ప్రధాన సిమెంట్ తయారీ గ్రూపు అయిన రామ్‌కో సిమెంట్స్ 2022 అక్టోబరు 10 నుంచి, 2023 నవంబరు 15 మధ్య రూ.54కోట్ల విలువైన బాండ్లను కొనుగోలు చేసింది.

కెజెఎస్ గ్రూపు : మధ్యప్రదేశ్‌కి చెందిన కెజెఎస్ సిమెంట్స్ 2019 ఏప్రిల్ 20, 2019 మే 9 మధ్య రూ.14కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది.

ఐఎల్‌ఎఫ్‌ఎస్ టెక్నాలజీ సెంటర్ ప్రైవేట్ లిమిటెడ్ : హైదరాబాద్‌కి చెందిన ఇన్వెస్ట్‌మెంట్ ప్లాట్‌ఫారమ్ అయిన ఈ కంపెనీ 2023 ఏప్రిల్ 10న రూ.5 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేసింది. 2019 మే లో కూడా బీజేపీకి రూ.5కోట్లు విరాళమిచ్చింది.

పేదలపై భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలు

క్యాబినెట్ సబ్ కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం సూచన



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆదాయం ప్రయివేటు వ్యక్తుల చేతుల్లోకి పోకుండా చూడాలని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క సూచించారు. పేదలపై భారం పడకుండా ప్రత్యామ్నాయ ఆదాయ వనరులు పెంచుకునేలా రాష్ట్ర ఆదాయాన్ని పెంపొందించేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రాష్ట్ర ఆదాయం పెంచేందుకు ప్రతివారం సమీక్ష సమావేశం నిర్వహించాలని గత సమావేశంలో చర్చించిన అంశాల్లో ప్రగతిని నివేదించాలని కోరారు. హైదరాబాద్, ఆ పరిసరాల్లో ప్రభుత్వ భూములను కాపాడేందుకు అధికారులు నిరంతరం అప్రమత్తతో ఉండాలనీ, అక్రమ రిజిస్ట్రేషన్లకు అడ్డుకట్ట వేయాలని ఆదేశించారు. రాష్ట్ర ఆదాయ వనరులు పెంచుకోవడం, వనరుల నిర్వహణ పై డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అధ్యక్షతన క్యాబినెట్ సబ్ కమిటీ శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో సమావేశమైంది. సమావేశంలో కమిటీ సభ్యులు, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణారావుతో పాటు సీఎస్ శాంతి కుమారి, స్పెషల్ సీఎస్ రామకృష్ణారావు, హెచ్ఎండీఏ కమిషనర్ దాన కిషోర్, సీసీఎల్ఏ కమిషనర్ నవీన్ మిట్టల్, డిప్యూటీ సీఎం స్పెషల్ సెక్రటరీ కృష్ణ భాస్కర్ తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

సహజ వనరు ఇసుక ద్వారా ఆదాయం పెంచుకోవడమే కాదు సామాన్యులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని భట్టి విక్రమార్క ఆదేశించారు. ఇసుక బహిరంగ వేలం నిర్వహించాలనీ, వ్యవసాయ మార్కెట్ యార్డుల్లో ఇసుక అందుబాటులో ఉంచాలనీ, ఇసుక కోసం ప్రయివేటు వ్యక్తుల వద్దకు వెళ్లాల్సిన పని లేకుండా చూడాలని ఆదేశించారు. ప్రభుత్వ ప్రయివేటు భాగస్వామ్యంతో గృహ నిర్మాణం ఇతర రంగాల్లో ఆదాయం పెంచుకునే మార్గాలను అన్వేషించాలని తెలిపారు. రాష్ట్రంలో ఉన్న ప్రభుత్వ లీజులను సమీక్షించి లీజు ఛార్జీలు పెంచేందుకు కసరత్తు చేయాలని ఆదేశించారు. ప్రధానంగా హెచ్ఎండిఏ, ఇండస్ట్రియల్ ఎస్టేట్స్, పర్యాటక రంగంలో ఉన్న లీజులను సమీక్షించాలన్నారు. ఔటర్ రింగ్ రోడ్డు పరిసరాలపై దృష్టి పెట్టాలని హెచ్ఎండీఏ అధికారులకు భట్టి సూచించారు. ఈ ప్రాంతాల్లో వివిధ విభాగాల ద్వారా సమన్వయం చేసుకుని ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని తెలిపారు. ఎల్ఆర్ఎస్ పథకానికి వచ్చిన దరఖాస్తులు వాటి ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. రియల్ ఎస్టేట్ రంగంలో గతంలో భూమ్ రావడానికి కారణాలు, ప్రస్తుతం ఆ రంగం పరిస్థితిని సమీక్షించారు.

మద్యం స్టాక్ పరిస్థితి ఏంటి?

మద్యం తయారు చేసే పరిశ్రమల నియంత్రణ, ఉత్పత్తి చేసే ప్రాంతాల్లో నమోదవుతున్న స్టాక్, మార్కెట్లోకి వచ్చినప్పుడు ఉన్న స్టాకు వ్యత్యాసాలను ఎలా గుర్తిస్తున్నారు అని భట్టి అడిగి తెలుసుకున్నారు. నాన్ డ్యూటీ లిక్కర్ రాష్ట్రంలోకి ప్రవేశించకుండా తీసుకుంటున్న చర్యలు ఏంటని అడిగారు. ఇతర రాష్ట్రాల్లో మద్య ధరలు, మన రాష్ట్రంలో మద్యం ధరలకు వ్యత్యాసంపై సమీక్షించారు. కల్తీలను నివారించేందుకు ప్రత్యేక హెూలోగ్రామ్స్ తో సెక్యూరిటీ వ్యవస్థ, సరిహద్దుల్లో చెక్ పోస్టులు పెంచడం తదితర అంశాలపై ప్రతి వారం తనకు నివేదిక సమర్పించాలని ఆదేశించారు. రాష్ట్రంలోనే మద్యం తయారుచేసి పన్ను చెల్లించడం లేదా, ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా మద్యం సరఫరా మూలంగా రాష్ట్ర ఎక్సైజ్ ఆదాయంపై ప్రభావం పడుతుందా తదితర అంశాలను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

సామాన్యుడు ఒక ప్రాంతం నుంచి మరొక ప్రాంతానికి మట్టి తరలించే క్రమంలో పోలీసులు, మైనింగ్ సిబ్బంది ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఈ అంశంలో జాగ్రత్తగా వివరించాలని అధికారులకు మంత్రులు ఉత్తమ్, జూపల్లి లు సూచించారు. రాష్ట్రంలో లైమ్ స్టోన్ ఖనిజాలతో పాటు ఆదిలాబాద్ జిల్లాలో మాంగనీసు అందుబాటులో ఉందనీ, ఇలా ఇతర జిల్లాల్లోనూ అందుబాటులో ఉన్న ఖనిజాల వివరాలు సేకరించి ఆదాయం పెంచుకునే అవకాశం ఉందని మంత్రి శ్రీధర్ బాబు సూచించారు. గోదావరి నుంచి ఇసుక తరలించే క్రమంలో ఒకే బిల్లుపై మూడుసార్లు అధిక లోడుతో ఇసుక తరలిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయనీ, ప్రభుత్వానికి ఒక శాతం ఆదాయం ఇస్తుంటే స్థానికంగా రహదారులు, ప్రజల ఆరోగ్యం మూడు రెట్లు దెబ్బతింటుంది ఈ వ్యవస్థను నియంత్రించాలని మైనింగ్ శాఖ అధికారులకు మంత్రి సూచించారు. ఇసుక అక్రమ రవాణా నిరోధానికి ప్రతి రీచ్‌లో సీసీ కెమెరాలు, ప్రధాన కార్యాలయంలో కమాండ్ కంట్రోల్ వ్యవస్థ, ఇసుక రవాణా చేసే వాహనాల ట్రాకింగ్ వ్యవస్థను ఆచరణలో పెట్టి పకడ్బందీగా అమలు చేయాలని తద్వారా రాష్ట్రానికి ఆదాయం పెరగడంతో పాటు సామాన్యులకు ఇసుక అందుబాటులోకి వస్తుందని అధికారులను ఆదేశించారు.ఎలక్ట్రికల్ వాహనాలపై ఇప్పుడే పన్నులు విధించే ఆలోచన విరమించుకోవాలని మంత్రి శ్రీధర్ బాబు అధికారులకు సూచించారు. ఎలక్ట్రానిక్ వాహనాల ఉత్పత్తికి సంబంధించిన పరిశ్రమలు క్రమంగా మన రాష్ట్రంలోకి వస్తున్నాయనీ, ఈ క్రమంలో పన్నుల భారం మోపితే రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ, ఉపాధిపై ప్రభావం పడే అవకాశం ఉంటుందన్నారు. జీవో నెంబర్ 188 పరిధిలో కాలనీల రిజిస్ట్రేషన్, సింగరేణి కార్మికుల కాలనీల రిజిస్ట్రేషన్ తద్వారా ప్రభుత్వానికి సమకూరే ఆదాయం గురించి మంత్రి శ్రీధర్ బాబు అధికారులతో సమీక్షించారు.

కేసీఆర్ సార్..భువనగిరి ఎంపీ టికెట్ ఇచ్చి గెలిపించండి

- తెలంగాణ అమరులు కాసోజు శ్రీకాంతా చారి తల్లి శంకరమ్మ



నవతెలంగాణ-హిమాయత్ నగర్

బీఆర్ఎస్ నుంచి తనకు భువనగిరి ఎంపీ అభ్యర్థిగా అవకాశమిచ్చి గెలిపించాలని మలిదశ తెలంగాణ తొలి అమరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మ మాజీ సీఎం కేసీఆర్‌ను కోరారు. శుక్రవారం హైదరాబాద్ గన్‌పార్క్ వద్దనున్న అమరవీ రుల స్తూపం వద్ద శ్రీకాంతా చారి చిత్రపటానికి ఆమె పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఆమె మాట్లాడుతూ.. భువనగిరి అసెంబ్లీ స్థానానికి బీఆర్ఎస్ పార్టీని టికెట్ అడిగామని తెలిపారు. టికెట్ ఇవ్వడం తెలంగాణ అమరవీరులకు ఇచ్చే గౌరవమన్నారు. అన్ని పార్టీలు కూడా అభ్యర్థులను ప్రకటించకుండా తనకు మద్దతు ఇవ్వాలన్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలిచ్చిన అమరుల కుటుంబాలకు పదేండ్లుగా న్యాయం జరగలేదని, తన బిడ్డతో పాటు 1000 మంది బిడ్డలు అమరులయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ కుటుంబాలకు ఇప్పటి వరకు చట్టసభల్లో కనీసం నామినేటెడ్ పదవులు కూడా రాలేదన్నారు. ఉద్యమ ద్రోహులకు బీఆర్ఎస్ పదవులు ఇచ్చిందని ఆరోపించారు. తెలంగాణ ఉద్యమంలో పనిచేయని వారు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు అయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అన్ని రాజకీయ పార్టీలు అమరవీరుల కుటుంబాలను గుర్తించాల న్నారు. రాష్ట్రం కోసం ప్రాణాలు త్యాగం చేసిన శ్రీకాంతా చారి తల్లిగా ఎంపీ ఎన్నికల్లో అవకాశం ఇవ్వాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నానని తెలిపారు.ఒకవేళ ఏ పార్టీ టికెట్ ఇవ్వకపోతే ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తా నని ప్రకటించారు. ఏ పార్టీ టికెట్ ఇచ్చినా మిగతా పార్టీలు తమకు మద్దతు తెలపాలని ఆమె కోరారు. ఆమె వెంట న్యాయవాది నర్సింహారావు, నర్సింహా చారి, శివ వస్తల్య, వీరా చారి, వెంకటా చారి, వసంత, సునంద, సంతోష్, మణికంఠ చారి తదితరులు ఉన్నారు.

అందినకాడికి దోచుకోవడమే..

- పార్సిల్స్ పేరుతో.. సైబర్ నేరస్తుల బెదిరింపులు
- డ్రగ్స్, పాస్‌పోర్ట్సు ఉన్నాయంటూ.. దండుకుంటున్న వైనం
- ముంబయ్ సైబర్ క్రైమ్ బ్రాంచ్ నుంచంటూ పోలీస్ డ్రెస్‌లో వీడియో కాల్స్
- డబ్బులు లేకుంటే మరీ రుణాలు పెట్టించి వసూళ్లు



నవతెలంగాణ-సిటీబ్యూరో

ఇటీవల కాలంలో రోజుకో తీరులో సైబర్ మోసాలు వెలుగు చూస్తున్నాయి. సులభంగా డబ్బు సంపాదించేందుకు కొందరు కేటుగాళ్లు మోసాల బాటపట్టారు. మాయమాటలతో బెదిరించి అందిన కాడికి దోచుకుంటున్నారు. తమ పేరుతో పార్సిల్ వచ్చిందని, అందులో డ్రగ్స్, పాస్‌పోర్టులు ఉన్నాయంటూ బెదిరిస్తున్నారు. కొందరు ఫొటోలను అసభ్యకరంగా మార్ఫింగ్ చేసి వేధిస్తున్నారు. మరికొందరు ప్రొఫైల్స్‌ను డౌన్‌లోడ్ చేసి వారి వ్యక్తిగత వివరాలన్నీ చెబుతుండటంతో బాధితులు నేరస్తులు చెప్పినట్టు చేస్తున్నారు. హనీ ట్రాప్ ద్వారా వృద్ధులు, యువకులను టార్గెట్ చేస్తున్నారు. తాజాగా ముంబయ్ క్రైమ్ బ్రాంచ్ నుంచి ఫోన్ చేస్తున్నామని, అడిగిన వివరాలు చెప్పకుంటే కేసు సీబీఐకి ట్రాన్స్‌ఫర్ చేస్తామంటూ నకిలీ పత్రాలు చూపుతూ డబ్బులు గుంజుతున్నారు.

బెదిరించి మరీ దండుకున్న నేరస్తులు

హైదరాబాద్‌కు చెందిన ఓ బాధితునికి గుర్తుతెలియని వ్యక్తుల నుంచి వీడియో కాల్ వచ్చింది. నేను ముంబయ్ సైబర్‌క్రైమ్ బ్రాంచ్ నుంచి మాట్లాడుతున్నా, నీ పేరు ఇదేనా అని ప్రశ్నించాడు. ఆందోళనకు గురైన బాధితుడు అవునని సమాధానం ఇవ్వడంతో, నీకు 'ఫెడెక్స్ కొరియర్‌లో' పార్శల్ వచ్చిందని, దాన్ని పరిశీలిస్తే అందులో 5 పాస్‌పోర్ట్సు, ఒక ల్యాప్‌టాప్, 30 ప్యాకెట్స్‌లో (ఎల్ఎస్‌డీ) మాదక ద్రవ్యాలున్నాయని బెదిరించారు. మా సార్ మాట్లాడుతాడు వెంటనే ఓ రూమ్‌లోకి వెళ్లి వీడియో కాల్ చేయ్ అంటూ బెదిరించారు. ఆందోళనకు గురైన బాధితుడు వారు చెప్పిన విధంగా చేశాడు. నీ మీద ఎఫ్ఐఆర్ నమోదు చేశామని 'ఎఫ్.ఐ.ఆర్ ఎంహెచ్ 1085' పంపించారు. దాదాపు 2 గంటలపాటు విచారించిన సైబర్ నేరస్తులు పూర్తి వివరాలను సేకరించారు. కేసును మాఫీ చేయాలంటే లక్షల్లో డిమాండ్ చేశారు. డబ్బులు ఇవ్వకుంటే కేసును సీబీఐ ముంబయ్ బ్రాంచ్‌కు పంపిస్తామని బెదిరించారు. అంత డబ్బులు తన వద్ద లేవని బాధితుడు ప్రాధేయపడగా, బ్యాంక్ నుంచి లోన్ తీసుకుని కట్టాలని ఆదేశించారు. వారుచెప్పిన విధంగా బాధితుడు పంజాబ్ నేషనల్ బ్యాంక్ నుంచి రూ.20లక్షలు లోన్ తీసుకుని వారికి రూ.19,94,101 పంపించాడు. కొద్దిరోజుల తర్వాత విషయాన్ని ఇంట్లో చెప్పడంతో అసలు విషయాన్ని గుర్తించారు. మోసపోయినట్టు తెలుసుకున్న బాధితుడు సీసీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఇదే తరహాలో పలువురిని మోసం చేస్తున్న సైబర్ నేరస్తులు రూ. కోట్లల్లో దండుకుంటున్నారు.

ఇలా దేశవ్యాప్తంగా అమాయకులను సైబర్ నేరస్తులు టార్గెట్ చేస్తున్నారు. సైబర్ నేరస్తులు విచారణ పేరుతో బాధితుల పూర్తి వివరాలను సేకరించడంతో పాటే వారి ఇతర వివరాలన్నీ కరెక్ట్‌గా నేరస్తులు చెబుతుండటంతో బాధితులు ఆందోళనకు గురవుతున్నారు. విచారణకు సహకరించకపోతే ఈ కేసును సీబీఐకి అప్పగిస్తామని బెదిరించడంతో నిజమైన పోలీసులుగా భావిస్తున్న బాధితులు వారు చెప్పినట్టు చేస్తున్నారు. ఓటీపీ తీసుకుని బ్యాంక్ ఖాతాలను ఖాళీ చేస్తున్నారు. బాధితులు ప్రశ్నిస్తే విచారణ పూర్తయిన తర్వాత మీ డబ్బులు తిరిగిస్తామంటూ సమాధానమిస్తున్నారు. ఈ తరహా మోసాలతో సైబర్ నేరస్తులు కోట్లలో కొల్లగొడుతున్నారు.

తెలియని కాల్స్‌లిఫ్ట్ చేయొద్దు

తెలియని నెంబర్ల నుంచి మెసేజ్‌లు, కాల్స్ వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు. గుర్తు తెలియని ఇంటర్నేషనల్ కాల్స్ లిఫ్ట్ చేయవద్దని చెబుతున్నారు. కొందరు కేటుగాళ్లు విదేశీ కోడ్ నెంబర్ల ద్వారా మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి కాల్స్ పట్ల అలర్ట్‌గా ఉండాలని, మెసేజ్‌లు, స్పామ్ కాల్స్ వస్తే వెంటనే బ్లాక్ చేయాలని తెలిపారు. అత్యాశకు పోయి డబ్బులు పోగొట్టుకోవటం కన్నా అప్రమత్తంగా ఉండటం ముఖ్యమని పోలీసులు అభిప్రాయపడుతున్నారు. సైబర్ నేరస్తుల బారినపడితే వెంటనే '1930' ఆన్‌లైన్ నెంబర్‌కు కాల్ చేయాలని తెలిపారు.

ఏకకాల ఎన్నికలు వస్తే..

- రాష్ట్రాల అసెంబ్లీలపై ప్రభావం
- పలు రాష్ట్రాల్లో ఐదేండ్లు పూర్తి కాకుండానే మళ్లీ ఎన్నికలకు
- 'జమిలీ'పై ఇప్పటికే నివేదిక సమర్పించిన భారత మాజీ రాష్ట్రపతి కోవింద్

న్యూఢిల్లీ : దేశంలో లోక్‌సభ ఎన్నికలు, పలు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్నాయి. రేపు ఎన్నికల సంఘం షెడ్యూల్‌ను ప్రకటించనున్నది. దీంతో ఇప్పటికే దేశవ్యాప్తంగా ఎన్నికల వేడి ఏర్పడింది. ఇలాంటి తరుణంలోనే మాజీ రాష్ట్రపతి రాంనాథ్ కోవింద్ నేతృత్వంలోని కమిటీ దేశంలో లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు నిర్వహించే ఏకకాల ఎన్నికలపై ఇప్పటికే తన నివేదికను ప్రస్తుత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు సమర్పించింది. దీంతో ఇప్పుడు ఏకకాల ఎన్నికల పైనా రాజకీయ వేదికపై చర్చ నడుస్తున్నది. దేశంలో ఏకకాల ఎన్నికల నిర్వహణను కేంద్రానికి వదిలేస్తూ కమిటీ తన నివేదికలో ప్రతిపాదించినట్టు తెలుస్తున్నది.

అయితే, కేంద్రం ఒకవేళ ఏకకాల ఎన్నికలకు వెళ్తే ఆయా రాష్ట్రాల్లో ఎన్నికైన, ఎన్నిక కాబోయే ప్రభుత్వాల ఐదేండ్ల పాలన గడువుపై ప్రభావం పడుతుందని రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. ఒకవేళ 2029లో లోక్‌సభ, రాష్ట్రాల అసెంబ్లీలకు ఏకకాల ఎన్నికలను అమలు చేయాలని కేంద్రం నిర్ణయిస్తే.. 2024 లోక్‌సభ ఎన్నికలు ముగిసిన వెంటనే ప్రక్రియ ప్రారంభమవుతుంది. అనేక రాష్ట్రాల అసెంబ్లీలు 2029లో వాటి ఐదేండ్లు ముగిసేలోపే రద్దు చేయబడతాయి. "ఒకే దేశం, ఒకే ఎన్నికలు"పై ఉన్నత స్థాయి కమిటీ ఏకకాల ఎన్నికలకు ఎప్పుడు సిద్ధంగా ఉండాలో నిర్ణయించటానికి కేంద్రానికి వదిలివేస్తూ రోడ్‌మ్యాప్‌ను ప్రతిపాదించింది. ఒకవేళ రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలోని ప్యానెల్ సిఫారసులను కేంద్రం ఆమోదిస్తే.. ఏకకాల ఎన్నికలు అనివార్య మవుతాయని నిపుణులు చెప్తున్నారు.ఒకవేళ 2029లో



ఏకకాల ఎన్నికలు జరిగితే పరిస్థితులు పూర్తిగా మారనున్నాయి. గతేడాది 10 రాష్ట్రాలలో ఏర్పడిన కొత్త ప్రభుత్వాలు 2028 వరకు అధికారంలో కొనసాగుతాయి. అనంతరం షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు జరిగితే ఏర్పడబోయే కొత్త ప్రభుత్వాలు దాదాపు ఒక సంవత్సరం లేదా అంతకంటే తక్కువ కాలం అధికారంలో ఉంటాయి.

ఇందులో తెలంగాణతో పాటు హిమాచల్ ప్రదేశ్, మేఘాలయ, నాగాలాండ్, త్రిపుర, కర్నాటక, మిజోరం, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లు ఉన్నాయి. ఇక యూపీ, పంజాబ్, గుజరాత్ రాష్ట్రాల్లో 2022లో కొత్త ప్రభుత్వాలు ఏర్పడ్డాయి. ఇక్కడ తిరిగి 2027లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నందున. అవి రెండు సంవత్సరాలు లేదా అంతకంటే తక్కువ కాలం అధికారంలో ఉండనున్నాయి. అలాగే, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, అసోం, కేరళ రాష్ట్రాల్లో 2026లో ఎన్నికలు జరగనున్నాయి. ఆ ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో మెజారిటీ వచ్చినా కూడా ప్రభుత్వాలు మూడేండ్ల పాటు మాత్రమే కొనసాగుతాయి. ఇక ఆంధ్రప్రదేశ్‌తో పాటు అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం, ఒడిశా, మహారాష్ట్ర, హర్యానా మాత్రమే షెడ్యూల్ ప్రకారం లోక్‌సభతో పాటు ఎన్నికలకు వెళ్తాయి.

ఏకకాల ఎన్నికలు రాజ్యాంగానికి విరుద్ధంగా జరగకుండా చూసుకోవటానికి లోక్‌సభ కాలవ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 83కి, రాష్ట్ర అసెంబ్లీ వ్యవధికి సంబంధించిన ఆర్టికల్ 172కి సవరణలు చేయాలని కమిటీ సిఫారసు చేసింది. ఇది రాష్ట్రపతి నోటిఫికేషన్‌ను అనుసరించే అవకాశం ఉన్నది. సవరణలు పార్లమెంటు ఆమోదం పొందటంలో విఫలమైతే, నోటిఫికేషన్ చెల్లదని నిపుణులు చెప్తున్నారు.

అలా కాకుండా, సవరణలు ఆమోదించబడితే, ఏకకాల ఎన్నికలు అనివార్యమవుతాయని వారు వివరిస్తున్నారు.

డాక్‌సేవక్‌ల సర్వీస్ కండీషన్లు సవరణ

- కేంద్రమంత్రి అశ్విన్ వైష్ణవ్ వెల్లడి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

దేశవ్యాప్తంగా తపాలాశాఖలో పనిచేస్తున్న 2.56 లక్షల మంది గ్రామీణ డాక్ సేవక్‌ల సర్వీసు కండీషన్లను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. శుక్రవారం ఢిల్లీలో వర్చువల్‌గా జరిగిన కార్యక్రమంలో కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ ఈ విషయాన్ని వెల్లడించారు. డాక్ సేవక్‌లు కేంద్ర ప్రభుత్వానికి వెన్నెముకలాంటి వారనీ, వారి సేవల్ని మరింత విస్తరిస్తామని తెలిపారు. ప్రతి గ్రామీణ డాక్ సేవక్‌కు తన సర్వీసును బట్టి మూడుసార్లు ఫైనాన్షియల్ అప్‌గ్రేడేషన్ ఉండేలా సర్వీస్ నిబంధనలు సవరించామన్నారు. 12 ఏండ్ల సర్వీసులో రూ.4,320 అప్‌గ్రేడేషన్ ఉంటుందన్నారు. అలాగే 24 ఏండ్ల సర్వీసులో రూ.5,520 అప్‌గ్రేడేషన్‌గా ఉంటుందనీ, 36 ఏండ్ల సర్వీసులో రూ.7,200 వేతన ఉన్నతీకరణ ఉంటుందని వివరించారు. అలాగే ప్రతి డాక్ సేవక్‌కూ గౌరవ వేతనంగా టైం రిలేటెడ్ కంటిన్యుటీ అలవెన్స్ (టీఆర్‌సీఏ)ను ఇస్తామని తెలిపారు. వర్చువల్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో తెలంగాణ పోస్టల్ సర్కిల్ చీఫ్ పోస్ట్‌మాస్టర్ జనరల్ కార్యాలయం అసిస్టెంట్ డైరెక్టర్ సీహెచ్ రామకృష్ణ పాల్గొన్నారు. కేంద్రమంత్రి ప్రకటనతో రాష్ట్రంలోని 10వేల మంది డాక్ సేవక్‌లకు ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని వివరించారు.

ఎంసీపీఐ(యు) పార్లమెంట్ అభ్యర్థుల తొలి జాబిత విడుదల

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణలో ఎంసీపీఐ(యు),బీఎల్ఎఫ్ పోటీచేసే ఐదు స్థానాల అభ్యర్థుల తొలి జాబితాను శుక్రవారం హైదరాబాద్‌లోని ఓంకార్ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఎంసీపీఐ(యు) ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ ఓంకార్, బీఎస్ఎఫ్ రాష్ట్ర చైర్మెన్ నల్ల సూర్యప్రకాష్ ప్రకటించారు. ఈ సందర్భంగా మద్దికాయల అశోక్ ఓంకార్ మాట్లాడుతూ.. దేశంలో మతోన్మాద, ఫాసిజం పెరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించటమే సామాజిక, వామపక్ష శక్తుల తక్షణ కర్తవ్యమన్నారు. సూర్యప్రకాశ్ మాట్లాడుతూ ప్రజల ఆకాంక్ష మేరకు ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో బీఎల్ఎఫ్‌తోనే బహుజనుల సమస్యలు పరిష్కారమవుతాయని తెలిపారు. ఎంసీపీఐ(యు) రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, బీఎల్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్లు దండి వెంకట్, వనం సుధాకర్, కె. పర్వతాలు,నూనె వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజక వర్గానికి నూనె వెంకటస్వామి (ప్రజా పోరాట సమితి), నల్లగొండ మస్కుల మట్టయ్య ఎంసీపీఐ(యు), చేవెళ్ల వనం సుధాకర్ ఎంసీపీఐ(యు), నిజామాబాద్ అబ్బగానీ అశోక్ గౌడ్ (బహుజన లెఫ్ట్ పార్టీ), జహీరాబాద్ వడ్ల సాయి కృష్ణ (బహుజన లెఫ్ట్ పార్టీ) రాబోయే ఎన్నికల్లో పోటీలో ఉంటారని తెలిపారు.

నేవీ మాజీ చీఫ్ అడ్మిరల్ రామ్‌దాస్ కన్నుమూత


(ఫైల్)

న్యూఢిల్లీ : భారత నేవీ మాజీ చీఫ్, మానవ హక్కుల కార్యకర్త అడ్మిరల్ లక్ష్మీనారాయణ రామ్‌దాస్ శుక్రవారం కన్నుమూశారు. ఆయన వయస్సు 90 ఏళ్లు. సుమారు 50 ఏళ్ల పాటు భారత నేవీకి ఆయన సేవలు అందించారు. 1971 బంగ్లాదేశ్ లిబరేషన్ వార్‌లో కీలక పాత్ర పోషించారు. ఆ యుద్ధ సమయంలో ఐఎన్ఎస్ బీయాస్‌కు కమాండర్‌గా ఉన్నారు. తూర్పు పాకిస్థాన్ (ప్రస్తుత పాకిస్థాన్) నుంచి వచ్చే యుద్ధ నౌకలను బీయాస్ సమర్థవంతంగా అడ్డుకుంది. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం సాధించడంలో భారత్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 1949లో టీనేజర్‌గా ఉన్న సమయంలో భారత సైన్యంలో రామ్‌దాస్ చేరారు. 15 ఏళ్ల వయస్సులో క్యాడెట్‌గా చేరారు. 1990 నవంబర్ 30న నేవీ చీఫ్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1993లో పదవీ విరమణ చేశారు. మానవ హక్కుల కార్యకర్తగానూ పనిచేశారు. ముఖ్యంగా అణు ఆయుధాల ముప్పును తగ్గించడానికి కృషి చేశారు. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పర్యటించి అణు నిరాయుధీకరణ వైపు ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

వంద రోజుల పాలనపై ప్రజలు పండుగ చేసుకోవాలి

- ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ పిలుపు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వ వంద రోజుల పాలనపై పండుగ చేసుకోవాలంటూ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ ప్రజలకు పిలుపునిచ్చారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పార్టీ సీనియర్ నేత బెల్లయ్య నాయక్‌తో కలిసి ఆయన విలేకర్లతో మాట్లాడారు. గత ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన చేయడంలో విఫలమైందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల ఆకాంక్షల మేరకు పరిపాలన కొనసాగిస్తున్నదన్నారు. క్యాబినెట్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు స్థానం కల్పించిందన్నారు. ఒక దళితుడిని డిప్యూటీ సీఎం చేసి గౌరవించిందని గుర్తుచేశారు. ప్రభుత్వానికి సీఎం, డిప్యూటీ సీఎం రెండుకండ్లలా పరిపాలన సాగిస్తున్నారని తెలిపారు. మెగా డీఎస్సీ నోటిఫికేషన్, గ్రూప్ 1,2,3 పోస్టులను భర్తీ చేశామన్నారు. ఇప్పుడు టెట్ కూడా డీఎస్సీ కంటే ముందే నిర్వహించేలా జీవో ఇచ్చిందని గుర్తు చేశారు. మాజీ సీఎం కేసీఆర్ ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నారని విమర్శించారు.

ఈసీ కమిషనర్ల నియామకంపై స్టేకు సుప్రీం నిరాకరణ

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

కొత్తగా ఎంపికైన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల నియామకంపై స్టే విధించేందుకు అత్యున్నత న్యాయస్థానం నిరాకరించింది. ఎన్నికల కమిషనర్ల నియామక కమిటీలో సీజేఐని తొలగిస్తూ చేసిన కొత్త చట్టాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ అగస్టీన్ జార్జి మషి నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టింది. కొత్త చట్టంలోని నిబంధనలపై స్టే ఇవ్వడానికి సుప్రీం ధర్మాసనం నిరాకరించింది. కొత్తగా నియమితులైన ఇద్దరు కమిషనర్ల నియామకంపై స్టే కోరుతూ కొత్తగా పిటిషన్ దాఖలు చేయాలని, మౌఖికంగా కోరితే పరిశీలించలేమని తేల్చిచెప్పింది. కొత్త చట్టం అమలు కాకుండా నిలిపివే యడానికి తాత్కాలిక స్టే ఇవ్వలేమని స్పష్టం చేసింది. తదుపరి విచారణను మార్చి 21వ తేదీకి వాయిదా వేస్తున్నట్టు ప్రకటించింది. కాగా, ప్రధాని నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ మాజీ ఐఏఎస్ అధికారులు జ్ఞానేశ్ కుమార్, సుఖ్‌బీర్‌సింగ్ సంధూలను గురువారం నూతన ఎన్నికల కమిషనర్లుగా నియమించింది.

రష్యా అధ్యక్ష ఎన్నికల్లో పోలింగ్ మొదలైంది

- బరిలో పుతిన్‌తో సహా నలుగురు అభ్యర్థులు



మాస్కో : రష్యా అధ్యక్ష ఎన్నికల పోలింగ్ శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజుల పాటు సాగే ఈ పోలింగ్‌లో మొదటి రోజు పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నట్టు రష్యన్ టెలివిజన్ తెలిపింది. అధ్యక్షునిగా ఎన్నికైన వారు ఆరేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు. ఇప్పటికే నాలుగు పర్యాయాలు (2000, 2004, 2012, 2018) అధ్యక్షునిగా కొనసాగిన పుతిన్ (71) ఇప్పుడు అయిదోసారి అధ్యక్ష ఎన్నికల బరిలోకి దిగారు. రాజ్యాంగ సవరణ ద్వారా 2036 వరకు ఆయన అధ్యక్ష ఎన్నికల్లో పాల్గొనే అవకాశముంది. ఈ ఎన్నికల్లో పుతిన్‌తో బాటు నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు. వీరిలోరష్యన్ కమ్యూనిస్టు పార్టీకి చెందిన నిఖోలాయ్ ఖరిత్నోవ్, లిబరల్ డెమొక్రటిక్ పార్టీకి చెందిన లియోనిద్ స్లాట్‌స్కీ, రష్యా న్యూ పీపుల్స్ పార్టీకి చెందిన వ్లదిస్లావ్ దావన్‌కోల్ ఉన్నారు. ఎన్నికల తుది ఫలితాలు ఈ నెల28 నాటికి కానీ వెల్లడి కాకపోవచ్చని ఎన్నికల సంఘం ప్రతినిధి ఒకరు తెలిపారు.

రాగిడి లక్ష్మారెడ్డికి మెజార్టీ అందించేందుకు కృషి



- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

బీఆర్ఎస్ పార్టీ మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డిని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు క్యాంప్ కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బీఆర్ఎస్ తరపున పోటీ చేస్తున్న లక్ష్మారెడ్డికి అభినందనలు తెలియజేశారు. తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని అత్యధిక మెజారిటీ అందించడానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన అభివృద్ధి కూకట్‌పల్లి నియోజకవర్గం ప్రజలు ఎప్పటికీ మరిచిపోరని కచ్చితంగా బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిని గెలిపిస్తామని అన్నారు.

వేసవిలో నీటి ఎద్దడి లేకుండా చర్యలు చేపట్టాలి



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

షాపూర్ నగర్‌లోని జలమండలి కార్యాలయంలో ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ శుక్రవారం అధికారులతో "వేసవికాలం నీటి సరఫరా పై" సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజలకు వేసవిలో ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టి నీటి ఎద్దడి లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ రావుల శేషగిరి, జలమండలి డీజీఎం అప్పలనాయుడు, జలమండలి సిబ్బంది రోహిణి, అనూష, రమ్య భారతి, పూజిత తదితరులు పాల్గొన్నారు.

అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్‌తోనే సాధ్యం



- ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

తెలంగాణ రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమం బీఆర్ఎస్ పాలనలోనే సాధ్యమైందని కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ అన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో కళ్యాణ లక్ష్మి, షాది ముబారక్ పథకం కింద దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు శుక్రవారం గాజులరామారం డివిజన్, దేవేందర్ నగర్‌లోని తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. అనంతరం 41 మంది లబ్ధిదారులకు సుమారు రూ.41 లక్షల పైచిలుకు చెక్కులను స్థానిక కార్పొరేటర్ రావుల శేషగిరి, తహసిల్దార్ రెహమాన్ ఖాన్‌లతో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ఆధ్వర్యంలో ఏర్పడిన ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి కృషి చేసిందన్నారు. ఆడపిల్ల పుడితే బరువుగా భావించే తల్లిదండ్రులకు ఎంతో ఊరటనిస్తూ ఇంటి పెద్ద కొడుకుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలలో బృహత్తర పథకం కళ్యాణ లక్ష్మి.షాదీ ముబారక్ పథకం ద్వారా పుట్టినింటనే కాదు..మెట్టినింట కూడా గౌరవప్రదమైన జీవితాన్ని అందించామన్నారు. కాంగ్రెస్ వంద రోజుల పాలన రాష్ట్ర ప్రజలకు అర్థమయిపోయిందని రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి కాంగ్రెస్‌కు చెబుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధికారులు ఆర్ఐ.రేణుక, పాక్స్ డైరెక్టర్ పరీశే శ్రీనివాస్ యాదవ్, డివిజన్ అధ్యక్షులు విజయ రాంరెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు కస్తూరి బాల్ రాజ్, నాయకులు దూదిమెట్ల సోమేష్ యాదవ్, రుద్ర అశోక్, పోలే శ్రీకాంత్, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పనిచేద్దాం.... మల్కాజిగిరిలో గులాబీ జెండా ఎగురవేద్దాం : ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్

కుత్బుల్లాపూర్: మల్కాజిగిరి ఎంపీ అభ్యర్థిగా బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం ఉదయం కుత్బుల్లాపూర్ హ్యాట్రిక్ ఎమ్మెల్యే కేపీ. వివేకానంద్ వారి నివాసంలో కలిసి తన గెలుపుకు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ సార్వత్రిక ఎన్నికలలో మీరు అందుకోబోయే గెలుపులో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నుంచి భారీ మెజార్టీని అందిస్తామన్నా రు. గత ఐదేండ్ల కాలంలో కాంగ్రెస్ ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి మల్కాజిగిరికి చేసింది ఏమీలేదన్నారు.ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేటర్ ఆగం రాజు, మాజీ కౌన్సిలర్ కిషన్ రావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులు విద్యతోపాటు కళలపట్ల అభిరుచిని పెంపొందించుకోవాలి : ఎమ్మెల్యే

130- సుభాష్ నగర్ డివిజన్ భాగ్యలక్ష్మి కాలనీలో నిర్వహించిన నేతాజీ హై స్కూల్ 14వ వార్షికోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు విద్యార్థి దశ ఎంతో కీలకమని, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, కళల పట్ల అభిరుచిని పెంపొందించుకొని తమకు తామే సాటి అనే విధంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్ జ్ఞాన్ గ్రూప్స్ అధినేత మల్లేష్ యాదవ్, ప్రధానోపాధ్యాయులు మహేష్ యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గుబ్బాల లక్ష్మీ నారాయణ, సాజిద్ తదితరులు పాల్గొన్నారు.



ఆకర్షణీయమైన బ్రోచర్లతో నమ్మించడంతో... అందరం మోసపోయాం..



- జీఎల్‌సీ వాస్తవ్యుల ఆందోళన

నవతెలంగాణ-దుండిగల్

మల్లంపేటలోని శ్రీనివాస కన్స్ట్రక్షన్ సంస్థ కొనుగోలు చేసే ముందు అన్ని వసతులు కల్పిస్తూ విల్లాలు ఇస్తామని ఆకర్షణీయమైన బ్రోచర్లతో తమను మోసం చేశారని బాధిత జీఎల్‌సీ కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశాయి. శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ విల్లాలు విక్రయించి నిబంధనల ప్రకారం బాధిత కుటుంబాలకు కనీస వసతులు కల్పించక రిజిస్ట్రేషన్లకు ఇబ్బందులు పెడుతున్నారని బాధిత జీఎల్‌సీ కుటుంబాలు ఆరోపించాయి. మరోవైపు తాము చిన్నపిల్లల కోసం ఏర్పాటు చేసిన స్థలం సైతం వేరొకరికి విక్రయించడం జేసీబీతో పార్కు పరికరాలు ధ్వంసం చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశాయి.

బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. కుత్బుల్లాపూర్ నియోజక వర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్‌లోని సర్వే నెంబర్ 170/3, 170/5 శ్రీ లక్ష్మి శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ గుర్రం. విజయలక్ష్మి 2020 సంవత్సరంలో 12 ఎకరాల స్థలం కొనుగోలు చేసి అందులో కొంత స్థలానికి హెచ్ఎండిఏ అనుమతులు తీసుకొని వందల సంఖ్యల విల్లాల నిర్మాణాలు చేపట్టడం జరిగింది. ఈ నిర్మాణాల కొన్నింటిలో గతంలో గ్రామపంచాయతీ అనుమతుల సైతం చేపట్టడంతో పాటు పక్కనున్న కత్వ చెరువు ఎఫ్‌టీఎల్ స్థలం కబ్జాచేసి నిర్మించడంతో నాయకులు, ప్రజలు ఫిర్యాదులతో పెద్ద వివాదంగా మారింది. ఎట్టకేలకు అప్పటి దుండిగల్ కమిషనర్ చర్యలు చేపట్టి అక్రమ నిర్మాణాలను ఆపించారు. అప్పటికే కొనుగోలుదారుల వద్ద డబ్బులు వసూలు చేసిన సదరు శ్రీనివాస కన్స్ట్రక్షన్, విల్లాల కొనుగోలుదారులకు ఆకర్షణీయమైన బ్రోచర్లలో పొందుపరిచిన వసతులు నీటి వసతి డ్రయినేజీ, పార్క్, కమ్యూనిటీ హాలు, స్విమ్మింగ్ పూల్ వంటి ఏ ఒక్కటి ఏర్పాటు చేయలేదు. దుండిగల్ కమిషనర్ ఎఫ్‌టీఎల్ అక్రమ నిర్మాణాలు సైతం కొన్నింటిని కూల్చివేసి కలెక్టర్ ఆదేశానుసారం సీజ్ చేశారు. అప్పటినుండి ఒక్కొక్కరు రూ.80 లక్షల వ్యయంతో విల్లాలు కొనుగోలు చేసిన బాధితులకు ఇప్పటివరకు వారికి సదరు శ్రీ లక్ష్మీ కన్స్ట్రక్షన్ యాజమాన్యం బాధితులకు రిజిస్ట్రేషన్లు, వసతులు కల్పించకుండా దాటవేస్తూ వస్తున్నారు. యజమాన్యం సదుపాయాలు కల్పించడం లేదని, యాజమాన్యం వారు పార్కు కోసం చూపించిన స్థలం 1200 గజాల స్థలం గురించి కమిషనర్ దృష్టికి ఎమ్మెల్సీకి తెలియజేసి బాధితులందరూ ఆర్థిక సహాయం సమకూర్చుకొని ఎట్టకేలకు చిన్నపిల్లల పార్క్ ఏర్పాటు చేసుకున్నారు. ఆ సమయంలో మున్సిపల్ వారు పార్క్ బోర్డ్ సైతం ఏర్పరిచింది. ఇదిలా ఉండగా, ఈ విల్లాల బాధితులకు కొత్తగా ఊహించని సంఘటన గురువారం జరిగింది. శ్రీనివాస కన్స్ట్రక్షన్స్ వారుపార్కు వంటి సదుపాయాలు కల్పించకపోవడమే కాకుండా గతంలో పార్కు స్థలాన్ని ముగ్గురు వ్యక్తులకు విక్రయించినట్టు తెలిసింది. ఈ స్థలం తమది అంటూ, వారు కోర్టు ఆర్డర్ పత్రాలతో జేసీబీతో వచ్చి పార్కులోని పరికరాలు తొలగించారు. దాంతో వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఈ మేరకు శుక్రవారం మల్లంపేటలోని జీఎల్‌సీ బాధితుల సమక్షంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ శ్రీనివాస కన్స్ట్రక్షన్ సంస్థ వారు ఆకర్షణీయమైన బ్రోచర్లతో మోసం చేశారని తెలిపారు. ఇప్పటికీ తామ విల్లాస్ గృహాలలో కరెంటు వసతి లేదు, డ్రయినేజీ, పార్కు కమ్యూనిటీ హాల్ ఏవి కల్పించలేదన్నారు. అలాగే తాము ఏర్పరచుకున్న చిన్నపిల్లల పార్కును సైతం, వేరే వారికి విక్రయించినట్టు తెలిపారు. వారు దౌర్జన్యంగా కోర్టు అనుమతులు ఉన్నాయంటూ వచ్చిన వారిని చంపేస్తామంటూ, బెదిరించడం ఏమిటని బాధితులు వాపోయారు. శ్రీనివాస్ నిర్మాణ సంస్థ వందల మంది ప్రజల వద్ద కోట్ల రూపాయలు వసూలు చేసి మోసం చేయడమే కాకుండా తమ తమ రిజిస్ట్రేషన్లను ఇబ్బంది పెట్టుచు మరోవైపు ఒకరిపై ఒకరికి విక్రయించడంతో వారందరూ వచ్చి దౌర్జన్యం చేయడం ఎంతవరకు సమంజసమని పేర్కొ న్నారు. దీనిపై అధికారులు, ప్రజా ప్రతినిధులు న్యాయం చేయా లని బాధితులు కోరుతున్నారు. ఈ సంఘటనపై దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.



ఒత్తిడి లేని చదువుతోనే అద్భుత ఫలితాలు

- తల్లిదండ్రుల కలలు సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులదే
- భారత్ విద్యా శిరోమణి అవార్డు గ్రహీత, ప్రముఖ విద్యావేత్త బి.ఎస్.ఎన్.మూర్తి



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పదవ తరగతి విద్యార్థులు పరీక్షల సమయంలో ఒత్తిడి లేకుండా చదువుకుంటే అద్భుత ఫలితాలు సాధిస్తారని, తల్లిదండ్రుల కలలు సాకారం చేయాల్సిన బాధ్యత విద్యార్థులపై ఉందని భారత్ విద్యా శిరోమణి అవార్డు గ్రహీత, ప్రముఖ విద్యావేత్త బి.ఎస్.ఎన్.మూర్తి విద్యార్థులకు సూచించారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం చింతల్ డివిజన్ పట్వారి నగర్(బ్రాంచ్) నవజ్యోతి హై స్కూల్ క్యాంపస్‌లో పదవ తరగతి విద్యార్థులకు పరీక్షల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు పలు సూచనలతో కూడిన అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ పాఠశాలలో ఉపాధ్యాయులు చెప్పినటువంటి పాఠ్యాంశాలను శ్రద్ధగా చదువుకోవాలని బట్టి చదువు విధానానికి స్వస్తి చెప్పాలన్నారు. ముందుగా మీకు వచ్చిన జవాబులే ఆందోళన చెందకుండా ముందు వ్రాయాలిని చెప్పారు. కష్టపడి చదివే కంటే ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాల అధిరోహిస్తారన్నారు. తల్లిదండ్రులతోపాటు పాఠశాలకు, రాష్ట్రానికి, దేశానికి పేరు ప్రఖ్యాతలు తేవాలన్నారు. అనంతరం పదో తరగతి విద్యార్థులకు ఆయన బెస్ట్ ఆఫ్ లక్ చెప్పారు. నవజ్యోతి విద్యాసంస్థల చైర్మెన్ మల్లిరెడ్డి ఇందిరా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ పాఠశాల స్థాపించిన సుమారు మూడున్నర దశాబ్దాలుగా ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ అనుభవజ్ఞులైన అధ్యాపకులచే విద్యాబుద్ధులు, సామాజిక విలువలు నేర్పుతూ ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ప్రతి సంవత్సరం పదవ తరగతిలో పరీక్ష ఫలితాల్లో తమ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ స్థాయిలో ఫలితాలు సాధించి కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికే తలమానికంగా నిలుస్తున్నారని ఈ సంవత్సరం కూడా అదే స్థాయి ఫలితాలు సాధిస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు ఆదిత్య కృష్ణ, రూపాంజలి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అమర్యాదగా ప్రవర్తిస్తున్న సి.ఓ.పాపాగౌడ్‌పై చర్యలు తీసుకోవాలి



- వార్డు కార్యాలయం ముందు పొదుపు సంఘాల మహిళల ఆందోళన

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

పొదుపు సంఘాల మహిళల పట్ల పలు విచారణల కోసం వార్డు కార్యాలయాలకు వచ్చే ప్రజల పట్ల మర్యాదగా, అసభ్యంగా ప్రవర్తిస్తున్న కమ్యూనిటీ ఆర్గనైజర్ (సి.ఓ)పై తక్షణమే ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని ప్రగతి మహిళా స్లమ్ సమాఖ్య, స్ఫూర్తి మహిళా స్లమ్ సమాఖ్య సంఘాల నాయకురాళ్ళు, సభ్యులు, మహిళలు ముక్తకంఠంతో నినదీస్తూ డిమాండ్ చేశారు. ఈ మేరకు చింతల్ డివిజన్ భగత్ సింగ్ నగర్‌లోని వార్డు కార్యాలయ ఆవరణలో ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రూపు మహిళలకు అందజేసే బ్యాంకు రుణాల చెక్కులను ప్రాసెస్ చేయడం కోసం రూ. 10 నుంచి 20 వేల వరకు కొంత నగదును డిమాండ్ చేస్తూ వసూలు చేసేవాడని ఇవ్వకపోతే ఫైల్ ముందుకు కదలని చెప్పేవాడని మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భగత్ సింగ్ నగర్ ప్రాంతంలో గత 25 సంవత్సరాల నుంచి సుమారు 70 పొదుపు సంఘాలతో ఆరు సమైక్యలుగా ఏర్పడి కార్యక్రమాలు కొనసాగించు కుంటున్నామని తెలిపారు. ప్రజాపాలన కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులు, వార్డు కార్యాలయాన్ని వచ్చిన మహిళల, వృద్ధులతో కూడా ఇష్టారాజ్యంగా ప్రవర్తించేవాడని సరైన సమాధానం చెప్పకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ చీదరించుకునే వాడని సీవో పాపాగౌడ్ పనితీరు పై వారు మండిపడ్డారు. పెన్షన్ మంజూరైన వారికి ఇంటింటికి తిరిగి కార్డులు అందజేస్తూ వారి వద్ద కూడా వసూళ్లకు పాల్పడేవాడని వాపోయారు. తక్షణమే ఉన్నతాధికారులు సి.ఓ పాపాగౌడ్ పై సమగ్ర విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన మరింత ఉధృతం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ విషయమై స్థానిక ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్‌తో పాటు కూకట్‌పల్లిజోనల్ కమిషనర్ అభిలాష అభినవ్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.



కేపీహెచ్‌బీ డివిజన్‌లో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆధ్వర్యంలో వేల కోట్ల రూపాయలతో అభివృద్ధి పరిచారని స్థానిక కార్పొరేటర్ మందడి శ్రీనివాస్ రావు అన్నారు. శుక్రవారం కేపీహెచ్‌బీ డివిజన్ పరిధిలోని 3వ , 7వ ఫేజ్ లో దోబీ ఘాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అనాటి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కృషితో మోడ్రన్ దోబీఘాట్లుగా తీర్చిదిద్దేందుకు నిధులు మంజూరు చేశామన్నారు. పనులు ప్రారంభించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారు లకు సూచించామని తెలిపారు. రాబోయే కాలంలో కూడా ప్రజలకు మౌలిక సదుపాయాలకు ఇబ్బంది లేకుండా ఎప్పుడూ అందుబాటులో ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో దీఊ ఆనంద్, ఎతఊ సాయి ప్రసాద్, దోబీఘాట్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు. నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట



- కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

హైదర్ నగర్ డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని హైదర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నే శ్రీనివాస్ రావు అన్నారు. హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్‌లో నూతనంగా చేపట్టిన సెంట్రల్ డివైడర్ నిర్మాణ పనులను ఆయన జీహెచ్ఎంసీ అధికారులతో, కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ సెంట్రల్ డివైడర్ వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. నాణ్యత విషయంలో ఎక్కడ రాజీ పడకూడదని, ప్రజలకు ట్రాఫిక్ రహిత, సుఖవంతమైన, మెరుగైన రవాణా సౌకర్యం కొరకు శాయ శక్తుల కృషి చేస్తానన్నారు. ప్రజలకు స్వచ్ఛమైన, చక్కటి ఆహ్లాదకరమైన వాతావరణం కలిపిస్తా మన్నారు. పనుల్లో జాప్యం లేకుండా త్వరితగతిన పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాల న్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కలిపిస్తామని, ప్రజలకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామన్నారు. డివిజన్ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తానన్నారు. మీ కాలనీలో కానీ, మీ బస్తీలో కానీ ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా ఆయన్ని కానీ, కార్పొరేటర్ కార్యాలయాన్ని కానీ సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ మహాదేవ్, కాలనీ వాసులు వెంకట్ రెడ్డి, గోపాల్ రెడ్డి, మల్లికార్జున్ రావు, రంగారావు, శ్రీనివాస్ రెడ్డి, అశోక్, గోపి తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులు పూర్తి చేయాలి



- కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్

నవతెలంగాణ-కూకట్‌పల్లి

ఆల్విన్ కాలని డివిజన్ ఆల్విన్ కాలనీ పరిధిలోని తులసీ నగర్ 1 లో సీసీ రోడ్ల కొరకు, గతంలో ముప్పై లక్షల రూపాయలు నిధులు మంజూరై, సీసీ రోడ్లను నిర్మాణ పనులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. నాణ్యత ప్రమాణాల విషయంలో రాజీ పడకుండా సీసీ రోడ్డు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. నిర్మాణ పనులు పూర్తయిన సీసీ రోడ్డును కావల్సినంత క్యూరింగ్ చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ (బాబాయ్), మల్లేష్, నాగరాజు, కేబుల్ సాయి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి రాథోడ్ సంతోష్ అరెస్టు

- మల్కాజిగిరిలో ప్రధానమంత్రి మోడీ పర్యటనలో భాగంగా అదుపులోకి తీసుకున్న కుషాయిగూడ పోలీసులు



నవతెలంగాన-సిటీబ్యూరో/కాప్రా

ప్రధానమంత్రి మోడీ మల్కాజిగిరి వస్తున్నారని ఎస్ఎఫ్ఐ మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి రాథోడ్ సంతోష్‌ని ముందస్తు అరెస్ట్ చేసి కుషాయిగూడ పోలీసు స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ.. ఇది అక్రమ అరెస్ట్ అన్నారు. నూతన విద్యా విధానం 2020ని రద్దు, ఏడాదికి 2 కోట్ల ఉద్యోగాల భర్తీ గురించి ప్రశ్నిస్తారని భయపడే అక్రమ అరెస్టు చేపించారన్నారు. నూతన జాతీయ విద్యావిధానం 2020 రద్దు చేయాలని, కేంద్ర ప్రభుత్వ యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తిని కాపాడాలని, కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి 10శాతం నిధులు కేటాయించాలని, చరిత్రను వక్రీకరిస్తూ చేస్తున్న ఎన్సీఈఆర్టి సిలబస్ మార్పులను ఆపాలన్నారు. యూనివర్సిటీ గ్రాంట్స్ కమీషన్‌కు నిధులను తగ్గించి నిర్వీర్యం చేసే కుట్రను మానుకోవాల ని, ఎస్సీ, ఎస్టీ మైనారిటీ పరిశోధక విద్యార్థుల ఫెలోషిప్లలో కోతను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. విద్యారంగంలో మతోన్మాద ఆర్ఎస్ఎస్ ఎజెండా అమలు చేయాలని, విద్యారంగాన్ని కార్పోరేట్, ప్రైవేట్ శక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేయడానికి దేశంలో నూతన విద్యావిధానం తీసుకుని వస్తున్నారని, విద్యా విధానం ద్వారా దేశంలో వీదేశీ యూనివర్సిటీలను రద్దు చేయాలని, యూజీసీకి గ్రాంట్స్ పెంచాలని కోరారు.

దేశంలో విద్యారంగానికి తక్కువ నిధులు ఇచ్చి, నూతన విద్యావిధానం పేరుతో ప్రభుత్వం ప్రభుత్వ యూనివర్సిటీలు, విద్యాసంస్థలను నష్టం చేసే చర్యలు చేస్తుందన్నారు. నూతన విద్యావిధానం 2020 ఈ దేశంలో విద్యరంగంలో ఫెడరల్ స్ఫూర్తి దెబ్బతీసి రాష్ట్రాల హక్కులు కాలరాస్తుందని కార్పోరేట్ శక్తుల, వీదేశీ శక్తుల ప్రవేశం దీని ద్వారా మరింత సులభతరం అవుతుందన్నారు. రాజీవ్ గాంధీ నేషనల్ ఫెలోషిప్స్ గత 8 సంవత్సరాల నుంచి పెండింగ్ ఉన్నాయని వాటిని పునరుద్ధరణ చేసి అందరికీ ఫెలోషిప్స్ అందించాలని పేర్కొన్నారు. ప్రతి యేటా యువతకు 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని 2014 ఎన్నికల్లో హామీ ఇచ్చిన మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మరిశారని ఏడాదికి రెండుకోట్లు చొప్పున 10 సంవత్సరాల లో 20 కోట్లు ఉద్యోగాలు ఎమైయాయని ప్రశ్నించారు. మోదీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రశ్నించే వారిపై దాడులు, హత్యలు, కేసులు పెరిగాయని ఈడి, సిబిఐ లను పంపి బెదిరింపులు చేస్తోందని అన్నారు. దేశ ప్రజాస్వామ్యం అపహాస్యం చేస్తూరని అన్నారు. పేదలకు ఉపాధి లేదు, రోజురోజుకు పెరుగుతున్న ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయని తెలిపారు. వాటిని నియంత్రణ చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు.

విద్యాసంస్థలలో మత విద్వేషాలు పెంచి కళాశాలలో, యూని వర్సిటీలలో దాడులు చేస్తున్నారు. ఫీజులు పెంచుతున్నారు. అందరికీ విద్య, అందరికీ ఉపాధి కల్పించకుండా కేవలం ఆదానీ, అంబానీల కోసం మాత్రమే ప్రధానమంత్రిగా వ్యవహరిస్తున్నారని అన్నారు.

హైదరాబాద్‌లో విన్‌ఫ్లోరా రెసిడెన్సీ

- కొత్త హెటల్‌ను ప్రారంభించిన మంత్రి జూపల్లి, నటి మాళ్విక శర్మ



నవతెలంగాన-సిటీబ్యూరో

భోజన ప్రియులను ఆకర్షించే రుచికరమైన భోజనం, కస్టమర్లకు హృదయపూర్వక ఆతిథ్యం, విలాసవంతమైన సౌకర్యాలతో హైదరాబాద్ నగరంలో విన్‌ఫ్లోరా రెసిడెన్సీ శ్రీనగర్ కాలనీలో తన కొత్త లగ్జరీ రెస్టారెంట్ ప్రారంభించారు. శుక్రవారం జరిగిన ప్రారంభోత్సవ వేడుకలో తెలంగాణ ఎక్సైజ్, ప్రొహిబిషన్, టూరిజం, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, భారతీయ నటి మాళ్విక శర్మ ప్రత్యేక అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విన్‌ఫ్లోరా వ్యవస్థాపకులు సోను అగర్వాల్, వైభవ్ అగర్వాల్ మాట్లాడుతూ అసాధారణమైన సౌకర్యాలు, చక్కటి భోజనం, హృదయ పూర్వక ఆతిథ్యం ద్వారా అతిథి అంచనాలను మించి విలాసవంతమైన, సౌకర్యవంతమైన తిరోగమనాన్ని సృష్టించడం తమ లక్ష్యాన్ని వివరించారు. రెసిడెన్సీ రూపొందించబడిన అతిథి గదులు, సూట్‌లు ప్రత్యేకంగా నిలిచాయి. స్థానిక రుచులు, గ్లోబల్ వంటకాలు, అలాగే రూపొందించిన కాక్‌టెయిల్‌లు రెండింటినీ కలిగి ఉన్న అగ్రశ్రేణి చెఫ్‌లచే రూపొందించబడిన విభిన్న భోజన ఎంపికలలో అతిథులు మునిగిపోతారు.

వ్యాపారం, సాంఘిక సమావేశాలు రెండింటినీ అందించే ఈవెంట్ స్పేస్ అవసరాన్ని గుర్తిస్తూ, విన్‌ఫ్లోరా రెసిడెన్సీ అత్యాధునిక సౌకర్యాలను అందిస్తుంది. విన్‌ఫ్లోరా రెసిడెన్సీ తన అసమానమైన లగ్జరీ, అత్యుత్తమ సేవలను అనుభవించడానికి అతిథులను స్వాగతించడానికి సంతోషిస్తోంది. అసాధారణమైన బసను అందించాలనే నిబద్ధతతో, విన్‌ఫ్లోరా హైదరాబాద్‌లో ఆతిథ్యాన్ని పునర్నిర్వచించడం లక్ష్యంగా పెట్టుకుంది.

కవిత అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నాం

- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

నవతెలంగాణ-కూకట్‌పల్లి

తెలంగాణ శాసన మండలి సభ్యురాలు కల్వకుంట్ల కవితను ఈడి అధికారులు అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కవితపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ ప్రేరేపిత కేసులపై సుప్రీం కోర్టులో కేసులు విచారణలో ఉండగానే, ఈడి అధికారులు కుట్రపూరితంగా అరెస్ట్ చేయడం శోచనీయమని అన్నారు. ప్రజాస్వామ్యయుతంగా మహిళా సాధికారాత కోసం పోరాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న మహిళా నాయకురాలిని అక్రమంగా అరెస్ట్ చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తు న్నట్లు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కేసీఆర్ ను రాజకీయపరంగా ఎదుర్కోలేని బీజేపీ, కాంగ్రెస్ నాయకత్వం అక్ర మంగా కేంద్రప్రభుత్వ సంస్థలను అడ్డుపెట్టుకొని అరెస్టులకు పాల్పడుతూ బెదిరింపు రాజకీయాలు చేయడం సిగ్గు చేటని విమర్శించారు. రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజలు బీజేపీ నాయకత్వానికి తగిన గుణపాఠం చెప్పడం ఖాయమన్నారు.



జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖైరతాబాద్ నియోజకవర్గ అధ్యక్షుడిగా కలకండ శ్రీనివాసులు నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయనకు సంఘం అధ్యక్షులు, ఎంపీ ఆర్ కఅష్ణయ్య నియామక పత్రకాన్ని తెలంగాణ యూత్ అధ్యక్షులు నీలా వెంకటేష్‌తో కలిసి అందజేశారు. తన బాధ్యతను గుర్తెరిగి తన కష్టానికి ఫలితంగా అందించిన ఈ అవకాశంతో ప్రతి బీసీ పౌరుని అభివఅద్ధి కోసం పోరాడుతానని శ్రీనివాస్ తెలిపారు.
నవతెలంగాణ-బంజారాహిల్స్

డిప్యూటీ సీఎంను కలిసిన డిప్యూటీ మేయర్

నవతెలంగాణ-ఓయూ



తెలంగాణ రాష్ట్ర డిప్యూటీ సీఎం మల్లు బట్టి విక్రమార్కను శుక్రవారం ఉదయం జ్యోతిరావు పూలే ప్రజా భవన్‌లోని వారి క్యాంప్ కార్యాలయంలో గ్రేటర్ హైదరాబాద్ నగర డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతశోభన్‌రెడ్డి,కార్మికనేత శోభన్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిశారు.

పార్లమెంట్‌తోనే కంటోన్మెంట్ ఉప ఎన్నికలు

నవతెలంగాణ-కంటోన్మెంట్

పార్లమెంట్ ఎన్నికలతోపాటే సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నిక జరిపేం దుకు రంగం సిద్ధమైనట్టు తెలుస్తోంది. ఈ మేరకు దానికి సంబంధించిన అధికారిక ప్రక్రియ దాదాపు పూర్తయినట్టు సమాచారం. గత నెల 23న కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత రోడ్డు ప్రమాదంలో మఅతి చెందడంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది. అయితే సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ నేడు విడుదల కానుంది. వీటితోపాటే దేశ వ్యాప్తంగా వివిధ కారణాల వల్ల ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు నిర్వహిస్తారు. ఇప్పటికే సికింద్రాబాద్ కంటోన్మెంట్‌కు సంబంధించి అసెంబ్లీ స్థానం ఖాళీ అయినట్లు ధ్రువీకరణ కూడా పూర్తయింది. ఈ మేరకు ఉపఎన్నిక నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లను చేసుకోవాల్సిందిగా ఉన్నతాధికారులు, కిందిస్థాయి సిబ్బందికి సూచించినట్టు తెలుస్తోంది.

సిద్ధమవుతున్న ఆశావహులు

ఇదిలా ఉండగా ఎన్నికలలో పోటీ చేసేందుకు సాయన్న



కుటుంబం నుంచి ఇంతవరకు ఎలాంటి ప్రకటన లేదు. ఎమ్మెల్యే లాస్య నందిత చనిపోయిన తర్వాత ఆమె సోదరి నివేదిత డిప్రెషన్‌లోకి వెళ్లిపో యారు. నెల రోజులు గడుస్తున్నా ఇప్పటివరకు వారి కుటుంబం నుంచి ఉప ఎన్నికలపై ఎలాంటి స్పందన కనిపించ లేదు. త్వరలో ఆమె కీలక ప్రకటన చేస్తుందని పలువురు చెబుతున్నారు. ఇక బీజేపీ నుండి పోటీ చేసేందుకు ఎన్ శ్రీ గణేష్ ఇప్పటికే రంగంలో ఉన్నారు. అలాగే నివేదిత ఎన్నికలలో బరిలో ఉండకపోతే కార్పొరేషన్ మాజీ చైర్మన్‌లు గజ్జల నగేష్, క్రిశాంక్‌లు బీఆర్ఎస్ నుంచి బరిలోకి దిగే అవకాశం ఉంది. ఇకపోతే కాంగ్రెస్ పార్టీ నుంచి గద్దర్ కుమార్తె వెన్నెలకే మరో అవకాశం ఇచ్చేందుకు పార్టీ అధిష్టానం చూస్తున్నట్టు సమాచారం. వెన్నెలకు కాంగ్రెస్ ఉప ఎన్నికలలో టికెట్ ఇచ్చినా గెలిచే అవకాశాలు తక్కువగా ఉంటాయని కొందరు సీనియర్ కాంగ్రెస్ నాయకులు చెబుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో కాంగ్రెస్ ఉన్నా కంటోన్మెంట్‌లో గద్దర్ వెన్నెల ఇన్‌చార్జిగా ఉండి అందరినీ కలుపుకుపోవటం లేదని ఒక ఆరోపణ ఉంది. నియోజకవర్గంలో ఏ కార్యక్రమం చేసినా కార్యకర్తలకు ఆమె సమాచారం ఇవ్వటం లేదని విమర్శలు ఉన్నాయి. .గద్దర్ వెన్నెల ఈ ఆరోపణలను అధిగమించకపోతే మళ్లీ ఓటమి పాలు కాక తప్పదు అంటూ పలువురు సీనియర్ కాంగ్రెస్ నేతలు గుసగుసలాడుతున్నారు.

ఈవీఎం మిషన్లపై అవగాహన



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

యూసుఫ్ గూడాలోని జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 ఆఫీసులో ఈవీఎం మిషన్ల పనితీరుపై ప్రజలకు సెంట్రల్ ఆర్మ్స్ రిజర్వ్ పోలీసు అధికారులు అవగాహన కల్పించారు. అక్కడకు వచ్చిన వారితో ప్రతీరోజు 40 నుండి 50 మంది వరకు, వారు వేయవలసిన పార్టీ గుర్తులపై ఓటు వేయించి, వారు వేసిన గుర్తు ఈవీఎం మిషన్‌లో కరెక్ట్ గా వచ్చిందో లేదో చూసుకోవాలని ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమాన్ని సెంట్రల్ ఆర్మ్స్ రిజర్వ్ పోలీసు సిబ్బంది, ఇద్దరు అధికారులు నిర్వహిస్తున్నారు. ఉదయం 10 గంటల వరకు మిషన్ తీసుకొని వచ్చి సాయంత్రం ఐదు గంటల వరకు వచ్చిన వారితో ఓటు వేయించి మిషన్లలో ఎలాంటి పొరపాటు జరగదని అవగాహన కల్పిస్తున్నారు. ఈ కార్యక్రమంలో సీఏఆర్ పోలీస్ అధికారులు వి.సాయి కుమార్, రమణ యాదవ్ ప్రత్యేక ఏర్పాటు చేశారు. వీరికి కావలసిన అన్ని ఏర్పాట్లను జీహెచ్‌ఎంసీ సర్కిల్ 19 అధికారులు ఏర్పాటు చేశారు.

ప్రభుత్వ సాహసోపేత నిర్ణయన్ని స్వాగతిస్తున్నాం



- వీరశైవ లింగాయత్ లింగ బలిజ సంఘం

నవతెలంగాణ-బంజారాహిల్స్

వీరశైవ లింగాయత్ లింగ బలిజ ఫైనాన్షియల్ కార్పొరేషన్ ఏర్పాటు చేయుటకు నిర్ణయించిన సీఎం రేవంత్ రెడ్డికి, బీసీ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, సహచర మంత్రులకు ముఖ్యంగా దీనికి ముందుండి సహకరించిన వీరశైవ లింగాయత్ ముద్దు బిడ్డ సురేష్ షేట్కరికి, ముఖ్యంగా దీని కోసం అలుపెరగని పోరాటం చేసిన రాష్ట్ర అధ్యక్షులు పట్లోళ్ల సంగమేశ్వర్,రాష్ట్ర గౌరవ అధ్యక్షులు వెన్న ఈశ్వరప్పకి యావత్ తెలంగాణ రాష్ట్రంలోని వీరశైవ లింగాయత్ లింగబలిజల వారు ధన్యవాదాలు తెలిపారు. మంత్రుల నివాసంలో శుక్రవారం ప్రత్యక్షంగా మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌ను, రాష్ట్ర,నగర ప్రధాన కార్యదర్శులు సెక్రెటరీ జీఆర్‌పీ రఘు, షాబాద్, రాకేష్‌లు కలిసి ప్రత్యేక కఅతజ్ఞతలు తెలిపారు.

బీఎస్ఎఫ్, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో కాన్సీరాం జయంతి



నవతెలంగాణ-ఓయూ

ఓయూ ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో శుక్రవారం బహుజన స్టూడెంట్స్ ఫెడరేషన్, బహుజన విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో మాన్యవార్ కాన్షీరాం 90 వ జయంతిని ఘనంగా నిర్వహించారు. బీఎస్ఎఫ్, బహుజన విద్యార్థి సంఘాల జాక్ చైర్మెన్ సంజయ్ వేల్పుల మాట్లాడుతూ. బహుజనులను రాజకీయంగా అధికారంలోకి తీసుకురావడానికి తన జీవితం మొత్తం త్యాగం చేసిన మహనీయుడు మాన్యశ్రీ కాన్షీరాం అని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకుపోతామన్నారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ ఓయూ అధ్యక్షులు పోమల అంబేద్కర్, నాయకులు భాస్కర్, కృష్ణ యుగంధర్, స్వామి, కుమార్, సందీప్, కుమార్,నాయక్ పాల్గొన్నారు.

ప్రధాని రోడ్‌షోలో పాల్గొన్న కార్పొరేటర్



నవతెలంగాణ-ఓయూ

ప్రధాని మోడీ మల్కాజిగిరిలో శుక్రవారం నిర్వహించిన రోడ్ షోకు హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ చేతన హరీష్ ఆధ్వర్యంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. కార్యక్రమంలో సుమన్ రావు , హేమంత్ మూలకాలు రాఘవ రెడ్డి , పాడటియా నాయక్ , రంగా రవి తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి చేసిన పార్టీకి ఓటు వేయండి

ఎంపీ అభ్యర్థి ఆర్ ఎల్ ఆర్
ఆర్ఎల్ఆర్ ను గెలిపిస్తాం
ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ఓయూ



హైదరాబాద్‌ను అభివఅద్ధి చేసిన మాజీ సీఎం కేసీఆర్‌కు అండగా నిలిచి రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో మల్కాజిగిరిలో బీఆర్ఎస్‌ను గెలిపించాలని బీఆర్ఎస్ మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం హబ్సిగూడాలోని తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ప్రధాని మోడీ నిత్యావసర సరుకుల నుంచి పెట్రోల్ డీజిల్ ధరలు వరకు అన్నీ పెంచారన్నారు. 7 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎలాగైతే బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించారో తనను అలాగే గెలిపించాలని కోరారు. ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ఆర్ఎల్ఆర్ ను భారీ మెజారిటీతో గెలిపించుకుంటామన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో తన విజయం కోసం ఆయన కృషి చేయడం తో పాటుగా పూర్తిస్థాయిలో సహకారాన్ని అందించారని చెప్పారు. ప్రతీ నేత, కార్యకర్తలు ఆయన గెలుపు బాధ్యతలు భుజస్కంధాలపై వేసుకొని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాన్షీరాంకు భారతరత్న ఇవ్వని బీజేపీని ఓడించండి

నవతెలంగాణ-ఓయూ



బహుజన్ సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు, బహుజన సిద్ధాంతకర్త మాన్యశ్రీ కాన్షీరాం 90వ జయంతి బహుజన్ స్టూడెంట్ ఫెడరేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మొగిలిగిద్ద ప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం ఓయు ఆర్ట్స్ కాలేజ్ ఆవరణలో ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఎస్ఎఫ్ రాష్ట్ర కన్వీనర్ బొరెల్లి సురేష్ హాజరై మాట్లాడారు "ఈ దేశ అత్యున్నతమైన పురస్కారం భారతరత్న అందుకునేందుకు అని అర్హతలు ఉన్న బహుజన వీరుడు మాన్యశ్రీ కాన్షీరాంకు భారతరత్న ఇవ్వని బీజేపీ ఓడించి తీరాలని పిలుపునిచ్చారు. బీజేపీని ఓడించడమే కాన్షీరాంకు ఇచ్చే ఘనమైన నివాళి అని అన్నారు. బడుగు బలహీన వర్గాలకు రాజ్యాధికారం సాధించి పెట్టిన గొప్ప యోధుడు కాన్షీరాం అని అలాంటి గొప్ప నాయకుని విగ్రహం ట్యాంక్ బండ్ పై పెట్టాల్సిన బాధ్యత అధికారపార్టీపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సబ్బండ వర్గాలైనా ఎస్సీ, ఎస్టీ ,బీసీ ,మైనార్టీలకు సంక్షేమంలో పెద్దపీట వేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా వచ్చిన తెలంగాణ దళిత దండు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎర్రమళ్ళ మొగులయ్య మాట్లాడుతూ కాన్షీరాం ఆలోచన విధానం భారతదేశ ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలకు అవసరమని ఈ జాతులు అభ్యున్నతికి రాజ్యాధికార ఆకాంక్షకు కాన్షీరాం వేసిన బాటలు ఎంతో విలువైనవని అన్నారు. కాన్షిరామ్‌కు భారతరత్న ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీఎస్ఎఫ్ నాయకులు అరె కంటి శ్రీకాంత్, కోవిక్, పానుగంటి కర్ణాకర్, రేవంత్,సతీష్, అనంతయ్య, విజయ్, పురుషోత్తం, చింతయ్య, వంశీ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

మానవతా దృక్పథంతో ఉద్యోగాలు కల్పించండి

- ముఖ్యమంత్రికి డీఎస్సీ 1998 క్వాలిఫైడ్ యూనియన్ విజ్ఞప్తి

నవతెలంగాణ-బంజారాహిల్స్

మానవతా దఅక్పథంతో 1998 సంవత్సరంలో డీఎస్సీ క్వాలిఫైడ్ అయిన తమకు మానవతాదృక్పదంతో ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డికి 1998 డీఎస్సీ క్వాలిఫైడ్ యూనియన్ విజ్ఞప్తి చేసింది. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమా వేశంలో యూనియన్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు నర సింహారెడ్డి, సంజీవ్‌లు మాట్లాడారు. విద్యార్థులకు నా ణ్యమైన సేవలందించాలని లక్ష్యంతో బీఈడి పూర్తి చేసి 1998లో అప్పటి ప్రభుత్వం నిర్వహించిన డీఎస్సీలో క్వాలిఫై అయ్యామని తెలిపారు. అప్పటినుంచి తమకు న్యాయం చేయాలని పోరాటం చేస్తున్నా ప్రయోజనం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఏర్పాటుకు ముందు నుంచి తాము పోరాటం చేస్తు న్నామని



తెలిపారు. విభజన సమయంలో ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటుకు సహకరించినట్టు చెప్పారు. స్వరాష్ట్రంలో తమకు న్యాయం జరుగుతుందని భావించినా అప్పటి పాలకులు తమను పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ ఇచ్చిన పార్టీగా ప్రభుత్వాన్ని చేపట్టిన కాంగ్రెస్ పార్టీ ఇప్పటికైనా తమకు ఉద్యోగాలు కల్పించి ఆదుకోవాలని కోరారు. ముఖ్యమంత్రి తమకు అనుకూలంగా నిర్ణయం తీసుకుంటే జీవితాంతం రుణ పడి ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో జోష్ణ, ఇషాక్ అలి, గోపాల్, రాములు పాల్గొన్నారు.

ఓయూలో ఓపెన్ జిమ్ ప్రారంభం



- మహిళలకు చట్టసభల్లో 33 శాతం రిజర్వేషన్స్ కల్పించిన నేత మోడీ
- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-ఓయూ

చట్ట సభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తీసుకొచ్చిన ఘనత ప్రధాని మోడీకి దక్కిందని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉస్మాని విశ్వవిద్యాలయం నాన్ టీచింగ్ హోమ్‌లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి తన నిధులతో ఏర్పాటు చేసిన ఓపెన్ జీమ్‌ను ప్రారంభించారు. అనంతరం ఓయు లో మూడు భోద నేతర ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ సభలో పాల్గని ప్రసంగించారు. మహిళలపై నేటికీ సమాజంలో వివక్షత కొనసాగటం బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు అన్ని రంగాల్లో ప్రధాన భూమిక పోషిస్తున్నారని ఇంకా పోషించాల్సిన అవసరం ఉందని తెలిపారు. మహిళలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎల్పిజి గ్యాస్ ఇవ్వడంతో పాటుగా వారిని ప్రోత్సాహం ఇస్తున్నట్లు చెప్పారు. విశ్వవిద్యాలయాల అభివఅద్ధిలో భాగంగా పాల మూరు విశ్వవిద్యాల యానికి రు 100 కోట్లు నిధులను తన సహకారంతో అందజే శామని,అదే విధంగా ఓయూలో కూడా పలు అభివఅద్ధి కార్యక్రమాలకు నిధులు ఇచ్చినట్టు గుర్తు చేశారు. త్వరలో అనేక అభివఅద్ధి కార్యక్రమాలు చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఓయూ డా.బి.ఆర్.అంబెద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సీనియర్ చరిత్ర శాఖ ప్రొఫెసర్ ప్రో.ఈ. సుధ రాణి, మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళ లపై నేటికి వివక్షత కొనసాగుతున్నట్టు చెప్పారు. మహిళలు జీవితంలో రాణించాలని ఉంటే అది చదువు ద్వారానే అన్నారు.కార్యక్రమానికి మహిళలు భారీగా తరలివచ్చారు. ఉత్సాహంగా పలు సాంస్కఅతిక కార్యక్రమాలల్లో పాల్గ న్నారు. కార్యక్రమంలో శాత వాహన యూనివర్సిటీ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత, ఓయూ వీసీ ప్రొ.డి. రవీందర్, రిజిస్ట్రార్ ప్రొ.పి. లక్ష్మీనారాయణ లు ప్రసంగించారు. ఓయూ ఉమెన్స్ కమిటీ నేతలు ప్రణీత, సి.హైమవతి, ప్రీతి, స్వాతిరెడ్డి, వరలక్ష్మి, సుధ, అధ్యక్షులు జ్ఞానేశ్వర్, నాగరాజ రావు,శివ శంకర్, అక్బర్ బేగ్‌తో పాటు పలువురు మహిళలు పాల్గొన్నారు.


ఘనంగా కాన్షిరామ్ జయంతి



నవతెలంగాణ-ఓయూ

భారత రాజకీయాలలో బహుజన రాజ్యాన్ని స్థాపించేందుకు మాహత్మ జ్యోతిబాపూలే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్‌ల ఆలోచన విధానాలతో ముందుకు సాగిన మహానుభావుడు మాన్యశ్రీ కాన్షీరామ్ 90వ జయంతిని భరత జాగఅతి, యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో ఉస్మానియా యూనివర్సి టీఆర్ట్స్ కాలేజీ ముందు ఘనంగా నిర్వహించారు. నిరుద్యోగ విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యునైటెడ్ పులే ఫ్రంట్ విద్యార్థి విభాగం కన్వీనర్ ఓయూ జేఏసి అధ్యక్షులు డా.ఎల్చల దత్తాత్రేయ మాట్లాడుతూ. బహుజన హక్కుల సాధనకు భారత జాగఅతి యునైటెడ్ పూలే ఫ్రంట్ నిరంతరం పోరాడుతుందన్నారు. పూలే విగ్రహాన్ని ఎమ్మెల్సీ కవిత అసెంబ్లీలో పెట్టాలని డిమాండ్ చేస్తుంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ముఖం చాటేస్తున్నదన్నారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామన్న ఎన్నికల హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు.రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 90 రోజుల్లోనే నిరుద్యోగులను మహిళలను తీవ్ర అన్యాయం చేసిందన్నారు. ఒక్క పోస్టు కూడా బ్యాక్‌లాగ్ ఏర్పడకుండా మొత్తం 9210 పోస్టులను భర్తీ చేయాలి కోరుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో యూపీఎఫ్ ప్రచార కార్యదర్శి బిసి నరసన్న మాట్లాడుతూ బీసీల రాజకీయ రిజర్వేషన్ల కోసం ఎంతకైనా పోరాడుతాన్నారు. జాగఅతి రాష్ట్ర కార్యదర్శి, యూపీఎఫ్ విద్యార్థి విభాగ కో కన్వీనర్ బి. లింగం మాట్లాడుతూ రేవంత్ రెడ్డి ప్రభుత్వం మహిళలను నిరుద్యోగులను రైతులను మోసం చేసిందన్నారు. ఓయూ నేత యూపీఎఫ్ విద్యార్థి విభాగ కో కన్వీనర్ అశోక్ యాదవ్ మాట్లాడుతూ బహుజనులకు, మహిళలకు రాజకీయ ఆర్థిక సామాజిక అవకాశాలు కల్పించాలని కోరారు. జాగృతి అధికార ప్రతినిధి దండెం ఆనంద్,గోపి విద్యార్థి నాయకులు కొప్పుల అర్జున్ ఎల్చల వంశీకఅష్ణ,నామ సైదులు అంసా ఓయూ అధ్యక్షులు,అశోక్, పెద్ద సంఖ్య లో విద్యార్థులుయువకులు బహుజన వాదులు పాల్గొన్నారు.

మాజీ సీఎం తో భేటీ



రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం సాయంత్రం బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ సీఎం కేసీఆర్‌ను అయిన నివాసంలో కలిసి కృతజ్ఞతలు చెప్పారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యేలు కేపివివేకానంద్, మర్రి రాజశేఖర్ రెడ్డి, మాధవరం కఅష్ణారావులను కూడా రాగిడి లక్ష్మారెడ్డి శుక్రవారం వేరువేరుగా మర్యాదపూర్వకంగా కలిశారు.
నవతెలంగాణ-ఓయూ

2వ జాతీయ డాక్టోరల్ కాన్‌క్లేవ్

నవతెలంగాణ-ఓయూ

పరిశోధనలో కొత్త సరిహద్దులను అన్వేషించడం అనే ఇతి వృత్తంతో 2వ జాతీయ డాక్టోరల్ కాన్క్లేవ్-2024ను, శుక్రవారం ఉస్మానియా విశ్వవిద్యాలయం వాణిజ్య విభాగం కళాశాల ఆడిటోరియంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాణిజ్య విభాగం హెడ్ ప్రో.దాసరి. చెన్నప్ప, బోర్డ్ ఆఫ్ స్టడీస్ చైర్మెన్ సీనియర్ ప్రో. కఅష్ణ చైతన్య, కాన్‌క్లేవ్ కన్వీనర్ ప్రో. జి. నరేష్ రెడ్డి, ప్రముఖ ప్రొఫెసర్లు ప్రో. ఎ. పాట్రిక్, ప్రో. ఇంద్రకాంతి శేఖర్, ప్రో. సంధ్య రాణి, ప్రో. కవి తా దేవి, ప్రొఫెసర్ టి. కఅష్ణ కుమార్ (రిటైర్డ్) పాల్గొన్నారు. వాణిజ్య శాఖ నిర్వహించిన ఈ డాక్టోరల్ కాన్‌క్లేవ్‌లో తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల నుంచి కామర్స్ ఫ్యాకల్టీ సభ్యులు, రీసెర్చ్ స్కాలర్లు, రీసెర్చ్ సూపర్వైజర్స్ మైసూరు విశ్వవిద్యాలయం నుంచి ఒక స్కాలర్ పాల్గొన్నారు..ఈ కార్యక్రమంలో, సీనియర్ ప్రో. డి. చెన్న ప్ప పరిశో ధనలో శ్రద్ధ, నైతిక ప్రమాణాల ప్రాముఖ్యతను నొక్కి చెబుతూ, పురోగతిని చర్చించడానికి పరిశోధన సవాళ్లను పరిష్కరించడానికి పరిశోధనా పండితులు, పర్యవేక్షకుల కోసం సమావేశాలను నిర్వహి ంచడంలో విభాగం చేసిన ప్రయత్నాలను ఎత్తిచూపారు. ఈ సమావేశాన్ని నిర్వహించినందుకు ప్రో. జి. నరేష్ రెడ్డిని ప్రో.ఎ.పాట్రిక్ ప్రశంసించారు. పరిశోధనను ప్రదర్శించ డానికి, పరిశోధన నాణ్యతను పెంచ డానికి నిపుణుల నుంచి విలువైన అభిప్రాయాన్ని స్వీకరించడానికి ఒక వేదిక అన్నారు. ప్రొఫెసర్ ఇంద్ర కాంతి శేఖర్ ఇంటర్ డిసిప్లినరీ సహకారాన్ని ప్రోత్స హించారు. పండితుల పరిశోధన పనిని సుసంపన్నం చేయడానికి ఇతర రంగాల నుంచి నిపుణులను ఆహ్వానించాలని విభాగాన్ని కోరారు. ఇండియన్ అకౌం టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు ప్రో. అప్పారావు, ప్రదర్శన నైపుణ్యాల ప్రాముఖ్యత, సమయపాలనకు కట్టుబడి ఉండటం, అధిక-నాణ్యత, అసలైన పరిశోధనల ఉత్పత్తిని నొక్కి చెప్పారు. ప్రో. జి. నరేష్ రెడ్డి విద్యార్థులను తీవ్రమైన పరిశోధనలపై దృష్టిపెట్టడానికి, జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో సహకారం కోసం ఆకాంక్షించడానికి, అధిక-నాణ్యత గల పత్రికలలో ప్రచుర ణకు



ప్రాధాన్యత ఇవ్వడానికి ప్రేరేపించారు. రిసోర్స్ పర్సన్ అండ్ జడ్జి, ప్రొ.టి.కృష్ణకుమార్ నాణ్యమైన పరిశోధన ఫలితాల కోసం విద్యార్థులు తమ ఆసక్తిని కొనసాగించాలని, అందుబాటులో ఉన్న వనరులను,అధునాతన సాధనాలను ఉపయోగించుకోవాలని సూచించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
మేడ్చల్-మల్కాజిగిరి-ఉప్పల్
శనివారం | మార్చి 16, 2024 | www.navatelangana.com

ఎన్టీఆర్ నగర్ సమస్యలపై ఎమ్మెల్యే బండారికి వినతి



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు తమ సమస్యలను పరిష్కరించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బాలవికాస్ సంస్థ వారు నిర్మించిన వాటర్ ప్లాంట్ స్థలం ప్రస్తుతం నిరూపయోగంగా ఉండడంతో ఆ స్థలాన్ని కొంత మంది కబ్జా చేయడానికి ప్రయత్నిస్తున్నారని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వాటర్ ప్లాంట్ స్థలంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ సమస్యను గతంలో సంబంధిత అధికారులకు, నాయకుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

లబ్దిదారులకు కల్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని రైతు వేదికలో శుక్రవారం ముడుచింత లపల్లి మండలానికి మంజూరైన 21 మందికి షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి చెక్కులను మేడ్చల్ ఎమ్మెల్యే చామకుర మల్లారెడ్డి లబ్ధిదారుల కు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ హారిక, జెడ్పీటీసీ హరివర్ధన్‌రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్ యాదవ్, వైస్ ఎంపీపీ మంద శ్రీనివాస్ రెడ్డి, ఎంపీటీసీలు పారుపల్లి నాగరాజు, మాజీ సర్పంచులు జాం రవి, సింగం ఆంజనేయులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు పనులకు బండారి శంకుస్థాపన



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని బాబా నగర్ కాలనీలో రూ.40లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు మల్లాపూర్ కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డితో కలిసి ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..అభివృద్ధే ఎజెండాగా ముందుకెళ్తున్నామని తెలిపారు. డివిజన్ పరిధిలోని అన్ని కాలనీల్లో సీసీ రోడ్లు, వాటర్ లైన్లు, భూగర్భ డ్రయినేజీ పనులను చేపడుతున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ రూప, ఏఈ శ్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, బాబా నగర్ కాలనీవాసులు సూర్యం శివ, జలగం శీను, బీఆర్ఎస్ నేతలు వాసు గౌడ్, పాండు, పద్మారెడ్డి, ప్రభాకర్ రెడ్డి, రాపోలు సతీష్, శ్రీశైలం, ఎండీ. ఉస్మాన్, రవి నాయక్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

సీవరేజీ పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన



చర్లపల్లి డివిజన్ పరిధిలోని వీఎన్ రెడ్డి నగర్‌లో రూ.36 లక్షల వ్యయంతో సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి శుక్రవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ..నియోజకవర్గం అభివృద్ధి, సంక్షేమానికి అధిక మొత్తంలో నిధులు ఖర్చు చేస్తున్నామని చెప్పారు. అభివృద్ధి పనులను వేగవంతం చేశామని పేర్కొన్నారు. ప్రజా సంక్షేమం కోసం నిధులు తీసుకొచ్చి ప్రజల ఆకాంక్షను నెరవేరుస్తున్నామన్నారు. అభివృద్ధికి స్థానిక ఆధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సుచించారు. ఈ కార్యక్రమంతో డీజీఎం సతీష్, ఏఈ రోహిత్, జీహెచ్ఎంసీ ఆధికారులు, కాలనీ వాసులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

'పది' విద్యార్థులకు పరీక్షా కిట్ల అందజేత



నవతెలంగాణ-కాప్రా

చర్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ ఫౌండేషన్, కుషాయిగూడ లైన్స్ క్లబ్ ఆధ్వర్యంలో శుక్రవారం పరీక్షా కిట్లు అందజేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండర్ శరత్‌సుదర్శి మాట్లాడుతూ.. విద్యార్థులకు పదో తరగతి అత్యంత కీలకమైనదని, ఎలాంటి ఆందోళన చెందకుండా పరీక్షలు రాయాలని సూచించారు. పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధిస్తే ప్రభుత్వ పాఠశాలలకు మంచి గుర్తింపు వస్తుందన్నారు. అప్పుడే ఎక్కువ మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరేందుకు ఆసక్తి చూపుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శోభ, లైన్స్ క్లబ్ సభ్యులు నర్సింగ్‌రావు, హేమంత్ రాజు, ప్రేరణ సభ్యులు ప్రవీణ్, పాల్గొన్నారు.

రాగిడి లక్ష్మారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా

బీఆర్ఎస్ మల్కాజిగిరి ఎంపీ టికెట్ రాగిడి లక్ష్మారెడ్డికి అధిష్టానం ప్రకటించడంతో ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మా రెడ్డి, కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆయనకు శుభా కాంక్షలు తెలిపారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. తనకు టికెట్ ప్రకటించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. రాగిడి లక్ష్మారెడ్డి గెలుపునకు కృషి చేస్తామని ఎమ్మెల్యే బండారి, కార్పొరేటర్ ప్రభుదాస్ తెలిపారు.

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలి : మంజుల



నవతెలంగాణ -అల్వాల్

ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని ఏఎంహెచ్‌వో డాక్టర్ మంజుల అన్నారు. శుక్రవారం పారిశుధ్య సిబ్బంది ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వచ్ఛత వైపు ఒక అడుగు' కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మన ఆరోగ్యం మన చేతులలో ఉందని, ప్రతి ఒక్కరూ స్వచ్ఛత పాటించాలని సూచించారు. బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేస్తే రూ.500 జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అనంతరం స్వచ్ఛ అల్వాల్‌కు సహకరించాలని భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చిత్తారి రాజు, ఎస్ఎఫ్ఏలు వెంకటేష్, పురుషోత్తం, విష్ణు, భాస్కర్, గణేష్, సతీష్, బాలు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన అవసరం

- ఏయూ డీన్ విజయ్ కుమార్



సందర్భంగా డిన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ .. యుక్త వయసు వారు సరైన అవగాహన లేకపోవడం తో ఈ

నవతెలంగాణ-ఘట్కేసర్

ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు అందరూ కృషి చేయాలని అనురాగ్ యూనివర్సిటీ డీన్ విజయ్ కుమార్ అన్నారు. మండలంలోని వెంకటాపూర్ గ్రామంలోని అనురాగ్ యూనివర్సిటీలో రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ సేవా పథకం ఆధ్వర్యంలో యూనివర్సిటీలో జాతీయ సేవా పథకం సంయుక్తంగా హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని అనురాగ్ యూనివర్సిటీ డీన్ స్కూల్ ఆఫ్ ఇంజినీరింగ్ డాక్టర్ వి.విజయ్ కుమార్, ఎన్ఎస్ఎస్-ఎల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ మల్లేష, రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహరావు, అసిస్టెంట్ డైరెక్టర్ యూత్ అఫైర్స్ టీసీఏసీఎస్ హైదరాబాద్ రమేష్, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్స్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించా రు. ఈ సందర్భంగా డిన్ విజయ్ కుమార్ మాట్లాడుతూ .. యుక్త వయసు వారు సరైన అవగాహన లేకపోవడం తో ఈ మహమ్మారి బారినపడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. ఎయిడ్స్ లాంటి వ్యాధుల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించడం చాలా అవసరం అని పేర్కొన్నారు. విద్యార్థులకు రాష్ట్ర కంట్రోల్ సొసైటీ తరఫున అడిషనల్ డైరెక్టర్ డాక్టర్ పి ప్రసాద్, కాకతీయ యూనివర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ నరసింహారావు లు తమ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించడం మంచి పరిణామన్నారు. ఈ సందర్భంగా పుట్టుకతోనే హెచ్ఐవీతో బాధపడుతున్న 24 ఏండ్ల యువతి ఈ సమాజంలో తాను బాధపడుతున్న బాధలు, అనుభవాల ను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా యూని వర్సిటీ లెవెల్ రెడ్ రిబ్బన్ క్లబ్ యాక్టివిటీస్ పోస్టర్ మేకింగ్ సాత్విక, ఎం. మానస, ఎలక్యూషన్ కాంపిటీషన్ విజేతలు చేతన, కుసుం, రెడిబన్ క్లబ్ స్టూడెంట్ బ్రాండ్ అంబాసిడర్స్ ఎం. సింధూ, డి. మనీషాలను అభినందిం చారు. ఈ కార్యక్రమంలో నాలుగు యూనిట్ల ప్రోగ్రామ్ ఆఫీసర్లు డాక్టర్ నవీన్, చిన్ని శ్రీనివాసరావు, మధుకర్, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

మోడీ పర్యటన అంటూ అక్రమ అరెస్టు

- దురుసుగా ప్రవర్తించిన పోలీసులపై చర్యలు తీసుకోవాలి
- ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర



నవతెలంగాణ-కాప్రా

హైదరాబాద్‌లో ప్రధాని నరేంద్ర మోడీ పర్యటన సందర్భంగా అఖిలభారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) ఆధ్వర్యంలో ఎలాంటి ధర్నా, ముట్టడి కార్యక్రమాలకు పిలుపు ఇవ్వకపోయినా నాచారం పోలీసులు అక్రమంగా అరెస్టులు చేస్తున్నారని ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర అన్నారు. శుక్రవారం నాచారం పోలీసులు ధర్మేంద్రను అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ.. నాచారం పోలీసులు దురుసు ప్రవర్తన, అసభ్య పదజాలంతో దూషిస్తూ ముందస్తు అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం అన్నారు. అరెస్ట్ చేయడానికి వచ్చిన కానిస్టేబుల్ జే. సుదర్శన్ అసభ్యంగా మాట్లాడటం బాధాకరమన్నారు. ఏఐవైఎఫ్ సంఘం ఎలాంటి ధర్నాలకు పిలుపు ఇవ్వలేదని చెప్పినా కానిస్టేబుల్ వినడలేదన్నారు. కమ్యూనిస్టులు రాజ్యాంగ సూత్రాలకు లోబడే ఉంటారని గుర్తించుకోవాలని హితవు పలికారు. పోలీసు ఉన్నతాధికారులు దూషించిన కానిస్టేబుల్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మోడీ పర్యటన అంటూ విచ్చలవిడిగా అక్రమ అరెస్టులు చేయడం రాజ్యాంగ హక్కుల ఉల్లంఘనేనని ధ్వజమెత్తారు. మోడీ నిరంకుశ విధానాలు దేశానికి నష్టమని, మూడోసారి ప్రధాని కావాలనే మోడీకి ప్రజలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

అక్రమ అరెస్టులు చేయడం హేయం : వీ.ఎస్. బోస్

మోడీ పర్యటన సందర్భంగా రాష్ట్రంలోని యువజన సంఘాల నాయకులను, ప్రజాస్వామిక వాదులను అక్రమ అరెస్టులు చేయడం దుర్మార్గమని వీఎస్‌బోస్ అన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ధర్మేంద్ర అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. కేంద్ర తెచ్చిన పౌరసత్వ సవరణ చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజలు సామరస్యంగా జీవిస్తున్న దేశంలో ఇలాంటి చట్టం తీసుకురావడం సరికాదన్నారు. బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ, లౌకిక విలువలకు తూట్లు పొడిచే వినాశకర చర్యలకు పూనుకుందని పేర్కొన్నారు. మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తున్న మోడీ లోక్‌సభ ఎన్నికలకు ముందు పౌరసత్వ (సవరణ) చట్టం-2019ను అమలు చేస్తున్నట్లు ప్రకటించడం నీచమైన చర్య అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాచారం డివిజన్ కార్యదర్శి కృపాకర్, ఏఐటీయూసీ కాప్రా మండల కార్యదర్శి మిరియాల సాయిలు పాల్గొన్నారు.

సినారే ప్రతి పాటా సాహిత్య పరంగా ప్రత్యేకత



- వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు

నవతెలంగాణ-కల్చరల్

మూడు వేల పైగా సినీ పాటలు రాసినా సినారే ప్రతి గీతం సాహిత్య పరంగా ప్రత్యేకత ఉన్నవని వంశీ సంస్థల అధినేత వంశీ రామరాజు అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదికపై సుశీల నారాయణరెడ్డి ట్రస్ట్ వంశీ కల్చరల్ అండ్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రఖ్యాత కవి డాక్టర్ సి నారాయణ రెడ్డి తొలి సినీ గీతం రచించి 65 ఏండ్లయిన సందర్భంగా ప్రముఖ గాయకులు మిత్రా వై.ఎస్.రామకష్ణ శశికళ గీతాంజలిలు నలభై పాటలను మధురంగా అలపించి పాటల పట్టాభిషేకం చేశారు. సినారే రచించిన తొలి పాట నన్ను దోచుకుందవాటేతో అరభించి ఎవరికీ తలవంచకు, చిత్రం భళారే విచిత్రం వంటి పాటలను వారు గానం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభా కార్యక్రమంలో నిర్వహకులు వంశీ రామరాజు, తిరుమల గ్రూప్ చైర్మెన్ నంగ నూరి చంద్ర శేఖర్ పాల్గొని మాట్లాడుతూ.. సినారే పాటలు నిత్య నూతనం అన్నారు. చంద్ర శేఖర్ గాయనీ గాయకులను అయోధ్య నుంచి తెప్పించిన శాలువాలతో సత్కరించి జ్ఞాపికలు బహుకరించారు. డాక్టర్ తెన్నేటి సుధ, సుంకరపల్లి శైలజ కార్యక్రమం పర్యవేక్షణ చేయగా సినారే కుమార్తెలు గంగ, యమున, కావేరి, కష్ణవేణి వారి భర్తలతో పాల్గొన్నారు. ప్రముఖ నటి శారద చెన్నై నుంచి సందేశం పంపుతూ సినారే తన సినిమాలకు సాహిత్య సంగీత పరమైన హిట్ పాటలు రాశారని గుర్తు చేశారు.

వడ్డెర కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలి

- సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిల మల్లు



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

వడ్డెర కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శివరాత్రి అయిలమల్లు డిమాండ్ చేశారు. తెలంగాణ వడ్డెర సంఘం అండ్ చారిటబుల్ ట్రస్ట్ రాష్ట్ర కోశాధికారి గండికోట కుమార్ అధ్యక్షతన మౌలాలిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. రాష్ట్రంలో 16 కులా లకు కార్పొరేషన్ ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డెరలను మరిచి పోయిందని విమర్శించారు. కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో వడ్డెర కులానికి కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని ఇచ్చిన హామీ విస్మరించారన్నారు. నేడు వడ్డెర కార్పొరేషన్ లేకపోవడంతో వడ్డెరలు ఆందోళన చెందుతున్నారన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం వడ్డెరలకు కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదన్నా రు. బీఆర్ఎస్ ప్రభుత్వంపై విసుగు చెందిన వడ్డెరులు కాంగ్రెస్‌ను గెలిపించారని పేర్కొన్నారు. కానీ వడ్డెరలను విస్మరించిందని తెలిపారు. ఇటీవల 16 కులాలకు కార్పొరేషన్ ఏర్పాటు చేసి, వడ్డెర కులాన్ని మర్చిపోవడం బాధాకరమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వడ్డెరలకు న్యాయం చేయాలని కోరా రు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు ఎత్తరి గణేష్, వరి కుప్పల వెంకటేష్, రాష్ట్ర వైస్ చైర్మెన్, దేవరాజ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు భిక్షం, వెంకటేష్, శ్రీశైలం, రాష్ట్ర కార్యదర్శులు తిరుపతి, మల్లేష్, శ్రీనివాస్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు సాయి కుమార్, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ రాజు, వెంకటరమణ, చెన్నయ్య, 33 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



నవతెలంగాణ-కాప్రా

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటుకు సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయం తీసుకో వడంతో రాష్ట్ర రెడ్డి జేఏసీ సంఘం సభ్యులు, ఉప్పల్ నియోజకవర్గ రెడ్డి నాయకులు హర్షం వ్యక్త చేశారు. జేఏసీ నేతలు పైళ్ల హరినాథ్‌రెడ్డి, తుమ్మల మధుకర్‌రెడ్డి ఆధ్వర్యంలో రాధిక రాజ బహదూర్ విగ్రహం వద్ద రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఉప్పల్ నియోజకవర్గ రెడ్డిలు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ఎనిమిదేండ్లుగా రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని వినతి పత్రా లు ఇచ్చినా గత ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. ఈ కార్పొరేషన్ ద్వారా పేద రెడ్లకు విద్య, ఉద్యోగ, ఉపాధి రంగాల్లో ఆర్థికంగా చేయూత ఇవ్వడానికి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో కందాడి సుదర్శన్ రెడ్డి, రాఘవరెడ్డి, అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పల్లెర్ల రాజిరెడ్డి, మధుసూదన్ రెడ్డి, కంచర్ల రవీందర్‌రెడ్డి, ఆనంద్ రెడ్డి, రామకృష్ణరెడ్డి, సురేందర్ రెడ్డి, తదితరులున్నారు.

సీఐటీయూ మల్కాజిగిరి కార్యదర్శి నర్సింగరావు అరెస్ట్

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

మల్కాజిగిరికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోడ్ షోకు వస్తున్న సందర్భంగా ముందస్తుగా మల్కాజిగిరి మండలం సీఐటీయూ కార్యదర్శి బంగారు నర్సింగరావును పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు.

నాయకుల ముందస్తు అరెస్ట్‌లను సీఐటీయూ, సీపీఐ(ఎం) మల్కాజి గిరి మండల కమిటీల నాయకులు తీవ్రంగా ఖండించారు.

రైతులు సేంద్రియ పంటలు పండించాలి

- రాజేంద్రనగర్ ఏడీఏ దివ్యజ్యోతి



నవతెలంగాణ-కీసర

రైతులు సేంద్రియ వ్యవసాయంతో పంటలు పండించాలని రాజేంద్రనగర్ ఏడీఏ దివ్యజ్యోతి తెలిపారు. శుక్రవారం యాద్గార్‌పల్లి గ్రామంలోని రైతు వేదిక రైతు శిక్షణ కేంద్రంలో రాజేంద్రనగర్ ఏడీఏ దివ్యజ్యోతి, ఆదిలక్ష్మి, ఏవో హిమబింధూ, ఏఈవో వందన రైతులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సేంద్రియ వ్యవసాయం చేయడం వలన పంటల దిగుబడితో పాటు రైతులు ఆర్థికంగా రాణిస్తారని పేర్కొన్నారు. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు ఎలా రాబట్టాలో రైతులకు వివరించారు. ఆవు పేడ సిలంద్ర నాశిని అని, ఆవు మూత్రంలో ఔషద గుణాలు ఉంటాయని, పంటలకు వాటినే ఎరువుగా వాడాలని వివరించారు. వర్మీ కంపోస్టు తయారి విధానాన్ని రైతులకు వివరించారు. పచ్చి రొట్టె ఎరువులు వేసుకోవడంతో భూసారాన్ని కాపాడవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈవో వందన, రైతులు కొండల్ రెడ్డి, జూపల్లి కృష్ణ, మచ్చ విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని మోడీ రోడ్ షోకు తరలిన నాయకులు



నవతెలంగాణ-అల్వాల్

అల్వాల్ పరిధిలోని మచ్చ బొల్లారం 133వ డివిజన్ మల్కాజిగిరి ఎక్స్ రోడ్డులో నిర్వహించిన మోడీ రోడ్డు షోలో పాల్గొనేందుకు బీజేపీ నాయకులు అజయ్‌రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పద్మిని, రాష్ట్ర ఎస్సీ మోర్చా సోషల్ మీడియా ఇన్‌చార్జి గోళ్ల ఆనంద్, మల్లికార్జున్ యాదవ్, నవీన్ ఆర్మీ, శ్రీనివాస్, నీకేష్ ఝా, అనురాధతో పాటు పలువురు వెళ్లారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ప్రవీణ్ గౌడ్



నవతెలంగాణ-శామీర్‌పేట

తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన వెంకట గోపాల్‌ను శుక్రవారం మున్సిపల్ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ యువ నాయకులు ప్రవీణ్‌గౌడ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.



ఓల్డ్ అల్వాల్‌లోని బాలికల ఉన్నత పాఠశాల ఉపాధ్యాయురాలు అపర్ణ దేవి శుక్రవారం పదవీ విరమణ చేశారు. గణిత శాస్త్ర అధ్యాపకురాలిగా ఎన్నో సేవలందించిన ఆమెను ప్రధానోపాధ్యాయురాలు సంధ్యారాణి తోటి ఉపాధ్యాయులు, బాలికలు ఘనంగా సత్కరించారు.
-నవతెలంగాణ-అల్వాల్

కవిత అరెస్టు రాజకీయ కోణం



నవతెలంగాణ-హాయత్ నగర్

ఎమ్మెల్సీ కవిత అరెస్ట్ రాజకీయ కోణంలో జరిగిన ఘటన అని మన్సూరాబాద్ టీఆర్ఎస్ మహిళ అధ్యక్షురాలు కొసనం ధనలక్ష్మి వెంకట్ రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మనీ లాండరింగ్ కేసులో ఈడీ ఎలాంటి అరెస్ట్ వారెంట్ లేకుండా కవితను అరెస్ట్ చేయడం బీజేపీ హస్తం ఉందని ఇది పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీజేపీ ఆడిన నాటకమన్నారు. సుప్రీంకోర్టు తీర్పును ధిక్కరించిన ఈడీపై న్యాయపరంగా పోరాటం చేస్తామన్నారు. తెలంగాణ ప్రజలు ఇది గమనించాలని వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎల్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు.

సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం



నవతెలంగాణ,బడంగ్‌పేట్

రాష్ట్ర ప్రభుత్వం పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుపై చేనేత విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుమల రేవంత్ రెడ్డి చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ చేనేత విభాగం అధ్యక్షులు గూడూరు శ్రీనివాస్, మచ్చ వరలక్ష్మి మాజీ గ్రేటర్ హైదరాబాద్ మహిళా కాంగ్రెస్ చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి అంకం శ్రీనివాసులు ఆదేశం మేరకు ఈ కార్యక్రమం నిర్వహించటం జరిగిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలో పేద బడుగు బలహీన వర్గాల ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంక్షేమ సంఘం నాయకులు ఎలే నరేంద్ర నేత గ్రేటర్ హైదరాబాద్ వివర్ సెల్ ప్రెసిడెంట్, బోగ జగదీష్ నేత స్టేట్ జనరల్ సెక్రటరీ, పేర్ల పుర్షోతం నేత, గుర్రం శ్రీనివాస్ నేత భువనగిరి డిస్ట్రిక్ ప్రెసిడెంట్, బలే ప్రవీణ్ నేత సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కర్నాటి లింగాయ నేత రంగారెడ్డి జిల్లా ఉప-అధ్యక్షులు, బొడ్డు శివకుమార్ నేత, కొనంపేట నర్సింగ్ రావు నేత, వంశీనేత తదితరులు పాల్గొన్నారు.



అంధులకు రేషన్ కిట్ల పంపిణీ



నవతెలంగాణ-ధూల్‌పేట్

రంజాన్ మాసం సందర్భంగా ఐడియస్ స్కూల్ ఫర్ డిజేబుల్డ్ (ఐఎస్‌డీ) ఆధ్వర్యంలో అంధులకు రేషన్ కిట్లను పంపిణీచేశారు. ఏటా రంజాన్ నెలలో మూగ, చెవిటి, అంధులకు ఇఫ్తార్ విందు ఇస్తున్నామని ఐఎస్‌డీ సెక్రటరీ నవీదుర్రహ్మాన్ అన్నారు. ఉపవాసాలు పాటించే అంధులు ఎలాంటి చీకూ చింత లేకుండా ఇఫ్తార్ చేసుకునేందుకు నెలరోజులకు సరిపడా రేషన్ పంపిణీ చేశామని పేర్కొన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో ఇస్లామిక్ సోషల్ సర్వీస్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ అబ్దుల్ ఖాదిర్, నాసిర్ చేతులమీదుగా జరిగింది.

జంగంమేట్ యూపీహెచ్‌సీలో సమస్యలను పరిష్కారించాలి

- డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్



నవతెలంగాణ-ధూల్‌పేట్

జంగంమేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్సీ)లో సమస్యలను పరిష్కారించాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. డీవైఎఫ్ఐ, ఐద్వా మహిళ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ హాస్పిటల్ సమస్యల పై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జంగంమేట్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ (యూపీహెచ్సీ)లో రోజురోజుకి పేషెంట్లు సంఖ్య పెరుగుతుందన్నారు. నిత్యం వైద్య సేవలందిస్తూ, మంచి ఆదరణ పొందుతున్న యూపీహెచ్సీ ఆస్పత్రిలో సమస్యలు పరిష్కరించకపోవడం పై ప్రశ్నించారు. 350మంది వరకు వస్తు వైద్య సేవలు పొందుతున్న రోగులు, సిబ్బంది కనీస సౌకర్యాలు త్రాగునీరు కల్పించకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. స్థానిక ప్రజల నాణ్యమైన వైద్యం కోసం న్యూ టెక్నాలజీ ఈక్విప్మెంట్స్ అందించాలన్నారు. వాటితో పాటూ జనరల్ వార్డు జనరల్ ఫిజీషియన్ డాక్టర్ ఏర్పాటు చేయాలని ప్రభుత్వాధికారులకు దృష్టికి తీసుకెళ్తామని తెలియజేశారు. మంచి నాణ్యమైన వైద్యం కోసం డీవైఎఫ్ఐ మహిళా సంఘం ప్రయత్నం చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ మహిళా సంఘం నాయకులు జిల్లా కార్యదర్శి శశికళ, డీవైఎఫ్ఐ నాయకులు శ్రీను, రాజేష్ మురారి న్యూస్ప్ తదితరులు పాల్గొన్నారు.

'టీ-సేవ కేంద్రాల ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం'

నవతెలంగాణ-హిమాయత్ నగర్

టీ-సేవ ఆన్ లైన్ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని స్వయం ఉపాధి పొందేందుకై అర్హత ఆసక్తి గల అభ్యర్థుల నుండి తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆన్ లైన్ లో దరఖాస్తులు కోరడం జరుగుతుందని డైరెక్టర్ అడపా వెంకటరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. టీ-సేవ ఆన్ లైన్ ద్వారా వివిధ బిల్లుల చెల్లింపులు, పాన్ కార్డు సేవలు, బస్సు, ట్రైన్, విమానాల టికెట్స్ బుకింగ్స్, ఆల్ బ్యాంకు మనీ ట్రాన్స్‌ఫార్లు, ఆధార్ ఆధారిత పేమెంట్ సిస్టం, వినియోగదారులకు మైక్రో ఏటిఎం సేవలు అందించడం, వివిధ టెలికాం పోస్ట్ పేయిడ్, ప్రీ పేయిడ్ రిఛార్జెస్, డేటా కార్డ్స్, ల్యాండ్ లైన్ బిల్ ప్రెమెంట్స్, డిటిహెచ్, కాష్ డిపోసిట్స్, హెల్త్ ఇన్సూరెన్స్ సర్వీసెస్ తో పాటు బైక్, కార్ ఇన్సూరెన్స్, స్కిల్ డెవలప్మెంట్ అడ్మిషన్స్ మొదలగు ఆన్ లైన్ సేవలను వినియోగదారులకు అందించడం ద్వారా అభ్యర్థులు స్వయం ఉపాధిని పొందవచ్చునని ఆయన తెలిపారు. ఎంపిక చేసిన అభ్యర్థులకు వివిధ సర్వీసెస్ కు సంబంధించి ఆన్‌లైన్ ట్రైనింగ్ తో పాటు, కేంద్ర ప్రభుత్వ కంప్యూటర్ ఆపరేటర్ సర్టిఫికెట్, బిజినెస్ చేసుకోవడానికి లాగిన్ అండ్ సర్వీసెస్ ట్రైనింగ్ అందిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ క్రింద తెలిపిన వెబ్ సైట్ లో ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, ఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ సైట్ www.tsevacentre.com ఆన్‌లైన్‌లో దరఖాస్తు లు స్వీకరించుటకు చివరి తేది ఈ నెల 31 వరకు సమయం ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు దరఖాస్తుల కొరకు ఫోన్ నంబర్: 8179955744ను సంప్రదించగలరని ఆయన కోరారు.



విజయవాడ కనకదుర్గ అమ్మవారిని దర్శించుకున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ దంపతులు, మీడియా ఇన్‌చార్జ్ ముచ్చకుర్తి ప్రభాకర్, శంకర్ ముదిరాజ్, శ్రీధర్ చారి, కరికె కిరణ్, చంద్రశేఖర్, తదితరులు

నవతెలంగాణ-ముషీరాబాద్

టీజీ..క్రేజీ

- తొలిరోజే రికార్డు స్థాయి ఆదాయం
- రాష్ట్రవ్యాప్తంగా 1475 కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్
- మొత్తం 2.5కోట్లకుపైగా ఆదాయం
- టీజీ 09 0001కు..9.61లక్షల పలికిన ధర
- రాష్ట్రంలో 'టీజీ'తో మొదలైన వాహన రిజిస్ట్రేషన్లు





నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రవ్యాప్తంగా టీజీ పేరుతో వాహన రిజిస్ట్రేషన్లు మొదలయ్యాయి. దీంతో శుక్రవారం టీజీ సిరీస్‌కు సంబంధించిన నెంబర్ ప్లేట్‌ను ఖైరతాబాద్ ఆర్టీఏ ఆఫీస్‌లో రవాణాశాఖ కమిషనర్ జ్యోతి బుద్ధప్రకాష్, ఆ శాఖ ఉన్నతాధికారులతో కలిసి లాంఛనంగా ప్రారంభించారు. టీఎస్ నుంచి టీజీ పేరుతో మారడంతో వాహనాలకు రిజిస్ట్రేషన్ చేసుకునేందుకు ప్రజలు ఎంతో ఆసక్తి చూపించారు. అందులో టీజీ ప్రారంభ సిరీస్ కోసం వాహనదారులు పెద్ద సంఖ్యలో పోటీపడ్డారు. తొలిరోజు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా 1475 వాహనాలు రిజిస్టర్ అవ్వగా.. రవాణాశాఖకు రికార్డు స్థాయి ఆదాయం లభించింది. కేవలం ఒక్కరోజులోనే 1475 వాహనాలకు సాధారణ, ప్రత్యేక నంబర్లు కేటాయింపు ద్వారా రవాణాశాఖకు 2.5కోట్లకుపైగా ఆదాయం సమకూరింది. అలాగే ఖైరతాబాద్ ఆర్టీఏ పరిధిలోనూ కేవలం ఒక్కరోజే సాధారణ, ప్రత్యేక నెంబర్ల కేటాయింపు ద్వారా రూ.30.49 లక్షల ఆదాయం లభించడం విశేషం.

ఇదిలావుంటే రాష్ట్రంలోని 54 ఆర్టీఏ కార్యాలయాల్లో ప్రతీరోజు 3వేలకుపైగా వాహనాలు నమోదవుతుండగా.. గ్రేటర్ పరిధిలోని ఖైరతాబాద్, సికింద్రాబాద్, మెహదీపట్నం, మలక్‌పేట్, బండ్లగూడ, మేడ్చల్, కూకట్‌పల్లి, ఉప్పల్, ఇబ్రహీంపట్నం, అత్తాపూర్ ఆఫీసుల్లో ఒకరోజుకి 1500లకుపైగా కొత్త వాహనాలు రిజిస్టర్ అవుతున్నాయి. వీటిలో వెయ్యికిపైగా టూవీలర్లు ఉంటుండగా.. మిగతావి కార్లు, ఇతర రవాణా వాహనాలు ఉన్నాయి. అయితే షోరూమ్‌లలో డీలర్ల వద్ద తాత్కాలిక నెంబర్లపై రిజిస్ట్రేషన్... అనంతరం పర్మినెంట్ రిజిస్ట్రేషన్ల కోసం ఆర్టీఏ కార్యాలయాలకు వస్తారు. ఈ నేపథ్యంలో రవాణాశాఖ ప్రతి మూడు నెలలకు ఒకసారి విడుదల చేసే పదివేల నంబర్లపైన వాహనాలను రిజిస్ట్రేషన్ చేస్తుంది. ప్రతి ఆర్టీవో ఆఫీసుల్లో ఏ రోజురోజుకూ నమోదయ్యే వాహనాల సంఖ్యకు అను గుణంగా ఈ నెంబర్లను విడుదల చేస్తుంటారు. ప్రతీరోజు విడుదల చేసేవాటిలోనే వాహనదారులు తమకు నచ్చిన ఫ్యాన్సీ నంబర్ల కోసం ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పాల్గొని.. కావాల్సిన నంబర్‌ను పొందవచ్చు. ఉదాహరణకు 0001 నుంచి 2,5,7,9 0099, 9999, 999, 1234, 6666 వంటి ఫ్యాన్సీ నంబర్ల కోసం వాహనదారులు రూ.లక్షల్లో చెల్లించి నంబర్లు దక్కించుకోవడం విశేషం.

కాగా 'టీఎస్'కు బదులు టీజీ పేరుతో రాష్ట్రవ్యాప్తంగా కొత్త సిరీస్ ప్రారంభమైన నేపథ్యంలో వాహనదారులు టీజీ నెంబర్ల కోసం పోటీపడ్డారు. ఫలితంగా ప్రత్యేక నంబర్లకు ఫుల్ డిమాండ్ కనిపించింది. శుక్రవారం రాష్ట్రంలోని అన్ని ఆర్టీవో ఆఫీసుల్లో ప్రత్యేక నెంబర్ల కోసం పలువురు వాహనదారులు ఆన్‌లైన్ బిడ్డింగ్‌లో పోటీపడ్డారు. దీంతో తొలిరోజు 1475 వాహనాలకు సాధారణ, ఫ్యాన్సీ నెంబర్ల కేటాయింపుతో రవాణాశాఖకు రూ. 2.5కోట్లకుపైగా ఆదాయం వచ్చింది. ఇదిలా వుంటే ఖైరతాబాద్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్ లో టీజీ09 0001 నంబర్‌కు అనుహ్యమైన పోటీ కనిపించింది. రుద్రరాజు రజీవ్ కుమార్ అనే వ్యక్తి ఈ నెంబర్ కోసం ఏకంగా 9,61,111 చెల్లించి సొంతం చేసుకున్నారు. గత జనవరిలో టీఎస్ సిరీస్‌లో నిర్వహించిన ఈ వేలంలో 0001కు కేవలం 6లక్షలకుపైగా ధర పలికిన విషయం తెలిసిందే. ఇదిలావుంటే భవ్య సింధు ఇన్‌ఫ్రా ప్రాజెక్ట్సు ప్రయివేట్ లిమిటెడ్ తమ విలువైన కారు కోసం రూ. 2.30లక్షలు చెల్లించి టీజీ09 0909 నెంబర్‌ను దక్కించు కుంది. శాన్విత రెడ్డి అలేటి తమ విలువైన కారు కోసం రూ.2.21 లక్షలు వెచ్చించి టీజీ09 0005 నెంబర్‌ను దక్కించుకున్నారు. టీజీ09 0002 నంబర్ కోసం ఎం. దుష్యంత రెడ్డి 1.22లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నారు. టీజీ09 0369 నెంబర్ కోసం సాటోరి డిజైన్స్ అనే సంస్థ రూ. 1.20లక్షలు వెచ్చించింది. టీజీ09 0007 నెంబర్ కోసం ఎస్‌హెచ్ హరినాథ్ రెడ్డి రూ.1,07లక్షలు చెల్లించారు. శుక్రవారం నిర్వహించిన టీజీ ప్రత్యేక నెంబర్ల ఈ వేలం ద్వారా ఖైరతాబాద్ ఆర్టీఏకు ఒక్కరోజే రూ. 30,49,589 ఆదాయం సమకూరినట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(జేటీసీ) సి. రమేష్ తెలిపారు. అలాగే తిరుమలగిరి (8.52లక్షలు), బండ్లగూడ (3.33లక్షలు), మెహిదీపట్నం(5.38లక్షలు) ఆర్టీవో కార్యాలయ పరిధిలో నిర్వహించిన ఆన్‌లైన్ బిడ్డింగ్‌కు అనూహ్య స్పందన లభించిందని జేటీసీ తెలిపారు.

జీవశాస్త్రంపై విద్యాభ్యాసంతో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

జీవశాస్త్రంపై విద్యాభ్యాసంతో మహిళలకు ఉజ్వల భవిష్యత్తు ఉందని కేంద్ర ప్రభుత్వ డిపార్టుమెంట్ ఆఫ్ బయోటెక్నాలజీ మాజీ సలహాదారులు, మాజీ సైంటిస్ట్ డాక్టర్ మీనాక్షి మున్షీ అన్నారు. శుక్రవారం తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం డిపార్ట్మెంట్ ఆఫ్ జెనెటిక్స్ అండ్ బయోటెక్నాలజీ, బయోక్లూస్ ఆర్గనైజేషన్ సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఉమెన్ ఇన్ బయోలాజీ అనే అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె టీఎంవీ ఇన్‌చార్జి వీసీ ప్రొఫెసర్ ఎం విజ్జులత, టీఎంవీ స్పెషల్ ఆఫీసర్ ప్రొఫెసర్ సరస్వతమ్మ, సదస్సు కన్వీనర్ డాక్టర్ రూపశ్రీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ మంజరి, డాక్టర్ జ్యోతి లతో కలిసి జ్యోతి ప్రజ్వలనతో సదస్సును ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. డిపార్టుమెంట్ ఆఫ్ బయో టెక్నాలజీ ద్వారా మహిళలు జీవశాస్త్రంలో రాణించేలా ఎన్నో కార్యక్రమాలను నిర్వహించడం జరిగిందన్నారు. జీవశాస్త్రంలోని మెళకువలను తెలుసుకొని మహిళలు బయోటెక్నాలజీ ఏ విధంగా ఉపయోగపడుతుంది అనే అంశాలపై క్లుప్తంగా వివరించారు. టీఎంవీ ఇంచార్జి వీసీ ప్రొఫెసర్ ఎం.విజ్జులత మాట్లాడుతూ తెలంగాణ మహిళా విశ్వ విద్యాలయం ఏర్పడిన అనంతరం మొట్టమొదటి సారి మహిళల కోసం ప్రత్యేక సదస్సును నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ సదస్సు ద్వారా విద్యార్థినులు జీవశాస్త్రంలోని మెళకువలను తెలుసుకునేందుకు దోహదం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థినులతో పాటు జాతీయ స్థాయిలోని వివిధ విద్యా సంస్థలకు చెందిన ప్రముఖులు పాల్గొన్నారు.

తలసేమియా వ్యాధి బాధితులకు యువత అండగా ఉండాలి

- సన్ సీడ్ హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ అన్వేష్

నవతెలంగాణ-ముషీరాబాద్

తల సేమియా వ్యాధి బాధితులకు యువత అండగా ఉండాలని సన్ సీడ్ హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ అన్వేష్ అన్నారు. ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో భగత్‌సింగ్ యువజన ఉత్సవాల సందర్భంగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సన్ సీడ్ హాస్పిటల్ చైర్మెన్ డాక్టర్ అన్వేష్ హాజరై మాట్లాడుతూ ఎస్ఎఫ్ఐ డీవైఎఫ్ఐ కమిటీ ఆధ్వర్యంలో తలసేమియా బాధితులకు, రక్తదాన శిబిరం నిర్వహించడం అభినందనీయమన్నారు. విద్యార్థులు యువత పోరాటాలు కాకుండా ఇలాంటి సామాజిక కార్యక్రమాలు చేయడం చాలా సంతోషకరమైన విషయమని పేర్కొన్నారు. సమాజంలో రక్తదానం చేయడంలో యువత, విద్యార్థులు, ప్రజలకూ అవగాహన లేకపోవడం వల్ల రక్త దానం చేయడంలో ముందుకు రావడం లేద న్నారు. రక్తం కొరతతో ప్రతిరోజు చాలామంది చనిపోతున్నారని.. ఇటు వంటి వారికి రక్తం అందించడంలో ప్రతీ ఒక్కరి పాత్ర ఉండాలని సూచిం చారు. వేసవి సమయంలో కూడా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసిన విద్యార్థి యువజన కమిటీలకు ధన్యవాదాలు అన్నారు. ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, డివైఎఫ్ఎఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ మాట్లా డుతూ డీవైఎఫ్ఐ ఎస్ఎఫ్ఐ భగత్ సింగ్ 98వ వర్ధంతి సందర్భంగా భగత్ సింగ్ స్మారక యువజన ఉత్సవాల సందర్భంగా క్రీడోత్సవాలు, రక్తదాన శిబిరాలు, సేవా కార్యక్రమాలు ఆనందనీయమన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వరుణ్ రాజ్ కంటెస్టెడ్ ఎమ్మెల్యే సనత్ నగర్, మాజీ నాయకులు మహేందర్ ఆర్ వెంకటేష్, ఐపీయం బ్లడ్ బ్యాంక్ వైద్యులు మాధవి, సూర్య కుమార్. ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు లెనిన్,అశోక్ రెడ్డి , అశ్మీ బాబు ఎండి జావిద్, నాయకులు అనిల్ ,శ్రీనివాస్ నాగేందర్, ప్రశాంత్ స్టాలిన్, శ్రీమాన్,అభిమన్యు అజయ్, ప్రశాంత్ ,విగ్నేష్ ,రాజేష్ వంశీ చరణ్ శ్రీ, సంధ్య,రాజు, శివ శ్రీరామ్, శివ గణేష్ ,శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉస్మానియా ఆస్పత్రిలో కంటి ఆపరేషన్లు షురూ



నవతెలంగాణ- ధూల్‌పేట్

ఉస్మానియా ఆస్పత్రిలో కంటి ఆపరే షన్లు పునః ప్రారంభం చేశామని ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. ఆస్పత్రిలో పునరుద్ధరించిన నేత్ర వైద్య ఆపరేషన్ థియేటర్‌ను శుక్రవారం ఆయన దాత పరేఖ్, పునరుద్ధరణ పనులను విరాళంగా అందించిన రోగి సహాయ ట్రస్ట్ ట్రస్టీలతో కలిసి ప్రారంభించారు.

ఈ ఆఫ్తాల్మాలజీ ఆపరేషన్ థియేటర్ ప్రారంభోత్సవంలో అడిషనల్ సూపరింటెండెంట్ డాక్టర్ బి.త్రివేణి, ఆర్ఎంఓలు, ఇతర సిబ్బందితో పాటు డిపార్ట్‌మెంట్ ఫ్యాకల్టీ, నేత్రవైద్య విభాగం ప్రొఫెసర్ డాక్టర్ అతుల్ గుప్తా, ఇతర సిబ్బంది ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో నేత్ర చికిత్సలతో పాటు ఆపరేషన్ సేవలను రోగులు ఇక్కడ పొందవచ్చని తెలిపారు. చికిత్సలు పొందే రోగులు ఇక్కడ నుండి సరోజినీ, ఇతర ఆసుపత్రులకు వెళ్లేందుకు రోగులు ఇబ్బందులకు గురికావడంతో ఈ సేవలను అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. రోగులు ఇబ్బందులకు గురి కాకుండా మెరుగైన వైద్య సేవలు కల్పిస్తు న్నామన్నారు. థియేటర్‌కు సహకరించిన కరుణామయ విరాళానికి కృతజ్ఞతలు తెలిపారు. పరేఖ్ రోగి సహాయత్తా ట్రస్ట్‌కు ధన్యవాదాలు తెలిపారు.

మార్చి 22 నుంచి ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె బాట



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

నేషనల్ హెల్త్ మిషన్ స్కీమ్ (ఎన్‌హెచ్‌ఎం)లో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ (ఏఐటీయుసీ) ఆధ్వర్యంలో శుక్రవారం కోఠిలోని కుటుంబ సంక్షేమ శాఖ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఎన్.హెచ్.ఎం.రాష్ట్ర అధ్యక్షుడు ఎం. నరసింహ మాట్లాడుతూ.. రాష్ట్రంలో అనేక విపత్కర పరిస్థితుల్లో విధులు నిర్వహించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతున్న కిందిస్థాయి ఉద్యోగులు అయినటువంటి ఎన్‌హెచ్‌ఎం కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు మూడు నెలల వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా మాట్లాడుతూ.. కార్మికులకు రావాల్సిన 7 నెలల పీఆర్‌సీ ఏరియర్స్ వెంటనే విడుదల చేయాలన్నారు. ప్రతి నెల 1న కాంట్రాక్టు ఉద్యోగులందరికీ జీతాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు మార్చి 22 నుండి తెలంగాణలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నో వర్క్ నో పే కార్యక్రమము నిర్వహించనున్నట్లు తెలియజేశారు. సమ్మె నోటీసు ఇచ్చామన్నారు. గతంలో విడుదల చేసినటువంటి 510, 730 జీవోలలో కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని రాబోయే పీఆర్‌సీలో కాంట్రాక్టు ఉద్యోగులకు రెగ్యులర్ ఉద్యోగుల బేసిక్ వేతనం అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డైరెక్టర్ ఆఫీసు లో సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేయటం జరిగింది. ఈ కార్యక్రమంలో యూనియన్ సెకండ్ ఏ. ఎన్.ఎం.లు యూనియన్ రాష్ట్ర ట్రెజరర్ జై పద్మ, రాష్ట్ర నాయకులు జయమ్మ , సునీత, స్వాతి , ఎన్. హెచ్.ఎం. ఆల్ క్యాడర్స్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ సుమన్, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

దేశ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించిన మాన్యవర్ కాన్షీరాం

- మాన్యవర్ కాన్షీరాం 91వ జయంతి ఉత్సవాలలో వక్తలు



నవతెలంగాణ-ముషీరాబాద్

భారతదేశ రాజకీయాలలో ప్రకంపనలు సృష్టించిన బహుజన మేధావి, బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు మాన్యవర్ కానీరాం అని రిటైర్డు ఐఆర్ఎస్, సౌత్ సెంట్రల్ రైల్వే అప్పికట్ల భరతభూషణ్, రిటైర్డు సీఆర్ఎస్, సౌత్ సెంట్రల్ రైల్వే దార్ల పోతురాజు అన్నారు. బంధు సొసైటీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు పల్లెల వీరస్వామి అధ్యక్షతన మాన్యవర్ కాన్షీరాం 91వ జయంతి ఉత్సవాలలో మాన్యవర్ కాన్షీరాం 91వ జయంతి ఉత్సవాలు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ ఉత్సవాలలో రిటైర్డు ఐఆర్ఎస్, సౌత్ సెంట్రల్ రైల్వే అప్పికట్ల భరత భూషణ్, రిటైర్డు సీఆర్ఎస్, సౌత్‌సెంట్రల్ రైల్వే దార్ల పోతురాజు హాజరై మాట్లాడుతూ భారత సమాజం లోని నిచ్చెన మెట్లకుల వ్యవస్థలో పేద, బడుగు బలహీన వర్గాల ప్రజలను ఐక్యము చేసి నేటికి అసెంబ్లీ, పార్లమెంటులో అడుగుపెట్టని కులాలను అసెంబ్లీ, పార్లమెంటు లోనికి, ఎమ్మెల్యే, ఎంపిలుగా పంపిన రాజకీయ దురంధరుడు మాన్యవర్ కాన్షీరాం అని కొనియాడారు. 'కుల నిర్మూలన కోసం, జాతి చోడో, సమాజ్ జోడో,' అని నినదించిన గొప్ప వ్యక్తి అన్నారు. భారతదేశంలో విఫలమైన బహుజన రాజకీయాలను తనదైన పద్ధతిలో అధ్యయన ము చేసి, రిజర్వేషన్ల లబ్దిదారుల నుండి "సమయము-ప్రతిభ-ట్రెజరి" నుంచి సేకరించి నూతన సామాజిక రాజకీయ సిద్ధాంత కర్త కాన్షీరాం అన్నారు. ఈ సమావే శంలో పల్లెల వీరాస్వామి, ఎర్ర దేవదానం, జనరల్ సెక్ర టరి, జి. హంస రాజు, ఆర్గనైజింగ్ సెక్రటరి, ఎస్. నర్సిం గ రావు, ఎం. నర్సింగరావు, ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ కాన్ఫడరేషన్ అధ్యక్షులు వాసపాక నర్సింహ, బహుజన రాజ్యాధికార సమితి అధ్యక్షులు డా. నథాని యల్, ప్రొఫె సర్, ఉస్మానియా యూనివర్సిటి, గుండెడపు కనకయ్య, ప్రొఫెసర్, తెలంగాణ యూనివర్సిటి, పవన్ కుమార్, బంధు సేవా మండలి, నగర కార్యదర్శి నర్సింగరావు, వ్యక్తులు పాల్గొన్నారు.

నందకిషోర్ వ్యాస్ రాజీనామాతో బీఆర్ఎస్‌కు నష్టం లేదు

- బీఆర్ఎస్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్

నవతెలంగాణ-సుల్తాన్ బజార్



గోషామహల్ నియోజకవర్గం నుండి బీఆర్ఎస్ అభ్యర్థిగా గత అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైన నందకిషోర్ వ్యాస్ తమ పార్టీకి రాజీనామా చేయడం విచారక రమని ఆయన పార్టీని వీడడం వలన పార్టీకి జరిగే నష్టం ఏమిలేదని బీఆర్ఎస్ పార్టీ గోషామహల్ సీనియర్ నాయకులు ఆశిష్ కుమార్ యాదవ్ తెలిపారు. శుక్రవారం అబిడ్స్‌లోని ఆయన కార్యాల యంలో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా కల్వకుంట్ల చంద్రశేఖరరావు పది సంవత్సరాల పాటు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు గోషామహల్ నియోజకవర్గంలోని ప్రజలకు అవసర మైన అన్ని పథకాలను లబ్ధిధారులకు అందేలా ప్రత్యేక చర్యలు తీసుకు న్నామన్నారు. నందు బిలాల్ పార్టీ రాజీనామా పై కార్యకర్తలు నాయకులు ఎవరు ఆధైర్యపడల్సిన అవసరం లేదన్నారు. పార్టీ నాయకులకు, కార్యకర్తలకు ఎలాంటి సమస్యలు ఉన్న తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు.

కాంగ్రెస్‌లోకి బీఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్..

- బీఆర్ఎస్‌కు రాజీనామా లేఖ..



నవతెలంగాణ-ధూల్‌పేట్

గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ బిలాల్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకోనున్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు స్థానిక నాయకులతో కలిసి మైనంపల్లి హనుమంతు రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులను కలిసి మాట్లాడినట్లు పార్టీ శ్రేణులు పేర్కొంటున్నారు. బీఆర్ఎస్ పార్టీకి తన రాజీనామా లేఖను కేటీఆర్‌కి, తెలంగాణ భవన్‌కి ఫ్యాక్స్ లో పంపించారని సమాచారం. త్వరలో గాంధీభవన్‌లో తెలంగాణ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జీ దీపాదాస్ మున్షీ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకోనున్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బడుగు బలహీన వర్గాల అభ్యున్న తికి చేస్తున్న కృషికి ఆకర్షితుడినై తాను కాంగ్రెస్‌లో చేరుతున్నానని మీడియా అడగడంతో వ్యాస్ తెలిపారు. గోషామహల్ నియోజకవ ర్గంలో కాంగ్రెస్ కు పూర్వ వైభవం తెచ్చేందుకు కృషి చేస్తానన్నారు.

మెట్రో రైలు ప్రాజెక్ట్‌ను సందర్శించిన రజనీకాంత్




నవతెలంగాణ-సిటీబ్యూరో

ప్రముఖ నటుడు రజనీకాంత్ బుధవారం ఉప్పల్‌లోని ఎల్ అండ్ టీ మెట్రో రైలు లిమిటెడ్ ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)ను సందర్శించారు. ఈ సందర్భంగా ఎల్ అండ్ టీ మెట్రో రైల్ (హైదరాబాద్) లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో కేవీబీ రెడ్డి, ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారులు రజనీకాంత్‌కు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆపరేషన్స్ కంట్రోల్ సెంటర్ (ఓసీసీ)ను రజనీకాంత్ ప్రశంసించారు. రజనీకాంత్ తమ సంస్థను సందర్శించడం పట్ల కేవీబీ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఆయన సందర్శనను తమ చరిత్రలో ఒక ముఖ్యమైన మైలురాయిగా అభివర్ణించారు.

నేడు మహతి సూరి కూచిపూడి నాట్య రంగ ప్రవేశం

నవతెలంగాణ-కల్చరల్

ఈ నెల 16 న(నేడు) రవీంద్ర భారతి ప్రధాన వేదిక పై ప్రముఖ నాట్య గురువు నిహంత్రి రెడ్డి శిష్యురాలు మహతి సూరి కూచిపూడి నాట్య రంగ ప్రవేశం ఉంటుందని నిర్వాహకులు కృష్ణానానంద్ ఫణి రాజ్య శ్రీ తెలిపారు. మహతి చిన్న వయస్సు నుంచి నాట్య కళ ను అభ్యసిస్తే దేశం లో వివిధ వేదిక లపై ప్రదర్శనలు ఇచ్చి ప్రముఖుల ప్రశంసలు అందుకుంది. ఆర్ట్స్ ఆఫ్ లివింగ్ నిర్వహణలో జరిగిన అంతర్జాతీయ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఫెస్టివల్ లో నృత్య భూషణ్ అవార్డ్ అందుకొన్న మహతి తిరుమల లో నాద నీరాజనం వేదిక పై ప్రదర్శన ఇచ్చారు. ప్రస్తుతం వైద్య విద్య గాంధీ మెడికల్ కాలేజీలో చదువుతూ నాట్య కళ కొనసాగిస్తున్నారు. వీణ లోనూ కీ బోర్డ్ లోనూ శిక్షణ పొందుతున్నారు.



అకౌంట్ల నుంచి డబ్బులు మాయం

- యోనో ఆఫర్ పేరుతో మెసేజీలు ఫార్వర్డ్ చేస్తూ మోసం
- పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితులు

నవతెలంగాణ-తలకొండపల్లి

సైబర్ నేరగాల బారి నుంచి ప్రజలను అప్రమత్తం చేయడానికి ప్రభుత్వాలు ఎన్ని చర్యలు చేపట్టినా కొంతమంది మొబైల్ నెంబర్లను హ్యాక్ చేసి ఈజీగా డబ్బులు సంపాదిస్తున్నారు. తాజాగా వాట్సప్ గ్రూపులో ఎస్‌బీఐ యోనో ఆఫర్ గెట్ రివార్డ్ నౌ, స్టేట్ బ్యాంక్ రివార్డ్ అనే యాప్ పేరుతో మొబైల్ ఫోన్‌లలో మెసేజ్‌లు ఫార్వర్డ్ చేస్తూ కేటుగాళ్లు డబ్బులను కాజేస్తున్నారు.తలకొండపల్లి మండలంలోని జంగారెడ్డిపల్లి గ్రామానికి చెందిన మీసాల ఈశ్వర్ అనే యువకుడికి చెందిన బ్యాంకు అకౌంట్ నుంచి రూ.11వేలు, చౌదర్‌పల్లి గ్రామానికి చెందిన కా లే శ్రీశైలం తండ్రి రాములు అకౌంట్ నుంచి రూ. 17,135 వేల నగదు కేటుగాళ్లు కాజేసి నట్టు బాధితులు తెలిపారు. లింకు ఓపెన్ చేసిన తర్వాత అర్ధ గంటకు వాట్సప్ గ్రూప్ మొత్తం హ్యాక్ అయ్యి డబ్బు లు కట్ అయినట్టు మెసేజ్ రావడంతో బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈశ్వర్ అనే బాధితుడు వెంటనే అప్రమత్తమై తలకొండపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆన్‌లైన్ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చే యాలని సూచించడంతో వెంటనే ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేసినట్టు బాధితులు తెలిపారు. వెల్జాల్ ఎస్‌బీఐ బ్యాం కులో మేనేజర్ దృష్టికి తీసుకెళ్లి బ్యాంక్ అకౌంట్‌ను హోల్డ్ లో పెట్టించారు. వెల్జాల్ బ్యాంక్ అధికారులను సంప్రదించి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. వాట్సప్ గ్రూపులో అనవసరమైన లింకులను ఓపెన్ చేసి డబ్బులను పోగొ ట్టుకోకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనపై ఉందని పోలీసులు, బ్యాంక్ అధికారులు సూచిస్తున్నారు.

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి



నవతెలంగాణ-ధారూర్

విద్యుద్ఘాతంతో యువకుడు మృతి చెందిన ఘటన వికారాబాద్ జిల్లా ధారూర్ మండల పరిధిలో చోటుచేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నాగారం గ్రామానికి చెందిన మద్దులపల్లి ప్రేమ్ కుమార్(34) వ్యవసాయ పనులు చేసుకుంటున్నాడు. శుక్రవారం వరి పొలానికి నీళ్లు పెడుతుండగా ఒక్కసారిగా కరెంటు రావడంతో అక్కడికక్కడే పడిపో యాడు. అక్కడే ఉన్న రైతులు గుర్తించి అతడిని బయటకు తీసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వికారాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కుమ్మర (శాలివాహన) కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

- ఆర్‌టీఐ, సామజిక కార్యకర్త, సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కుమ్మర



నవతెలంగాణ-సంతోష్ నగర్

కుమ్మర (శాలివాహన) కార్పొరేషన్ ను తక్షణమే ఏర్పాటు చేసి కుమ్మరుల ఆర్థికాభివృద్ధికి తోడ్పాటునందించాలని ఆర్‌టీఐ, సామాజిక కార్యకర్త,సీనియర్ జర్నలిస్ట్ రాపోలు లింగస్వామి కుమ్మర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం చంపాపేట్ లోని ఆయన నివాసంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాజాగా అన్ని కులాల అభివృద్ధి కోసం పలు కార్పొరేషన్ లు ప్రకటించడం పట్ల సంతోషాన్ని వ్యక్తం చేశారు. కానీ ప్రపంచానికి నాగరికత నేర్పిన కుమ్మరులు నేడు ఆర్థికంగా గాని, వృత్తి పరంగా గాని, రాజకీయం పరంగా గాని అత్యంత వెనుక బడి ఉన్నామని తమ కులం అభివృద్ధి చెందెం దుకు కుమ్మరులను గుర్తించి కుమ్మర కార్పొరేషన్ ఏర్పాటు చేయకపోవడం పట్ల ఆవేదన వ్యక్తం చేశారు. హక్కుల కోసం కుమ్మర కార్పొరేషన్ సాధన కోసం సంఘాల కతీతంగా కుమ్మరు లంతా కలిసి పోరాటం చేయాల్సిన సమయం ఆసన్నమైదని, పోరాటాలతోనే సాధించుకుం టామని పిలుపునిచ్చారు. స్వాతంత్రం వచ్చి నేటికీ 76 సంవత్సరాలు అవుతున్నా కానీ చట్ట సభలకు ఆమడ దూరంలో ఉన్నామని, రోజు రోజుకి కుమ్మ రులు పేదరికంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని,, ఏ ప్రభుత్వాలు కూడా కుమ్మరులను గుర్తించడం లేదని ఆవేదన చెందారు. తెలంగాణ రాష్ట్రంలో నూతనంగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోనైనా కుమ్మరు లను గుర్తిస్తారని ఎదురు చూశామన్నారు. కానీ అలాంటిదేది కనిపించలేదన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కుమ్మ రులు కూడా అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నా రని గుర్తు చేశారు. కుమ్మర కులాన్ని తక్షణమే గుర్తించి కుమ్మర కార్పొరేషన్ ప్రకటించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. లేనిచో కుమ్మరులంతా కలిసి రాష్ట్ర వ్యాప్తంగా పోరాటం చేస్తామని హెచ్చరించారు.

ప్రజల్లోకి రావడానికి మోడీకి భయమెందుకు

- సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్



నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రధాని మోడి ప్రజాస్వామ్య పద్ధతిలో పరిపాలన సాగించే వాడయితే ప్రజల్లోకి రావడానికి భయమెందుకు అని సీపీఐ(ఎం) మల్కాజిగిరి మండల కార్యదర్శి కృపాసాగర్ అన్నారు. శుక్రవారం ఉదయం ఆరు గంటలకే సీపీఐ(ఎం) మండల కార్యదర్శి కృపాసాగర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అనంతరం గృహ నిర్బంధం చేసారు. ఈ సందర్భంగా ఆయ నమాట్లాడుతూ అక్రమ అరెస్టులను సీపీఐ(ఎం) తీవ్రంగా ఖండిస్తున్నదని తెలిపారు. మోడి అధికారంలోకి వచ్చిన ఈ పది సంవత్సరాల కాలంలో ప్రజలను పూర్తిగా నిర్లక్ష్యం చేసి కేవలం బడా వ్యాపార వేత్త లకు, పెట్టుబడిదారులకు మాత్రమే మేలు చేసాడన్నారు. పేదల ఖాతాలో రూ. 15 లక్షలు వేయలేదని.. ప్రతీ పేద కుటుంబానికి ఇండ్లు నిర్మించి ఇస్తామని మోసం చేసారన్నారు. నిరుద్యోగ సమస్య పరిష్కారం చేయడం లో పూర్తిగా విఫలమయ్యారని.. గ్యాస్, పెట్రోల్, డీజిల్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచారని తెలిపారు. అవినీతి రహిత పాలన సాగిస్తామని మొత్తం అవినీతి నల్ల డబ్బులు రాజ్య మేలు తున్నాయని చెప్పారు. కొత్త యూనివర్సిటీ లు రాలేదు, కొత్త పరిశ్రమలను తీసుకు రాలేదన్నారు. పదేండ్లపాలన లో పేదరికం ఏమాత్రం తగ్గలేదన్నారు. మతోన్మాదం పెరిగింది, ప్రజల మధ్య చిచ్చు పెరిగింది అని.. మహిళల కు రక్షణ లేదు,హత్యలు, లైంగికదాడులు గణనీయంగా పెరిగియని చెప్పారు. ప్రశ్నించే మేధావుల మీద హత్యలు దాడులు పెరిగాయన్నారు. ప్రతి పక్ష ప్రభుత్వాల కూల్చివేతకు కుట్రలు చేస్తున్నారని.. బడ్జెట్ లో రాష్టాలకు సహకారం లేదు... ఇంకా అనేక చెడు సాంప్రదాయాల సంస్కృతి ని పెంచుతున్నదన్నారు. రాజ్యాంగాన్ని మార్చే కుట్రలు చేస్తున్నారని తెలిపారు. ఇలా పూర్తిగా ప్రజా వ్యతిరేక పాలన సాగిస్తున్న మోడి ఏ ముఖం పెట్టుకుని ప్రజల వద్దకు వస్తున్నాడని ప్రశ్నించారు. బీజేపీకి ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని... ఇన్ని అనర్థాలకు, అన్యాయాలకు పాల్పడుతున్న మోడి సర్కారు ను చిత్తుగా ఓడించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అరెస్టు చేసినంత మాత్రాన ఉద్యమాలు ఆగవు అని ప్రజాస్వామ్య వాదులు ఈ అక్రమ అరెస్టులను ఖండించాలని అన్నారు.

నిబద్ధతతోనే మహిళా రక్షణ చట్టాలు అమలు కావాలి



నవతెలంగాణ-కల్చరల్

మహిళా రక్షణ చట్టాలు ఎన్ని వచ్చినా అమలు చేయటంలో ప్రజలు ప్రభుత్వం లోనూ నిబద్ధత కావాలని కేంద్ర పూర్వ మంత్రి డాక్టర్ సముద్రాల వేణుగోపాలాచారి అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభ ప్రధాన వేదిక పై ప్రముఖ సాంస్కృతిక సంస్థ కళా నిలయం నిర్వహణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని ఉమెన్ ఐకాన్ ఆఫ్ ద ఇయర్ 2024 అవార్డుల ప్రదాన సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ వేణుగోపాలాచారి పాల్గొని మాట్లాడుతూ ప్రతీ మహిళా వారి రంగం లో లేదా గృహ జీవితంలో ఒక ఐకాన్ అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ గాయని బోయి హైమవతి భీమన్న మాట్లాడుతూ తొలి రోజుల్లో శ్రామిక దినోత్సవంగా ఉన్న మార్చ్ 8 తేదీ ఎన్నో ఉద్యమాలు తరువాత అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా ఐక్య రాజ్య సమితి ప్రకటించిందని తెలిపారు. అనంతరం అవార్డ్స్‌ను బహూకరించారు అవార్డ్స్ అందుకున్న వారిలో జబర్దస్త్ ఫేమ్ కళాంజలి ప్రార్థినీ, నీలం శ్రీలత, ఎస్. సరిత, సహన, కృష్ణ వేణి, శ్రుతి తదితరులు ఉన్నారు సంస్థ కార్యదర్శి సురేందర్ నివేదిక సమర్పించిన కార్యక్రమంలో అతిథులు గా వైఎస్సార్ మూర్తి,కాకుమాను జ్యోతి తదితరులు పాల్గొన్నారు సంస్థ అధ్యక్షురాలు పుష్ప కార్యక్రమ నిర్వహణ చేశారు.



డీటీసీ ప్రవీణ్ రావుకు జేటీసీగా పదోన్నతి

నవతెలంగాణ-సిటీబ్యూరో

రవాణాశాఖ కేంద్ర కార్యాలయంలో పరిపాలనా, విజిలెన్స్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్(డీటీసీ)గా విధులు నిర్వహిస్తున్న ఎం.ప్రవీణ్ రావుకు స్టేట్ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ ఆఫీస్ జేటీసీగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఒకటి రెండు రోజుల్లో ఆయన అక్కడే జేటీసీ(అడ్మిన్)గా పదవి బాధ్యతలు స్వీకరించనున్నారని తెలిసింది. ఈ సందర్భంగా పలువురు అధికారులు, సిబ్బంది, మిత్రులు, శ్రేయోభిషులు, బంధువులు అభినందనలు తెలిపారు. ఇదిలావుంటే మరో ముగ్గురు ఆర్టీవోలకు డీటీసీలుగా పదోన్నతులు కల్పించే ప్రక్రియ కూడా తుది దశకు చేరింది. ఇప్పటికే డిపార్టు మెంటల్ ప్రమోషన్ కమిటీ భేటీ అయ్యి.. పేర్లను సైతం ఫైనల్ చేసినట్టు సమాచారం. నేడు సార్వత్రిక ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్ విడుదలయ్యేలోపే డీటీసీల ప్రమోషన్లకు సంబంధించిన అధికారిక ఉత్తర్వులు వెలువరించే అవకాశం ఉందని విశ్వసనీయ సమాచారం.

సంకల్పం ఉంటే అసాధ్యం ఏదీ లేదు



- ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీ.వీ. పట్టాభిరామ్

నవతెలంగాణ-కల్చరల్

దృఢ సంకల్పం ఉంటే అసాధ్యం ఏదీ లేదనీ లక్ష్య సాధన కు దీక్షతో కృషి చేస్తే సాధించవచ్చని ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు బీ.వీ. పట్టాభిరామ్ అన్నారు. హైదరాబాద్ మేజిషియన్స్, జోషి మేజిక్ అకాడెమీ సంయుక్త నిర్వహణలో కోదండ రామ ఆలయ ప్రాంగణం వద్ద ఇటీవల కండ్లకు గం తలు కట్టుకొని మోటార్ సైకిళ్లపై హైదరాబాద్ నుంచి అయోధ్యకు 1600 కిలోమీటర్స్ విజయవంతం గా ప్రయాణం చేసిన మారుతి జోషి, జీ.రామకృష్ణ లకు అభినందన సత్కారం జరిగింది. అతిథిగా పట్టాభిరామ్ పాల్గొని వారిని సత్కరించి మాట్లా డారు సాహసోపేత నిర్ణయం తీసుకొని ఇరువురూ కండ్లకు గంతలు కట్టుకొని అరుదైన ఫీట్ చేశారని అభినందించారు బాల సాహిత్య రచయిత మేజిక్ చాప్లిన్ చొక్కపు రమణ అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఫిబ్రవరి 23 న చిన్న జీయ్యర్ స్వామి ఆశీస్సులతో ఆరంభమైన వీరి యాత్ర మార్చి 3 వ తేదీ ముగిసిందని మొత్తం పది రోజుల వ్యవధిలో హైదరాబాద్ నుంచి అయోధ్య చేరారని తెలిపారు. యాత్రి కులు రామ కృష్ణ జోషిలు మాట్లాడుతూ మార్గ మధ్యంలో ఎందరో తమకు స్వాగతం పలికారని పార్లమెంట్ సభ్యులు లల్లు సింగ్, వీ.హెచ్.పీ నాయకులు శివదాస్ సింగ్ తదితరులు తమను అభినందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా అధ్యాత్మిక వేత్త లక్ష్మీ నాధా చార్యులు హాజరు అయ్యారు. త్రిపుర సుందరి, వీ.ఆదినాధ్,విశ్వనాథ్ జోషి, ఆంజనేయులు, జయదేవ తదితరులు పాల్గొన్నారు

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం : అరవింద్ శర్మ



నవతెలంగాణ - చైతన్యపురి

కవిత అరెస్ట్ అప్రజాస్వామికం అని మహేశ్వరం నియోజకవర్గం బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి అరవింద్ శర్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన మాట్లాడుతూ ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కావాలనే కవిత పేరును చేర్చి వేధింపులకు గురి చేస్తుందని ఆరోపించారు. సోదాలు చేస్తానని చెప్పి అరెస్ట్ చేయడం దారుణమని అన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నప్పుడు అరెస్టు చేయకూడదని తెలిసినా కేంద్రం ఒత్తిడితోనే అరెస్టు పర్వానికి తెర లేపారని అని అన్నారు. అరెస్టుతో బీజేపీ రాష్ట్రంలో రెండు, మూడు ఎంపీ సీట్లు సాధిస్తాం అనే ఉద్దేశంతోనే ఈ చర్యలకు పూనుకుందన్నారు. రాజకీయంగా ఎదుర్కొలేకనే కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి ఇలాంటి నాటకాలు ఆడుతున్నారని ఆరోపించారు. ప్రజా క్షేత్రంలో వీరి భాగోతాన్ని ఎండగడతామని తెలిపారు.

'శాంతి భద్రతల విషయంలో రాజీపడొద్దు'



నవతెలంగాణ - చైతన్యపురి

శాంతి భద్రతల విషయంలో రాజీ పడకుండా ప్రజలకు సేవ చేయాలని రంగారెడ్డి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా అధ్యక్షుడు బాణాల ప్రవీణ్ అన్నారు. సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఇనిస్పెక్టర్‌గా నూతన బాధ్యతలు స్వీకరించిన సైదిరెడ్డిని శుక్రవారం బాణాల ప్రవీణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్చం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.తర్వాత శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు సత్వర న్యాయం అందించే విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఎస్ఐ లక్ష్మయ్య యాదవ్, ఎస్ఐ గణేష్ బాబు, సుదర్శన్, ఖలీల్ తదితరులు ఉన్నారు.



'హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు'

- జీహెచ్ఎంసీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్‌ల బృందం

నవతెలంగాణ - సిటీబ్యూరో

హైదరాబాద్ నగర అభివృద్ధికి ప్రణాళిక బద్ధంగా చర్యలు తీసుకుంటున్నామని జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ తెలిపారు. ఆరు రాష్ట్రాలకు చెందిన ట్రైనీ ఐ.ఏ.ఎస్‌లు బెస్ట్ ప్రాక్టీసెస్‌పై అధ్యయనం చేయడానికి జీహెచ్ఎంసీని సందర్శించారు. ముస్సోరిలో ట్రైనింగ్ పొందుతున్న హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, మధ్య ప్రదేశ్, గుజరాత్, రాజస్థాన్, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు చెందిన 16 మంది ఐఏఎస్‌లు రెండు రోజుల పర్యటనలో భాగంగా శుక్రవారం జీహెచ్ఎంసీకి వచ్చారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్, సీ అండ్ డీ వేస్ట్ ప్రాసెసింగ్, చెత్త సేకరణ, జీవీపీ, ఎలిమినేషన్, ఎస్.ఎన్.డీ.పీ, ఎస్.ఆర్.డీ.పీ, టౌన్ ప్లానింగ్, ఇంటి నిర్మాణ అనుమతులు, యూబీడీ ద్వారా చేపట్టిన గ్రీనరి, మోడల్ గ్రేవ్ యార్డ్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్స్, మోడల్ మార్కెట్లు, ఫ్లై ఓవర్ బ్రిడ్జిలు, స్ట్రీట్ లైటింగ్, ట్రాఫిక్ సిగ్నల్స్, లేక్స్ అభివృద్ధి, పీఎం స్వానిధి, ఇంటిగ్రేటెడ్ గ్రీవెన్స్ సిస్టం, వేస్ట్ రీసైక్లింగ్, నగర పౌరులకు అందిస్తున్న సేవలు, హరితహారం, నిధుల సమీకరణ, శానిటేషన్‌లపై వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ రోనాల్డ్ రోస్ మాట్లాడుతూ... హైదరాబాద్ నగర అభివృద్ధికి పారిశుధ్య నిర్వహణతో పాటు పచ్చదనాన్ని పెంచడం, టౌన్ ప్లానింగ్, క్లీన్ అండ్ గ్రీన్ సిటీగా రూపొందించే దిశగా చేపట్టిన చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయన్నారు. జీహెచ్ఎంసీలో 6 జోన్లు, 30 సర్కిల్స్ ఉన్నాయని, ముఖ్యంగా జీహెచ్ఎంసీకి ఆదాయ వనరులు బిల్డింగ్ పర్మిషన్‌లు, ఇంటి పన్ను, ప్రకటనలు, ట్రేడ్ లైసెన్స్‌ల ద్వారా సమకూరుతుందని తెలిపారు. జీహెచ్ఎంసీలో శానిటేషన్ పనుల నిర్వహణ కోసం సుమారు 22 వేల మంది వివిధ కేటగిరి ఉద్యోగులు ఉన్నారని, వారికి ఉచిత హెల్త్ చెకప్‌తోపాటు, ఈ ఎస్ ఐ, ఈ.పీ.ఐ, బీమా సదుపాయాలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వర్షాలు, వరదలతో ప్రజలు ఇబ్బంది పడకుండా చేపట్టిన నాలా అభివృద్ధి పనుల చర్యలపై వివరించారు. జీహెచ్ఎంసీలో డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటు చేసామని, వరదలు, అగ్నిప్రమాదాలు సంభవించినప్పుడు, ఈదురు గాలులకు చెట్లు విరిగినప్పుడు, భవనాలు కూలిపోయినప్పుడు, ఇతర ప్రమాదాల సమయంలో ఎన్ఫోర్స్‌మెంట్, విజిలెన్స్, డిజాస్టర్ మేనేజ్మెంట్ సేవలు అందిస్తున్నదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీలు రమేష్ ఆర్ దామోర్, దుని చంద్ రాణా, రోహిత్ జామ్ వాల్, దిశా ప్రణయ్ నాగ్ వంశీ, అనురాగ్ సక్సేనా, శుచి స్మిత సక్సేనా, అవినాష్ ప్రభాకర్ రావ్ పాతక్, డాక్టర్ ప్రవీణ్ కుమార్ పితాంబర్ దియోరే, ప్రకాష్ బాబురావు ఖాష్టీ, గోరక్ష మహాదేవ్ గదిల్ కార్, మకరంద్ ప్రహ్లాద్ దేశ్ముఖ్, మిలింద్ కుమార్ వామన్ రావు సాల్వే, సచిన్ కాలన్ త్రే, ప్రియాంక గోస్వామి, పుఖ్ రాజ్ సేన్, ప్రకాష్ చంద్ర లు పాల్గొనగా, జీహెచ్ఎంసీ అధికారులు ఈ.వీ.డీ.ఎం డైరెక్టర్ ప్రకాష్ రెడ్డి, ఈ.ఎన్.సీ జియా ఉద్దీన్, అడిషనల్ కమిషనర్లు శివ కుమార్ నాయుడు, డాక్టర్ సునంద, వెటర్నరీ డిడి డాక్టర్ విల్సన్, ఎస్.డబ్లు.ఎం ఈఈ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సర్కిల్ కార్యాలయంలో అపరిశుభ్రత

- కార్యాలయంపైన నిలిచిన నీళ్లు
- పాకూరు పట్టిన వైనం
- పట్టించుకోని అధికారులు



నవతెలంగాణ - ఎల్బీనగర్

ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంలో అపరిశుభ్రత నెలకొన్నది. కార్యాలయంలో ఎక్కడ చూసినా సామాన్లతో నిండిపోయి ఉన్నది. కార్యాలయం స్లాబ్ పైన నీరు నిలిచిపోయి పాకూరు పట్టి ఉంది. 'బయట పల్లకి మోత ఇంట్లో ఈగలమోత' అన్న చందంగా ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయం ఉన్నది. ఇంట్లో వర్షపు నీటి నిల్వలు ఉంచొద్దని దోమలు ఉత్పత్తి అవుతాయని ప్రచారం చేసే జీహెచ్ఎంసీ అధికారులు.. ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయంపైన నెలల తరబడి నీళ్లు నిలిచిపోయి ఉన్నా పట్టించుకునే నాథుడు లేడు. సర్కిల్ కార్యాలయంపైన పూర్తిగా నీటితో నిండిపోయి ఉన్నది. నీరు కిందికి జారుతూ కార్యాలయంలో కారుతున్నది. స్లాబ్ దెబ్బ తింటున్నది అయినా అధికారులకు పట్టింపు లేదు.

ఎక్కడ చూసినా పాత సమాన్లు, మూటలు..

సర్కిల్ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాలన్న ధ్యాస అధికారులకు లేకపోవడంతో ఎల్బీనగర్ మున్సిపల్ కార్యాలయంలో ఎక్కడ చూసినా పాత సామాన్లతో నిండిపోయి ఉన్నది. కార్యాలయం వరండాలో బాక్సులు, మూటలు, బీరువాలు, పాత సామాన్లతో పూర్తిగా నిండిపోయి ఉన్నది. వివిధ పనుల కోసం సర్కిల్ కార్యాలయానికి వెళ్లేవారికి ప్రభుత్వ కార్యాలయం లాగా కనిపించదు. పాడుబడ్డ భవనం లోనికి వెళ్లినట్లుగా ఉంటుంది.

అంతేకాదు కంపు కొడుతున్న టాయిలెట్స్, కార్యాలయం గదుల్లో కురుస్తున్న నీరు, విరిగిపోతున్న పాల్ సీలింగ్ దర్శనం ఇస్తున్నాయి. ఎల్బీనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ పెషిలో ప్యాన్ షీలింగ్ ఊడిపోయి ఉంది. ప్రభుత్వ కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత ఒకరిపైన లేకపోవడంతో మూడు ముక్కలాట లాగా తయారయింది. ఒకే భవనంలో మూడు సర్కిల్ కార్యాలయాలు ఉండడంతో నిర్వహణ బాధ్యత 'ఎవరికి వారే యమునా తీరే' అనే చందంగా తయారయింది. ఇప్పటికైనా అధికారులు కార్యాలయం పైన నిలిచిపోయిన నీళ్లను వెంటనే తొలగించి, కార్యాలయాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.

పాత సామాన్లు తొలగించి, కార్యాలయాన్ని పరిశుభ్రంగా ఉంచి, పౌరులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పలువురు అంటున్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయాన్ని వెంటనే మరమ్మతులు చేపట్టి, రంగులు వేసి పరిశుభ్రంగా ఉంచాలని ప్రజలు కోరుతున్నారు. కానీ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

తెలంగాణలోనే ప్రారంభమైన సాహిత్య ప్రక్రియలు

ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి



నవతెలంగాణ - హయత్ నగర్

ప్రాచీన కాలంలోనే అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు తెలంగాణలోనే ప్రారంభం అయ్యాయని ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ పూర్వాధ్యక్షులు ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల హయత్ నగర్‌లో "తెలంగాణ అస్తిత్వ పోరాట సాహిత్యం సమాలోచన" అనే అంశం మీద రెండు రోజుల జాతీయ సదస్సు శుక్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక తెలుగు సాహిత్య ప్రక్రియలు తెలంగాణలోనే ప్రారంభం అయ్యాయని, అవి అనంతరకాలంలో తెలుగు ప్రాంతాలన్నింటికీ విస్తరించాయని దాదాపు 25 తెలుగు సాహిత్య ప్రక్రియల గురించి వివరించారు. నిజాం ఏలుబడిలో జరిగిన పోరాటాల సమయంలో వచ్చిన సాహిత్యం, రైతాంగ పోరాట కాలం నాటి సాహిత్యం, తెలంగాణ ఉద్యమం తొలి, మలిదశ కాలాల నాడు వచ్చిన సాహిత్యాల గురించి కూడా వివరించారు.

కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. జోత్స్నప్రభ అధ్యక్షతన జరిగిన ఈ ప్రారంభ సమావేశానికి కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు ప్రొఫెసర్ డి. రాజేందర్ సింగ్, జి. యాదగిరి, ప్రస్తుత అధ్యక్షులు ఆచార్య సాగి కమలాకరశర్మ, తెలంగాణ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ ఫ్యాకల్టీ డీన్ ఆచార్య కే. లావణ్య, సేవారత్న శ్రీ నక్క శ్రీనివాస్‌యాదవ్ హాజరయ్యారు. కళాశాల సదస్సు కన్వీనర్, డాక్టర్ కె సురేశ్, సదస్సు కోఆర్డినేటర్ డాక్టర్ చింతల రాకేశ్ భవాని, డాక్టర్ గంజి శశిధర్, శ్రీమతి సరస్వతి, కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది విద్యార్థులు, వివిధ కళాశాలల నుండి పత్రసమర్పణ చేయడానికి వచ్చిన అధ్యాపకులు, సాహిత్య అభిమానులు, ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు, ఎన్సీసీ క్యాడెట్లు పాల్గొన్నారు.

సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి



- రిటైర్డ్ ప్రొఫెసర్ సి.గణేశ్

నవతెలంగాణ - చైతన్యపురి

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని రిటైర్డ్ ప్రొఫెసర్ సి.గణేశ్ సూచించారు. యువతలో 'పెరుగుతున్న హింసాత్మక పరిణామాలు-పరిష్కారాలు' అనే అంశంపై నక్క వెంకటేశ్ అధ్యక్షతన కొత్తపేటలోని బాబు జగ్జీవన్‌రామ్ భవన్‌లో శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా రిటైర్డ్ ప్రొఫెసర్ సి. గణేశ్‌తో పాటు ప్రొఫెసర్ జీబీ రెడ్డి, అడిషనల్ ఎస్పీ టి.తిరుపతిరెడ్డి, విశ్రాంత డిప్యూటీ డైరెక్టర్ పెరిక యాదయ్యలు హాజరై మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో విద్యార్థులు సోషల్ మీడియా ప్రభావం వలర ఎక్కువగా చెడిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

యువత సరైన మార్గంలో ప్రయాణించాలంటే క్రమశిక్షణ, చిత్తశుద్ధి, పట్టుదల చాలా ముఖ్యమని విద్యార్థులకు సూచించారు. సరైన మార్గాన్ని ఎంచుకొని తమ భవిష్యత్ తీర్చిదిద్దుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గట్టు మల్లు, డాక్టర్ ఎన్వీ శివాజీ, అశోక్ యాదవ్, నాగరాజ్, శంకర్, సతీశ్, వినయ్, వివిధ హాస్టళ్ల విద్యార్థులు పాల్గొన్నారు.

కెమిస్ట్స్, డ్రగిస్ట్స్ సమస్యలు పరిష్కరించాలి

కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కృష్ణ కుమార్

నవతెలంగాణ-అబ్దుల్లాపూర్ మెట్

కెమిస్ట్రీ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ రెండోవ సర్వసభ్య సమావేశం పెద్ద మున్సిపాలిటీ లక్ష్మారెడ్డి పాలెం కమ్యూనిటీ హాల్లో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కెమిస్ట్స్ అండ్ డ్రగిస్ట్స్ అసోసియేషన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పెండెం కృష్ణకుమార్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కెమిస్ట్స్, డ్రగిస్ట్స్ ప్రజలకు అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. సెలవు దినాలు లేకుండా ప్రతినిత్యం ప్రజలకు సేవలందిస్తూ ఆరోగ్యాన్ని కాపాడడంలో ముందుంటున్నారని కొనియాడారు. ప్రజలకు ఇలాంటి సేవలందిస్తున్న సందర్భాలలో ఫేక్ కాల్స్‌తో, కొంతమంది మద్యం ప్రియుల నుంచి మెడికల్ షాపుల నిర్వాహకులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి ఆకతాయిల నుంచి స్థానిక పోలీసులు రక్షించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హయత్ నగర్ సీఐ రామకృష్ణ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా మెడికల్ షాప్‌ల నిర్వాహకులకు రక్షణ కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఫార్మసి కౌన్సిల్ మెంబర్ చెరుకూరి పరమాత్మ, కెమిస్ట్స్, డ్రగిస్ట్స్ అసోసియేషన్ హయత్ నగర్ జోన్ ప్రెసిడెంట్ నరేందర్ రెడ్డి, సెక్రెటరీ మహేందర్ రెడ్డి, ట్రెజరర్ భగవాన్ దాసు, ఉపాధ్యక్షులు శ్రీహరి, సభ్యులు మధు, రవీందర్ రెడ్డి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

'నేషనలిస్ట్' రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్‌యాదవ్, ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ బషారత్ ఉల్లా



నవతెలంగాణ - సంతోష్‌నగర్

నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా సునీల్ యాదవ్, తెలంగాణ ఉపాధ్యక్షుడిగా మహమ్మద్ బషారత్ ఉల్లా, మైనారిటీ అధ్యక్షుడిగా మహ్మద్ పాషా, మలావత్ విట్టల్, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడిగా అబ్దుల్ కలీం ఎన్నికయ్యారు. హైదరాబాద్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో నూతనంగా ఎన్నికైన అధ్యక్షుల, ఉపాధ్యక్షులకు పూలు మాలలు వేసి శాలువాలతో సత్కరించారు. తర్వాత వారికి నియామక పత్రాలను



అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. అనంతరం తమకు సహకరించిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లోకి జిల్లా మైనార్టీ విభాగం నాయకుడు

నవతెలంగాణ - చైతన్యపురి

బీఆర్ఎస్ పార్టీ రంగారెడ్డి జిల్లా మైనార్టీ విభాగం నాయకుడు ఎస్.కె.మహమ్మద్ కాంగ్రెస్ పార్టీ తెలంగాణ రాష్ట్ర ఇంచార్జి దీపాదాస్ మున్షి సమక్షంలో శుక్రవారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా మహమ్మద్‌కు దీపాదాస్ మున్షి కాంగ్రెస్ కండువా కప్పి, పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా మహమ్మద్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీతోనే అభ్యున్నతి సాధ్యం అవుతుందని అన్నారు. అందుకే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాలలో అభ్యున్నతి సాధిస్తుందనే నమ్మకంతో తిరిగి తాము కాంగ్రెస్ పార్టీలోకి చేరినట్టు తెలిపారు. దేశంలో రాహుల్ గాంధీ నేతృత్వంలో రానున్న ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. చేవెళ్లలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర ఫైనాన్స్ కమిటీ సభ్యుడు సంకేపల్లి సుధీర్ రెడ్డి నేతృత్వంలో తనతోపాటు ఎండి. అహ్మద్, రఫిక్ బాబా కాంగ్రెస్ పార్టీలో చేరినట్టు పేర్కొన్నారు.



'ఆందోళన కలిగిస్తున్న కిడ్నీ సంబంధ వ్యాధులు'

- లక్డికాపూల్ గ్లెనిగల్స్ హాస్పిటల్‌లో అవగాహనా కార్యక్రమం

నవతెలంగాణ-సిటీబ్యూరో

రోజురోజుకూ కిడ్నీ సంబంధిత వ్యాధులు ఆందోళన కలిగిస్తున్నాయని గ్లెనిగల్స్ హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెంట్ తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతున్న కిడ్నీ సంబంధ వ్యాధుల పట్ల అవగాహన కల్పించంతో పాటు వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా ఈ సంవత్సరం అందరికి కిడ్నీ ఆరోగ్యం అనే థీమ్ వరల్డ్ హెల్త్ ఆర్గనైజేషన్



ప్రకటించిన నేపథ్యంలో లక్డీకాపూల్‌లోని' గ్లెనిగల్స్ హాస్పిటల్స్‌లో సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ప్రదీప్ దేశ్‌పాండే, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ ఎట్టా, సీనియర్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్ట్ అండ్ కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ ఫిజీషియన్ డాక్టర్ వి.ధనలక్ష్మిల ఆధ్వర్యంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. రోజు రోజుకూ పెరుగుతున్న కిడ్నీ సంబంధ వ్యాధులను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ కిడ్నీ ఆరోగ్యం పట్ల జాగ్రత్త పడాలని, మన శరీరంలో రక్తం నుంచి వ్యర్థాలను, అదనంగా ఉండే ద్రవాలను శుభ్రపర్చే కీలకమైన అవయవం కిడ్నీలు. కిడ్నీ సమస్యలు తలెత్తి పూర్తిగా పనిచేయకుండా పోతే తీవ్రమైన సమస్యలకు దారితీస్తుందని తెలిపారు. పౌష్టిక అహారం తీసుకోవడం, వ్యాయామం చేస్తూ ధూమపానానికి దూరంగా ఉండటంతో పాటు కిడ్నీ సంబంధ వ్యాధులను ముందుగానే గుర్తించి చికిత్స తీసుకోవడంతో కిడ్నీలను కాపాడుకోవచ్చని తెలిపారు.

క్రానిక్ కిడ్నీ డిసీజ్ (సికెడి) ప్రపంచ వ్యాప్తంగా. 850 మిలియన్ల మంది బాధపడుతున్నారని, 2019లో 3.1 మిలియన్లకు పైగా మరణాలకు సికెడి కారణమైందని తెలిపారు. కిడ్నీ జబ్బులను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స తీసుకుంటే కిడ్నీ సంబంధ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త పడవచ్చని తెలిపారు. యుక్త వయస్సులో వారు కూడా కిడ్నీ సంబంధ వ్యాధుల బారిన పడతుండటం ప్రస్తుతం అందోళన కలిగిస్తున్న అంశమన్నారు. సరైన సమయంలో సరైన చికిత్స తీసుకోకపోతే డయాలసిస్ బారిన పడటం ఆ తరువాత కిడ్నీ మార్పిడి ఒక్కటే పరిష్కార మార్గమని తెలిపారు. గ్లెనిగల్స్ హాస్పిటల్స్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నామని ఈ సందర్భంగా తెలియజేశారు. ఈ సందర్భంగా కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్ అయి సాధారణ జీవితం గడుపుతున్న వారు వారి అనుభవాలను పంచుకున్నారు. అనంతరం ప్రత్యేక కిడ్నీ ప్యాకేజీని డాక్టర్లు ప్రారంభించారు.

'క్షత్రియ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి'



నవతెలంగాణ-సిటీబ్యూరో

క్షత్రియ సమాజాన్ని కలిపి శ్రీ క్షత్రియ, సారోళ్ళు సోమ వంశ క్షత్రియ కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని శ్రీ క్షత్రీయ రాష్ట్ర నాయకులు కొంగల రాంప్రసాద్, సారోళ్ళు క్షత్రీయ రాష్ట్ర నాయకులు బోరేద ప్రవీణ్ కుమార్, జే.వేదాకర్‌లు ముఖ్యంత్రి రేవంత్ రెడ్డిని శుక్రవారం కోరారు. రాష్ట్రంలో బీసీ వర్గాల సంక్షేమం కోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థికంగా వెనకబడిన వర్గాలకు పలు ప్రత్యేక బోర్డులను ఏర్పాటు చేసిందని, సంక్షేమ పథకాలను అమలు మంచి నిర్ణయాలేనని అభిప్రాయపడ్డారు. సంక్షేమ పథకాలు అందుకో లేకుండా అట్టడుగు స్థాయిలోవున్న కులాలను గుర్తించి వారికి కూడా సంక్షేమ పథకాలు అందించే విధంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. స్వాతంత్రం వచ్చి 70 సంవత్సరాలు గడిచినప్పటికీ కూడా ఇప్పటికి తమ కుల సమాజాకి, వర్గానికి ఎలాంటి విద్య, ఉద్యోగ, సంక్షేమ పథకాలు అందలేదన్నారు. తాము కోరినట్లు తమ కార్పొరేషన్ ఏర్పాటు చేసినట్లయితే అన్ని రకాలుగా క్షత్రియ వర్గాలైన శ్రీ క్షత్రియ, రామ జోగి, సారోళ్ల సోమవంశ క్షత్రియ, అగ్నికుల క్షత్రియ, జల క్షత్రియ, వన్యకుల క్షత్రియ, ఆర్య క్షత్రియ, తోగాట, వీర క్షత్రియ, భావసార క్షత్రియ, అన్నికుల సంఘాలను ఒక తాటిపైకి తెచ్చి వారికి సంక్షేమ



పథకాలు అందించినట్లు అవుతుందని అభిప్రాయపడ్డారు. గత పాలకులు క్షత్రీయ కార్పొరేషన్ ఏర్పాటు చేయలేదని, ఇప్పటికైనా ముఖ్యమంత్రి ఏర్పాటు చేయాలని కోరారు.

ప్రేమంటే ఇది అని స్పష్టమైన అర్థం చెప్పలేని అనుభూతి. ఇద్దరు వ్యక్తుల మధ్య అనిర్వచనీయమైన అంశం. ఇది యవ్వనంలో ఉన్నవారి మధ్యే కాదు ఎవరికైనా కలుగుతుంది. ఒకరిని ప్రేమించడం, వారి ప్రేమను పొందడం అద్భుతమైన విషయం. కానీ నేటి యువత ప్రేమంటే ఆకర్షణ, శారీరక సంబంధం అనుకుంటున్నారు. వయసులో వున్నవారు ప్రేమలో పడితే వారికీ అన్ని అపురూపంగా కనిపిస్తాయి. తర్వాతనే అసలు సమస్యలు మొదలౌతాయి. కానీ వారిది నిజమైన ప్రేమైతే అన్నింటినీ జయించి జీవితాన్ని హాయిగా గడుపుతారు అనడానికి ఈ వారం ఐద్వా అదాలత్ చక్కటి ఉదాహరణ...

నిజమైన ప్రేమ గెలుస్తుంది



యాసిన్, రేష్మ ఇద్దరూ కలిసి ఆఫీస్‌కి వచ్చారు. యాసిన్‌కు 22 ఏండ్లు ఉంటాయి. అతను ఏసీలు రిపేర్ చేస్తాడు. ఇంట్లో అమ్మా, నాన్న ఉంటారు. అన్నయ్య, వదిన వేరుగా ఉంటారు. చెల్లికి పెండ్లి అయిపోయింది. సొంత ఇల్లుంది. ఎవరిది వారికీ అన్నట్లుగా ముందుగా కట్టించి ఇచ్చారు. తల్లిదండ్రులు యాసిన్ కోసం కట్టించిన ఇంట్లో ప్రస్తుతం కిరాయి వారు ఉన్నారు. నెలకు 12000 కిరాయి వస్తుంది. ఇకపోతే అతనికి నెలకు రూ. 30వేల వరకు జీతం వస్తుంది. ఇంటింటికి వెళ్ళి ఏసీలు రిపేర్ చేస్తాడు. అలా వెళ్ళినప్పుడే అతనికి రేష్మ పరిచయం అయింది. రేష్మకు అన్నదమ్ముళ్లు లేరు. ముగ్గురూ అమ్మాయిలే. వీరిలో రేష్మనే పెద్దది. చెల్లెళ్లు ఇద్దరూ ఇంటర్ చదువుతున్నారు. రేష్మ డిగ్రీ చివరి ఏడాదిలో వుంది. డిగ్రీ అయిపోయిన వెంటనే పెండ్లి చేయాలని ఇంట్లో సంబంధాలు చూడడం మొదలుపెట్టారు. రేష్మ పెండ్లి చేసుకోవడం ఇష్టం లేదు అని చెప్పినా వినకుండా ఒక సంబంధం ఖాయం చేశారు.

ఇంకా రెండు రోజుల్లో పెండ్లి ఉందనగా ఆమె యాసిన్‌తో కలిసి ఇంట్లో నుండి వెళ్ళిపోయింది. ఒక రోజు మొత్తం ఇద్దరూ బయటే ఉన్నారు. తర్వాత రోజు ఐద్వా ఆఫీస్‌కు వచ్చి వారి ప్రేమ గురించి చెప్పి 'మేము పెండ్లి చేసుకోవాలి అనుకుంటున్నాం. మీరేమైనా సాయం చేస్తారా? లేకపోతే మేము వేరే దగ్గరికి వెళ్లి చేసుకుంటాం. మా పెద్ద వాళ్ళకు మాత్రం చెప్పము' అన్నారు. 'మీ పెద్ద వాళ్ళతో మేము మాట్లాడతాం' అని చెబితే ముందు వినలేదు. 'వాళ్లు వస్తే నన్ను మా ఇంటికి తీసుకెళ్ళిపోతారు. మా ఇంట్లో వాళ్ళకు యాసిన్ అంటే ఇష్టం లేదు. యాసిన్ వాళ్ళ నాన్నకు ఇద్దరు భార్యలు, యాసిన్ రెండో భార్య కొడుకు. అందుకే మా వాళ్ళకు నచ్చలేదు' అని చెప్పింది.

'ఏది ఏమైనా మీ పెద్దవారితో మాట్లాడకుండా మేము ఏం చెప్పలేము' అని ఇరువైపుల పెద్దలను పిలిచి మాట్లాడం. యాసిన్ వాళ్ళ అమ్మానాన్న వచ్చారు. 'మీకు రేష్మ నచ్చింది అన్నారంట, మరి పెండ్లి ఎందుకు చేయడం లేదు' అని అడిగాము. 'అమ్మాయి వాళ్ళకు ఇష్టం లేనప్పుడు మేమేం చేస్తాము. అందుకే మేము మా వాడికి వేరే అమ్మాయిని చూస్తున్నాము. రేష్మకు కూడా వాళ్ళ ఇంట్లో వేరే సంబంధాలు చూస్తున్నారు. పైగా వాళ్ళ ఇంట్లో అందరూ ఆడపిల్లలే. అందుకే మాకు ఈ సంబంధం నచ్చలేదు. కానీ ఇద్దరూ మా మాట వినకుండా మీ దగ్గరకు వచ్చారు. పైగా వాళ్ళ తెగ వేరు మా తెగ వేరు. రేష్మ తల్లిదండ్రులను పిలిపించి వాళ్ళ ఇంటికి పంపించండి. మేము మా అబ్బాయిని తీసుకొని వెళ్ళిపోతాము' అన్నారు.

రేష్మ వాళ్ళ తల్లిదండ్రులు, బంధువులు కూడా వచ్చారు. రేష్మ కనీసం వారితో మాట్లాడటానికి కూడా ఇష్టపడలేదు. వాళ్ళతో మాట్లాడితే 'యాసిన్ వాళ్ళ కుటుంబంలో అందరికీ రెండు పెండిండ్లు జరిగాయి. భవిష్యత్‌లో యాసిన్ కూడా రెండో పెండ్లి చేసుకుంటే మా అమ్మాయి పరిస్థితి ఏమిటి. అందరూ రెండో భార్య దగ్గరే ఉంటున్నారు. భవిష్యత్‌లో యాసిన్ కూడా రెండో పెండ్లి చేసుకొని చిన్న భార్య దగ్గర ఉంటే ఎలా? అలాగే అతను చేసేది ఏసీ రిపేరు పని. అది ఎప్పుడూ ఉండదు. పని ఉన్నప్పుడే వెళ్ళాలి లేకపోతే ఇంట్లోనే ఉండాలి. నెలకు కచ్చితమైన జీతం అనేది లేదు. వాళ్ళ తెగ కూడా వేరు. అలాంటి కుటుంబానికి చెందిన అబ్బాయికి మా అమ్మాయిని ఎలా ఇచ్చి పెండ్లి చేయమంటారు. నిన్నటి నుండి రేష్మ కోసం వెదుకుతూనే ఉన్నాం. పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశాం. రాత్రి యాసిన్ వాళ్ళ ఇంటికి వెళ్లి అడిగితే ఏం చెప్పలేదు. అప్పటికీ యాసిన్ ఇంట్లోనే వున్నాడు. మాకు ఎంత భయం వేస్తుంది. మా అమ్మాయికి ఏం జరిగిందో అని చాలా కంగారు పడ్డాం. తను మాత్రం పెండ్లి చేసుకుంటానని మీ దగ్గరకు వచ్చింది' అన్నారు.

ఇరు కుటుంబాల మధ్య మాటా మాట పెరిగి గొడవలు పడ్డారు. మేము అందరికీ సర్దిచెప్పి 'మీ పిల్లలిద్దరూ ఇప్పుడు ఎవరు ఏం చెప్పినా వినే పరిస్థితుల్లో లేరు. ప్రేమలో మునిగిపోయారు. తెగలు వేరయితే ఏంటీ? ఈ మధ్యకాలంలో మతాంతర వివాహాలే చేసుకుంటున్నారు. ఇద్దరూ ప్రేమించుకున్నారు కనుక కలిసి సంతోషంగా ఉండేలా చూడాలి. యాసిన్ ఏసీ రిపేరింగ్‌తోపాటు, కొత్తగా గాజుల దుకాణం పెట్టాలని అనుకుంటున్నాడు. యాసిన్ పనికి వెళ్ళినప్పుడు ఆ షాప్ వాళ్ళ అమ్మ చూసుకుంటుంది. ఇకపోతే రెండో పెండ్లి గురించి అంటారా... వాళ్ళ నాన్న, బంధువులు చేసుకున్నంత మాత్రాన ఇతను కూడా అలాగే చేసుకుంటాడని భయపడడం సరైనది కాదు. మీకు అంత భయం ఉంటే యాసిన్ కోసం అతని తల్లిదండ్రులు కట్టించిన ఇంటిని వీరిద్దరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించమని చెబుదాం. ప్రేమించుకున్న ఇద్దరికీ పెండ్లి చేసి సంతోషంగా ఉండేలా చూడడం పెద్దలుగా మీ బాధ్యత' అని ఎంతో సర్దిచెప్పాము.


ఇరు కుటుంబాల వారు పెండ్లికి అంగీకరించారు. కానీ యాసిన్, రేష్మా మాత్రం ఇంటికి వెళ్ళడానికి ఒప్పుకోలేదు. 'ఇప్పుడు మీ దగ్గరే సరే అంటారు.. ఇంటికి వెళ్ళిన తర్వాత వేరే అతనికిచ్చి పెండ్లి చేస్తారు' అంటూ మొండికేశారు. సరే అని వాళ్ల ఆచారం ప్రకారం 'ఖాజీ' దగ్గరకు తీసుకెళ్లి మేమే ఇద్దరికీ వివాహం చేయించాం. నెలకోసారి ఆఫీసుకు రావాలని చెప్పాం. తల్లిదండ్రులు కూడా సంతోషించారు.

'మా అమ్మాయి ఎక్కడికో వెళ్ళకుండా మీ దగ్గరకు వచ్చి మంచి పనే చేసింది. మీరు కాబట్టి మమ్మల్ని పిలిచి అర్థమయ్యేలా చెప్పి మా ముందే పెండ్లి చేశారు' అని రేష్మా తల్లిదండ్రులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు. ఇల్లు కూడా ఇద్దరి పేరు మీద రాసే విధంగా యాసిన్ తల్లిదండ్రులతో మాట్లాడాము. నిజమైన ప్రేమ గెలిచితీరుతుందని యాసిన్, రేష్మలు నిరూపించారు. ఇప్పుడు ఇద్దరూ ఇరు కుటుంబాలతో సంతోషంగా ఉంటున్నారు.

- వై వరలక్ష్మి,
9948794051

'మా అమ్మాయి ఎక్కడికో వెళ్ళకుండా మీ దగ్గరకు వచ్చి మంచి పనే చేసింది. మీరు కాబట్టి మమ్మల్ని పిలిచి అర్ధమయ్యేలా చెప్పి మా ముందే పెండ్లి చేశారు' అని రేష్మా తల్లిదండ్రులు ఆనందంతో కన్నీళ్లు పెట్టుకున్నారు.

హాయిగా నిద్రపోవచ్చు!




ప్రతిరోజూ మనిషికి కంటి నిండా నిద్ర అవసరం. మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారంతో పాటు సరైన నిద్ర పోవాలి. కొందరికి మానసిక ఒత్తిడి సమస్య అయితే, మరికొందరు ఇతర సమస్యలు వెంటాడతాయి. అలాంటి వారికి రాత్రి ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టదు. స్మార్ట్ ఫోన్లు వచ్చాక చాలామంది నిద్రను లైట్ తీసుకుంటున్నారు. అర్ధరాత్రి.. అపరాత్రి అని లేకుండా నిత్యం ఫోన్లతోనే గడిపేస్తున్నారు. దానివల్ల మెదడు పనితీరు, జీర్ణక్రియ వ్యవస్థపై ప్రభావం చూపుతుందని నిపుణులు చెబుతున్నారు. ఫలితంగా అంతుచిక్కని రోగాలను కొని తెచ్చుకుంటున్నారు.

మనిషి ఆరోగ్యంగా ఉండాలంటే కనీసం 8 గంటల నిద్ర అవసరమని వైద్యులు, పరిశోధనలు చెబుతున్నాయి. కొన్ని అలవాట్లను మార్చుకుని.. ఈ సింపుల్ చిట్కాలను పాటించండి. తప్పకుండా మంచి నిద్ర మీ సొంతమవుతుంది.

- క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అప్పుడు జీర్ణక్రియ వ్యవస్థ బాగా పనిచేస్తుంది. మెదడు బాగా అలిసిపోయి నిద్ర త్వరగా పడుతుంది.
- రాత్రి భోజనం 8 గంటల లోపు, త్వరగా జీర్ణం అయ్యే తక్కువ మోతాదులో ఆహారాన్ని తినాలి. సి విటమిన్ అధికంగా ఉండే అరటికాయ, నల్ల ద్రాక్ష, కమలా పండ్లను తినాలి.
- రోజుకు మూడు నుంచి నాలుగు లీటర్ల మంచినీళ్లను క్రమం తప్పకుండా తీసుకోవాలి. గోరువెచ్చని మంచినీళ్లు తాగితే ఇంకా మంచిది. రాత్రి వేళలో టీ, కాఫీలు తీసుకోకూడదు.
- పడుకునేముందు పుస్తకం చదవడం, మంచి సంగీతాన్ని వినడం వల్ల త్వరగా నిద్రపడుతుంది.
- బాదం పప్పు లేదా గోరు వెచ్చని బాదం పాలను తాగండి. దీనివల్ల కండరాలు, మనసు రిలాక్స్ అవుతాయి. ఫలితంగా చక్కగా నిద్రపడుతుంది.
- సరైన నిద్ర లేకపోతే ఒత్తిడి, డిప్రెషన్, ఆందోళనకు గురయ్యే అవకాశం ఉంటుంది. ఎనిమిది గంటలు కాకపోయినా.. కనీసం ఆరు గంటలైనా ప్రశాంతంగా నిద్రపోయేలా టైమ్ సెట్ చేసుకోండి.

మోరంగడ్డతో ప్రయోజనాలెన్నో...



స్వీట్ పొటాటో దీనినే మనం మోరంగడ్డ అని కూడా అంటాం. ఫైబర్ ఇంకా విటమిన్ బి 6 అధికంగా ఉండే మోరంగడ్డ గుండెపోటు ప్రమాదాన్ని తగ్గిస్తుంది. విటమిన్ సి అధికంగా ఉండే చిలగడదుంప రోగనిరోధక శక్తిని అందించడమే కాదు ఎముకలు, దంతాల ఆరోగ్యాన్ని పెంచుతాయి. ఇందులో ఉండే పొటాషియం హృదయ స్పందనలు, నరాల సంకేతాలను నియంత్రిస్తుంది. మూత్రపిండాల వ్యాధులు, వాపులు, కండరాల తిమ్మిర్ల నుంచి కూడా ఉపశమనం కలిగిస్తుంది. ఇది క్యాన్సర్ కారకాల నుంచీ కాపాడుతుంది. పొటాటో చిప్స్‌కు బదులు స్వీట్ పొటాటో చిప్స్ ఎంచుకోండి. ఆలూ చిప్స్ చేసే హానికి దూరంగా మనకు ఆరోగ్యాన్ని అందిస్తుంది. రక్తంలోని ఎర్ర తెల్ల రక్తకణాలను అధికంగా ఉత్పత్తి చేసి ఒత్తిడిని తగ్గిస్తుంది.

మిషన్‌భగీరథపై విజిలెన్స్

(మొదటిపేజీ తరువాయి)

పంపాలని పేర్కొంది. గత వారం రోజులుగా విజిలెన్స్ విచారణ సాగుతున్నది. తొలుత నిజామాబాద్ ఎస్ఈ కార్యాలయంలో విచారించారు. ఆయా పనులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. జీరాక్స్ కాపీలను తీసుకున్నారు. అక్కడ జరిగిన పనులు, వ్యయం, ఏమేరకు అవినీతి జరిగిందనే విషయమై ఆరా తీశారు. అలాగే తాజాగా రాసిన లేఖలో నిజామాబాద్‌తోపాటు ఆదిలాబాద్, కుమ్రంభీమ్ ఆసిఫాబాద్, మంచిర్యాల జిల్లాలకు చెందిన కాంట్రాక్టులు, ఇతర వివరాలను విజిలెన్స్ విభాగం అడిగింది. సోలార్ పథకాల్లో జరిగిన అక్రమాలకు సంబంధించి వివరాలను ఇవ్వాలని భగీరథ శాఖను కోరింది. కాంట్రాక్టర్ల బౌతిక, ఆర్థిక పరిస్థితులకు సంబంధించి అంశాల్లో స్పష్టత అవసరం అని పేర్కొన్నది. ఆడిట్ పేరాల పరిశీలన, సమాధానాల సమాచారం కావాలని అడిగింది. ఈ మేరకు విజిలెన్స్ ఎస్పీ సిహెచ్.శృత కీర్తి, మిషన్ భగీరథ ఈఎన్సీకి లేఖ రాశారు. కాంట్రాక్టర్లకు పనుల అప్పగింత రికార్డులను ఇవ్వాలని కోరారు. రాష్ట్ర వ్యాప్తంగా 33 జిల్లాల్లోని 26 సెగ్మెంట్లల్లో భగీరథ పనులు చేపట్టిన సంగతి తెలిసిందే. పనులు జరిగిన తీరు, బిల్లుల మంజూరు, పనులు ఇచ్చిన విధానం తదితర అంశాలపై గత వారం రోజులుగా రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సోదాల్లో విజిలెన్స్ అధికారులు ఆరా తీస్తున్నది. గురువారం భగీరథ రాష్ట్రకార్యాలయానికి ఇద్దరు విజిలెన్స్ అధికారులు వచ్చి విచారించారు. గణాంక అధికారితో ప్రాజెక్టు వ్యయం, అప్పులు, వడ్డీ తదితర అంశాలపై ఆరా తీశారు. సమాచారం కావాలని అడగడం మినహా ఫైళ్లేవీ స్వాధీనం చేసుకోకపోవడం గమనార్హం.

మాది సెక్యులర్ సర్కార్

(మొదటిపేజీ తరువాయి)



నిలుస్తుందని చెప్పారు. విద్య ఉద్యోగాల్లో ముస్లింలకు నాలుగు శాతం రిజర్వేషన్లు అమలుపరుస్తామన్నారు. వాటిని మోడీ, అమిత్‌షా రద్దు చేస్తామంటున్నారనీ, అది వారి వల్ల కాదని చెప్పారు. వాటిని అడ్డుకోవడం ఎవరికీ సాధ్యం కాదని చెప్పారు. మైనార్టీ పాఠశాలలకు, రెసిడెన్షియల్ భవనాల కోసం ప్రభు త్వం ఇప్పటికే నిధులు విడుదల చేసిందని తెలిపారు. ప్రభుత్వం మైనార్టీలకు అన్ని రంగాల్లో సముచిత స్థానం కల్పిస్తుందని చెప్పారు. వారికి అండగా ఉంటుందన్నారు. అన్ని వర్గాలకు సమానమైన గౌరవం ప్రజా ప్రభుత్వంలో ఉంటుందని తెలిపారు.

ఖమ్మం హస్తంలో అయోమయం

(మొదటిపేజీ తరువాయి)

ఆశావహుల సంఖ్య భారీగా పెరుగుతుండటం గమనార్హం. సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మినహా మిగిలిన ఖమ్మం ఎంపీలంతా స్థానికేతరులేనన్న గత చరిత్రను కూడా కాంగ్రెస్ అధిష్టానం దగ్గర ఉంచి టిక్కెట్ ప్రయత్నాలు చేసుకుంటున్నవారూ ఉన్నారు.

ఆ మూడు అంశాలు కీలకం..

ఖమ్మం ఎంపీ టిక్కెట్ విషయంలో అంగ అర్థబలంతో పాటు ఆ నేత ఏమేరకు సమన్వయం చేసుకోగలరనే మూడు అంశాలు కీలకంగా మారనున్నాయి. ఈ లెక్కన ముగ్గురు జిల్లా మంత్రులు ఒకరికొకరు తీసిపోని విధంగా ఉన్నారు. 13 లక్షలకు పైగా ఓట్లున్న ఖమ్మం పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌కు ఎంత బలమున్నా తక్కువలో తక్కువ రూ.100 కోట్లకు పైగా వెచ్చిస్తేనే గెలుపు అవకాశాలున్నాయి. ఎందుకంటే ప్రత్యర్థి పార్టీల నుంచి పోటీ చేసే బీఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు, బీజేపీ టిక్కెట్ ఆశిస్తున్న జలగం వెంకట్రావు, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు సైతం ఖర్చు విషయంలో వెనక్కి తగ్గే అవకాశం లేదనే అంచనాలు ఉన్నాయి.

దీన్నిబట్టి అర్థబలం ఎంత కీలకమో అర్థం చేసుకోవచ్చు. ముగ్గురు మంత్రుల్లో ఆర్థికపరమైన అంశంలో పొంగులేటి ముందున్నారు. ఇక అంగబలం విషయానికొస్తే ముగ్గురికి ముగ్గురు సమ ఉజ్జీలైనా.. ఒకరికి టిక్కెట్ ఇస్తే మిగిలిన ఇద్దరు ఏకమైనా ఆశ్చర్యపోనక్కర్లేదనే చర్చ ఆ పార్టీలో సాగుతోంది. అలాంటిదేమీ లేకుండా ప్రస్తుతమున్న సమన్వయాన్నే కొనసాగిస్తామనే సంకేతం ముగ్గురు మంత్రుల నుంచి అధిష్టానానికి వెళ్లినప్పుడే కాంగ్రెస్ ఖమ్మం ఎంపీ అభ్యర్థిత్వం నిర్ధారణయ్యే అవకాశం ఉంది. మంత్రులు పొంగులేటి సోదరుడు ప్రసాదరెడ్డికి కాకుండా భట్టి సతీమణి మల్లు నందినికీ లేకుండా తుమ్మల తనయుడు యుగంధర్‌కూ దక్కకుండా నాలుగో వ్యక్తికి ఎవరికిచ్చినా ఈ ముగ్గురు మంత్రులు వారికి ఎంతమేరకు సహకరిస్తారనే అంశంపైనే కాంగ్రెస్ గెలుపోటములు ఆధారపడి ఉంటాయని విశ్లేషకుల అంచనా. ఈ క్రమంలోనే రాష్ట్రంలో అభ్యర్థిత్వం కోసం తీవ్ర పోటీ నెలకొన్న ప్రతి చోటా కాంగ్రెస్ అధిష్టానం టిక్కెట్ కేటాయింపుపై విస్తృత అధ్యయనం చేస్తున్నట్టు తెలుస్తోంది. దీనిలో ప్రధానంగా ఖమ్మంపైనే ఎక్కువ ఫోకస్ ఉందని సమాచారం.

ఎన్నికల బాండ్ల గుట్టు బహిర్గతం

న్యూఢిల్లీ : ఎన్నికల బాండ్లపై సుప్రీం కోర్టు ఇచ్చిన తదుపరి ఆదేశాన్ని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో స్వాగతించింది. బాండ్లు ఇచ్చిన దాతలు, పుచ్చుకున్నవారి పేర్లు తెలిసేలా ఎన్నికల బాండ్ల ఆల్ఫా న్యూమరిక్ కోడ్‌లను ఎస్‌బీఐ అందజేయాలంటూ సుప్రీం కోర్టు తదుపరి ఆదేశాలు జారీ చేసింది. రాజకీయ పార్టీలకు అందిన నిధుల వివరాలను ప్రజలకు మరింత పారదర్శకంగా తెలియజేయడానికి సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును దెబ్బతీసేందుకే ఈ ప్రయత్నాలన్నీ జరుగుతున్నాయన్న వాస్తవం దీంతో మరింత స్పష్టమైందని పొలిట్‌బ్యూరో వ్యాఖ్యానించింది. తమ వద్ద అందుబాటులో వున్న డేటాను ఎన్నికల కమిషన్ తన వెబ్‌సైట్‌లో గురువారం అప్‌లోడ్ చేసినప్పటి నుంచి, ఈ డేటాను విశ్లేషించే యత్నాలు మొదలయ్యాయి. ఈ ఎన్నికల బాండ్ల పూర్తి ప్రభావాన్ని అర్థం చేసుకోవడానికి కొంత సమయం పట్టొచ్చని పొలిట్‌బ్యూరో పేర్కొంది. అయితే, ఎన్నికల బాండ్ల ద్వారా కార్పొరేట్ సంస్థల నుంచి నిధులను బలవంతంగా వసూలు చేసేందుకు ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను ఉపయోగించారని, అలాగే క్విడ్ ప్రొ కో వంటివి కూడా చోటుచేసుకున్నాయని ప్రాథమిక విశ్లేషణల్లో వెల్లడవుతోందని పొలిట్‌బ్యూరో తెలిపింది. ప్రజాస్వామ్యం భవితవ్యం పట్ల ఆసక్తి కలిగిన అన్ని రాజకీయ పార్టీలు, గ్రూపులు, వ్యక్తులు అందరూ కూడా ఎన్నికల ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీసేందుకు జరుగుతున్న ఇటువంటి దారుణమైన ప్రయత్నాలను నిరసిస్తూ, వీటిని ప్రతిఘటించాలని సీపీఐ(ఎం) కోరింది.

పదోన్నతులకు ఎన్నికల ఎఫెక్ట్

(మొదటిపేజీ తరువాయి)

(జీహెచ్‌ఎం) పదోన్నతులు చేపట్టే అవకాశమున్నది. అందుకనుగుణంగా వేసవి సెలవుల్లో విద్యాశాఖ షెడ్యూల్‌ను జారీ చేయనుంది. దీంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. మల్టీజోన్-2 పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల (జీహెచ్‌ఎం) పదోన్నతులపై ఉన్న స్టేను హైకోర్టు ఈనెల 11న ఎత్తేసిన విషయం తెలిసిందే. పాత షెడ్యూల్‌ను కొనసాగించేందుకు అనుమతిచ్చింది. దీంతో పాఠశాల విద్యాశాఖ వెంటనే స్పందించి షెడ్యూల్‌ను విడుదల చేస్తుందని ఉపాధ్యాయులందరూ ఆశించారు. ఆ మేరకు ఉపాధ్యాయ సంఘాలు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాయి. సీనియార్టీ జాబితా సిద్ధంగా ఉందనీ, వెబ్‌ఆప్షన్లకు అవకాశం కల్పిస్తే రెండు రోజుల్లో పదోన్నతుల ప్రక్రియ పూర్తవుతుందని టీఎస్‌యూటీఎఫ్ ప్రభుత్వాన్ని కోరింది. కానీ పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వస్తుండడంతో ఆ దిశగా విద్యాశాఖ అధికారులు కసరత్తు చేయకపోవడం గమనార్హం. షెడ్యూల్ విడుదలయ్యాక ఎన్నికల షెడ్యూల్ వస్తే ఆ ప్రక్రియ నిలిచిపోతుందన్న అభిప్రాయానికి వారు వచ్చినట్టు తెలిసింది. అయితే మల్టీజోన్-2 పరిధిలో ప్రభుత్వ ప్రధానోపాధ్యాయులకు, మల్టీజోన్-1 పరిధిలో ప్రభుత్వ, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పనిచేసిన ఉపాధ్యాయులకు జీహెచ్‌ఎం పదోన్నతులను కల్పించిన విషయం తెలిసిందే. ఈనెల నుంచే ఉపాధ్యాయుల ఉద్యోగ విరమణలు ప్రారంభమవుతాయి. మల్టీజోన్-2లో పదోన్నతులు పొందకుండానే స్కూల్ అసిస్టెంట్లు ఉద్యోగ విరమణ పొందుతారు.

ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి త్రిసభ్య కమిటీ

(మొదటిపేజీ తరువాయి)

సందర్భంగా సంఘాల ప్రతినిధులు ఇచ్చిన విజ్ఞప్తులు, వినతులన్నింటినీ పరిశీలించి, ఉద్యోగుల సమస్యల పరిష్కరిస్తామని హామీ ఇచ్చామని శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వాటిని పరిశీలించి సాధ్యాసాధ్యాలు, పరిష్కార మార్గాలను సూచించే బాధ్యతను త్రిసభ్య కమిటీకి అప్పగించామని పేర్కొన్నారు. ఉద్యోగ సంఘాలు ప్రస్తావించిన అంశాలన్నింటినీ పరిగణనలోకి తీసుకుని పరిష్కరించే దిశగా సలహాలు సూచనలతో నివేదికను అందజేయాలని ఆ కమిటీకి సీఎం సూచించారు.

భువనగిరి బరిలో సీపీఐ(ఎం)

(మొదటిపేజీ తరువాయి)

విధానాలను నిరసిస్తూ రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలన్నారు. రైతు చట్టాలకు వ్యతిరేకంగా 1100 మంది రైతులు మృతి చెందితే తప్ప ప్రధాని వెనకడుగు వేయలేదని విమర్శించారు. దేశాన్ని అప్పుల పాలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం వ్యక్తం చేశారు. దేశంలో కార్పొరేట్ శక్తులు.. ఆర్ఎస్ఎస్, మోడీ అమిత్ షా త్రయంలో ట్రిబుల్ ఇంజిన్ సర్కార్ నడుస్తుందన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎండీ జహంగీర్, రాష్ట్ర కమిటీ సభ్యులు కొండమడుగు నర్సింహ, బట్టుపల్లి అనురాధ, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మంగ నరసింహులు, మాటూరు బాలరాజు, కల్లూరి మల్లేశం, దోనూరు నర్సిరెడ్డి, దాసరి పాండు, జిల్లా కమిటీ సభ్యులు దయ్యాల నరసింహ, సిరిపంగి స్వామి, మాయ కృష్ణ, బొల్లు యాదగిరి, ఎండి.పాషా, బబ్బూరి పోశెట్టి, గంగదేవి సైదులు, బొడ్డుపల్లి వెంకటేష్, బండారు నరసింహ, బొలగాని జయరాములు, అవ్వారు రామేశ్వరి, గడ్డం వెంకటేష్, ఎంఎ.ఇక్బాల్, ప్రజా సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గోప్యత ఎందుకు?

(మొదటిపేజీ తరువాయి)

సంజీవ్ ఖన్నా, జస్టిస్ బిఆర్ గవాయి, జస్టిస్ జెబి పార్థివాలా, జస్టిస్ మనోజ్ మిశ్రాలతో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారించింది. ఎలక్టోరల్ బాండ్స్ వివరాలు వెల్లడించిన ఎస్‌బీఐ, ఆ బాండ్స్ నెంబర్లను అందజేయకపోవడంపై ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఎలక్టోరల్ బాండ్లకు చెందిన నెంబర్లను ఎన్నికల సంఘానికి అందజేయాలని ఆదేశించింది. నెంబర్లు వెల్లడించకపోవడంతో, ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత విరాళం ఇచ్చిందో తెలియలేదని ధర్మాసనం పేర్కొంది. విశిష్టమైన ఆల్ఫా న్యూమరిక్ నెంబరును వెల్లడిస్తే, ఆ నెంబర్‌తో ఆ విరాళాలు ఎక్కడికి వెళ్లాయో తెలుస్తాయన్నారు.

విచారణ ప్రారంభం కాగానే, ప్రధాన న్యాయమూర్తి జస్టిస డి వై చంద్రచూడ్, "ఒక విషయం. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున ఎవరు వాదనలు వినిపిస్తున్నారు? వారు బాండ్ నంబర్‌లను వెల్లడించలేదు. స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటిని వెల్లడించాలి" అని స్పష్టం చేశారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జోక్యం చేసుకొని "నేను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తరపున వాదనలు వినిపించడం లేదు. మీరు ఎస్‌బిఐకి నోటీసు జారీ చేయవచ్చు. ఎందుకంటే ఇందుకు సంబంధించి ఏదైనా చెప్పవలసింది వారే అని భావిస్తున్నాను" అని చెప్పారు. పిటిషనర్ తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ వాదనలు వినిపిస్తూ ఎలక్టోరల్ బాండ్‌లకు సంబంధించి ఎస్‌బిఐ తమ వద్ద అందుబాటులో ఉన్న అన్ని వివరాలను అందించేలా చూడాలని కోరారు. "రాజ్యాంగ ధర్మాసనం తీర్పు ప్రకారం ఎస్‌బీఐ ఎలక్టోరల్ బాండ్లకు సంబంధించిన అన్ని వివరాలను ఇసికి అందించాలి. కొనుగోలు చేసిన తేదీ, కొనుగోలుదారు పేరు సహా రిడీమ్ చేయబడాలి. కాకపోతే ఆ వివరాలను ఎస్‌బిఐ వెల్లడించలేదు. ఎలక్టోరల్ బాండ్ల ప్రత్యేక ఆల్ఫా న్యూమరిక్ నెంబర్లను వెల్లడించాలి" అని ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ తెలిపారు. ఈ సందర్భంగా ఎన్నికల సంఘం దరఖాస్తును ధర్మాసనం కొట్టివేసింది. ఇసిఐ సీల్డ్ కవర్‌లో గతంలో ఇచ్చిన వివరాలను స్కాన్ చేసి డిజిటలైజ్ చేయాలని రిజిస్ట్రీకి ఆదేశించింది. అంతేకాదు.. ఇసిఐ సీల్డ్ కవర్‌లో ఇచ్చిన వివరాలను కూడా కేంద్ర ఎన్నికల కమిషన్ వెబ్ సైట్‌లో శనివారం సాయంత్రం 5 గంటల కల్లా ఉంచాలని స్పష్టం చేసింది.

నేడే ఎన్నికల నగారా

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

18వ లోక్‌సభతో పాటు, ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు నగారా మోగనుంది. ఇందుకు సంబంధించి నేడు(శనివారం) షెడ్యూల్ విడుదల కానుంది. ఈ మేరకు శుక్రవారం కేంద్ర ఎన్నికల సంఘం ఒక ప్రకటన విడుదల చేసింది. శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో కొత్త ఈసీలు సుఖ్‌బీర్ సింగ్ సంధూ, జ్ఞానేష్ కుమార్‌తో కలిసి, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ రాజీవ్ కుమార్ ఎన్నికల షెడ్యూల్‌ను విడుదల చేయనున్నట్లు తెలిపింది. దేశంలోని మొత్తం 543 లోక్‌సభ స్థానాలకు, ఆంధ్రప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, ఒరిస్సా, సిక్కిం రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేయనున్నారు. అసెంబ్లీతో కూడిన కేంద్ర పాలిత ప్రాంతం జమ్మూ కాశ్మీర్‌కు విభజన, ఆర్టికల్ 370 రద్దు తరువాత తొలిసారి అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అలాగే ఆంధ్రప్రదేశ్‌లో 175, ఒరిస్సాలో 147, అరుణాచల్ ప్రదేశ్‌లో 60, సిక్కింలో 32 అసెంబ్లీ స్థానాలకూ ఎన్నికలు జరగబోతున్నాయి. అలాగే ఇటీవల మరణించిన, ఇతర కారణాలతో దేశ వ్యాప్తంగా ఖాళీ అయిన అసెంబ్లీ స్థానాల్లోని సీట్లకు ఉప ఎన్నికలు ప్రకటించే అవకాశమున్నట్లు తెలిసింది. ఇందులో భాగంగా ఎమ్మెల్యే నందిత లాస్య మరణంతో ఖాళీ అయిన తెలంగాణలోని కంటోన్మెంట్ సీటుకు కూడా షెడ్యూల్ ప్రకటించే ఆస్కారం ఉంది. కాగా ఎన్నికల నిర్వహణ కోసం ఎన్నికల అధికారులు ఇప్పటికే దేశంలోని వివిధ రాష్ట్రాల్లో పర్యటించి కసరత్తు పూర్తి చేశారు. దీని ఆధారంగా ఈ నెల 13నే షెడ్యూల్ విడుదల చేయాలని ఈసీఐ ముందుగా భావించింది. అయితే గత ఫిబ్రవరి 14న ఎన్నికల కమిషనర్ అనూప్ చంద్ర పాండే పదవీ విరమణ చేశారు. మరోవైపు మార్చి 8న అనూహ్యంగా మరో కమిషనర్ అరుణ్ గోయల్ కేంద్ర ఎన్నికల కమిషనర్ పదవి నుంచి తప్పుకున్నారు. దీంతో లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌పై ప్రభావం పడింది. అయితే తాజాగా ఖాళీ అయిన రెండు ఈసీ స్థానాలను కేంద్రం భర్తీ చేయడం, వారిద్దరూ బాధ్యతలు స్వీకరించడంతో షెడ్యూల్‌కు లైన్ క్లియరైంది.

గతంలో మాదిరిగానే ఏడు దశల్లో ఎన్నికలు

2019లో సార్వత్రిక ఎన్నికల కోసం మార్చి 10న ఈసీఐ ఎన్నికల షెడ్యూల్ విడుదల చేసింది. అయితే ఈసారి దాదాపు వారం రోజులు ఆలస్యంగా షెడ్యూల్ విడుదలవుతోంది. అయితే 2019 సార్వత్రిక ఎన్నికల మాదిరిగానే ఈసారి కూడా దేశ వ్యాప్తంగా మొత్తం ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిసింది. మొదటి దశ ఏప్రిల్ 11, రెండో దశ ఏప్రిల్ 18, మూడో దశ ఏప్రిల్ 23, నాలుగో దశ ఏప్రిల్ 29 , ఐదో దశ మే 6, ఆరో దశ మే 12, ఏడో దశ మే 19న ఎన్నికలు జరిగాయి. ఎన్నికలు ఫలితాలు మాత్రం మే 23న వెల్లడించారు. ఇందులో మొదటి దశలోనే తెలంగాణ, ఏపీలో ఎన్నికలు ముగిశాయి. ఈసారి కూడా తొలి దశలోనే తెలుగు రాష్ట్రాల్లో ఎన్నికలను ముగించే అవకాశం ఉంది. కాగా 2014లో సార్వత్రిక ఎన్నికల్లో భాగంగానే ఏపీ, తెలంగాణలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు జరిగాయి. అయితే 2018లో కేసీఆర్ ముందస్తుకు వెళ్లడంతో... తెలుగు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల్లో మార్పులు వచ్చాయి. దీంతో ఈసారి ఏపీ రాష్ట్రంలో లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలు ఒకే సారి జరగనున్నాయి.

నూతన ఈసీల బాధ్యతల స్వీకరణ

కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ)లో నూతన ఎలక్షన్ కమిషనర్లుగా(ఈసీ) మాజీ ఐఏఎస్ అధికారులు సుఖ్ బీర్ సింగ్ సంధూ, జ్ఞానేశ్వర్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. వీరిద్దరిని నూతన ఈసీలుగా నియమిస్తూ కేంద్ర న్యాయ శాఖ గురువారం రాత్రి గెజిట్ విడుదల చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయమే నిర్వచన్ సదన్ లో నూతన ఈసీలుగా బాధ్యతలు తీసుకున్నారు. అనంతరం ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజీవ్ కుమార్ నేతృత్వంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్, నిర్వాహణ, దశల వారీ ఎన్నికల తేదీలు, ఇతర అంశాలపై చర్చించారు. అనంతరం లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్‌ను శనివారం విడుదల చేయనున్నట్లు ఒక ప్రకటనలో వెల్లడించారు.



శరత్ ఓటమి

● సింగపూర్ స్మాష్ 2024

సింగపూర్ : భారత టేబుల్ టెన్నిస్ స్టార్ క్రీడాకారుడు, వరల్డ్ నం.88 అచంట శరత్ కమల్ మెరుపు విజయాలకు బ్రేక్ పడింది. సింగపూర్ స్మాష్ టేబుల్ టెన్నిస్ టోర్నమెంట్‌లో వరుసగా వరల్డ్ నం.13, వరల్డ్ నం.22 ర్యాంక్ ఆటగాళ్లను ఓడించిన శరత్ కమల్ క్వార్టర్‌ఫైనల్లో తడబడ్డాడు. ఈ టోర్నీలో తొలిసారి క్వార్టర్‌ఫైనల్‌కు చేరుకున్న శరత్ కమల్ 9-11, 2-11, 7-11, 11-9, 8-11తో పరాజయం పాలయ్యాడు. వరల్డ్ నం.6, ఫ్రాన్స్ ఆటగాడు ఫెలిక్స్ లెబ్రూన్ 4-1తో శరత్ కమల్‌పై సాధికారిక విజయం నమోదు చేశాడు. ఇటీవల కాలంలో అత్యుత్తమ ప్రదర్శన చేసిన శరత్ కమల్ ప్రపంచ ర్యాంకింగ్స్‌లో టాప్-40లోకి అడుగుపెట్టే అవకాశం ఉంది. పారిస్ ఒలింపిక్స్ ముంగిట శరత్ కమల్ ప్రదర్శన అతడిలో ఆత్మవిశ్వాసం రెట్టింపు చేయనుంది.



కార్ల్‌సన్ చెస్960

ఫ్రీస్టయిల్ వరల్డ్ టూర్ ప్రకటన

పారిస్ : ప్రపంచ చెస్ దిగ్గజం, ఐదు సార్లు ప్రపంచ చాంపియన్ మాగ్నస్ కార్ల్‌సన్ సరికొత్త సవాల్‌కు సిద్ధమయ్యాడు. ఈ ఏడాది నవంబర్‌లో ప్రపంచ ఫ్రీస్టయిల్ చెస్ టూర్ (చెస్ 960)కి శ్రీకారం చుట్టనున్నాడు. వరల్డ్ నం.1 కార్ల్‌సన్ మాగ్నస్ ఈ టూర్‌లో భాగంగా ఎంపిక చేసిన ఎనిమిది మంది దిగ్గజ చెస్ క్రీడాకారులతో పోటీపడనున్నాడు. కార్ల్‌సన్ ఈ టూర్‌ను చెస్ పవర్‌హౌస్ భారత్ నుంచి మొదలుపెట్టనున్నాడు. భారత్‌లో చెస్360 ప్రైజ్‌మనీ రూ.4.15 కోట్లుగా కార్ల్‌సన్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. జర్మనీ, అమెరికా, కంబోడియా, దక్షిణాఫ్రికా, ఆస్ట్రేలియాలో సైతం చెస్360 పోటీలు ఉంటాయని తెలిపాడు.

వైట్‌బాల్ క్రికెట్‌లో స్టాప్ క్లాక్

మ్యాచ్ ఫీజులో కోత, బౌండరీ లైన్ దగ్గర ఓ ఫీల్డర్ కుదింపు.. వైట్‌బాల్ క్రికెట్‌లో సమయం వృథాను తగ్గించేందుకు అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) అమలు చేస్తున్న కఠిన నిబంధనలు. అయినా, వైట్‌బాల్ ఫార్మాట్ క్రికెట్‌లో ఆశించిన గుణాత్మక మార్పులు రావటం లేదు. టీ20, వన్డే మ్యాచులు నిర్దేశిత సమయం కంటే ఆలస్యంగా ముగుస్తున్నాయి. దీంతో ఐసీసీ మరో కఠిన నిబంధనతో ముందుకొచ్చింది. వన్డే, టీ20 క్రికెట్‌లో 'స్టాప్ క్లాక్' నిబంధనను శాశ్వతం చేయనుంది. రెండు ఓవర్ల మధ్య విరామం 60 సెకండ్ల గడువు మూడుసార్లు మించితే.. ఫీల్డింగ్ జట్టుపై 5 పరుగుల పెనాల్టీ విధించనుంది. ఈ నిబంధన జూన్ 1, 2024 నుంచి మెన్స్ వైట్‌వాట్ క్రికెట్‌లో అమల్లోకి రానుంది. రానున్న ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో సైతం ఈ నిబంధన అమలు చేయనున్నారు.

● జూన్ 1 నుంచి అమల్లోకి కొత్త నిబంధన ● అంతర్జాతీయ క్రికెట్ కమిటీ ప్రకటన

నవతెలంగాణ-దుబాయ్



అంతర్జాతీయ మెన్స్ వైట్‌బాల్ క్రికెట్‌లో సరికొత్త నిబంధనల అమల్లోకి రానుంది. గత ఏడాది డిసెంబర్ నుంచి ప్రయోగాత్మకంగా అమలు పరిచిన 'స్టాప్ క్లాక్' నిబంధన ఈ ఏడాది జూన్ 1 నుంచి శాశ్వతంగా అమల్లోకి రానుంది. వన్డే, టీ20 క్రికెట్‌లో మీతిమీరిన సమయం వృథాను అరికట్టేందుకు 'స్టాప్ క్లాక్'ను అమలు చేస్తున్నట్టు అంతర్జాతీయ క్రికెట్ కమిటీ (ఐసీసీ) ఓ ప్రకటనలో తెలిసింది. ఇటీవల దుబాయ్‌లో జరిగిన ఐసీసీ బోర్డు సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. వెస్టిండీస్, అమెరికా సంయుక్తంగా ఆతిథ్యం ఇవ్వనున్న ఐసీసీ 2024 టీ20 ప్రపంచకప్‌లో సైతం స్టాప్ క్లాక్ నిబంధన అమల్లో ఉండనుంది. 'ఐసీసీ చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీకి (సీఈసీ)కి స్టాప్ క్లాక్ ప్రయోగాత్మక ఫలితాల నివేదికను సమర్పించారు. ఓ వన్డే మ్యాచ్‌లో కనీసం 20 నిమిషాల సమయం ఆదా ఈ నిబంధనతో చేకూరింది. సమయం వృథా నివారణలో స్పష్టమైన ఫలితాలను సీఈసీ పరిగణనలోకి తీసుకుంది. అంతర్జాతీయ వైట్‌బాల్ క్రికెట్‌లో స్టాప్ క్లాక్ నిబంధన తప్పనిసరి చేయాలని నిర్ణయం తీసుకుంది. జూన్ 1, 2024 నుంచి స్టాప్ క్లాక్ రూల్ అమలు చేయబడుతుంది' అని ఐసీసీ ఓ ప్రకటనలో తెలిపింది.

5 పరుగుల పెనాల్టీ

ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రతి రెండు ఓవర్ల మధ్య విరామం 60 సెకండ్లు మించకూడదు. తొలి ఓవర్లో చివరి బంతి పడిన తర్వాత.. 60 సెకండ్ల లోపు రెండో ఓవర్ తొలి బంతి పడాలి. 60 సెకండ్ల గడువును ఓ ఇన్నింగ్స్‌లో మూడుసార్లు దాటితే.. అప్పుడు ఫీల్డ్ అంపైర్ 5 పరుగుల జరిమానా విధిస్తారు. 60 సెకండ్ల సమయం మించినప్పుడు తొలి రెండు సార్లు ఫీల్డ్ అంపైర్ హెచ్చరిక జారీ చేస్తారు. మూడోసారి మాత్రమే 5 పరుగుల జరిమానా విధిస్తారు. ఇదిలా ఉండగా, 2023 డిసెంబర్ నుంచి స్టాప్ క్లాక్ నిబంధనను ప్రయోగాత్మకంగా అమలు చేశారు. ఈ సమయంలో ఏ జట్టు సైతం పెనాల్టీకి గురి కాలేదు. ఈ విషయం సీఈసీకి సమర్పించిన నివేదికలో పొందుపరిచారు.

మూడు నిబంధనలు!

అంతర్జాతీయ వైట్‌బాల్ క్రికెట్‌లో సమయ పాలన కోసం ఐసీసీ ఇప్పటికే రెండు కఠిన నిబంధనలు అమలు చేస్తుండగా, ఇప్పుడు మూడోదీ తీసుకొచ్చింది. మెరుగైన ఓవర్‌రేట్ లక్ష్యం కోసం గతంలో తీసుకొచ్చిన రెండు నిబంధనలు ఆశించిన ఫలితాలు ఇవ్వలేదు!. నిర్దేశిత సమయంలోపు నిర్ణీత ఓవర్లను పూర్తి చేయకుంటే.. ఆ సమయం పూర్తయిన తర్వాత మిగిలిన ఓవర్లకు 30 గజాల సర్కిల్ ఆవల ఓ ఫీల్డర్‌ను సర్కిల్ లోపలకు తీసుకురావాల్సి ఉంటుంది. డెత్ ఓవర్లలో ఫీల్డింగ్ జట్టు సర్కిల్ బయట నలుగురు ఫీల్డర్లను మాత్రమే నిలుపుకోవాల్సి ఉంటుంది. ఇక ఓవర్‌రేట్‌కు మ్యాచ్ ఫీజులో జరిమానా సైతం అమల్లో ఉంది. ప్రతి ఆలస్యమైన ఓవర్‌కు మ్యాచ్ ఫీజులో 5 శాతం కోత పడుతుంది. మ్యాచ్ ఫీజులో కోత గరిష్ఠంగా 50 శాతం వరకు ఉంటుంది. ఆటగాళ్లతో పోల్చితే కెప్టెన్‌కు రెట్టింపు మ్యాచ్ ఫీజు కోత విధిస్తారు.

ఇక కనీసం 10 ఓవర్లు

ఐసీసీ సీఈసీ సమావేశంలో మరో కీలక నిర్ణయం తీసుకున్నారు. ఐసీసీ టీ20 ప్రపంచకప్‌లో నాకౌట్ మ్యాచుల్లో ఫలితం తేలేందుకు కనీసం ప్రతి ఇన్నింగ్స్‌లో 10 ఓవర్ల ఆట సాగాలని తేల్చింది. ప్రస్తుతం ఏదేని కారణంగా మ్యాచ్ కుదించబడితే.. 5 ఓవర్ల మ్యాచ్‌కు అవకాశం ఉంటుంది. కానీ ఇక నుంచి 5 ఓవర్ల ఆట కుదరదు. క్వార్టర్‌ఫైనల్, సెమీఫైనల్ సహా ఫైనల్లో కనీసం 10 ఓవర్ల ఆట సాధ్యపడితేనే ఫలితం తేలుతుంది. గ్రూప్ దశ మ్యాచులకు మాత్రం ఈ నిబంధన వర్తించదు. గతంలో మాదిరిగానే 5 ఓవర్ల ఆటతో ఫలితాన్ని తేల్చవచ్చు. ప్రపంచకప్‌లో ఫైనల్‌తో పాటు సెమీఫైనల్స్‌కు సైతం రిజర్వ్ డే కేటాయించారు.

2026కు అర్హత ఇక్కడ్నుంచే

ఐసీసీ 2026 టీ20 ప్రపంచకప్ అర్హత ప్రక్రియ 2024 టీ20 వరల్డ్‌కప్‌లోనే మొదలవుతుందని ఐసీసీ సీఈసీ ప్రకటించింది. 2026 ప్రపంచకప్‌లోనూ 20 జట్లు పోటీపడుతుండగా.. 12 జట్లు నేరుగా అర్హత సాధించనున్నాయి. ఆతిథ్య దేశాలు భారత్, శ్రీలంక సహా 2024 టీ20 ప్రపంచకప్‌లో సూపర్8 దశకు చేరుకున్న జట్లు నేరుగా అర్హత సాధిస్తాయి. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-8లో నిలిచిన రెండు/నాలుగు జట్లు సైతం అర్హత సాధిస్తాయి. మిగతా జట్లు రీజినల్, కాంటినెంటల్ అర్హత టోర్నీల నుంచి ప్రపంచకప్‌కు చేరుకోవాల్సి ఉంటుంది.

ఫైనల్లో బెంగళూర్

ఎలిమినేటర్‌లో ముంబయిపై ఉత్కంఠ గెలుపు
మహిళల ప్రీమియర్ లీగ్ 2024




న్యూఢిల్లీ : రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ మహిళల ప్రీమియర్ లీగ్ ఫైనల్లోకి ప్రవేశించింది. శుక్రవారం ఫిరోజ్‌షా కోట్ల మైదానంలో ముంబయి ఇండియన్స్‌తో జరిగిన ఎలిమినేటర్‌లో ఆర్‌సీబీ అమ్మాయిలు ఐదు పరుగుల తేడాతో మెరుపు విజయం నమోదు చేసింది. 136 పరుగుల ఛేదనలో ముంబయి ఇండియన్స్ చతికిల పడింది. 18 బంతుల్లో 20 పరుగులు చేయాల్సిన దశలో హర్మన్‌ప్రీత్ (33), అమేలీ ఖేర్ (27 నాటౌట్) క్రీజులో ఉండటంతో ముంబయి విజయంపై దీమాగా కనిపించింది. కానీ చివరి మూడు ఓవర్లలో మ్యాజిక్ చేసిన బెంగళూర్ అమ్మాయిలు.. ముంబయి ఇండియన్స్‌ను ఒత్తిడిలో పడేశారు. 20 ఓవర్లలో ముంబయి ఇండియన్స్ 6 వికెట్లకు 130 పరుగులే చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత ఓవర్లలో 6 వికెట్లకు 135 పరుగులు చేసింది. ఎలిసీ పెర్రీ (66, 50 బంతుల్లో 8 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీతో ఆ జట్టుకు మంచి స్కోరు అందించింది. ఆదివారం జరిగే టైటిల్ పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌తో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ అమీతుమీ తేల్చుకోనుంది. మహిళల ప్రీమియర్ లీగ్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌కు ఇదే తొలి ఫైనల్ కావటం విశేషం. డిఫెండింగ్ చాంపియన్ ముంబయి ఇండియన్స్ కథ ఎలిమినేటర్‌లోనే ముగిసింది.

ఆకాశంలో ఐపీఎల్ టికెట్ల ధరలు!

● గరిష్ట టికెట్ ధర రూ.30 వేలు
● కనిష్ట టికెట్ ధర రూ.1500

నవతెలంగాణ, హైదరాబాద్



ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) 2024 సీజన్‌కు సిద్ధమవుతున్న తెలంగాణ క్రికెట్ అభిమానులకు సన్‌రైజర్స్ హైదరాబాద్ గట్టి షాక్ ఇచ్చింది. ఈ సీజన్ టికెట్ల ధరలను అమాంతం పెంచేసిన సన్‌రైజర్స్ యాజమాన్యం.. సగటు అభిమానులు స్టేడియంలో రావటం గగనం చేసింది. ఈ నెల 27న ఉప్పల్ స్టేడియంలో సన్‌రైజర్స్ హైదరాబాద్, ముంబయి ఇండియన్స్ మ్యాచ్‌కు టికెట్లను ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచారు. ఈ మ్యాచ్‌కు టికెట్ ధర కనిష్టంగా రూ.1500గా నిర్ధారించారు. దీనికి జీఎస్‌టి అదనం. గరిష్టంగా కార్పోరేట్ బాక్స్ టికెట్ ధర రూ.30 వేలుగా నిర్ధారించారు. ఇతర స్టాండ్స్ టికెట్ల ధరలు రూ.2500, రూ. 4000, రూ. 4500, రూ.7500, రూ.15000, రూ.22000గా ఉన్నాయి. హైదరాబాద్ ఇటీవల వరుసగా క్రికెట్ మ్యాచులకు ఆతిథ్యం వహించింది. 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్ సహా భారత్, ఇంగ్లాండ్ టెస్టు మ్యాచ్‌లకు టికెట్ల ధరలు సాధారణ అభిమానులకు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నారు. కానీ ఐపీఎల్ టికెట్లను సన్‌రైజర్స్ హైదరాబాద్ యాజమాన్యం భారీగా పెంచింది. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లను టెర్రస్ 2 నుంచి వీక్షించేందుకు టికెట్ ధర రూ.500-750 వరకు ఉండేది. కానీ సీజన్‌లో ఇదే టికెట్ ధర మూడు రెట్లు అదనంగా ఉండటంతో అభిమానులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

నవ్వులే నవ్వులు..



హీరో శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ముఖ్య పాత్రధారులుగా 'హుషారు' ఫేమ్ శ్రీ హర్ష కొనుగంటి దర్శకత్వం వహించిన అవుట్ అండ్ అవుట్-ఎంటర్‌టైనర్ 'ఓం భీమ్ బుష్'. వి సెల్యులాయిడ్, సునీల్ బలుసు కలిసి ఈ సినిమాని నిర్మిస్తుండగా, యువి క్రియేషన్స్ సమర్పిస్తుంది. తాజాగా మేకర్స్ శుక్రవారం సినిమా థియేట్రికల్ ట్రైలర్‌ను లాంచ్ చేశారు.
హీరో శ్రీవిష్ణు మాట్లాడుతూ,'మార్చి 22న థియేటర్స్‌కి రండి. మీరు నవ్విన నవ్వులకు థియేటర్స్ బద్దలైపోతాయి. పిచ్చిపిచ్చిగా ఎంజాయ్ చేస్తారు. ఫ్రెండ్స్ గ్రూప్స్‌తో వెళితే ఇంక బాగా ఎంజాయ్ చేస్తారు. 22న ఎవరూ మిస్ అవ్వద్దు. మిమ్మల్ని నవ్వించాలనే ఉద్దేశంతోనే సినిమా చేశాం. రెండు వందల శాతం పిచ్చిపిచ్చిగా నవ్వుతారు. కేవలం ఎంటర్‌టైన్మెంట్ ఇవ్వాలని ఫిక్స్ అయి చేసిన సినిమా ఇది. దర్శకుడు హర్ష చాలా హిలేరియస్‌గా సినిమాని తీశారు' అని తెలిపారు. 'ఈనెల 22 తప్పకుండా అందరూ థియేటర్స్ కి రండి. డబుల్ డోస్ ఎంటర్‌టైన్మెంట్ ఇస్తామని ప్రామిస్ చేస్తున్నాం. నిర్మాతలు వంశీ, సునీల్ చాలా సపోర్ట్ చేశారు. వారి ప్రోత్సాహం వలనే ఇంత క్రేజీ సినిమా చేయగలిగాం. తప్పకుండా సినిమా మీ అందరినీ అలరిస్తుంది' అని ప్రియదర్శి అన్నారు.
దర్శకుడు శ్రీ హర్ష కొనుగంటి మాట్లాడుతూ,'ట్రైలర్‌లో ఉండే ఎనర్జీ కంటే సినిమాలో వందరెట్ల ఎనర్జీ ఉంటుంది. 22న అందరూ గ్యాంగ్స్‌తో రండి. టెన్ టైమ్స్ ఎంటర్‌టైన్ అవుతారు. అది మా గ్యారెంటీ' అని తెలిపారు. నిర్మాత సునీల్ బలుసు మాట్లాడుతూ, 'ఓ మంచి హిలేరియస్ కాన్సెప్ట్‌తో ఈ సినిమాని తెరకెక్కించాం. ఈ సినిమా ప్రతి ఒక్కరినీ కచ్చితంగా ఎంటర్‌టైన్ చేస్తుంది. ప్రేక్షకుల నవ్వులతో థియేటర్లు మారుమోగిపోవడం ఖాయం' అని అన్నారు.



అర్జునుడి గీతోపదేశం మొదలైంది

వరలక్ష్మీ శరత్ కుమార్ మెయిన్ లీడ్‌గా, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్ ఇతర ప్రధాన పాత్రలలో సతీష్ గోగాడ దర్శకత్వంలో ఫస్ట్ కట్ ఫిల్మ్ ఫ్యాక్టరీ ప్రొడక్షన్ నెం1 గా రూపొందనున్న చిత్రం 'అర్జునుడి గీతోపదేశం'. త్రిలోక్ నాథ్.కె, ప్రదీప్ రెడ్డి.వి నిర్మిస్తున్న ఈ చిత్రం పూజా కార్యక్రమాలతో గ్రాండ్‌గా ప్రారంభమైంది.
ముహూర్తపు సన్నివేశానికి కనుమెలి అమ్మిరాజు క్లాప్ కొట్టగా, మల్లాల సీతారామరాజు కెమెరా స్విచాన్ చేశారు. త్రిలోక్ నాథ్, పూజిత స్క్రిప్ట్ అందించగా, లక్కంశెట్టి వేణు గోపాల్ తొలిషాట్‌కు గౌరవ దర్శకత్వం వహించారు.
రాజీవ్, ఆదిత్య శశికుమార్ ఇతర కీలక పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి చరణ్ అర్జున్ సంగీతం అందిస్తుండగా, చైతన్య కందుల డీవోపీగా, అర్జున్ ఎడిటర్‌గా పని చేస్తున్నారు.
దర్శకుడు సతీష్ గోగాడ మాట్లాడుతూ,'దర్శకుడిగా ఇది నా తొలి చిత్రం. ఈ కథ చెప్పినపుడు నటీనటులంతా చాలా పాజిటివ్‌గా స్పందించారు. ఈనెల 20 నుంచి మొదటి షెడ్యూల్ అమలాపురంలో మొదలుపెడుతున్నాం. తర్వాత వైజాగ్, హైదరాబాద్, చెన్నైలో తర్వాత షెడ్యూల్స్ ప్లాన్ చేస్తున్నాం' అని అన్నారు.
'ఫస్ట్ కట్ ఫిల్మ్ ఫ్యాక్టరీలో ఇది మొదటి సినిమా. సతీష్ చెప్పిన కథ చాలా అద్భుతంగా అనిపించింది. ప్రేక్షకులందరినీ అలరించేలా ఈ సినిమా ఉంటుంది' అని నిర్మాతలు చెప్పారు.
రాజీవ్ మాట్లాడుతూ, 'దర్శకుడు సతీష్‌కి సినిమా అంటే చాలా ప్యాషన్. కథ చెప్పినపుడు చాలా ప్లజెంట్‌గా అనిపించింది. మంచి క్యారెక్టర్ చేస్తున్నాను' అని తెలిపారు. 'చాలా మంచి కథ ఇది. ఇందులో లీడ్ రోల్‌లో అవకాశం ఇచ్చిన దర్శక, నిర్మాతలకు ధన్యవాదాలు. చాలా మంచి టీంతో కలసి ఈ సినిమా చేస్తున్నాం' అని దివిజ అన్నారు.
వరలక్ష్మి శరత్‌కుమార్, అఖిల్ రాజ్, దివిజ ప్రభాకర్, రాజీవ్, ఆదిత్య శశికుమార్ తదితరులు నటిస్తున్న ఈచిత్రానికి రచన - దర్శకత్వం: సతీష్ గోగాడ, సంగీతం: చరణ్ అర్జున్, డివోపీ: చైతన్య కంధుల, ఆర్ట్: కె.వి.రమణ, ఎడిటర్: అర్జున్, లైన్ ప్రొడ్యూసర్: నాని రెడ్డి కె, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరికృష్ణ బోగ, ప్రొడక్షన్ ఎగ్జిక్యూటివ్: రాము తాటిపాక, కొరియోగ్రఫర్: విజయ్ పోలంకి.

నవచిత్రం


భీమాకు అపూర్వ ఆదరణ



మారుతి, గోపీచంద్, సంపత్‌నంది, మాళవిక శర్మ

హీరో గోపీచంద్ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భీమా'. ఎ హర్ష దర్శకత్వం వహించిన ఈ చిత్రాన్ని శ్రీ సత్యసాయి ఆర్ట్స్ పతాకంపై కె కె రాధామోహన్ నిర్మించారు. ప్రియా భవానీ శంకర్, మాళవిక శర్మ హీరోయిన్స్‌గా నటించారు. మహా శివరాత్రి సందర్భంగా ఈనెల 8న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదలైన ఈ చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించి బ్లాక్ బస్టర్ విజయాన్ని సాధించింది. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ గ్రాండ్‌గా థ్యాంక్స్ మీట్ నిర్వహించింది. దర్శకులు మారుతి, సంపత్ నంది ఈ వేడుకలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.
హీరో గోపీచంద్ మాట్లాడుతూ, 'ఇంత మంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. సినిమాకి చాలా మంచి ప్రసంశలు వచ్చాయి. సినిమా చాలా బావుంది, రెండు క్యారెక్టర్స్‌లో చక్కని వేరియేషన్స్ చూపించారని మంచి అప్లాజ్ వచ్చింది. ఇంకా చూడని వారంతా థియేటర్స్‌కి వెళ్లి చూడండి. థియేట్రికల్ ఎక్స్‌పీరియన్స్ ఎక్స్‌ట్రార్డినరీగా ఉంటుంది. గ్రాఫిక్స్, యాక్షన్, కామెడీ అద్భుతంగా ఉంటాయి. మా విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవడానికి వచ్చిన మారుతి, సంపత్ నందికి ప్రత్యేక ధన్యవాదాలు. ఇంత మంచి కథ తీసుకొచ్చి, ఆడియన్స్‌కి ఏం కావాలో అలాంటి మంచి కమర్షియల్ ప్యాక్ సినిమా ఇచ్చిన హర్షకి, ఎక్కడా రాజీపడకుండా సినిమాని నిర్మించి ఇంత మంచి సినిమా ఇచ్చిన రాధామోహన్‌కి, శ్రీధర్‌కి ధన్యవాదాలు. పరీక్షలు అయిపోయాయి. ఇంకా చూడనికి ప్రేక్షకులు తప్పకుండా చూడండి. ఖచ్చితంగా ఎంజాయ్ చేస్తారు' అని అన్నారు.
'ఇది నా మొదటి తెలుగు సినిమా. నాకు సపోర్ట్ చేసిన అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. ఇంత మంచి సినిమాని ఇచ్చిన నిర్మాత రాధమోహన్‌కి, సహ నిర్మాత శ్రీధర్‌కి ధన్యవాదాలు. గోపీచంద్ అద్భుతమైన నటుడు. చాలా సార్లు నిరూపించారు. భీమాకి వచ్చిన రెస్పాన్స్ మరింత ఆనందం ఇచ్చింది. ఈ అవకాశం ఇచ్చిన ఆయనకు, ఇంతమంచి విజయాన్ని ఇచ్చిన ప్రేక్షకులకు ధన్యవాదాలు. ఇంకా సినిమా చూడని ప్రేక్షకులు తప్పకుండా థియేటర్స్‌లో చూడండి. చాలా ఎంజాయ్ చేస్తారు' అని చిత్ర దర్శకుడు హర్ష చెప్పారు.
నిర్మాత రాధామోహన్ మాట్లాడుతూ,'మా 'భీమా' సక్సెస్‌ఫుల్‌గా రన్ అవుతోంది. ఇప్పుడు పరీక్షలు పూర్తయ్యాయి. రోజు రోజుకి కలెక్షన్స్ పెరుగుతున్నాయి. పిల్లలు, పేరెంట్స్ కలసి ఈ సినిమా చూసి, నెక్స్ వీక్ కలెక్షన్స్ ఇంకా బాగా పెరుగుతాయని భావిస్తున్నాం' అని తెలిపారు.

బర్త్‌డే గిఫ్ట్‌లు



ఆనంద్ దేవరకొండ

హీరో ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలియజేస్తూ కొత్త పోస్టర్ రిలీజ్ చేసింది 'గం..గం..గణేశా' చిత్రబృందం. ఈ సినిమాను హై-లైఫ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మిస్తున్నారు. ఉదయ్ శెట్టి ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. ఆనంద్ దేవరకొండ తన కెరీర్‌లో చేస్తున్న ఫస్ట్ యాక్షన్ మూవీ ఇది కావడం విశేషం.

గం..గం..గణేశా

ఈ మూవీ కొత్త పోస్టర్‌లో రకరకాల ఆయుధాలు పట్టుకుని మీదకు వస్తున్న విలన్స్‌ను నవ్వుతూ చూస్తున్న ఆనంద్ దేవరకొండ స్టిల్ ఉంది. ఈ విలన్స్‌తో పాటే రోజ్ ఫ్లవర్ ఇస్తున్న హీరోయిన్‌ను కూడా చూపించడం ఇంట్రెస్టింగ్‌గా ఉంది. ప్రస్తుతం ఈ సినిమా రిలీజ్‌కు రెడీగా ఉంది. త్వరలోనే ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రగతి శ్రీవాస్తవ, కరిష్మా, వెన్నెల కిషోర్, జబర్దస్త్ ఇమాన్యూయల్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి ఆర్ట్: కిరణ్ మామిడి, ఎడిటర్: కార్తీక్ శ్రీనివాస్, సినిమాటోగ్రఫీ: ఆదిత్య జవ్వాడి, సంగీతం : చేతన్ భరద్వాజ్, కొరియోగ్రఫీ: పొలాకి విజయ్, కో-ప్రొడ్యూసర్ -అనురాగ్ పర్వతనేని, రచన, దర్శకత్వం - ఉదయ్ శెట్టి.

డ్యూయెట్‌లో మదన్..



ఆనంద్ దేవరకొండ నటిస్తున్న మరో యూత్ ఫుల్ లవ్ ఎంటర్‌టైనర్ 'డ్యూయెట్'. ఈ చిత్రాన్ని స్టూడియో గ్రీన్ బ్యానర్‌లో భారీ బడ్జెట్‌తో కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మిస్తున్నారు. మధుర శ్రీధర్ రెడ్డి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్నారు. మిథున్ వరదరాజ కృష్ణన్ ఈ చిత్రంతో దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ చిత్రంలో రితిక నాయక్ హీరోయిన్‌గా నటిస్తోంది. ఆనంద్ దేవరకొండ పుట్టినరోజు సందర్భంగా ఈ సినిమాలో ఆయన నటిస్తున్న మదన్ క్యారెక్టర్ లుక్‌ను రిలీజ్ చేశారు. మనసంతా ప్రేయసిని నింపుకున్న ప్రేమికుడిగా ఆయన ఈ లుక్‌లో కనిపిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా రెగ్యులర్ చిత్రీకరణలో ఉంది. ఓ డిఫరెంట్ ప్రేమ కథగా ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని కలిగించేలా ఈ సినిమాను రూపొందిస్తున్నారు. రావు రమేష్ ముఖ్య పాత్ర పోషిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ - అరుణ్ రాధాకృష్ణన్, ఎడిటింగ్ - జి.కె. ప్రసన్న, ప్రొడక్షన్ డిజైనర్ - ఉదయ్ కుమార్, సంగీతం - జి.వి. ప్రకాష్ కుమార్.



అశోక్‌కుమార్, వేదాల శ్రీనివాస్

సరికొత్త కాన్సెప్ట్‌తో యమధీర

కన్నడ హీరో కోమల్ కుమార్ హీరోగా, ఇండియన్ క్రికెటర్ శ్రీశాంత్ నెగిటివ్ రోల్‌లో నటించిన చిత్రం 'యమధీర'. శ్రీమందిరం ప్రొడక్షన్స్‌లో వేదాల శ్రీనివాస్ తొలి చిత్రంగా నిర్మించిన చిత్రమిది. ఈ సినిమాలో నాగబాబు, ఆలీ, సత్య ప్రకాష్, మధు సూధన్ తదితరులు కీలకపాత్రలు పోషించారు. తాజాగా ఈ సినిమా టీజర్‌ను నటులు, ప్రొడ్యూసర్ అశోక్ కుమార్ లాంచ్ చేశారు. ఈ సందర్భంగా నిర్మాత వేదాల శ్రీనివాస్ మాట్లాడుతూ, 'నిర్మాతగా ఇది నా మొదటి చిత్రం. సినిమాల మీద ప్యాషన్‌తో శ్రీమందిరం ప్రొడక్షన్స్ స్టార్ట్ చేశాను. ప్రేక్షకులు ఆదరిస్తారని కోరుకుంటున్నాను. త్వరలోనే ఈ సినిమా థియేటర్లో రిలీజ్ కానుంది' అని తెలిపారు.
'నా స్నేహితుడు వేదాల శ్రీనివాస్ కొత్తగా శ్రీమందిరం ప్రొడక్షన్స్ మొదలుపెట్టడం చాలా సంతోషకరంగా ఉంది. ఈ ప్రొడక్షన్స్‌లో తొలి చిత్రంగా వస్తున్న ఈ చిత్రం చాలా బాగా ఆడాలి. అలాగే మరెన్నో చిత్రాలు ఈ ప్రొడక్షన్స్‌లో రావాలని ఆశిస్తున్నాను. కన్నడలో 90కు పైగా సినిమాలలో నటించిన కోమల్ కుమార్ ఈ సినిమాలో కథానాయకుడిగా నటించడం విశేషం అని అన్నారు. క్రికెటర్ శ్రీశాంత్ ఫాస్ట్ బౌలర్‌గా మైదానంలో చూపే దూకుడుని ప్రతినాయకుడిగా చూపించే అవకాశం ఉంది. ఆలాగే ఈ చిత్రం అజర్ బైజాన్, శ్రీలంక వంటి దేశాలతో పాటు మన దేశంలోని మైసూర్, చెన్నై, బెంగళూరు ఇతర ప్రాంతాలలో షూటింగ్ జరుపుకోవడం విశేషం' అని అశోక్ కుమార్ చెప్పారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

బిజినెస్

అంతుచిక్కని జీడీపీ గణంకాలు

- ప్రయివేటు వినిమయం తగ్గింది
- పడిపోయిన ఎఫ్‌డిఐలు
- అయినా 8.4% వృద్ధి ఎలా..?
- మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు సుబ్రమణియన్



న్యూఢిల్లీ : మోడీ సర్కార్ ఇటీవల విడుదల చేసిన జీడీపీ గణంకాలపై మాజీ ప్రధాన ఆర్థిక సలహాదారు (సిఇఎ) అర్విండ్ సుబ్రమణియన్ విస్మయం వ్యక్తం చేశారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో భారత్ 8.4 శాతం వృద్ధి నమోదు చేసినట్లు ప్రభుత్వం వెల్లడించిన విషయం తెలిసిందే. ఈ లెక్కలపై శుక్రవారం ఇండియా కాన్‌క్లేవ్‌లో సుబ్రమణియన్ మాట్లాడుతూ.. అనేక అనుమానాలను వ్యక్తం చేశారు. జీడీపి గణంకాలు అంతుచిక్కనివిగా ఉన్నాయన్నారు. ఈ గణాంకాలు తనకు అర్థం కాలేదన్నారు. ప్రధాని మోడీ హయంలో 2014 నుంచి 2018 వరకూ ప్రధాన ఆర్థిక సలహాదారుగా సుబ్రమణియన్ వ్యవహరించారు.

"ఆర్థిక వ్యవస్థ 2023 డిసెంబర్ త్రైమాసికంలో 8.4 శాతం పెరిగింది. మరోవైపు ప్రయివేటు వినియోగం 3 శాతం మాత్రమే పెరిగింది. కాగా.. తొలి, రెండవ త్రైమాసికాల్లో వృద్ధి రేటు 8.2 శాతం, 8.1 శాతంగా చోటు చేసుకుంది. కానీ.. మరోవైపు గత రెండు, మూడు త్రైమాసికాలుగా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు (ఎఫ్‌డిఐ) గణనీయంగా తగ్గాయి. భారత్ పెట్టుబడుకు అత్యంత ఆకర్షణీయ ప్రదేశమైతే, అధికంగా ఎఫ్‌డిఐలు ఎందుకు రావడం లేదు. కార్పొరేట్ పెట్టుబడులు కూడా 2016 స్థాయిల కంటే దిగువన ఉన్నాయి." అని అర్విండ్ సుబ్రమణియన్ అన్నారు. భారతదేశం పెద్ద మార్కెట్ అనే వాస్తవం నుండి బయటికి రావాలని పరోక్షంగా మోడీ సర్కార్‌కు సుబ్రమణియన్ చురకలు అంటించారు. భారత్ పెద్ద మార్కెట్ కాదని అన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2023-24 ఏప్రిల్-జనవరిలో కీలక రంగాల వద్ధిరేటు 7.7 శాతానికి తగ్గింది. గడిచిన 2022-23 ఇదే వ్యవధిలో 8.3 శాతంగా చోటు చేసుకుంది. ఏడాదికేడాదితో పోల్చినప్పుడు తగ్గుదల చోటు చేసుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్‌లో ఎఫ్‌డిఐల్లో ఏకంగా 13 శాతం పతనమై 32.03 బిలియన్ డాలర్లకే పరిమితమయ్యాయి. కంప్యూటర్ హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్, ట్రేడింగ్, సేవలు, టెలికం, ఆటో, ఔషధ, రసాయన రంగాల్లో ఎఫ్‌డిఐలు దిగజారినట్లు తేలింది. ఈ నేపథ్యంలో జిడిపి అమాంతం వృద్ధి చెందడం ప్రభుత్వ తప్పుడు లెక్కలకు నిదర్శనమనే విమర్శలు పెరిగాయి.

మెట్రోయేతర ప్రాంతాల నుంచే 67శాతం బుకింగ్స్

- రెడ్‌బస్ రిపోర్ట్



హైదరాబాద్ : దేశంలో నగరాల మధ్య (ఇంటర్‌సిటీ) బస్సుల రవాణ పరిశ్రమపై రెడ్‌బస్ కొత్తగా డేటా ఆధారిత 'ఇండియా బస్‌ట్రాక్' నివేదికను విడుదల చేసింది. 2023 నవంబరు - డిసెంబర్‌లో మెట్రోల నుంచి 33 శాతం బస్ బుకింగ్‌లు నమోదు కాగా.. ఇతర ప్రాంతాలు 67 శాతం వాటాను కలిగి ఉన్నాయని తెలిపింది. ఇది ద్వితీయ, తృతీయ శ్రేణీ నగరాల ప్రాధాన్యతను ప్రదర్శిస్తుందని పేర్కొంది. దేశ వ్యాప్తంగా 4468 యాక్టివ్ ప్రయివేటు బస్సు ఆపరేటర్లు ఉన్నారని వెల్లడించింది. నవంబర్, డిసెంబర్‌లో 3.6 కోట్ల మంది ప్రయాణించారని తెలిపింది. కాగా.. శని, ఆదివారాల్లో కంటే గురువారాల్లోనే ఎక్కువ మంది ప్రయాణిస్తున్నారని తెలిపింది. "ఇది ఇండియా బస్‌ట్రాక్ పురోగతికి ఉత్ప్రేరకంగా మారనుందని మేము భావిస్తున్నాము. ఈ రంగం అంతటా సహకారం, సామర్థ్యాన్ని పెంపొందించాలని మేము అనుకుంటున్నాము" అని రెడ్‌బస్ సిఇఒ ప్రకాష్ సంగం పేర్కొన్నారు.

తెలుగు రాష్ట్రాల్లోకి ముత్తూట్ మైక్రోఫిన్ ప్రవేశం

ముంబయి : ప్రముఖ మైక్రోఫైనాన్స్ సంస్థ ముత్తూట్ మైక్రోఫిన్ తెలుగు రాష్ట్రాల్లోకి ప్రవేశిస్తున్నట్లు ప్రకటించింది. తొలుత తెలంగాణలో నాలుగు శాఖలను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించింది. భువనగిరి, జనగాం, హన్మకొండ, పరకాలలో వీటిని తొలి దశలో మార్చిలో అందుబాటులోకి తెస్తున్నట్లు తెలిపింది. తదుపరి 2024 జూన్ నాటికి ఆంధ్రప్రదేశ్‌కు విస్తరించనున్నట్లు వెల్లడించింది. తద్వారా రెండు రాష్ట్రాల్లోనూ ఆర్థిక సేవలను మరింత అందుబాటులోకి తేవాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపింది.

టెస్లాకు తలొగ్గిన కేంద్రం

- అనుకూలంగా ఇవి పాలసీ
- భారీగా దిగుమతి సుంకం తగ్గింపు



న్యూఢిల్లీ : అమెరికన్ కార్ల కంపెనీ టెస్లాకు మోడీ ప్రభుత్వం తలొగ్గింది. ఆ సంస్థ డిమాండ్ చేసినట్లుగా విద్యుత్ వాహనాల (ఇవి) పాలసీని రూపొందించింది. దేశంలో ఇవిల తయారీని ప్రోత్సహించేందుకు గానూ కేంద్రం ఇ-వెహికల్ పాలసీని తీసుకొచ్చిందని కేంద్ర వాణిజ్య మంత్రిత్వ శాఖ శుక్రవారం వెల్లడించింది. కొత్త పాలసీ ప్రకారం.. భారీ మొత్తంలో దిగుమతి సుంకాన్ని తగ్గించింది. దేశంలో ఏదైనా కంపెనీ కనీసం రూ.4,150 కోట్లు పెట్టుబడిగా పెడితే చాలు పలు రాయితీలు పొందవచ్చు. ఈ రెండు ప్రధానాంశాలు కూడా టెస్లాను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు స్పష్టమవుతోంది. కొత్త ఇవి పాలసీ వల్ల భారతీయులకు నూతన తరహా సాంకేతికత అందుబాటులోకి రావడంతో పాటు మేకిన్ ఇండియాకు ఊతం లభించనుందని వాణిజ్య మంత్రిత్వ శాఖ తెలిపింది. పర్యావరణానికి కూడా మేలు జరుగుతుందని, ముడి చమురు దిగుమతులు తగ్గుతాయని పేర్కొంది.

కాగా.. దేశంలోకి ఎప్పటి నుంచో ప్రవేశించాలని ఎదురు చూస్తున్న టెస్లాకు ఈ పాలసీ వీలు కల్పిస్తోంది. రూ.4,150 కోట్ల పెట్టుబడితో మూడేళ్లలో తయారీ కేంద్రాన్ని నెలకొల్పాల్సి ఉంటుంది. దీంతో పాటు తయారీకి వినియోగించే విడి భాగాల్లో 25 శాతం స్థానికంగానే సమీకరించాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు పాటించిన కంపెనీలు 35 వేల డాలర్ల (రూ.29వేలు) కంటే అధిక ధర కలిగిన కార్లను 15 శాతం సుంకంతో ఏటా 8,000 ఇవి కార్ల వరకు దిగుమతి చేసుకోవడానికి ఈ పాలసీ అనుమతిస్తుంది. ప్రస్తుతం కార్ల ధరను బట్టి 70-100 శాతం వరకు దిగుమతి సుంకాలు అమల్లో ఉన్నాయి. దీన్ని టెస్లా తీవ్రంగా వ్యతిరేకిస్తూ వస్తోంది. సుంకాలు తగ్గించాలని డిమాండ్ చేస్తోంది. దానికి అనుగుణంగా తాజాగా కేంద్ర ప్రభుత్వం పాలసీని రూపొందించడం గమనార్హం. అమెరికాలో టెస్లా తన అతి చౌక ఇవి కారు ధర 38,990 డాలర్లుగా ఉంది. టెస్లా సిఇఒ ఎలన్ మస్క్ ప్రముఖ సోషల్ మీడియా ట్విట్టర్ అధినేతగా కూడా ఉన్నారు. భారత్‌లో ఎన్నికల వేళ టెస్లాకు అనుకూల ఇవి అనుకూల విధానాన్ని రూపొందించడం అనేక అనుమానాలకు తావిస్తోంది.

రాష్ట్రంలో వెస్ట్‌సైడ్ 227వ స్టోర్ ఏర్పాటు


హైదరాబాద్ : టాటా గ్రూపులో భాగమైన వెస్ట్‌సైడ్ తన 227వ స్టోర్‌ను తెలంగాణలో తెరిచినట్లు ప్రకటించింది. ఫ్యాషన్ ఔత్సాహికులకు ఆనందాన్ని తీసుకు వచ్చే లక్ష్యంతో హన్మకొండలో కొత్త స్టోర్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపింది. ఈ కొత్త స్టోర్ అసాధారణమైన విలువతో వినియోగదారులకు సమకాలీన, ఆధునిక ఫ్యాషన్ ట్రెండ్‌లను సౌకర్యవంతమైన రీతిలో ఉత్పత్తులను అందించనుందని పేర్కొంది.

విదేశాంగ విధానంలో హిందూత్వ

దూకుడు ప్రదర్శిస్తున్న మోడీ ప్రభుత్వం

- అంతర్జాతీయ వేదికలపై సొంత ప్రచారం
- పొరుగు దేశాలతో బెడిసికొడుతున్న సంబంధాలు

దేశ ప్రయోజనాలకు ప్రాధాన్యత ఇస్తానని, భారత్‌ను బహుళ ధృవ ప్రపంచ క్రమంలో ప్రభావం చూపే స్థాయికి తీసికెళతానని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ హామీ ఇచ్చింది. విదేశాంగ విధానం గురించి మ్యానిఫెస్టోలో ప్రస్తావిస్తూ ఈ వ్యాఖ్యలు చేసింది. ప్రాంతీయ అభివృద్ధికి దక్షిణాసియాలో రాజకీయ సుస్థిరత, శాంతి అవసరమని నొక్కి చెప్పింది. అయితే బీజేపీ మాటలకు, చేతలకు ఏ మాత్రం పొంతన ఉండదని గత దశాబ్ద కాలంగా జరుగుతున్న పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఎందుకంటే ఈ కాలంలో అనేక పొరుగు దేశాలతో భారత్ సంబంధాలు బాగా దెబ్బతిన్నాయి.



న్యూఢిల్లీ : నరేంద్ర మోడీ ప్రభుత్వం విదేశాంగ విధానంలో దూకుడుగా, దుందుడుకుగా వ్యవహరిస్తోంది. స్వీయ ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతోంది. ఫలితంగా పొరుగు దేశాలతో సంబంధాలు దెబ్బతింటున్నాయి. మోడీ రెండోసారి అధికారంలోకి వచ్చినప్పుడు మాజీ దౌత్యవేత్త ఎస్. జయశంకర్ విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుండీ విదేశాంగ విధానంలో మార్పు కన్పిస్తోంది. మోడీ విదేశీ పర్యటనలకు వెళ్లినప్పుడు తరచుగా ప్రపంచంలో హిందువులు ఎదుర్కొంటున్న సమస్యలను ఏకరువు పెడుతున్నారు. తద్వారా హిందువులకు తానే ఏకైక ప్రతినిధినని అంతర్జాతీయ సమాజం భావించాలని ఆయన కోరుకుంటున్నారు. ఇదంతా విదేశాంగ విధానంలో హిందూత్వను భాగం చేసేందుకు జరుగుతున్న ప్రయత్నమేనని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

ద్వైపాక్షిక సంబంధాలకు విఘాతం

2015లో ప్రధాని నరేంద్ర మోడీ పాకిస్తాన్‌లో ఆకస్మికంగా పర్యటించారు. ఉభయ దేశాల మధ్య తొలుత శాంతి పవనాలు వీచినప్పటికీ ఆ తర్వాత సీమాంతర ఉగ్రవాదం కారణంగా సైనిక ఘర్షణలు చోటుచేసుకున్నాయి. జమ్మూకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పిస్తున్న ఆర్టికల్ 370లోని నిబంధనలు ద్వైపాక్షిక సంబంధాలను మరింత దెబ్బతీశాయి. ఇక నేపాల్‌తో భారత్ సంబంధాలు కూడా అంత సజావుగా లేవు. మన దేశంతో సాంస్కృతిక సంబంధాలు ఉన్న మాధేసీ జాతి వారి సమస్యలను నేపాల్ నూతన రాజ్యాంగ ముసాయిదా ఏ మాత్రం పట్టించుకోలేదు. రాజపక్స కుటుంబ పాలనలో శ్రీలంక మన దేశానికి దూరమైపోయింది. మాల్దీవులలో తొలుత అబ్దుల్లా యమీన్, ప్రస్తుతం మహమ్మద్ ముయిజూ అధికారంలో ఉన్నారు. ఈ ఇద్దరితోనూ మనకు సత్సంబంధాలు లేవు. మయన్మార్‌లో జరిగిన కుట్ర, 2021లో ఆఫ్ఘనిస్తాన్‌పై తాలిబాన్ల ఆధిపత్యం... ఈ రెండు పరిణామాలూ భారత్‌కు ఎదురు దెబ్బగానే భావించవచ్చు. ఒక్క బంగ్లాదేశ్‌తో మాత్రమే ద్వైపాక్షిక సంబంధాలు సజావుగా సాగుతున్నాయి.

2014 నుండి సార్క్ సమావేశమే లేదు

దక్షిణాసియా ప్రాంతీయ సహకార సంస్థ (సార్క్)ను బలోపేతం చేస్తానని బీజేపీ తన ఎన్నికల ప్రణాళికలో హామీ ఇచ్చింది. అయితే పాకిస్తాన్‌తో నెలకొన్న ఘర్షణ వైఖరి కారణంగా ఈ విషయంలో ప్రతిష్టంభన ఏర్పడింది. 2014 నుండి సార్క్ నేతల సమావేశమే జరగలేదు. పాకిస్తాన్‌తో ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ కాంగ్రెస్ నేతృత్వంలోని ప్రభుత్వం మాత్రం సార్క్ లక్ష్యాల సాధనకు కృషి చేసింది. వివిధ రంగాలలో సాంకేతిక, ఆర్థిక సహకారం కోసం పాకిస్తాన్ మినహా మిగిలిన అన్ని సార్క్ సభ్య దేశాలు ఓ ప్రాంతీయ వేదికగా ఏర్పడడం సానుకూల పరిణామం.

చైనాతో ఉద్రిక్తతలు

మోడీ తన తొలి ప్రభుత్వ హయాంలో చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో వ్యక్తిగత దౌత్యం నెరపినప్పటికీ ఫలితం మాత్రం చేకూరలేదు. తొలుత రెండు దేశాల మధ్య సైనికపరమైన ఉద్రిక్తతలు నెలకొన్నాయి. అవి 2020-21లో వాస్తవాధీన రేఖ వెంబడి ఘర్షణలకు దారితీశాయి. నలభై ఐదు సంవత్సరాలలో భారత సైనికులు మరణించడం అదే మొదటిసారి. వివాదాస్పద అంశాలపై నేటి వరకూ రెండు దేశాల మధ్య పూర్తి ఏకాభిప్రాయం సాధ్యపడలేదు.

అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం

భారత్, అమెరికా దేశాలు చైనాను ఉమ్మడి శత్రువుగా పరిగణిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే భారత్, అమెరికా మధ్య వ్యూహాత్మక భాగస్వామ్యం బలపడింది. ఖాడ్ దేశాలైన భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా మధ్య జరిగిన భద్రతాపరమైన చర్చలు ఓ కీలక వేదిక ఏర్పడడానికి కారణమయ్యాయి. ఆగ్నేయాసియా దేశాల సంఘంతో సహకారాన్ని బలోపేతం చేసుకోవాలని మోడీ ప్రభుత్వం కోరుకుంది. బీజేపీ 2019లో తన ఎన్నికల ప్రణాళికలో ఈ విషయాన్ని ప్రస్తావించింది. ఆగ్నేయాసియాలో చైనా ప్రాబల్యానికి గండి కొట్టి, దాని ప్రభావాన్ని తగ్గించాల్సిన అవసరమున్నదని తెలిపింది.

కెనడాతో దెబ్బతిన్న సంబంధాలు

ఖలిస్థాన్ మద్దతుదారులను కెనడా అణచివేస్తోందని భారత్ చేసిన ఆరోపణతో రెండు దేశాల మధ్య సంబంధాలకు విఘాతం ఏర్పడింది. తన అంతరంగిక రాజకీయాలలో భారత్ జోక్యం చేసుకుంటోందని అటు కెనడా కూడా ఆరోపణలు చేసింది. తన భూభాగంలో జరిగిన సిక్కు వేర్పాటువాద నాయకుడి హత్య వెనుక భారత్ హస్తం ఉన్నదని కెనడా చేసిన ఆరోపణతో గత సంవత్సరం ద్వైపాక్షిక సంబంధాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఓ పథకం ప్రకారం జరుగుతున్న హత్యల వెనుక ఉన్న కుట్రలో ఈ ఘటన కూడా భాగమేనని అమెరికా ఆరోపించింది. న్యూయార్క్‌లో కూడా ఇలాంటి హత్యే జరిగిందని చెప్పింది. దీంతో భారత్, అమెరికా మధ్య కూడా ఇబ్బందికరమైన పరిస్థితులు ఏర్పడ్డాయి. అంతర్జాతీయ వేదికలపై సొంత ప్రచారం బ్రిక్స్, జీ-20 వంటి వివిధ దేశాలతో కూడిన వేదికలతో సహకారాన్ని పెంపొందించుకుంటానని 2014 ఎన్నికల ప్రణాళికలో బీజేపీ చెప్పుకొచ్చింది. గత సంవత్సరం న్యూఢిల్లీలో జీ-20 సదస్సు జరిగింది. దీనిని ప్రధాని మోడీ తన అనుకూల ప్రచారానికి వేదికగా ఉపయోగించుకున్నారు. బ్రిక్స్ దేశాధినేతల మావేశంలోనూ ఇదే తీరు.

భాషాపండితుల కల సాకారం

- హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పు
- ఆర్‌యూపీపీటీఎస్ హర్షం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలోని భాషా పండితులు 20 ఏండ్లుగా ఎదురుచూస్తున్న కల సాకారమైంది. వారి ఆశలకు అనుగుణంగా హైకోర్టు డివిజన్ బెంచ్ శుక్రవారం తీర్పునిచ్చింది. భాషాపండితుల పోస్టుల అప్‌గ్రెడేషన్ కోసం గత ప్రభుత్వం ఇచ్చిన సర్వీసు రూల్స్ జీవోలపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. ఆ ప్రభుత్వం ఇచ్చిన జీవో నెంబర్లు 2,3, 9,10 చెల్లుబాటు అవుతాయని ప్రకటించింది. అప్‌గ్రెడేషన్ పోస్టులతోపాటు పదోన్నతుల పోస్టులను కేవలం భాషాపండితులనే పరిగణనలోకి తీసుకోవాలనీ, భాషేతర పోస్టులను ఎస్జీటీలతో నింపాలని జస్టిస్ అభినందన్ షావలి ఆదేశించారు. పండితుల పోస్టుల్లో ఎస్జీటీలకు అవకాశం ఇవ్వాల్సిన అవసరం లేదని స్పష్టం చేసింది. హైకోర్టు డివిజన్ బెంచ్ చారిత్రాత్మక తీర్పును వెలువరించిందని ఆర్‌యూపీపీటీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సి జగదీశ్, ప్రధాన కార్యదర్శి ఎస్ నర్సిములు, కోశాధికారి కట్టా గిరిజారమణశర్మ ఒక ప్రకటనలో తెలిపారు. భాషాపండితుల పక్షాన సురేందర్‌రావు, మాదిరాజు శ్రీనివాసరావు వాదించారని వివరించారు. భాషా పండితుల పోస్టులను వారికే చెందేలా జీవో నెంబర్లు 2,3, 9,10 సాధించామని తెలిపారు. వాటిపై ఎస్జీటీలు కోర్టును ఆశ్రయించారనీ, ఆ పోస్టులను పంచుకోవాలని సింగిల్ బెంచ్ తీర్పునిచ్చిందని గుర్తు చేశారు. తెలుగు, హిందీ, ఉర్దూ పోస్టుల్లో ఎక్కువగా ఎస్జీటీలకే చెందుతాయనీ, పండితులకు అన్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. ఇదే విషయంపై తాము హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించామని వివరించారు. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ రద్దు చేసిందని తెలిపారు. భాషాపండితులకు పదోన్నతులు కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

పండితులకు పదోన్నతులు కల్పించాలి : ఆర్‌యూపీపీటీ

భాషాపండితుల అప్‌గ్రెడేషన్‌పై సింగిల్ బెంచ్ జడ్జి మాధవి ఇచ్చిన తీర్పు చెల్లదనీ, దాన్ని రద్దు చేస్తున్నట్టు డివిజన్ బెంచ్ జస్టిస్ అభినందన్ షావలి తీర్పునిచ్చారని ఆర్‌యూపీపీటీ అధ్యక్ష, కార్యదర్శులు మహమ్మద్ అబ్దుల్లా, తిరుమల కాంతికృష్ణ తెలిపారు. పండితుల పోస్టులను వారికే ఇవ్వాలనీ, జీవోలను మార్చుకునే హక్కు ప్రభుత్వానికి ఉందని పేర్కొన్నారు. భాషాపండితులకు పదోన్నతులను కల్పించేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎస్ఎల్‌టీఏటీఎస్ హర్షం

సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పును రద్దు చేస్తూ పండితుల పోస్టులు వారికే ఇవ్వాలంటూ హైకోర్టు డివిజన్ బెంచ్ తీర్పు ఇవ్వడం పట్ల ఎస్-ఎల్‌టీఏటీఎస్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చక్రవర్తుల శ్రీనివాస్, కె గౌరీశంకర్‌రావు హర్షం ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆ తీర్పును అమలు చేయాలని కోరారు.

అనుమతి లేని మెడికల్ షాపులపై డీసీఏ దాడులు

- రూ.13 లక్షల మందుల సీజ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

హైదరాబాద్, భూపాలపల్లి జిల్లాల్లో అనుమతి లేకుండా మందుల నిల్వ ఉంచడంపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ కన్నెర్ర జేసింది.

భూపాలపల్లిలో అనధికారికంగా అమ్మేందుకు ఒక ఆస్పత్రిలో నిల్వ ఉంచిన రూ.11.83 లక్షల విలువైన ఔషధాలతో పాటు హైదరాబాద్ బండ్లగూడలోని మరో ఆస్పత్రిలో రూ.1.20 లక్షల విలువైన మందులను సీజ్ చేశారు భూపాలపల్లి మెయిన్ రోడ్‌లోని సాయి బాలాజీ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన స్టాకును వరంగల్ జోన్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు జె.కిరణ్ కుమార్ (భూపాలపల్లి), అరవింద్ కుమార్ (వరంగల్) స్వాధీనం చేసుకున్నారు. విశ్లేషించేం దుకు నమూనాలను సేకరించి కేసు నమోదు చేశారు.

హైదరాబాద్ బండ్లగూడ, ముంతాజ్‌బాగ్‌లోని షిఫా ఆస్పత్రి ప్రాంగణంలో అనుమతి లేకుండా నిల్వ ఉంచిన 20 రకాల ఔషధాలను సీజ్ చేశారు.

ఈ దాడుల్లో హైదరాబాద్ అసిస్టెంట్ డైరెక్టర్ టి.రాజమౌళి, చార్మినార్ డ్రగ్ ఇన్ స్పెక్టర్ బి.లక్ష్మి జూబ్లీహిల్స్ డ్రగ్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, మెహిదీపట్నం డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ పి.సంతోష్ పాల్గొన్నారు. నమూనాలను పరీక్షల కోసం పంపించారు. తదుపరి విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకోనున్నట్టు వారు తెలిపారు.

లైసెన్స్ తీసుకోండి

ఔషధాలను అమ్మాలనుకునే వారు తప్పని సరిగా డ్రగ్ లైసెన్స్ తీసుకోవాలని డ్రగ్ కంట్రోల్ అథారిటీ డైరెక్టర్ జనరల్ వీ.బీ.కమలాసన్ రెడ్డి సూచించారు. డ్రగ్స్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రొవిజన్స్ ప్రకారం లైసెన్స్ ఇస్తున్నట్టు తెలిపారు. లైసెన్స్ లేకుండా ఔషధా లను అమ్మేందుకు నిల్వ ఉంచితే గరిష్టంగా ఐదేండ్ల వరకు శిక్ష పడే అవకాశముందని హెచ్చరించారు.

ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతి

- 18 నుంచి టెన్త్ పరీక్షలు
- 5,08,385 మంది హాజరు
- 2,676 పరీక్షా కేంద్రాల ఏర్పాటు
- 30 వేల మంది ఇన్విజిలేటర్లు
- కంట్రోల్ రూం ఏర్పాటు
- ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు కృష్ణారావు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఈనెల 18 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు జరుగుతాయి. ఐదు నిమిషాలు ఆలస్యమైనా పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఉదయం 9.30 గంటలకు పరీక్షలు ప్రారంభ మవుతాయి. 9.35 గంటల వరకు విద్యార్థులకు గ్రేస్ పీరియడ్‌తో అనుమతిస్తారు. ఆ తర్వాత అనుమతి ఉండబోదని అధికారులు స్పష్టం చేశారు. ఈ మేరకు ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పరీక్షలను ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 11,469 పాఠశాలల నుంచి 5,08,385 మంది విద్యార్థులు ఈ పరీక్షలకు హాజరవుతారని తెలిపారు. వారిలో 2,57,952 మంది అబ్బాయిలు, 2,50,433 మంది అమ్మాయి లున్నారని వివరించారు. వారి కోసం 2,676 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. ఫస్ట్ లాంగ్వేజ్ కాంపోజిట్ కోర్సు సబ్జెక్టు మాత్రం ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.50 గంటల వరకు జరుగుతుందని పేర్కొన్నారు. సైన్స్ సబ్జెక్టును రెండు విడతల్లో రెండు రోజులపాటు నిర్వహి స్తున్నామని వివరించారు. ఫిజికల్ సైన్స్, బయలాజికల్ సైన్స్‌ను సబ్జెక్టులను వేర్వేరు రోజుల్లో ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకు నిర్వహిస్తామని తెలిపారు. 2,676 మంది చీఫ్ సూపరిం టెండెంట్లు, 2,676 మంది డిపార్ట్ మెంటల్ అధికారులు, 30 వేల మంది ఇన్విజిలే టర్లను నియమించామని పేర్కొన్నారు. విద్యార్థుల హాల్‌టికెట్లను ఇప్పటికే ఆయా పాఠశాలలకు పంపించామని తెలిపారు. ఙఙఙ.ఎంఎ్‌.ఙ్రీఖఅ-ఘ్రుఖఖ.వ్రకీఙ.ఱఅ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకుల కార్యాలయంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేశామనీ, సమస్యలుంటే 040-23230942 నెంబర్‌ను సంప్రదించాలనీ, డీఈవో కార్యాలయాల్లోనూ కంట్రోల్ రూంలను ఏర్పాటు చేశామని వివరించారు. విద్యార్థులను ఉదయం 8.30 నుంచే పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తామనీ, సకాలంలో చేరుకోవాలని కోరారు. పరీక్షలు ప్రారంభమయ్యే ఒకటి లేదా రెండు రోజుల ముందు పరీక్షా కేంద్రాలకు వెళ్లి చూసుకోవాలని తెలిపారు. పరీక్షలు సజావుగా జరిగేందుకు జిల్లా స్థాయి పరిశీలకులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ నియమించారని పేర్కొన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడం తోపాటు పోలీసుల బందోబస్తు ఉంటుందని వివరించారు. పరీక్ష జరిగే సమయంలో ఆ ప్రాంతంలోని జిరాక్స్ కేంద్రాలను మూసివేయాలని ఆదేశించారు. మాల్‌ప్రాక్టీస్‌లను నివారించడం పరీక్షల పర్యవేక్షణకు 144 మంది ఫ్లయింగ్ స్క్వాడ్‌లను నియమించామనీ, సమస్యాత్మక కేంద్రాల్లో సిట్టింగ్ స్క్వాడ్‌లను డీఈవోలు నియమించారని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు, సిబ్బంది మొబైల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్లను తేవడాన్ని నిషేధించామని పేర్కొన్నారు. హాల్‌టికెట్, ప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్, షార్ప్‌నర్, ఎరేసర్, జామెట్రీ పరికరాలను అనుమతిస్తామని వివరించారు. పరీక్షల విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సీసీఏ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఏ పార్టీలో ఉన్నా ప్రజాసేవ, అభివృద్ధే నాకు ముఖ్యం

- జహీరాబాద్ బీజేపీ ఎంపీ అభ్యర్థి బీబీ పాటిల్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తాను ఏ పార్టీలో ఉన్నా ప్రజాసేవ, అభివృద్ధే తనకు ముఖ్యమని జహీరాబాద్ ఎంపీ, బీజేపీ అభ్యర్థి బీబీ పాటిల్ అన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాల యంలో జహీరాబాద్ నియోజకవర్గానికి చెందిన మాజీ సర్పంచులు, సొసైటీల చైర్మెన్లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు, పలువురు నేతలు ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్, రాష్ట్ర కార్యదర్శి ప్రకాశ్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా బీబీ పాటిల్ మాట్లాడుతూ..బీజేపీలో చేరడం తనకు సంతోషంగా ఉందన్నారు. ఎస్సీవర్గీకరణతో దళితులకు న్యాయం జరుగు తుందనీ, తన నియోజకవర్గం అభివృద్ధి చెందుతుం దన్న ఉద్దేశం తోనే బీజేపీలో చేరానన్నారు. మోడీ పాలన గురించి గ్రామ గ్రామానికి తీసుకె ళ్తానని తెలిపారు. కార్యక్రమంలో మీడియా కమిటీ మెంబర్ రాణా, బీజేపీ జహీరాబాద్ పార్లమెంట్ కన్వీనర్ రవి గౌడ్, బీసీ మోర్చా అధికార ప్రతినిధి హరి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గుజరాత్ మోడల్ కోరుకోవడం లేదు

- ఆరు గ్యారంటీల తెలంగాణ మోడల్: మల్లు రవి

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

తెలంగాణ ప్రజలు గుజరాత్ మోడల్ కోరుకోవడం లేదనీ, కాంగ్రెస్ పార్టీ హామీ మేరకు తెలంగాణ మోడల్ ఆరు గ్యారంటీలను అమలు కోరుకుంటున్నారని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షులు మల్లు రవి వ్యాఖ్యానించారు. రైతు రుణమాఫీ, కులసంఘాలకు కార్పొరేషన్లు, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇస్తున్నట్టు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆరు గ్యారంటీల అమలుపై గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి ఒక్క సీటు కూడా రాదన్నారు. దేశంలో ఇండియా కూటమి ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి అవ్వడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో బీజేపీ అడ్డంగా దొరికింది

- టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ ప్రీతం

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ఎలక్ట్రోరల్ బాండ్ల విషయంలో బీజేపీ అడ్డంగా దొరికిపోయిందని టీపీసీసీ ఎస్సీ సెల్ చైర్మెన్ ప్రీతం విమర్శించారు. బాండ్లను గోప్యంగా ఉంచి బీజేపీ మోసం చేసిందన్నారు. 1300 కంపెనీలు ఆరువేల కోట్ల ఎలక్ట్రోరల్ బాండ్లను బీజేపీకి ఇచ్చారని చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. దేశంలో క్విడ్ ప్రోకో, మని లాండరింగ్‌ను బీజేపీ ప్రోత్సహించిందని విమర్శించారు. ఆయా కంపెనీల మీద ఐటీ దాడులు చేయించి, బాండ్లను కొనిపించిందని ఆరోపించారు.రాష్ట్ర ప్రజలను మోసం చేసేందుకు ప్రధాని మోడీ హైదరాబాద్ వచ్చారని విమర్శించారు. ఎస్సీ వర్గీకరణకు పార్లమెంట్‌లో బిల్లు పెడతామని చెప్పి మాదిగలను మోడీ మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

నారి న్యాయ కింద ఐదు లక్షలు ప్రకటించిన రాహుల్‌కు ధన్యవాదాలు

- మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్ .

భారత్ న్యాయ జోడో యాత్రలో భాగంగా ఐదు గ్యారంటీలను రాహుల్ గాంధీ ప్రకటించారని మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సునీతారావు చెప్పారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. నారి న్యాయ కింద మహిళలకు లక్ష రూపాయలు ఇస్తామని రాహుల్‌గాంధీ ప్రకటించి నందుకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. రాహుల్‌గాంధీ మహిళా పక్షపాతి, మహిళలకు 50శాతం రిజర్వేషన్ కల్పిస్తామనడం గొప్ప విషయమన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే 33 శాతం రిజర్వేషన్ అమలు చేస్తామన్న మోడీ ఇప్పటికీ చేయలేదన్నారు.

కొమెడ్‌కె దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కర్నాటక ఇంజినీరింగ్ ప్రవేశ పరీక్ష (కొమెడ్‌కె) దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. ఈ మేరకు ఎరా ఫౌండేషన్ సీఈవో పి మురళీధర్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. దరఖాస్తుల సమర్పణకు వచ్చేనెల ఐదో తేదీ వరకు గడువుందని తెలిపారు. దేశంలో 200 నగరాలు, పట్టణాల్లో 400 పరీక్షా కేంద్రాల్లో పరీక్షను నిర్వహిస్తామని పేర్కొన్నారు. మే 12న కొమెడ్‌కె, యూజీఈటీ, యూనిగేజ్ ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు. లక్ష మందికిపైగా అభ్యర్థులు హాజరవుతారని తెలిపారు. దరఖాస్తుల సమర్పణ కోసం www.comedk.org లేదా ఙఙఙ.బఅఱఅస్త్రుబస్త్రవ.ఱఅ వెబ్‌సైట్లను సంప్రదించాలని సూచించారు.

రేపు ఏఐఎస్టీఎఫ్ జాతీయ కార్యవర్గ సమావేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఆలిండియా సెకండరీ టీచర్స్ ఫెడరేషన్ (ఏఐఎస్టీఎఫ్) జాతీయ కార్యవర్గ సమావేశం హైదరాబాద్‌లో ఆదివారం జరగనుంది. ఈ మేరకు ఆ సంఘం జాతీయ అధ్యక్షులు ఇంద్రశేఖర్ మిశ్రా, ప్రధాన కార్యదర్శి జి సదానందంగౌడ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్కింగ్ ప్రెసిడెంట్ కత్తి నర్సింహారెడ్డి, తమిళనాడు, కర్నాటక, మహారాష్ట్ర, ఒడిశా, జమ్మూకాశ్మీర్ రాష్ట్రాల నుంచి ప్రతిని ధులు హాజరవుతారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్) రద్దు, ఆదాయపు పన్ను పరిమితి పెంపు వంటి అంశాలపై చర్చ జరుగుతుందని వివరించారు.

ఒకేషనల్ ఇంగ్లీష్ అధ్యాపకులు మూల్యాంకనానికి పనికిరారా?

- వెంటనే నియామక ఉత్తర్వులివ్వాలి
- తెలంగాణ ఒకేషనల్ అధ్యాపకుల సంఘం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఇంటర్మీడియెట్ ఒకేషనల్ ఇంగ్లీష్ అధ్యాపకులు జవాబు పత్రాల మూల్యాంకనానికి పనికిరారా?అని తెలంగాణ ఒకేషనల్ అధ్యాపకుల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ప్రయివేటు ఒకేషనల్ ఇంగ్లీష్ అధ్యాపకులకు వెంటనే నియామక ఉత్తర్వులను ఇవ్వాలని డిమాండ్ చేసింది. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు పీటర్ మహేష్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఒకేషనల్ ఇంగ్లీష్ అధ్యాపకుల పట్ల వివక్ష చూపడం సరైంది కాదని తెలిపారు. శనివారం నుంచి మూల్యాంకనం ప్రక్రియ ప్రారంభమవుతుందనీ, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఒకేషనల్ ఇంగ్లీష్ జవాబు పత్రాల మూల్యాంకనం కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. జనరల్ అధ్యాపకులు మూల్యాంకనం చేస్తే విద్యార్థులు నష్టపోతారని ఆందోళన వ్యక్తం చేశారు.

ఇంటర్ బోర్డు అధికారులు స్పందించి వెంటనే ఒకేషనల్ ఇంగ్లీష్ అధ్యాపకులకు ఉత్తర్వులివ్వాలని విజ్ఞప్తి చేశారు.